సోమవారం
21-1-2019
కరీంనగర్
• వెల. రూ.6.50
• సంపుటి 8 • సంచిక 206
• పేజీలు : 16 + 16

నమస్తే తెలంగాణ

మన రాష్ట్రం • మన పత్రిక

WWW. NTNEWS.COM
/NTDAILYONLINE

PUBLISHED FROM KARIMNAGAR I HYDERABAD I WARANGAL I KHAMMAM I NALGONDA I MAHABUBNAGAR I NIZAMABAD

మాది రైతు ప్రభుత్వం

వందకు వందశాతం హామీలన్నీ నెరవేరుస్తాం

గతంలో మాదిరిగానే రుణమాఫీ అమలుపరుస్తాం

భూరికార్డులను సంపూర్ణంగా ప్రక్షాళన చేస్తాం.. నీటిపారుదలకు ప్రథమ ప్రాధాన్యమిస్తాం

చెప్పినవేకాదు.. చెప్పనివీ చేస్తాం

- ఇండ్ల పథకంలో అక్రమాలు లేకుండా పకడ్బందీ విధానం
- ఆయుష్మాన్ భారత్ కన్నా ఆరోగ్యశ్రీ పథకమే అద్భుతం
- గవర్నర్ ప్రసంగానికి ధన్యవాదతీర్మానంపై చర్చలో సీఎం కేసీఆర్ స్పష్టీకరణ
- కేంద్రంలో అనుకూల ప్రభుత్వం లేదు..
- ఒక్క రూపాయి కూడా అదనంగా ఇవ్వలేదు
- నీతిఆయోగ్ రూ.24వేల కోట్లు ఇవ్వాలంటే కేంద్రప్రభుత్వం పైసా విదిల్చలేదని విమర్శ



ఆదివారం శాసనసభలో గవర్నర్ ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపే తీర్మానంపై చర్చకు సమాధానమిస్తూ ప్రసంగిస్తున్న ముఖ్యమంత్రి కే చంద్రశేఖర్‌రావు

హైదరాబాద్, నమస్తే తెలంగాణ:

ప్రజలకు ఇచ్చిన వాగ్దానాలను వందకు వందశాతం.. గతంలో నెరవేర్చినట్టుగానే ఇప్పుడు కూడా నెరవేరుస్తామని ముఖ్యమంత్రి కే చంద్రశేఖర్‌రావు ప్రకటించారు. తెలంగాణ ప్రభుత్వం ముమ్మాటికీ రైతుపక్షపాతిగా వ్యవహరిస్తుందని చెప్పారు. గతంలో మాదిరిగానే రుణమాఫీ అమలుపరుస్తామని, రైతుల అభివృద్ధే టీఆర్‌ఎస్ ప్రభుత్వ ధ్యేయమని స్పష్టం చేశారు. భూరికార్డులను వందశాతం ప్రక్షాళిస్తామని, నీటిపారుదలకు ప్రథమ ప్రాధాన్యమిస్తామని చెప్పారు. చీకట్లో ఇష్టానుసారంగా బాణం వేయమని.. అన్నీ ఆలోచించే చేస్తామన్నారు. ఐదేండ్లకాలంలో హామీలన్నీ పూర్తిచేస్తామని చెప్పారు. ఇండ్ల పథకంలో అక్రమాలు లేకుండా పకడ్బందీ విధానాన్ని అనుసరిస్తున్నామని, కేంద్రప్రభుత్వ ఆయుష్మాన్ భారత్ కన్నా మన ఆరోగ్యశ్రీ పథకమే అద్భుతమని పేర్కొన్నారు. శాసనసభలో గవర్నర్ ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపే తీర్మానంపై ఆదివారం చర్చ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ.. సభ్యులు అడిగిన పలు ప్రశ్నలకు వివరణ ఇచ్చారు. ధన్యవాదాలు తెలిపే తీర్మానాన్ని ఎమ్మెల్యే కొప్పుల ఈశ్వర్ ప్రతిపాదించగా, ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి బలపరిచారు. అనంతరం తీర్మానంపై చర్చలో వివిధ పార్టీల సభ్యులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సీఎం కేసీఆర్ మాట్లాడుతూ.. చర్చలో పాల్గొన్న అందరికీ ధన్యవాదాలు తెలిపారు. టీఆర్‌ఎస్ ప్రభుత్వం ఆచరించిన, అనుసరించిన, అవలంబించిన అన్ని విధానాలను ప్రజలు గత నాలుగున్నర సంవత్సరాలు పరిశీలించారని, అనంతరమే తిరిగి అఖండ మెజార్టీ ఇచ్చి ఈ ప్రభుత్వాన్ని మళ్లీ గెలిపించారని పేర్కొన్నారు. ఇంతటి విశ్వాసాన్ని తమ మీద ఉంచినందుకు శిరస్సు వంచి నమస్కరిస్తూ హృదయపూర్వక కృతజ్ఞతలు తెలియజేస్తున్నానన్నారు. గవర్నర్ ప్రసంగం పబ్లిక్ మీటింగ్‌లో కేసీఆర్ ప్రసంగంలాగా ఉందని విపక్షాలు చేసిన విమర్శలపై సీఎం కేసీఆర్ మండిపడ్డారు. గవర్నర్ ప్రసంగాన్ని విమర్శించినవారి రాజకీయ పరిజ్ఞానానికి జాలిపడటం తప్ప చేయగలిగింది ఏమీలేదన్నారు. ఏ పార్టీ ప్రభుత్వాన్ని గెలిపించారో, ఆ పార్టీ మ్యానిఫెస్టో.. అదే పాలసీ గవర్నర్ ప్రసంగంలో ఉంటదని కేసీఆర్ స్పష్టం చేశారు. గవర్నర్ మంచి సమయం ఇచ్చి, మంచి ప్రసంగం చేశారని, ఆయనకు ధన్యవాదాలు తెలుపడం

> టీఆర్‌ఎస్ ప్రభుత్వం ఆచరించిన, అనుసరించిన, అవలంబించిన అన్ని విధానాలను ప్రజలు గత నాలుగున్నర సంవత్సరాలు పరిశీలించారు.. అనంతరమే తిరిగి అఖండ మెజార్టీ ఇచ్చి ఈ ప్రభుత్వాన్ని మళ్లీ గెలిపించారు. ఇంతటి విశ్వాసాన్ని మా మీద ఉంచినందుకు శిరస్సు వంచి నమస్కరిస్తూ హృదయపూర్వక కృతజ్ఞతలు తెలియజేస్తున్నాను.
>
> - సీఎం కేసీఆర్

మిగతా 2వ పేజీలో

> మీ పంథా మార్చుకోమని సలహా చెప్తున్నా. మేం మార్చుకోలేమంటే అది మీ ఇష్టం. ఇంత తొందరపాటు ఎందుకు? మేం ఇచ్చిన వాగ్దానాలకు ఎంత ఖర్చవుతుంది.. ఎలా చేద్దామన్నది చూసుకొని చేస్తం కదా. ఇదెప్పుడు చేస్తరు? పొద్దుగూకేవరకు చేస్తరా అంటే.. అట్ల మేం చెప్పలేదు కదా. మ్యానిఫెస్టోలో ఏదైతే చెప్పినమో వందకు వందశాతం తూ.చ. తప్పకుండా అమలుచేస్తాం. నిన్న గవర్నర్ ప్రసంగంలో కూడా చెప్పినం.. మ్యానిఫెస్టోలో చెప్పని అంశాలు కూడా ప్రాసెస్‌లో.. ప్రయాణంలో మా దృష్టికి ప్రజల సమస్యలు వస్తే.. చెప్పలేదని ఊరుకోం. వాటిని కూడా వందకు వందశాతం అమలు చేస్తం..
>
> - ముఖ్యమంత్రి కే చంద్రశేఖర్‌రావు



డాక్టర్ రాజేంద్రసింగ్

మిషన్ కాకతీయ అద్భుత పథకం

సీఎం కేసీఆర్‌కు జలవనరుల ప్రాధాన్యం తెలుసు

వాటర్ మ్యాన్ ఆఫ్ ఇండియా రాజేంద్రసింగ్ ప్రశంస

హైదరాబాద్, నమస్తే తెలంగాణ:

ముఖ్యమంత్రి కేసీఆర్ రాష్ట్రంలో చేపట్టిన మిషన్ కాకతీయ పథకం అద్భుత పథకమని వాటర్ మ్యాన్ ఆఫ్ ఇండియా డాక్టర్ రాజేంద్ర సింగ్ ప్రశంసించారు. జలవనరులను పునరుద్ధరించడానికి ఇలాంటి పథకం దోహదం చేస్తుందన్నారు. రాష్ట్రంలోని ప్రతి ఇంటికీ తాగునీటిని అందించే మిషన్ భగీరథ పథకం కూడా అభినందనీయమన్నారు. సీఎం కేసీఆర్‌కు జలవనరుల ప్రాధాన్యం తెలుసు కాబట్టే ఇలాంటి ఆదర్శనీయమైన పథకాలను అమలు చేస్తున్నారని వ్యాఖ్యానించారు. తెలంగాణ జాగృతి సదస్సులో పాల్గొన్న ఆయన 'నమస్తే తెలంగాణ'తో మాట్లాడుతూ.. తెలంగాణలో అమలు చేస్తున్న పథకాలపై ప్రశంసలు కురిపించారు. జాగృతి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఈ సదస్సు వల్ల పర్యావరణం పట్ల, జలవనరుల పట్ల యువతలో అవగాహన పెరగడంతోపాటు ప్రకృతితో అనుబంధం పెంపొందిస్తుందన్నారు.



సభామర్యాదలను కాపాడుదాం

- తెలంగాణ శాసనసభ దేశానికే ఆదర్శంగా ఉండేలా కృషి
- సభ్యులందరూ సహకారం అందించాలి
- ఫిరాయింపులపై చట్టప్రకారం చర్యలు
- వ్యవసాయరంగంలో అందరికీ ఆదర్శంగా నిలిచాం
- స్పీకర్‌గా ఏకగ్రీవ ఎన్నికకు కృషిచేసిన సీఎం కేసీఆర్‌కు ధన్యవాదాలు
- మీడియాతో స్పీకర్ పోచారం శ్రీనివాస్‌రెడ్డి

4

స్త్రీశక్తిని మరువొద్దు



ఆదివారం హైదరాబాద్ హైటెక్స్‌లోని నోవాటెల్‌లో జరిగిన తెలంగాణ జాగృతి అంతర్జాతీయ యువజన నాయకత్వ సదస్సులో వాటర్ మ్యాన్ ఆఫ్ ఇండియా రాజేంద్రసింగ్‌కు జ్ఞాపికను అందజేస్తున్న గవర్నర్ నరసింహన్. చిత్రంలో ఎంపీ కవిత, మాలావత్ పూర్ణ ఉన్నారు.

- యువశక్తి అంటే పురుషుల శక్తి మాత్రమే కాదు
- టెక్నాలజీ మానవ మేధస్సుకు ప్రత్యామ్నాయం కాకూడదు
- యువతను జాగృతం చేయడంలో ఎంపీ కవిత సక్సెస్
- 'జాగృతి' ముగింపు సదస్సులో గవర్నర్ నరసింహన్
- నీటి కాలుష్యాన్ని రూపుమాపండి: రాజేంద్రసింగ్
- మహిళా సాధికారత కోసం కృషిచేయండి: ఎంపీ కవిత

4



పంచాయతీ తొలి విడుత ఎన్నికలకు ఆదివారం సిద్దిపేట జిల్లా చేర్యాల మండల పరిషత్ కార్యాలయ ఆవరణలోని పంపిణీ కేంద్రం వద్ద ఎన్నికల సామగ్రిని తీసుకుంటున్న సిబ్బంది

తొలివిడుతకు నేడు పోలింగ్

- మధ్యాహ్నం ఒంటిగంటవరకే ఓటింగ్
- ఆ తర్వాత ఓట్ల లెక్కింపు.. ఉప సర్పంచ్ ఎన్నికకూడా
- మూడోవిడుతలో 1,11,066 నామినేషన్లు

9

విదేశీ విద్యకు ఓవర్సీస్ అండ

నిరుపేద విద్యార్థులకు సర్కారు భరోసా

నాలుగున్నరేండ్లలో 1,984 మందికి రూ.307.86 కోట్ల సాయం

తాజాగా 42 మంది ఎస్సీ విద్యార్థుల ఎంపిక



ఓవర్సీస్ విద్యానిధి పథకం ద్వారా ప్రభుత్వం అందించిన ఆర్థికసాయం విద్యా సంవత్సరంవారీగా (రూ.కోట్లలో..)

క్యాటగిరీ	2014-15	2015-16	2016-17	2017-18	2018-19
ఎస్సీ	5.85	11.39	11.38	29.35	18.40
ఎస్టీ	1.35	2.75	3.0	36.56	3.20
బీసీ	--	--	--	59.29	14.00
మైనార్టీ	--	18.13	28.06	58.55	6.60
మొత్తం	7.20	32.27	42.44	183.75	42.20

హైదరాబాద్, నమస్తే తెలంగాణ:

రాష్ట్రంలో టీఆర్‌ఎస్ ప్రభుత్వం అమలుచేస్తున్న ఓవర్సీస్ విద్యానిధి పథకం నిరుపేద విద్యార్థులకు వరంగా మారింది. ఒకప్పుడు ఉన్నత కుటుంబాలకే పరిమితమైన విదేశీ విద్యావకాశాలను తెలంగాణ ప్రభుత్వం వచ్చిన తరువాత నిరుపేదలకూ చేరువచేసింది. నిరుపేద కుటుంబాల విద్యార్థులు విదేశాల్లో చదువుకొనేందుకు ఓవర్సీస్ విద్యానిధి పథకం ద్వారా రూ.20 లక్షల ఆర్థికసాయం అందిస్తున్నది. నాలుగున్నరేండ్లలో 1984 మందికి రూ.307.86 కోట్లు అందించి చేదోడుగా నిలిచింది. అందులో ఎస్సీ క్యాటగిరీలో 632 మంది, ఎస్టీలు 162 మంది, బీసీలు 537 మంది, మైనార్టీల్లో 653 మంది విద్యార్థులు లబ్ధి పొందారు. విదేశాల్లో విద్యనభ్యసించేవారికి గతంలో ఓవర్సీస్ స్కాలర్‌షిప్ కింద రూ.10 లక్షలు మాత్రమే ఇచ్చేవారు. టీఆర్‌ఎస్ ప్రభుత్వం మాత్రం ఒక్కొక్కరికి రూ.20 లక్షలు ఇస్తున్నది. తెలంగాణలోని దళిత, గిరిజన విద్యార్థులు విదేశాల్లో ఉన్నతవిద్యను అభ్యసించాలనే ఆశయాలను సాకారం చేసుకొనేందుకు అంబేద్కర్ ఓవర్సీస్ పథకం పేరిట సర్కారు సాయంచేస్తున్నది. ఆ తర్వాత మైనార్టీ ఓవర్సీస్ విద్యానిధి పథకాన్ని తీసుకురాగా, అదే విధానంతో చరిత్రలో తొలిసారిగా బీసీల కోసం మహాత్మా జ్యోతిరావుపూలే ఓవర్సీస్ స్కాలర్‌షిప్ పథకాన్ని గత విద్యాసంవత్సరం నుంచి

మిగతా 8వ పేజీలో

నేటినుంచి సహస్ర చండీ మహాయాగం

25న మహాపూర్ణాహుతితో ముగింపు

ఎర్రవల్లిలోని సీఎం కేసీఆర్ వ్యవసాయ క్షేత్రంలో ఏర్పాట్లు

3



ఎర్రవల్లిలో యాగశాల

మాది రైతు ప్రభుత్వం

› మొదటిపేజీ తరువాయి...

మనందరి ధర్మమని చెప్పారు. గవర్నర్ ప్రసంగానికి ధన్యవాద తీర్మానాన్ని ఏకగ్రీవంగా ఆమోదించాలని కోరారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి ప్రభుత్వ ప్రాధమ్యాలను, వివిధ కార్యక్రమాల అమలుతీరును సోదాహరణంగా వివరించారు.

ఐదేండ్లకాలంలో హామీలన్నీ పూర్తి

వందకు వందశాతం.. మ్యానిఫెస్టోలో పేర్కొన్న అన్ని హామీలను నెరవేరుస్తామని ముఖ్యమంత్రి కేసీఆర్ చెప్పారు. ఐదేండ్లకాలంలో పూర్తిచేయాల్సిన హామీలపై ఇప్పటినుంచే ప్రణాళికలు రూపొందించుకోవాలని సూచించారు. రైతులకు లక్ష రూపాయల రుణమాఫీని గతంలో మాదిరిగానే మాఫీచేసి తీరుతామని స్పష్టం చేశారు. గత ప్రభుత్వకాలంలో రూ.17వేల కోట్ల రైతు రుణాలను మాఫీ చేశామని, ఐదేండ్లలో రూ.24 వేల కోట్ల రుణాలను మాఫీ చేస్తామని చెప్పారు. ఈ విషయంపై విధివిధానాల రూపకల్పన జరుగుతున్నదని తెలిపారు. ఆర్థికశాఖ కార్యదర్శి బ్యాంకర్లతో మాట్లాడుతున్నారని చెప్పారు. కాంగ్రెస్ పార్టీ రెండులక్షల రుణమాఫీ చేస్తామన్నా ప్రజలు నమ్మలేదన్నారు. కాంగ్రెస్‌పాలిత రాష్ట్రమైన పంజాబ్ ఒకేసారి రైతు రుణమాఫీ చేస్తామని ప్రకటించినప్పటికీ ఇప్పటికీ పూర్తికాలేదని చెప్పారు. ఇటీవల అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పాలిత రాష్ట్రాల్లో రెండు లక్షల రుణమాఫీ ఒకేసారి చేస్తున్నట్టు ఫైల్‌పై సంతకం చేసినా అమలుకాలేదన్నారు. టీఆర్‌ఎస్ ప్రభుత్వం చెప్పిందంటే తప్పక చేస్తుందని గతంలో మాదిరిగానే ఈసారి కూడా రుణమాఫీ చేస్తామని చెప్పారు. ఎన్ని విడతలుగా అనేది పరిశీలిస్తున్నామన్నారు. జకేపీ ఉద్యోగులను రెగ్యులర్‌చేసే ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్ల నిర్వహణ బాధ్యత వారికే అప్పగిస్తామని తెలిపారు. రాబోయే రోజుల్లో తెలంగాణను మిగులు విద్యుత్ రాష్ట్రంగా తీర్చిదిద్దుతామని చెప్పారు. ఎక్కడైనా కొనవలసి వస్తే వెనక్కి పోకుండా కొంటున్నామని, ప్రజలకు, పారిశ్రామికవేత్తలు, రైతులకు విద్యుత్ రంగంలో ఎలాంటి బాధలు రానీయమని హామీ ఇస్తున్నానన్నారు. రైతులకు మద్దతు ధరను రాబట్టే విషయంలో తాము అవలంబించాలనుకున్న వ్యూహం ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్ అని, దాని అమలుకు త్వరలోనే ప్రయత్నిస్తామని చెప్పారు. గత ప్రభుత్వ కాలంలో మ్యానిఫెస్టోలో లేని 76 పథకాలను అమలుచేశామని పేర్కొన్నారు. వచ్చే ఆర్థిక సంవత్సరం నుంచి పింఛన్ల పెంపు అమలవుతుందని ముఖ్యమంత్రి చెప్పారు. నిరుద్యోగ భృతికి మాత్రం నాలుగైదు నెలల సమయం పడుతుందని చెప్పారు. నిరుద్యోగులు అంటే ఎవరనేది డెఫినేషన్ రావాలని, అన్ని పార్టీల శాసనసభ్యులను పిలిచి మాట్లాడుతానని తెలిపారు.

వందశాతం భూరికార్డుల ప్రక్షాళన

రైతుల అభివృద్ధే ధ్యేయంగా ఈ ప్రభుత్వం పనిచేస్తుందని సీఎం చెప్పారు. వందశాతం భూరికార్డుల ప్రక్షాళన చేస్తామని చెప్పారు. ధరణి వెబ్‌సైట్‌లో భూముల వివరాలు పొందుపరుస్తామని తెలిపారు. 54 లక్షల మంది రైతులకు పాస్‌పుస్తకాలు అందించామన్నారు. టీఆర్‌ఎస్ ప్రభుత్వంపై మరోసారి విశ్వాసం ఉంచిన ప్రజలకు శిరస్సు వంచి నమస్కరిస్తున్నానన్నారు.. గత ప్రభుత్వాలు రైతులను నిర్లక్ష్యంగా వదిలేశాయని కేసీఆర్ చెప్పారు. టీఆర్‌ఎస్ ప్రభుత్వం నిజంగా రుణమాఫీ చేయకపోతే ప్రజలు మళ్లీ తమకు ఎందుకు ఓటు వేశారని విపక్ష సభ్యులను ప్రశ్నించారు. రైతుబీమా పరిహారం బాధిత కుటుంబాలకు కేవలం పదిరోజుల్లోనే అందుతున్నదని చెప్పారు. ప్రభుత్వ కార్యాలయాలకు తిరుగకుండా, పైరవీలు చేయకుండానే బాధిత కుటుంబాల ఖాతాల్లో పరిహారం సొమ్ము జమ అవుతున్నదన్నారు. ఇప్పటికే 6,062 మందికి రైతుబీమా అందిందని, మొత్తం రూ.303 కోట్లు ఆయా రైతుల ఖాతాల్లో జమ అయ్యాయని చెప్పారు. కాంగ్రెస్ ప్రభుత్వం వ్యవసాయ అధికారులను కూడా నియమించలేదని సీఎం మండిపడ్డారు. 'ఇదివరలో సర్వేయర్లు లేరు.. వ్యవసాయ విస్తరణాధికారుల వ్యవస్థను కూడా నిర్వీర్యంచేశారు. మేం చెప్పింది చేసి చూపెట్టాం కాబట్టే ప్రజలు ఈసారి కూడా బ్రహ్మాండమైన మెజార్టీతో మమ్మల్ని గెలిపించారు. డిమాండ్‌ను బట్టి అవసరమైన ప్రతీచోట ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్లు ఏర్పాటుచేస్తాం' అని సీఎం తెలిపారు. తెలంగాణలో రైతే రాజు అయ్యే పరిస్థితులు వచ్చాయని ఇప్పటికే పలువురు ప్రశంసించారని పేర్కొన్నారు. ధరణి వెబ్‌సైట్‌తో భూరికార్డుల ప్రక్షాళన పూర్తిచేసి దేశంలో భూరికార్డులకు కూడా రైతుబంధు, రైతుబీమా పథకాల మాదిరిగా మార్గదర్శకంగా నిలువబోతున్నామని తెలిపారు.

మొదటి ప్రాధాన్యం ఇరిగేషన్ రంగానికే

రాష్ట్ర ప్రభుత్వ మొదటి ప్రాధాన్యం ఇరిగేషన్ అని, రానున్న మూడేండ్లలో కోటీ 25 లక్షల ఎకరాలకు నీరందించబోతున్నామని సీఎం కేసీఆర్ స్పష్టంచేశారు. సాగునీటి ప్రాజెక్టులపై ఇప్పటివరకు రూ.99 వేల కోట్లు ఖర్చుపెట్టామని, వచ్చే మార్చినాటికి మరో ఏడెనిమిది వేల కోట్లు ఖర్చవుతాయని చెప్పారు. ఆన్‌గోయింగ్ ప్రాజెక్టులు పూర్తిచేయడానికి రూ.లక్షా 17వేల కోట్లు ఖర్చు చేయబోతున్నామన్నారు. మనకు కేటాయించిన నీటివాటాను సంపూర్ణంగా వినియోగించుకునేలా ప్రణాళికలు అమలుచేస్తున్నామని చెప్పారు. కౌలురైతుల సంక్షేమాన్ని చూసే బాధ్యతను భూ యజమానులే తీసుకోవాలని సీఎం కేసీఆర్ విజ్ఞప్తిచేశారు. రెండో ప్రాధాన్యం రహదారులని, కొత్తగా ఏర్పడిన అన్ని గ్రామపంచాయతీలకు బీటీ రోడ్లు వేస్తామని సీఎం తెలిపారు. పాత రోడ్లను అద్దాల్లాగా తీర్చిదిద్దేందుకు అధిక ప్రాధాన్యం ఇస్తామన్నారు. 'వచ్చే ఆర్థిక సంవత్సరం నుంచి మేం ప్రకటించిన అన్ని హామీలు అమలుచేస్తం. నిరుద్యోగభృతిని క్షుణ్ణంగా అధ్యయనంచేసి ఎలాంటి లోటుపాట్లులేకుండా అమలుచేస్తం. శాంతిభద్రతలు అద్భుతంగా అమలుకావడం మాకు గర్వకారణం. పోలీస్ కమాండ్ కంట్రోల్ అన్ని విభాగాలను సమన్వయం చేసుకునేలా ఏర్పాట్లుచేస్తున్నాం. శాంతిభద్రతల విషయంలో ఎలాంటి రాజీ ఉండబోదు' అని తెలిపారు.

అక్రమాలకు తావులేకుండా ఇండ్ల పథకం

పేదవారికి అన్ని వసతులతో డబుల్ బెడ్‌రూం ఇండ్లను నిర్మించి ఇస్తామని సీఎం కేసీఆర్ స్పష్టంచేశారు. కొంచెం ఆలస్యమైనా అక్రమాలకు తావులేకుండా చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. 'మా ఆలోచన ప్రకారం డబుల్ బెడ్‌రూం ఇండ్లు కడుతున్నం. మేం కడుతున్న ఇండ్లకు వందకు వందశాతం పూర్తి సబ్సిడీ ఇస్తున్నం. పటిష్ఠంగా కడుతున్నం. కొంచెం ఆలస్యమైతదని ఎన్నికల సభలల్లనే చెప్పిన. గతంలో ఇండ్ల నిర్మాణంలో భయంకరమైన అవినీతి జరిగింది. అందుకే ఆ కార్పొరేషన్‌నే రద్దుచేసినం. పారదర్శకంగా లబ్ధిదారుల ఎంపిక జరుగుతుంది' అని కేసీఆర్ చెప్పారు. 'హైదరాబాద్‌లోని కొల్లూరులో 15,600 ఇండ్లు ఒకేచోట నిర్మాణం అవుతున్నయి. నగరపరిధిలోనే దాదాపు 30వేల ఇండ్ల నిర్మాణం జరుగుతున్నది. జిల్లాల్లో కూడా జరుగుతున్నయి. లక్ష ఇండ్ల నిర్మాణం కోసం ప్రణాళికలు కూడా జరుగుతున్నయి. మేం ఒక సాహసం చేయబోతున్నం.. కచ్చితంగా గ్రామపంచాయతీ కార్యదర్శులు, సర్పంచులను బాధ్యులనుచేస్తూ గ్రామాల నుంచి వంద శాతం జాబితాను తెప్పిస్తం. రాష్ట్రంలో కట్టాల్సిన ఇండ్ల సంఖ్య ఎంత అనేది కచ్చితంగా తేలుస్తం. పార్లమెంటు ఎన్నికల తర్వాత నిర్ణీత గడువు పెట్టి వివరాలు సేకరిస్తాం. వారి ఊర్లో ఇండ్లు కావాల్సిన పేదలు ఎంతమంది ఉన్నరో వివరాలు ప్రభుత్వానికి ఇయ్యాలి. ప్రభుత్వం కట్టే కాలనీలే కాకుండా సొంతస్థలాలు ఉన్నవారికి కూడా రూ.5-6 లక్షలతో ఇండ్లు కట్టుకునేందుకు ఇస్తమని హామీకి కట్టుబడి ఉంటాం. ఎంతమందికి ఇస్తామనేది బడ్జెట్ సందర్భంగా ప్రకటన చేస్తాం' అని తెలిపారు.

ఇతర రాష్ట్రాలకు మార్గదర్శకంగా 'కంటి వెలుగు'

రాష్ట్రప్రభుత్వం ప్రవేశపెట్టిన కంటి వెలుగు పథకం కూడా ఇతర రాష్ట్రాలకు మార్గదర్శకంగా నిలుస్తున్నదని సీఎం కేసీఆర్ చెప్పారు. పేదరికంతోపాటు నిర్లక్ష్యం వల్ల చాలామంది కంటిపరీక్షలు చేయించుకోవడం లేదని, ఎవరూ కోరకుండానే మంచి ఉద్దేశంతో కంటివెలుగు ప్రవేశపెట్టామని తెలిపారు. దీనిపై ప్రతిపక్షాలు తప్పుడు ప్రచారంచేయడం తగదన్నారు. కంటివెలుగు పథకం కింద ఇప్పటివరకు ప్రభుత్వం ఎలాంటి ఆపరేషన్లు ప్రారంభించలేదని చెప్పారు. కంటివెలుగు పథకం కింద ఇప్పటివరకు 1.32 కోట్ల మందికి పరీక్షలు జరిగాయని తెలిపారు. కంటివెలుగు పథకాన్ని 'సునేత్ర' పేరు తో ఇతర రాష్ట్రాలు అమలుకు ప్రయత్నిస్తున్నాయన్నారు. త్వరలో చెవి, ముక్కు, గొంతు పరీక్షల శిబిరాలు కూడా నిర్వహిస్తామని కేసీఆర్ స్పష్టంచేశారు. అనంతరం రాష్ట్రంలోని ప్రజలందరి రక్తపరీక్షలు నిర్వహించి ఆన్‌లైన్‌లో హెల్త్‌ప్రొఫైల్ పొందుపరచనున్నట్లు తెలిపారు.

కలప స్మగ్లర్లపై ఉక్కుపాదం మోపుతాం

అడవుల పరిరక్షణ విషయంలో కఠినంగా వ్యవహరిస్తామని, స్వచ్ఛమైన గాలి పీల్చలేని పరిస్థితులు రాకుండా నిరోధించడం అత్యవసరమని ముఖ్యమంత్రి అభిప్రాయపడ్డారు. కలప స్మగ్లర్లపై ఉక్కుపాదం మోపుతామన్నారు. డ్రగ్స్ కేసు విషయంలోనూ కఠినంగా వ్యవహరిస్తామని చెప్పారు. ధూల్‌పేట పునరావాసం విషయం అక్కడి ప్రజలతో ఎమ్మెల్యే రాజాసింగ్‌తో కూడా మాట్లాడుతానని తెలిపారు. గతంలో గ్రామాలపై తీవ్రనిర్లక్ష్యం కొనసాగిందని ముఖ్యమంత్రి కేసీఆర్ నిరసన వ్యక్తంచేశారు. అందమైన గ్రామసీమల్ని తయారుచేసుకుందామని, అందుకోసమే చాలా పకడ్బందీ, కఠినమైన పంచాయతీరాజ్ చట్టాన్ని తెచ్చామని చెప్పారు. రాష్ట్రమంతటా మంచిరోడ్లు వేసుకుందామని అన్నారు. 'సంక్షేమంలో గతంలో ఎవరూ పట్టించుకోనివాళ్లను కూడా పట్టించుకుంటున్నం. విద్యావైద్య రంగాల్లో కొన్ని మంచి పద్ధతులు తెచ్చినం. గురుకుల పాఠశాలలు పెంచుకుంటూ పోతాం. కొన్ని ఉపాధ్యాయ సంఘాలకు ఇష్టం లేకున్నా దానికి ప్రాధాన్యం ఇస్తం. ఉన్నత విద్యలో ప్రైవేటు భాగస్వామ్యాన్ని పెంచాలనేది పరిశీలించాలి. ఎలాగూ ఫీజు రీయింబర్స్‌మెంట్ ఇస్తున్నం. ప్రైవేటు విద్యాసంస్థలు సమర్థంగా నిర్వహణ చేయగలిగితే వాటి భాగస్వామ్యాన్ని కూడా తీసుకోవాలి' అని తెలిపారు.

ఈసారికి రాష్ట్రంలోనూ ఓటాన్ అకౌంట్ బడ్జెట్

ఈసారికి మన రాష్ట్రంలోనూ ఓటాన్ అకౌంట్ బడ్జెట్‌నే ప్రవేశపెట్టబోతున్నట్లు సీఎం చెప్పారు. 'ఈ మే తర్వాత ఏ ప్రభుత్వం వస్తది? ఆ ప్రభుత్వ విధానం ఏమై ఉంటది? అది కూడా తేలాలి. అందుకే మనకు అవకాశం ఉన్నా.. ఆ విషయాలు తేలకుండా ముందుకు పోలేం' అని పేర్కొన్నారు. 'రెండు, మూడు నెలల్లో పెద్దగా మునిగిపోయేది ఏం లేదు. కేంద్రంలోని ప్రభుత్వం కూడా ఓటాన్ అకౌంట్ బడ్జెట్‌నే పెడుతుంది. బ్రాడ్ పాలసీ వస్తది. ఈలోపు ఫైనాన్స్ కమిషన్ కూడా వస్తది. ఫిబ్రవరిలో మనకు టైం ఇచ్చినరు. నేను కూడా హాజరుకావాల్సి ఉంటది. చెప్పాల్సి ఉంటది. వీటి ప్రాతిపదికనే మనం ముందుకుపోవాలి. అందుకే చీకట్లోకి బాణం వేసినట్లుగా పోదలచుకోలేదు' అని చెప్పారు. 'ప్రస్తుతం మన రాష్ట్రం ఆర్థిక వృద్ధిలో దేశంలోనే నంబర్‌వన్‌గా ఉన్నది. నాలుగేండ్లు వరుసగా, నిలకడగా 17.17 శాతం వృద్ధి ఉంది. ఇప్పుడు జరిగేది ఐదో సంవత్సరం. ఇప్పుడు 29.93 శాతం మన గ్రోత్ ఉంది. ఇది మంచి వృద్ధి. జీఎస్టీ వసూళ్లలో కూడా దేశంలోనే నంబర్‌వన్‌గ ఉన్నం' అని ఆయన తెలిపారు.

చెప్పినవే కాదు.. చెప్పనివీ చేస్తం.. పంథా మార్చుకోండి..

ప్రతిపక్షం పంథా మార్చుకోవాలని, ప్రభుత్వ పనితీరు విషయంలో తొందరపాటుతో వ్యవహరించవద్దని ముఖ్యమంత్రి కేసీఆర్ సూచించారు. 'మీ పంథా మార్చుకోమని సలహా చెప్తున్నా. మేం మార్చుకోలేమంటే అది మీ ఇష్టం. ఇంత తొందరపాటు ఎందుకు? మేం ఇచ్చిన వాగ్దానాలకు ఎంత ఖర్చవుతుంది.. ఎలా చేద్దామన్నది చూసుకొని చేస్తం కదా. ఇదెప్పుడు చేస్తరు? పొద్దుగూకేవరకు చేస్తరా అంటే.. అట్ల మేం చెప్పలేదు కదా. మ్యానిఫెస్టోలో ఏదైతే చెప్పినమో వందకు వంద శాతం తూ.చ. తప్పకుండా అమలుచేస్తాం. నిన్న గవర్నర్ ప్రసంగంలో కూడా చెప్పినం.. మ్యానిఫెస్టోలో చెప్పని అంశాలు కూడా ప్రాసెస్‌లో.. ప్రయాణంలో మా దృష్టికి ప్రజల సమస్యలు వస్తే.. చెప్పలేదని ఊరుకోం. వాటిని కూడా వందకు వంద శాతం అమలు చేస్తం' అని ఆయన పేర్కొన్నారు.

ప్రశాంత ఎన్నికలు టీఆర్‌ఎస్ ప్రభుత్వ ఘనతనే..

ఇన్సిడెంట్ ఫ్రీ ఎన్నికలు జరిగాయని సభ్యుడు బలాలా అన్నారని, ఈ ఘనత కచ్చితంగా టీఆర్‌ఎస్ ప్రభుత్వానికి దక్కుతుందని ముఖ్యమంత్రి అన్నారు. గత నాలుగున్నరేండ్లలో రాష్ట్రంలో ఒక్కసారి కూడా మత కలహాలు చెలరేగలేదని, ఎలాంటి శాంతిభద్రతల సమస్యలు తలెత్తలేదని చెప్పారు. దేశమే గర్వపడే అంతర్జాతీయ స్థాయి ప్రమాణాలతో పోలీసు కమాండ్ అండ్ కంట్రోల్ రూం హైదరాబాద్ నడిబొడ్డులో తయారవుతున్నదని పేర్కొన్నారు. శాంతిభద్రతల విషయంలో చాలా కఠినంగా వ్యవహరిస్తామని, ఎట్టి పరిస్థితుల్లోనూ రాజీపడబోమని స్పష్టంచేశారు.

ఆదర్శాన్ని కొనసాగిద్దాం.. గొప్పగా గవర్నర్ ప్రసంగం

గవర్నర్ ప్రసంగం చాలా గొప్పగా ఉందని ముఖ్యమంత్రి పేర్కొన్నారు. 'ఏం ఉండాల్నో అది ఉంది. ఏం ఉండకూడదో అది లేదు. గవర్నర్ ప్రసంగంలో వివరాలు లేవని వెంకటరమణారెడ్డి అన్నరు. గవర్నర్ ప్రసంగంలో వివరాలు ఉండవు. గవర్నర్ ప్రసంగంలోగానీ, రాష్ట్రపతి ప్రసంగంలోగానీ బ్రాడ్ పర్‌స్పెక్టివ్ ఆఫ్ ద గవర్నమెంట్ చెప్తరు. కొత్తగా వచ్చిన ప్రభుత్వం ఏం చేస్తదో స్థూలంగా చెప్తరు తప్ప గవర్నర్ ప్రసంగంలో అన్నీ చెప్పరు' అని అన్నారు. శనివారం గవర్నర్ ప్రసంగ సమయంలో సభ జరిగిన తీరు చాలా హుందాగా, ఔన్నత్యంగా ఉందని ప్రశంసించారని, ఇదే ఆదర్శాన్ని కొనసాగిద్దామని తెలిపారు. ప్రతిపక్ష కాంగ్రెస్ నేతగా నియమితులైన భట్టి విక్రమార్కను ముఖ్యమంత్రి అభినందించారు. విజయవంతంగా పనిచేయాలని ఆకాంక్షిస్తున్నానన్నారు. ప్రతిపక్షాలు నిర్మాణాత్మక సహకారాన్ని, సలహాలను ఇవ్వాలని కోరారు. ఏ సమయంలోనైనా శాసనసభ ఎన్నిరోజులంటే అన్ని రోజులు నడిపేందుకు సిద్ధంగా ఉన్నామని చెప్పారు. వివక్ష లేకుండా అన్ని పథకాలనూ అన్ని నియోజకవర్గాల్లో ఒకేతీరుగా అమలుపరుస్తున్నామని ఆయన చెప్పారు.

నీతిఆయోగ్ సిఫారసు చేసినా నిధులివ్వని కేంద్రం



కేంద్రంలో అనుకూల ప్రభుత్వం లేదని, తెలంగాణకు ఒక్క రూపాయి కూడా అదనంగా ఇవ్వలేదని ముఖ్యమంత్రి కేసీఆర్ విమర్శించారు. కేంద్రం అండ లేకున్నా అద్భుతప్రగతి సాధిస్తున్నామని పేర్కొన్నారు. 'కేంద్రంలో ఇప్పుడు అధికారంలో ఉన్న బీజేపీ ప్రభుత్వం మనకు అదనంగా ఒక్క రూపాయి కూడా ఇయ్యలేదు. కనీసంగా 500 వినతిపత్రాలు ఇచ్చినం. అయ్యా.. సమైక్య రాష్ట్రంలో కష్టపడింది మేం. ఇబ్బందులు పడ్డది మేం. నష్టపోయింది మేం. వలసలు పోయింది.. ఆత్మహత్యలు చేసుకున్నది మా రైతులు. నీళ్లు మాకు రాలే. మా గొంతులు ఎండినయి, మా పొలాలు బీళ్లు వారినయి అని దండం పెట్టి.. నేనుగానీ, మంత్రులుగానీ 500 వినతిపత్రాలు ఇచ్చినం. తెలంగాణ ప్రభుత్వం తీసుకున్న మిషన్ కాకతీయ, మిషన్ భగీరథ అనే రెండు పథకాలు మంచిగ ఉన్నయని నీతి ఆయోగ్ వాళ్లు రెండింటికి కలిపి రూ.24 వేల కోట్లు ఇయ్యండని కేంద్ర ప్రభుత్వానికి రికమండ్ చేస్తే రూ.24 కూడా ఇయ్యలే. ఒక సాగునీటి ప్రాజెక్టుకు జాతీయ హోదా ఇయ్యమని అడిగినం. కానీ ఇయ్యలేదు. ఏ రంగంలో కూడా ఒక్క రూపాయి కూడా ఇయ్యలేదు. రాజ్యాంగబద్ధంగా కేంద్ర పన్నుల వాటాల్లో రావాల్సిన డెవల్యూషన్ ఫండ్స్ వాటా తప్ప అదనంగా ఒక్క రూపాయి రాలేదు. గత నాలుగున్నర సంవత్సరాల్లో కేంద్రంలో మనకు అనుకూలమైన ప్రభుత్వం ఉంది తప్ప అనుకూలమైన ప్రభుత్వం లేదు. అయినప్పటికీ ఈ గ్రోత్ సాధించినం' అని ముఖ్యమంత్రి చెప్పారు. 'వచ్చే ఐదేండ్లలో తెలంగాణ సమకూర్చుకునే ఆదాయం.. పెట్టే ఖర్చు రూ.10 లక్షల కోట్లపైనే ఉంటది. ఈ ఐదేండ్లలో రూ.2 లక్షల 40 వేల కోట్ల అప్పు చెల్లించాలి. నాలుగు నుంచి ఐదు లక్షల కోట్లు అభివృద్ధి పనులకు ఉంటాయి. రుణాలపై సమగ్ర అధ్యయనం చేసిన తర్వాత ఎన్ని విడతల్లో మాఫీచేయాలనే అంశంపై నిర్ణయం తీసుకుంటాం' అని తెలిపారు. కొన్ని పనుల ప్రారంభానికి ఎన్నికల కోడ్ అవరోధంగా మారిందన్నారు. లోక్‌సభ ఎన్నికలు పూర్తికాగానే పనులు, సంస్కరణల్లో వేగం పెరుగుతుందని స్పష్టంచేశారు. కాంగ్రెస్ ప్రభుత్వ విధానాలవల్లే పోడు భూముల సమస్య పరిష్కారంకాకుండా పోయిందన్నారు. పొరుగు రాష్ట్రాల నుంచి కోయలు వలసరావడం కూడా పోడు భూముల విషయంలో సమస్యగా మారిందని.. ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు ఆ సమస్యను తప్పకుండా పరిష్కరిస్తామని చెప్పారు. పోడు సమస్యపై త్వరలోనే రాష్ట్రంలోని గిరిజన ప్రజాప్రతినిధులందరితో సమావేశం నిర్వహిస్తామని తెలిపారు.

ఆరోగ్యశ్రీ అద్భుతమైన పథకం



ఆరోగ్యశ్రీ పథకం అద్భుతమైనదని ముఖ్యమంత్రి చెప్పారు. కేంద్ర ప్రభుత్వం ఆయుష్మాన్ భారత్ కంటే ఇదే మేలయినదని అన్నారు. 'ప్రధానమంత్రి నరేంద్రమోదీకి, నాకు మధ్య చాలాసార్లు ఇదే వాదన వస్తది. నేను పోయిన ప్రతిసారీ ఒక కాగితం ఇస్తరు. అందులో మొదటి లైన్‌లోనే.. తెలంగాణ డిడ్‌నాట్ జాయిన్ ఇన్ ఆయుష్మాన్ భారత్ స్కీం అని ఉంటది. మేం అందులో జాయిన్ కాలేదు. ఎందుకంటే ప్రజలకు లాభం కంటే కీడు ఎక్కువ ఉంది. మంచి పథకాలను ఎవరుతెస్తే వారికి చరిత్రలో కీర్తి ఉంటది. మంచి పథకాలను ఎవరూ కాదనలేరు. వైఎస్ రాజశేఖర్‌రెడ్డి ముఖ్యమంత్రిగ ఉన్నపుడు తెచ్చిన పథకం ఆరోగ్యశ్రీ. ఇది చాలా మంచి పథకం. మాకు భేషజాలు లేవు. మంచిని మంచి అని ఒప్పుకోవాలి. ఇది కేంద్ర ప్రభుత్వం పెట్టిన ఆయుష్మాన్ భారత్ కంటే ఎన్నో రెట్లు మంచి పథకం. అందుకే గత నాలుగున్నరేండ్లుగా దానిని మేం కొనసాగిస్తూనే ఉన్నం. ఇప్పుడు కూడా ముందుకు తీసుకుపోతం. నేను మోదీకి అదే చెప్పిన. చాలా మంచి పథకం. దానిని ఇంకా బెటర్ చేసుకుంటున్నం. దానికి అడిషన్స్ చేసుకుంటున్నం. ఆయన ఉన్నపుడు 108 అని పెట్టినరు, మేం ఇంకోటి.. అమ్మ ఒడి వంటివి కూడా యాడ్ చేసినం. మీ పథకం ఇన్ఫీరియర్ స్కీం, అందుకే జాయిన్ కామని కుండబద్దలు కొట్టినట్లు చెప్పినం' అని ఆయన తెలిపారు. 'అట్లనే కొన్ని భ్రమలు ఉన్నయి. ఇక్కడ బీజేపీవాళ్లు కూడా తమాషాలు మాట్లాడుతరు. మేం ఇన్ని డబ్బులు ఇచ్చినం అని అంటరు. మీరిచ్చేదేంది? మా హక్కు అది. కేంద్ర పన్నుల్లో వాటా. ఇది రాజ్యాంగబద్ధమైన హక్కు. దానిని ఏ కేంద్ర ప్రభుత్వమైనా ఇవ్వాల్సిందే. అందుకే ఆ భ్రమల నుంచి బీజేపీవాళ్లు బయటికి రావాలి. కేసీఆర్ కిట్స్‌లో కేంద్ర ప్రభుత్వ వాటానే లేదు. అచ్చంగ మనదే' అని ఆయన స్పష్టం చేశారు.

శాసనసభ, మండలి నిరవధిక వాయిదా

తెలంగాణ రాష్ట్ర రెండో అసెంబ్లీ మొదటి సమావేశాలు నాలుగు రోజులపాటు జరిగాయి. ఆదివారం మధ్యాహ్నం స్పీకర్ పోచారం శ్రీనివాస్‌రెడ్డి సభను నిరవధికంగా వాయిదా వేస్తున్నట్టు ప్రకటించారు. ఈ నెల 17న ప్రారంభమైన సమావేశాలు ఆదివారం మధ్యాహ్నం ముగిశాయి. నాలుగురోజుల్లో 9 గంటల 28 నిమిషాలపాటు సభ జరిగింది. శాసనమండలి సమావేశాలు ఆదివారం ఒక్కరోజు జరిగాయి. మండలిలో మొత్తం 18 మంది సభ్యులు 4 గంటల 54 నిమిషాలపాటు మాట్లాడారు. శాసనమండలిని కూడా చైర్మన్ స్వామిగౌడ్ నిరవధికంగా వాయిదావేశారు.

మీ గవర్నర్ కాదు.. మన గవర్నర్





టీఆర్‌ఎస్ ప్రభుత్వం అని సంబోధిస్తే అంత అసహనం ఎందుకు?

గండ్రకు సీఎం కేసీఆర్ ఘాటు సమాధానం

రాష్ట్రంలో గవర్నర్ ఒక్కరే ఉంటారని, ఆయనను ఎవరైనా 'మన గవర్నర్' అని గౌరవించేలా సంబోధించాలని సీఎం కేసీఆర్ స్పష్టంచేశారు. గవర్నర్ ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపే తీర్మానంలో భాగంగా ఆదివారం కాంగ్రెస్ పార్టీకి చెందిన భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి మాట్లాడుతూ 'మీ గవర్నర్' అని సంబోధించారు. దీనికి సీఎం కేసీఆర్ తీవ్ర అభ్యంతరం తెలిపారు. మీ గవర్నర్ కాదు.. మన గవర్నర్ అనాలని సలహా ఇచ్చారు. మీ గవర్నర్ పదాన్ని రికార్డుల నుంచి తొలిగించి మన గవర్నర్‌గా పేర్కొనాలని సూచించారు. గవర్నర్ కాంగ్రెస్ పార్టీకి ఒకరు, టీఆర్‌ఎస్ పార్టీకి మరొకరు ఉండరని పేర్కొన్నారు. గండ్ర స్పందిస్తూ.. సీఎం మాటలతో తాను ఏకీభవిస్తున్నాననీ, కానీ గవర్నర్ తన ప్రసంగంలో టీఆర్‌ఎస్ పార్టీ కేంద్రంపై రాజీలేని పోరాటం చేస్తుందని అన్నారని చెప్పారు. ఈ వ్యాఖ్యలకు కూడా సీఎం ఘాటుగా సమాధానమిచ్చారు. రాష్ట్రంలో అధికారంలో ఉన్నది టీఆర్‌ఎస్ పార్టీయే కాబట్టి, గవర్నర్ అన్నది వంద శాతం కరెక్టేనన్నారు. రాజస్థాన్‌లో, మధ్యప్రదేశ్‌లో, ఛత్తీస్‌గఢ్‌లో కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం అని కాకుండా ఇంకేమంటారని ప్రశ్నించారు. తెలంగాణ ప్రజలు తమకు ఓట్లేసి గెలిపించారని, కాబట్టి టీఆర్‌ఎస్ పార్టీ అనడంలో తప్పు లేదన్నారు. వాస్తవాన్ని భరించలేక, అంత ఆత్మవంచన, అసహనం ఎందుకని ప్రశ్నించారు. సంగారెడ్డిలో మెడికల్ కాలేజీని ఏర్పాటుచేస్తామన్న హామీని నెరవేర్చాలని సంగారెడ్డి ఎమ్మెల్యే జయప్రకాశ్‌రెడ్డి కోరగా.. తగిన చర్యలను తీసుకుంటామని సీఎం కేసీఆర్ హామీ ఇచ్చారు. కల్యాణలక్ష్మి పథకం పేదలకు ఎంతగానో ఉపయోగపడుతున్నదని, కానీ ఆర్థిక సాయం అందడంలో కొన్నిచోట్ల జాప్యం జరుగుతున్నదని గోషామహల్ ఎమ్మెల్యే రాజాసింగ్ పేర్కొన్నారు. దీనికి సీఎం సమాధానమిస్తూ.. జాప్యం జరిగిన సందర్భం ఒక్కటి కూడా తన దృష్టికి రాలేదని, నిర్దిష్టమైన వివరాలు ఉంటే తన దృష్టికి తీసుకురావాలని, వెంటనే చర్యలు తీసుకుంటామని ఆయన హామీఇచ్చారు.

ముహూర్తం



సూర్యోదయం: 6.53 గంటలకు



సూర్యాస్తమయం: 6.01 గంటలకు

విళంబినామ సంవత్సరం, ఉత్తరాయణం, హేమంతరుతువు, పుష్యమాసం, శుక్లపక్షం, పూర్ణిమ ఉదయం 10.47 వరకు, తదుపరి పాడ్యమి, నక్షత్రం: పునర్వసు తె. 5.23 వరకు తదుపరి పుష్యమి, అమృతఘడియలు: తె. 3.15 నుంచి కృష్ణపక్షం 4.51 వరకు, తదుపరి రాత్రి 8.51 నుంచి 10.27 వరకు, రాహుకాలం ఉదయం 8.17 నుంచి 9.40 వరకు, దుర్ముహూర్తం: మధ్యాహ్నం 12.05 నుంచి 12.50 వరకు, తదుపరి మధ్యాహ్నం 3.03 నుంచి 3.48 వరకు, వర్జ్యం: మధ్యాహ్నం 12.25 నుంచి 2.01 వరకు.

లోకం పోకడ



బయట నువ్వు చెప్పినట్టే వింటాగానీ, ఇంట్లో కూడా నాకు ఆర్డర్లు జారీ చేయొద్దు.. సరేనా?!

ప్రభుత్వ పనితీరుకే పట్టం

- ప్రజా సంక్షేమానికి అఖండ మెజార్టీ
- సీఎం కేసీఆర్ పనితీరే గీటురాయిగా ప్రజల తీర్పు
- హోం మంత్రి మహమూద్ అలీ
- గవర్నర్ ప్రసంగానికి ధన్యవాద తీర్మానంపై మండలిలో చర్చ



ఆదివారం శాసనమండలిలో మాట్లాడుతున్న హోంమంత్రి మహమూద్ అలీ, ప్రభుత్వ విప్, ఎమ్మెల్సీ పల్లా రాజేశ్వర్‌రెడ్డి

హైదరాబాద్, నమస్తే తెలంగాణ:

సీఎం కేసీఆర్ నేతృత్వంలోని గత ప్రభుత్వం పనితీరు ఆధారంగానే ప్రజలు రెండోసారి పట్టం కట్టారని, ప్రజా సంక్షేమం కోసం అ ఖండ మెజార్టీతో మళ్లీ గెలిపించుకున్నారని హోంశాఖ మంత్రి మహమూద్ అలీ పేర్కొన్నారు. అసెంబ్లీలో గవర్నర్ ప్రసంగంపై ఆదివారం శాసనమండలిలో ధన్యవాద తీర్మానాన్ని ప్రభుత్వ విప్, ఎమ్మెల్సీ పల్లా రాజేశ్వర్‌రెడ్డి ప్రతిపాదించారు. ఈ సందర్భంగా మహమూద్ అలీ మాట్లాడుతూ.. 2014లో ప్రజలకు ఇచ్చిన హామీలతోపాటు కొత్త పథకాలను ప్రవేశపెట్టి అమలుచేసిన సీఎం కేసీఆర్ పనితీరుపై ప్రజల్లో అపారమైన నమ్మకం ఏర్పడిందన్నారు. రాష్ట్రంలో శాంతిభద్రతలు అదుపులో ఉన్నాయని, ఎక్కడా అవాంఛనీయ ఘటనలకు తావులేకుండా పోలీసు వ్యవస్థను తీర్చిదిద్దామని పేర్కొన్నారు. రూ.700 కోట్లతో వాహనాలు కొనుగోలుచేసి పోలీసులు సంఘటనాస్థలానికి ఐదు నిమిషాల్లో చేరుకునేలా తయారుచేశామని చెప్పారు. 24 గంటల కరంట్ సరఫరాతో రైతులను, పరిశ్రమల్లో పనిచేసే కార్మికులను ప్రభుత్వం ఆదుకున్నదని గుర్తుచేశారు. కొత్త జిల్లాలు, డివిజన్లు, మండలాల ఏర్పాటుతో ప్రజల చెంతకే పాలన తీసుకొచ్చామన్నారు. భూ రికార్డుల ప్రక్షాళన, రైతుబంధు, రైతు బీమా పథకాల ద్వారా అన్నదాతల జీవన స్థితిగతులను మార్చిన ఘనత సీఎం కేసీఆర్‌దేనని స్పష్టంచేశారు. కేసీఆర్ కిట్లతో సర్కార్ దవాఖానలో ప్రసవాలు పెరిగాయన్నారు. సాగునీటి ప్రాజెక్టుల నిర్మాణం, మిషన్ భగీరథ వంటివి అమోఘమన్నారు. ముస్లిం మైనార్టీలకు 12 శాతం రిజర్వేషన్లు కల్పించాలని అసెంబ్లీలో తీర్మానం చేసి కేంద్రానికి పంపించామని గుర్తుచేశారు. వీటితో పాటు పింఛన్లు, కల్యాణలక్ష్మి, షాదీముబారక్ వంటి పథకాలతో సీఎం కేసీఆర్ ప్రజారంజక పాలన అందిస్తున్నారని వివరించారు.

ప్రజల నమ్మకం వల్లే గెలిచాం: ఎమ్మెల్సీ పల్లారాజేశ్వర్‌రెడ్డి

బంగారు తెలంగాణ సాధన దిశగా సీఎం కేసీఆర్ ప్రవేశపెట్టిన సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు, అన్నివర్గాల ప్రజల్లో టీఆర్‌ఎస్‌పై ఉన్న నమ్మకం వల్లే అసెంబ్లీ ఎన్నికల్లో గెలిచామని మండలి విప్ పల్లారాజేశ్వర్‌రెడ్డి పేర్కొన్నారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడ్డాక 2014 నుంచి 2019 వరకు ఆదాయ వృద్ధిరేటు 17.17 శాతం పెరిగిందన్నారు. రైతుబంధు, రైతుబీమా పథకాలను దేశం మొత్తం హర్షిస్తున్నదని, ఇటీవలే అన్నాహజారే వంటి ప్రముఖులు ప్రశంసించారని గుర్తుచేశారు. మండలి విప్ బోడకుంటి వెంకటేశ్వర్లు మాట్లాడుతూ టీఆర్‌ఎస్ ప్రభుత్వం చేపట్టిన పలు అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలను వివరించారు. ఎమ్మెల్సీలు రాంచందర్‌రావు, జాఫ్రీ పలు ప్రభుత్వ పథకాల అమలు తీరుపై చర్చించారు. ఎమ్మెల్సీ కాటేపల్లి జనార్దన్‌రెడ్డి మాట్లాడుతూ తెలంగాణ ప్రజల విశ్వాసం సీఎం కేసీఆర్‌వైపే ఉన్నదని మరోసారి నిరూపితమైందన్నారు. అభివృద్ధి, సంక్షేమాన్ని జోడెడ్ల బండిలా ముందుకు తీసుకెళ్లిన ఘనత ఆయనకే దక్కిందని కొనియాడారు. ఎమ్మెల్సీ నారదాసు లక్ష్మణ్‌రావు మాట్లాడుతూ కొత్త పథకాలు సృష్టించడం ఎంతో సాధన చేస్తేగానీ సాధ్యం కావని, నాలుగున్నరేండ్ల పాలనతో సీఎం కేసీఆర్ నూ తన భాష్యాన్ని చెప్పారని కొనియాడారు. పన్నుల రూపం లో వసూలు చేసిన ఆదాయాన్ని మళ్లీ ప్రజల సంక్షేమానికే ఖర్చుపెట్టడం గొప్ప విషయమన్నారు. ఎమ్మెల్సీ ఎంఎస్ ప్రభాకర్ మాట్లాడుతూ సీఎం కేసీఆర్ తెలంగాణను దేశంలోనే నంబర్‌వన్ రాష్ట్రంగా నిలబెట్టారని, కులమతాలకు అతీతంగా పథకాలను తెచ్చి అందరి మన్ననలను పొం దారని పేర్కొన్నారు. బస్తీ దవాఖానలతో డాక్టర్లు బస్తీలకే వచ్చి వైద్యం అందిస్తున్నారన్నారు. ఎమ్మెల్సీ గంగాధర్ గౌడ్ మాట్లాడుతూ 60 ఏండ్లలో చేయని పనులను సీఎం కేసీఆర్ నాలుగున్నరేండ్లలో చేసి చూపించారని, రైతులకు అండగా నిలిచారని పేర్కొన్నారు. ఎమ్మెల్సీ ఫరూఖ్‌హుస్సేన్ మాట్లాడుతూ తాను కాంగ్రెస్‌లో ఉన్నా, మిషన్ కాకతీయ పథకం కోసం నెల జీతం ఇచ్చానని గుర్తుచేశారు. మం చి పథకాలు చేపడితే పార్టీలకు అతీతంగా నిధులు సమకూరుతాయని చెప్పారు. ఎమ్మెల్సీ ఆకుల లలిత మాట్లాడుతూ మార్కెట్ కమిటీ పదవుల్లో మహిళలకు రిజర్వేషన్లు ఇచ్చిన ఘనత సీఎం కేసీఆర్‌దేనన్నారు. ఎమ్మెల్సీ ఎలిమినేటి కృష్ణారెడ్డి మాట్లాడుతూ గవర్నర్ ప్రసంగం సీఎం కేసీఆర్ ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధికి అద్దం పడుతున్నదన్నారు. ఎమ్మెల్సీ పురాణం సతీశ్ మాట్లాడుతూ 13శాతం ఓట్ల తేడాతో టీఆర్‌ఎస్ ప్రభు త్వం ఏర్పాటైందని చెప్పారు. ఎమ్మెల్సీ శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ సీఎం కేసీఆర్ రైతుబంధు, రైతుబీమా, రుణమాఫీ పథకాలతో రైతులను అప్పుల ఊబి నుంచి రక్షించారని చెప్పారు. సాగునీటి ప్రాజెక్టుల నిర్మాణం, ఎరువులు, విత్తనాల సరఫరా వంటి కార్యక్రమాలతో వారికి ఉపశమనం లభించిందన్నారు. ఎమ్మెల్సీ ఫరీదుద్దీన్ మాట్లాడుతూ అసెంబ్లీ ఎన్నికల్లో మైనార్టీలు కేసీఆర్ వెంటననడిచారని, వారు నిర్ణాయక శక్తిగా ఉన్న 53 నియోజకవర్గాల్లో టీఆర్‌ఎస్‌కు ఓటేసి పట్టం కట్టారని పేర్కొన్నారు. ఎమ్మెల్సీ వీ రాజేశ్వర్‌రావు మాట్లాడుతూ రాష్ట్రంలో కులమతాలకు అతీతంగా అందరూ బాగుండాలనే లక్ష్యంతో సీఎం కేసీఆర్ పథకాలను ప్రవేశపెట్టారని చెప్పారు.

ఎమ్మెల్సీ పదవుల రెన్యువల్‌పై ఆసక్తికరచర్చ

ఆదివారం శాసన మండలిలో ఎమ్మెల్సీ పదవుల రెన్యువల్‌పై ఆసక్తికర చర్చ జరిగింది. ఎమ్మెల్సీ మహ్మద్ సలీం సీఎం కేసీఆర్ ప్రజలకు చేసిన సేవలను, ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలను వివరిస్తున్న క్రమంలో కాం గ్రెస్ ఎమ్మెల్సీ షబ్బీర్‌అలీ మధ్యలో కలుగజేసుకొని.. మీకు ఎమ్మెల్సీ పదవి రెన్యువల్ గ్యారెంటీ అని అన్నారు. దీంతో మహ్మద్ సలీం 'ప్రాక్టికల్‌గా చేసినవి చెప్పుకోవాలి కదా' అంటూ ముగించారు. ఇంతలో సభలో ఉన్న ఎమ్మెల్సీ కడియం శ్రీహరి అందుకొని 'మీకు ఎలాగూ రెన్యువల్ లేదు కదా' అంటూ షబ్బీర్‌అలీకి చురకలు అంటించారు. దీంతో సభలో నవ్వులు విరిశాయి.





ఆదివారం సాయంత్రం ఎర్రవల్లిలోని తన వ్యవసాయ క్షేత్రంలో యాగం ఏర్పాట్లను పరిశీలిస్తున్న సీఎం కే చంద్రశేఖర్‌రావు. చిత్రంలో ఎంపీ జోగినిపల్లి సంతోష్‌కుమార్, సీఎం రాజకీయ కార్యదర్శి శేరి సుభాష్‌రెడ్డి తదితరులు ఉన్నారు. . విద్యుత్ దీపాల వెలుగులో మహా రుద్రసహిత సహస్ర చండీ యాగానికి సిద్ధమైన యాగశాల

నేటినుంచి సహస్ర చండీ మహాయాగం

25న మహాపూర్ణాహుతితో ముగింపు ● ఎర్రవల్లిలోని సీఎం కేసీఆర్ వ్యవసాయ క్షేత్రంలో ఏర్పాట్లు

హైదరాబాద్, నమస్తే తెలంగాణ:

ముఖ్యమంత్రి కే చంద్రశేఖర్‌రావు మరోయాగం నిర్వహణకు సిద్ధమయ్యారు. ఇటీవల రాజశ్యామల యాగం సందర్భంగా సీఎం కేసీఆర్ మహా రుద్ర సహిత సహస్ర చండీ యాగం నిర్వహించాలని తలపెట్టిన విషయం తెల్సిందే. ఈమేరకు సోమవారం నుంచి అయిదు రోజులపాటు సిద్దిపేట జిల్లా గజ్వేల్ నియోజకవర్గం ఎర్రవల్లిలోని తన వ్యవసాయ క్షేత్రంలో ఈ యాగాన్ని నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేశారు. సీఎం కేసీఆర్ దంపతులు సోమవారం ఉదయం 11 గంటలకు గోపూజతో యాగాన్ని ప్రారంభిస్తారు. కర్ణాటకలోని శృంగేరి శారదాపీఠం, విశాఖపట్నంలోని శారదాపీఠంతోపాటు కరీంనగర్, హైదరాబాద్, మహబూబ్‌నగర్, మెదక్ తదితర ప్రాంతాలకు చెందిన 300 మందికిపైగా వేదపండితులు యాగక్రతువులో పాల్గొననున్నారు. యాగ ఏర్పాట్లను మాడుగుల మాణిక్య సోమయాజులు, నరేంద్ర కాపే, ఫణిశశాంక శర్మ, భద్రకాళి వేణు తదితరులు పర్యవేక్షిస్తున్నారు. విశాఖశారదా పీఠాధిపతి స్వరూపానందేంద్ర సరస్వతి యాగక్రతువుకు నేతృత్వం వహించనున్నారు. రాష్ట్రం సుభిక్షంగా ఉండాలని, సకాలంలో వర్షాలు కురువాలని, రైతులు సుఖసంతోషాలతో ఉండాలని, అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు నిరాటంకంగా కొనసాగాలని, ఇందుకు అమ్మవారి అనుగ్రహం ఉండేందుకు ఈ యాగం చేపడుతున్నారు. ఈ నెల 25న మహాపూర్ణాహుతితో యాగం ముగియనున్నది. యాగం ఏర్పాట్లను ఆదివారం సాయంత్రం సీఎం కేసీఆర్ స్వయంగా పర్యవేక్షించారు. యాగశాలల నిర్మాణం, వేదపండితులకు వసతి, భోజన ఏర్పాట్లను స్వయంగా పరిశీలించారు. సీఎంవెంట రాజ్యసభ సభ్యుడు జోగినిపల్లి సంతోష్‌కుమార్, సీఎం రాజకీయ కార్యదర్శి శేరి సుభాష్‌రెడ్డి తదితరులున్నారు.

యాగానికి పరిమితంగానే ఆహ్వానాలు

యాగానికి గతంలో మాదిరిగా ప్రజలందరినీ ఆహ్వానించడంలేదు. కేవలం ఎంపీలు, ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలు, జెడ్పీచైర్మన్ల వరకు మాత్రమే ఈ యాగంలో పాల్గొంటారని తెలిసింది. యాగశాల వద్ద పరిమితంగానే ఏర్పాట్లున్నాయి. ఈ నేపథ్యంలోనే ప్రజలందరికీ అనుమతిస్తే ఇబ్బందులు ఎదురవుతాయన్న అభిప్రాయాన్ని యాగక్రతువులో పాల్గొనే వేదపండితులు వ్యక్తంచేసినట్టు సమాచారం. సహస్ర చండీ మహాయాగం కావడంతో అత్యంత నియమనిష్ఠలను రుత్విక్కులు పాటిస్తారు. ప్రజలందరికీ ఆహ్వానం పలికితే ఇబ్బందులు తలెత్తుతాయని వారు నిర్వాహకులతో చెప్పినట్టు తెలిసింది.

రేపు ఢిల్లీకి సీఎం కేసీఆర్



హైదరాబాద్, నమస్తే తెలంగాణ: ముఖ్యమంత్రి కే చంద్రశేఖర్‌రావు మంగళవారం సాయంత్రం ఢిల్లీ వెళ్లనున్నారు. కేంద్రమంత్రి హర్షవర్ధన్ కుమారుడు మయాంక్ వివాహ వేడకలో పాల్గొననున్నారు. కేంద్రమంత్రి హర్షవర్ధన్ ఆహ్వానం మేరకు వివాహ వేడుకలో పాల్గొన్న అనంతరం తిరిగి అదేరోజు రాత్రి హైదరాబాద్‌కు చేరుకోనున్నారు.

గురుకుల పీజీటీ సోషల్ స్టడీస్ అర్హుల సర్టిఫికెట్ల పరిశీలన

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: తెలంగాణలోని గురుకుల విద్యాలయాల్లో పని చేసేందుకు పోస్ట్ గ్రాడ్యుయేట్ టీచర్స్ (పీజీటీ) సోషల్ స్టడీస్ అర్హుల సర్టిఫికెట్ల పరిశీలన ఈ నెల 23న నిర్వహించనున్నట్టు టీఆర్‌ఈఐ-ఆర్‌బీ చైర్మన్ ఆర్ ప్రవీణ్‌కుమార్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇందుకు సంబంధించి అభ్యర్థులు హాజరుకావాల్సిన సమయం, సబ్జెక్టులవారీగా వివరాలను ఫోన్ సందేశం పంపించినట్టు పేర్కొన్నారు. పీజీటీ సోషల్ స్టడీస్ అభ్యర్థులు పూర్తి వివరాలకోసం తెలంగాణ రెసిడెన్షియల్ ఎడ్యుకేషనల్ ఇన్‌స్టిట్యూషన్స్ రిక్రూట్‌మెంట్ బోర్డు వెబ్‌సైట్ www.treirb.telangana.gov.in <\<>http: //www.treirb.telangana.gov.in>>లో వివరాలను తెలుసుకోవాలని ఆయన సూచించారు.

శంషాబాద్ ఎయిర్‌పోర్టులో 2కిలోల బంగారం పట్టివేత

- రూ.66.27 లక్షల విలువైన సొత్తు స్వాధీనం
- నిందితునివద్ద నకిలీ ఆధార్‌కార్డు

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: రెండుకిలోల బంగారాన్ని అక్రమంగా రవాణా చేస్తుండగా శంషాబాద్ ఎయిర్‌పోర్టులో డీఆర్‌ఐ అధికారులు పట్టుకున్నారు. బంగారం రవాణా చేస్తున్న వ్యక్తిని అరెస్టు చేసి, రూ.66.27 లక్షల విలువైన బంగారు బిస్కెట్లను స్వాధీనం చేసుకున్నారు. ఇండోర్ నుంచి హైదరాబాద్‌కు వస్తున్న 6ఈ-648 విమానంలో ఓ ప్రయాణికుడు అక్రమంగా బంగారం రవాణా చేస్తున్నట్టు డీఆర్‌ఐ అధికారులకు అందిన సమాచారం మేరకు ఆదివారం తెల్లవారుజామున 2 గంటలకు శంషాబాద్ ఎయిర్‌పోర్టులో మాటువేశారు. బూట్లలో బంగారు బిస్కెట్లు తీసుకువస్తున్న వ్యక్తిని గుర్తించి అదుపులోకి తీసుకుని సోదాచేశారు. తనిఖీల్లో 1996.70 గ్రాముల బంగారం పట్టుబడింది. పట్టుబడిన వ్యక్తి వద్ద నకిలీ ఆధార్‌కార్డు ఉన్నట్టు డీఆర్‌ఐ అధికారులు గుర్తించారు. షార్జా నుంచి తిరువనంతపురం వెళ్తున్న మరో ప్రయాణికుడు విమానంలో వదిలివెళ్లిన బంగారాన్ని తాను తీసుకొస్తున్నట్టు నిందితుడు ప్రాథమిక దర్యాప్తులో అంగీకరించినట్టు డీఆర్‌ఐ అధికారులు తెలిపారు.



శంషాబాద్ ఎయిర్‌పోర్టులో పట్టుబడిన బంగారం

శంషాబాద్ విమానాశ్రయంలో హై అలర్ట్

శంషాబాద్: గణతంత్ర దినోత్సవం సందర్భంగా శంషాబాద్ విమానాశ్రయంలో హై అలర్ట్ ప్రకటించారు. బ్యూరో ఆఫ్ సివిల్ ఏవియేషన్ సెక్యూరిటీ (బీసీఏఎస్) ఆదేశాల మేరకు ఎయిర్‌పోర్టు సందర్శకుల ప్రవేశ పాసులపై ఆదివారం నుంచి ఆంక్షలు విధించినట్టు జీఎమ్మార్ కార్పొరేట్ కమ్యూనికేషన్ వర్గాలు ఓ ప్రకటనలో తెలిపాయి. డొమెస్టిక్ ప్రయాణికులు 2 గంటల ముందు, ఇంటర్నేషనల్ ప్రయాణికులు 3 గంటల ముందు ఎయిర్‌పోర్టుకు చేరుకొని తనిఖీలు తదితర అంశాల్లో భద్రతావర్గాలకు సహకరించాలని కోరారు. ఐబీ హెచ్చరికల నేపథ్యంలో విమానాశ్రయం, పరిసరాల్లో నిఘాతోపాటు భద్రత కట్టుదిట్టం చేశారు. ఎయిర్‌పోర్టు, రైల్వేస్టేషన్, హైవే, ఔటర్ రింగ్‌రోడ్డు, ఇతర రద్దీ ప్రదేశాల్లో నిఘా పెంచారు. స్థానిక పోలీసులతోపాటు ఎయిర్‌పోర్టు ప్రత్యేక భద్రతాసిబ్బంది వాహన తనిఖీలతో ముందు జాగ్రత్త చర్యలు చేపట్టింది.

స్టార్టప్‌లకు అండగా నిలుస్తాం

- టీటా నూతన కమిటీ

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: రాబోయే మూడేండ్ల కాలంలో స్టార్టప్‌లకు ప్రోత్సాహం ఇచ్చేందుకు కృషిచేస్తామని తెలంగాణ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ అసోసియేషన్ (టీటా) నూతన కమిటీ ప్రకటించింది. ఇప్పటివరకు గ్రామీణ ప్రాంతాల్లో సాంకేతిక అక్షరాస్యతకు చేసిన కృషికి కొనసాగింపుగా ఈ కార్యాచరణ చేపట్టనున్నట్లు తెలిపింది. ఆదివారం టీటా నూతన కమిటీ తెలంగాణ జలవనరుల అభివృద్ధి సంస్థ చైర్మన్ వీ ప్రకాశ్ సమక్షంలో ప్రమాణస్వీకారం చేసింది. టీటా గ్లోబల్ ప్రెసిడెంట్ సందీప్‌కుమార్ మక్తాల మాట్లాడుతూ స్టార్టప్‌లను ప్రోత్సహించేందుకు చర్యలు తీసుకోవడంతోపాటు విదేశాల్లో తెలంగాణ ఐటీ కాంగ్రెస్ నిర్వహించేందుకు ఎన్నారైలతో చర్చలు జరుపుతున్నట్టు తెలిపారు.

మహిళా శక్తిని మరువొద్దు





ఆదివారం హైదరాబాద్‌లోని హైటెక్స్ నోవాటెల్‌లో తెలంగాణ జాగృతి అంతర్జాతీయ యువజన నాయకత్వ సదస్సులో ప్రసంగిస్తున్న గవర్నర్ నరసింహన్, సదస్సుకు హాజరైన గవర్నర్ సతీమణి విమలా నరసింహన్, వివిధ రంగాల ప్రముఖులు, దేశ, విదేశీ ప్రతినిధులు

యువశక్తి అంటే పురుషుల శక్తి మాత్రమే కాదు ■ టెక్నాలజీ మానవ మేధస్సుకు ప్రత్యామ్నాయం కాకూడదు

యువతను జాగృతం చేయడంలో ఎంపీ కవిత సక్సెస్ ■ 'జాగృతి' ముగింపు సదస్సులో గవర్నర్ నరసింహన్

నీటి కాలుష్యాన్ని రూపుమాపండి: రాజేంద్రసింగ్ ■ మహిళా సాధికారత కోసం కృషిచేయండి: ఎంపీ కవిత

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: యువశక్తి అంటే కేవలం పురుషుల శక్తి మాత్రమే కాదని, స్త్రీశక్తి మిళితమై ఉన్నదని గవర్నర్ ఈఎస్ఎల్ నరసింహన్ పేర్కొన్నారు. అధికారమో, హోదానో మహిళా సాధికారత కాదని, వారు స్వేచ్ఛగా జీవించినప్పుడు, విద్యను అభ్యసించినప్పుడు, రక్షణ కల్పించినప్పుడు సాధికారత సాధ్యమవుతుందని చెప్పారు. తల్లిదండ్రులు, గురువులు పిల్లలకు చిన్ననాటి నుంచే స్త్రీలతో గౌరవంగా మెదిలేలా నేర్పించాలని సూచించారు. యువత గాంధేయ మార్గంలో పయనించి సమ్మిళిత సమాజానికి బాటలు వేయాలని సూచించారు. ఎంపీ కవిత నాయకత్వంలో యువతను మేల్కొలిపే ప్రక్రియలో జాగృతి విజయం సాధించిందని అభినందించారు. ఆదివారం హైదరాబాద్ హైటెక్స్‌లోని నోవాటెల్‌లో జరిగిన తెలంగాణ జాగృతి అంతర్జాతీయ యువజన నాయకత్వ సదస్సు ముగింపు సభలో ఆయన మాట్లాడారు. ప్రజలందరినీ ఏకతాటిపైకి తీసుకురావాలన్న గాంధీజీ ఆశయాలకు అనుగుణంగా వివిధ దేశాల నుంచి ప్రతినిధులు ఈ సదస్సుకు హాజరయ్యారని, ఇదొక వసుధైక కుటుంబంలాగా కనిపిస్తున్నదని పేర్కొన్నారు. ఉన్నత లక్ష్యాలను అధిరోహించేవరకు విశ్రమించొద్దన్న స్వామి వివేకానంద పిలుపును యువత అందిపుచ్చుకున్నదని, ఈ సదస్సే దానికి నిదర్శమన్నారు. ప్రస్తుత సమాజానికి శాంతి, వ్యవసాయం, పర్యావరణంలో సుస్థిరాభివృద్ధి అత్యంత అవసరమని, వీటిని సాధించగలిగితే ప్రతి రంగంలోనూ సుస్థిర అభివృద్ధి సాధ్యమవుతుందని పేర్కొన్నారు. ప్రపంచవ్యాప్తంగా ఉన్న ప్రజల మధ్య సంబంధాలను పెంపొందించడానికి జాగృతి సరైన వేదికను ఏర్పాటుచేసిందని అభినందించారు. జీవితంలో విజయం సాధించాలంటే ఎంతో సహనం అవసరమని, అహింసామార్గంలో లక్ష్యసాధనకు కృషిచేయాలని సూచించారు. హింస ప్రజలను, వనరులను, సమాజాన్ని నాశనం చేస్తుందని, కాబట్టి ప్రపంచవ్యాప్తంగా శాంతిస్థాపనకు యువత పాటుపడాలని పిలుపునిచ్చారు. పేదరికం, నిరక్షరాస్యత, అనారోగ్యం, అసమానత, పర్యావరణ కాలుష్యం వంటి అంశాలపై పోరాటం చేయాలన్నారు. నాణ్యమైన విద్యతో పేదరికాన్ని నిర్మూలించవచ్చన్నారు. దేశ ప్రగతిలో మహిళలు ప్రధాన పాత్ర పోషిస్తారని, స్త్రీలను చదివిస్తే సమాజం బాగుపడుతుందని చెప్పారు. ఆరోగ్యంగా ఉంటే సంపదను సృష్టించవచ్చని, కానీ సంపదతో ఆరోగ్యాన్ని పొందలేమని పేర్కొన్నారు. విద్య, వైద్యం అందుబాటులో ఉంటే తప్పకుండా ఉపాధి లభిస్తుందన్నారు. మనుషుల మధ్య తారతమ్యాలు తొలిగిపోతే మానవ సంబంధాలు మెరుగుపడుతాయని, మెరుగైన సమాజం నిర్మితమవుతుందని చెప్పారు.

వనరుల ధ్వంసంతో భారీ మూల్యం తప్పదు

మానవాళికి అవసరమైన అన్ని వనరులు మనకు అందుబాటులో ఉన్నాయని, కానీ దురాశతో వాటిని నాశనం చేస్తున్నారని గవర్నర్ నరసింహన్ ఆవేదన వ్యక్తంచేశారు. వనరులను ధ్వంసం చేస్తే భారీ మూల్యం చెల్లించక తప్పదని హెచ్చరించారు. పూర్వం చెట్లను, నీటిని దేవుళ్లుగా ఆరాధించేవారని, వాటిని కాపాడుకోవడం మన సంస్కృతిలో భాగమని చెప్పారు. కానీ ప్రస్తుతం మన సంస్కృతి, సంప్రదాయాలను విస్మరిస్తున్నారని వాపోయారు. పర్యావరణాన్ని రక్షించే బాధ్యత అందరిపైనా ఉందని, ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలని కోరారు. పర్యావరణ పరిరక్షణలో సుస్థిరాభివృద్ధి సాధించాలని సూచించారు. గ్లోబల్‌వార్మింగ్, నీటి కాలుష్యం పెరుగుతున్నదని, నియంత్రణ చర్యలు చేపట్టకుంటే భవిష్యత్ తరాలపై పెను ప్రభావం చూపుతాయన్నారు. ప్రస్తుతం మనం చేసే పనులు భావితరాలకు లాభం చేకూర్చేలా ఉండాలన్నారు. యువత కొత్త ఆవిష్కరణలు వెలుగులోకి తీసుకురావాలంటే తమ పరిధికి మించి ఆలోచించాలని సూచించారు. టెక్నాలజీ అనేది ప్రతి ఒక్కరికీ అవసరమేగానీ ఎప్పటికీ మానవ మేధస్సుకు ప్రత్యామ్నాయం కాలేదన్నారు. అభివృద్ధిలో భాగంగా టెక్నాలజీని వాడడంలో తప్పులేదని, అది పర్యావరణానికి, సమాజానికి హాని కలిగించేలా ఉండకూడదని స్పష్టంచేశారు.

నీటికోసమే మూడో ప్రపంచ యుద్ధం: రాజేంద్రసింగ్, వాటర్ మ్యాన్ ఆఫ్ ఇండియా

ప్రపంచవ్యాప్తంగా నీటి కాలుష్యం పెరిగిపోతున్నదని, భవిష్యత్‌లో మూడో ప్రపంచ యుద్ధమంటూ జరిగితే అది నీటికోసమేనని వాటర్ మ్యాన్ ఆఫ్ ఇండియా రాజేంద్రసింగ్ పేర్కొన్నారు. ఇప్పటికే ఆఫ్రికా, తూర్పు ఆసియా దేశాల్లో తీవ్రమైన నీటికరువు ఉన్నదన్నారు. దీనిని దృష్టిలో పెట్టుకొని నీటి కాలుష్యాన్ని రూపుమాపడానికి యువత కృషిచేయాలని కోరారు. రాజస్థాన్‌లో చిన్న నీటి వనరులు క్షీణిస్తున్నాయని, నీటి వనరులను కాపాడుకోవడంపై ప్రజలందరూ అప్రమత్తతతో వ్యవహరించాలని సూచించారు. పర్యావరణ కాలుష్యం భవిష్యత్ తరాలకు పెను ప్రమాదంగా మారుతుందని హెచ్చరించారు. 21వ శతాబ్దంలో గ్లోబల్ వార్మింగే మానవాళి ముందున్న అతి పెద్ద సవాల్ అని తెలిపారు. ప్రజలందరికీ అవసరమైన, ఆరోగ్యకరమైన సమాజాన్ని నిర్మించేందుకు జాగృతి ఆధ్వర్యంలో ప్రపంచవ్యాప్తంగా ఉన్న యువతను ఒక వేదికపైకి తీసుకురావడం గొప్ప విషయమని కొనియాడారు.

2030 లక్ష్యంగా సుస్థిరాభివృద్ధి

ఎంపీ కవిత, జాగృతి అధ్యక్షురాలు



సుస్థిరాభివృద్ధిని సాధించేందుకు 2030ని లక్ష్యంగా నిర్దేశించుకున్నట్టు జాగృతి అధ్యక్షురాలు, ఎంపీ కవిత తెలిపారు. నాడు మొక్కగా నాటిన 'జాగృతి' నేడు మహావృక్షమై ప్రగతి పథంలో దూసుకుపోతున్నదని చెప్పారు. జాగృతి ఆధ్వర్యంలో 19 వేల మంది విద్యార్థులకు శిక్షణ ఇచ్చామని, అందులో 15 వేలమందికి ఉపాధి కల్పించామని చెప్పడానికి చాలా గర్వంగా ఉన్నదన్నారు. మూడురోజుల సదస్సులో భాగంగా 17 ముఖ్యమైన అంశాలపై చర్చించామని, ఈ లక్ష్యాలను సాకారం చేసేందుకు ప్రతిఒక్కరూ సహకరించాలని కోరారు. ప్రపంచవ్యాప్తంగా ఉన్న యువతను ఒక వేదికపైకి తీసుకురావడానికి జాగృతి ఆధ్వర్యంలో కృషి చేస్తూనే ఉంటామని వెల్లడించారు. మహిళా సాధికారత కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కోరారు. ఎంతో ఉత్సాహంగా పాల్గొని సదస్సును విజయవంతం చేసినందుకు ప్రతినిధులందరికీ ధన్యవాదాలు తెలిపారు.



జాగృతి అంతర్జాతీయ యువజన నాయకత్వ సదస్సులో జాగృతి అధ్యక్షురాలు, ఎంపీ కవిత, పుల్లెల గోపీచంద్, బబితాకుమారి ఫొగాట్, మాలావత్ పూర్ణ

భవిష్యత్‌లో క్రీడలది కీలక పాత్ర

- ప్రభుత్వాలు క్రీడలను ప్రోత్సహించాలి
- భారత బ్యాడ్మింటన్ కోచ్ పుల్లెల గోపీచంద్
- ఆడబిడ్డలకు ధైర్యం నూరిపోయాలి: బబితాకుమారి ఫొగాట్
- మానసికంగా దృఢంగా ఉండాలి: మాలావత్ పూర్ణ

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: భవిష్యత్‌లో క్రీడలు కీలక పాత్ర పోషిస్తాయని భారత బ్యాడ్మింటన్ కోచ్ పుల్లెల గోపీచంద్ అన్నారు. గతంలో మన జీవనశైలిలో శారీరక శ్రమ ఉండేదని, మారిన పరిస్థితుల్లో ప్రస్తుతం అదిలేకుండా పోయిందని చెప్పారు. ప్రభుత్వాలు ప్రతి చిన్నారిని క్రీడల వైపు ప్రోత్సహించాలని కోరారు. హైటెక్స్ నోవాటెల్ జరిగిన జాగృతి అంతర్జాతీయ యువజన నాయకత్వ సదస్సులో భాగంగా ఆదివారం 'రెసిలియన్స్ ఫర్ యూత్ డెవలప్‌మెంట్, సక్సెస్ అండ్ బియాండ్' అనే అంశంపై ప్యానెల్ చర్చలో మహిళా రెజ్లర్ బబితాకుమారి ఫొగాట్, ఎవరెస్ట్ అధిరోహించిన మాలావత్ పూర్ణతో కలిసి మాట్లాడారు. కార్యక్రమానికి మోడరేట్‌గా జాగృతి అధ్యక్షురాలు, ఎంపీ కవిత ఉన్నారు. ప్రతిఒక్కరికీ ఫిజికల్ లిట్రసీ చాలా ముఖ్యమని, దీనిని పెంపొందించేందుకు ప్రభుత్వాలు చొరువ చూపాలని గోపీచంద్ కోరారు. యువత తనకు నచ్చినరంగంలో సత్తా చాటేందుకు తగిన వేదికలు ఉండాలని కోరారు. క్రీడలు ప్రతిదేశానికి గౌరవాన్ని తెస్తాయన్న గోపీచంద్.. పిల్లలు క్రీడల పట్ల ఆసక్తి చూపేలా తల్లిదండ్రులు ప్రోత్సహించాలని విజ్ఞప్తిచేశారు.

ఆడబిడ్డకు ధైర్యం నూరిపోయాలి: బబితాకుమారి ఫొగాట్

ఆడపిల్లలను తల్లిదండ్రులు సున్నితంగా పెంచకుండా, చిన్ననాటి నుంచే వాళ్లకు ధైర్యం నూరిపోయాలని మహిళా రెజ్లర్ బబితాకుమారి ఫొగాట్ చెప్పారు. క్రమశిక్షణ, ఆత్మవిశ్వాసం ఉంటే ఈ లోకంలో సాధించలేనిది ఏమీ లేదన్నారు. బాలికలు భయాలు వీడాలని, ఉన్నత లక్ష్యాలను ఎంచుకొని ముందుకుసాగాలని పిలుపునిచ్చారు. లక్ష్యాలు సాధించడంలో అందరూ ఒక్కటేనని స్త్రీ, పురుషులనే తేడా ఉండకూడదని అన్నారు.

సివిల్స్ సాధించడమే లక్షం: మాలావత్ పూర్ణ

మానసికంగా దృఢంగా ఉంటే ఏదైనా సాధ్యమని అతిపిన్న వయస్సులోనే ఎవరెస్ట్ అధిరోహించిన మాలావత్ పూర్ణ అన్నారు. ప్రభుత్వ రెసిడెన్షియల్ స్కూల్‌లో చదివిన తాను గొప్ప లక్ష్యాన్ని సాధించానంటే తెలంగాణ ప్రభుత్వ ప్రోత్సాహమే కారణమని చెప్పారు. ప్రస్తుతం సివిల్స్ సాధించడమే లక్ష్యంగా ముందుకుసాగుతున్నానని తెలిపారు.



ఆదివారం హైదరాబాద్‌లోని హైటెక్స్ నోవాటెల్‌లో తెలంగాణ జాగృతి అంతర్జాతీయ యువజన నాయకత్వ సదస్సులో గాంధీజీ విగ్రహానికి పూలమాల వేసి పుష్పాంజలి ఘటిస్తున్న గవర్నర్ నరసింహన్, తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు, ఎంపీ కల్వకుంట్ల కవిత

సభామర్యాదలను కాపాడుదాం



అసెంబ్లీలో మీడియాతో మాట్లాడుతున్న స్పీకర్ పోచారం శ్రీనివాస్‌రెడ్డి. చిత్రంలో అసెంబ్లీ కార్యదర్శి నరసింహాచార్యులు

- తెలంగాణ శాసనసభ దేశానికే ఆదర్శంగా ఉండేలా కృషి
- ప్రభుత్వపాలనకు దర్పణం పట్టేలా గవర్నర్ ప్రసంగం
- ఫిరాయింపులపై చట్టప్రకారం చర్యలు
- స్పీకర్‌గా ఏకగ్రీవ ఎన్నికకు కృషిచేసిన సీఎం కేసీఆర్‌కు ధన్యవాదాలు
- మీడియాతో స్పీకర్ పోచారం శ్రీనివాస్‌రెడ్డి

హైదరాబాద్, నమస్తే తెలంగాణ:

'సభ్యుల సహకారంతో తెలంగాణ శాసనసభ వ్యవహారాలను దేశానికే ఆదర్శంగా ఉండేలా నిర్వహిస్తా. గవర్నర్ ప్రసంగం రాష్ట్రప్రభుత్వ పరిపాలనకు దర్పణం పట్టేలా ఉన్నది. ఫిరాయింపులపై చట్టప్రకారమే చర్యలు తీసుకుంటాం.సభ్యులుగా సభా సంప్రదాయాలు, మర్యాదలను కాపాడుదాం. స్పీకర్‌గా ఏకగ్రీవంగా ఎన్నికయ్యేందుకు కృషిచేసిన సీఎం కేసీఆర్‌కు ధన్యవాదాలు' అని స్పీకర్ పోచారం శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. స్పీకర్‌గా బాధ్యతలు స్వీకరించిన తర్వాత తొలిసారి ఆదివారం అసెంబ్లీ కమిటీహాల్‌లో శాసనసభ కార్యదర్శి నరసింహాచార్యులుతో కలిసి ఆయన మీడియాతో మాట్లాడారు. శాసనసభ రాష్ట్రానికి ఉన్నతమైన సభ అని, రాష్ట్ర ప్రగతి, పేద ప్రజల అభ్యున్నతికి, రైతాంగం శ్రేయస్సు కోసం ఫలప్రదమైన చర్చలు జరుపుకొని వారి ఆశయాలను నెరవేర్చాల్సిన బాధ్యత అందరిపై ఉన్నదని చెప్పారు. ఏ పార్టీకి చెందినవారైనా సభాగౌరవాన్ని కాపాడాలని, సమావేశాల సందర్భంగా సలహాలు, సూచనలు ఇచ్చి సహకరించాలని కోరారు. సీఎం కేసీఆర్ నాయకత్వంలో వ్యవసాయశాఖమంత్రిగా పనిచేశానని, నాలుగున్నరేండ్లలో తెలంగాణ వ్యవసాయశాఖ ఇతర రాష్ట్రాలకు ఆదర్శంగా నిలిచిందని తెలిపారు. దేశంలో అందరూ తెలంగాణలో వ్యవసాయం, రైతుబంధు, రైతుబీమా పథకాల గురించే మాట్లాడుతున్నారని చెప్పారు. టైమ్స్ ఆఫ్ ఇండియా నుంచి అవార్డు తీసుకున్న సమయంలో తెలంగాణ వ్యవసాయరంగం గురించి తాను మాట్లాడుతుంటే.. ఇన్ని పనులు చేపట్టారా? అని పలువురు ఆశ్చర్యం వ్యక్తంచేశారన్నారు. ముఖ్యమంత్రి కేసీఆర్, సభ్యుల సహకారంతో శాసనసభనూ దేశంలో ఆదర్శంగా నిలిపేలా కృషిచేస్తానని చెప్పారు. శాసనసభలో ప్రతినిమిషం, ప్రతి మాటా చాలా విలువైనవని, ఇష్టం వచ్చినట్టుగా మాట్లాడి సభా సమయాన్ని వృథా కానీయొద్దని కోరారు. దేశంలో అన్నింట్లోనూ నంబర్‌వన్‌గా ఉన్నాం.. శాసనసభా వ్యవహారాల్లోనూ నంబర్‌వన్‌గా ఉందామని అన్నారు. కొత్తగా ఏర్పడిన రాష్ట్రంలో శాసనసభా వ్యవహారాలైనా నిర్వహించుకోగలరా? అంటూ పలువురు వ్యంగాస్త్రాలు సంధించారని, కానీ నేడు దేశంలోనే ఉత్తమంగా సభను నడిపించుకుంటున్నామని చెప్పారు. తెలంగాణ ప్రగతికి మీడియా సహకారం కూడా అవసరమని కోరారు.

నాలుగు కోట్ల మందికి ప్రతినిధులం..

శాసనసభలో గవర్నర్ ప్రసంగం రాష్ట్రంలో ప్రభుత్వ పరిపాలనకు అద్దం పట్టేలా ఉన్నదని పోచారం అన్నారు. గవర్నర్ ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపే తీర్మానానికి సీఎం కేసీఆర్ ఇచ్చిన సమాధానం సభ్యులందరి మనసు దోచేలా ఉన్నదని తెలిపారు. సభలో ఏ పార్టీకి చెందినవారైనా నాలుగు కోట్ల ప్రజలకు ప్రతినిధులమనే విషయం మర్చిపోవద్దని కోరారు. శాసనసభ్యులకు శిక్షణ తరగతులు ఏర్పాటుచేస్తామని, బీఏసీ సలహా మేరకు ఎన్నిరోజులు సభ జరుగాలనేది నిర్ణయిస్తామన్నారు. సభ్యులందరికీ మాట్లాడే అవకాశమిస్తామని చెప్పారు. సభ్యులు పార్టీమారడానికి సంబంధించిన ఫిర్యాదులపై న్యాయపరమైన అంశాలను పరిశీలిం చి, చట్టప్రకారం చర్యలు తీసుకుంటామన్నారు. 1977లో ప్రారంభమైన తన రాజకీయజీవితంలో గ్రామస్థాయి నుంచి నేటి సభాపతి వరకు అనేక అవకాశాలు దక్కాయని స్పీకర్ పోచారం చెప్పారు. సభాపతిగా అవకాశం కల్పించి ఏకగ్రీవంగా ఎన్నికయ్యేలా కృషిచేసిన ముఖ్యమంత్రి కేసీఆర్‌కు, సహకరించిన సభ్యులందరికీ ధన్యవాదాలు తెలుపుతున్నానన్నారు.

రాజకీయాలు కాదు.. రాష్ట్రం శాశ్వతం

ప్రాజెక్టులను అడ్డుకొనే కేసులు ఉపసంహరించుకోండి

శాసనసభలో గవర్నర్ ప్రసంగానికి ధన్యవాద తీర్మానాన్ని ప్రతిపాదించిన కొప్పుల ఈశ్వర్



గవర్నర్ ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపే తీర్మానాన్ని ప్రతిపాదిస్తున్న ఎమ్మెల్యే కొప్పుల ఈశ్వర్

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: రాజకీయాలు కాదు.. రాష్ట్రం శాశ్వతమనే అంశాన్ని గుర్తెరిగి అభివృద్ధిలో కలిసిరావాలని ఎమ్మెల్యే కొప్పుల ఈశ్వర్ ప్రతిపక్షపార్టీలకు సూచించారు. రాష్ట్రప్రభుత్వం తెలంగాణ దశదిశను మార్చేలా ప్రాజెక్టుల నిర్మాణం చేపడుతున్నదని.. రాజకీయ ఉద్దేశాలతో వాటిని అడ్డుకొనేలా వేసిన కేసులను ఉపసంహరించుకోవాలని కోరారు. గవర్నర్ ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపే తీర్మానాన్ని ఆదివారం ఆయన సభలో ప్రతిపాదించారు. ఈ తీర్మానాన్ని టీఆర్ఎస్ మరో ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి బలపర్చారు. చర్చను ప్రారంభించిన అనంతరం కొప్పుల ఈశ్వర్ మాట్లాడుతూ.. ఆర్థికవృద్ధి రేటులో దేశంలోనే తెలంగాణ అగ్రగామిగా ఉన్నదని, కరెంట్ కోతల పరిస్థితి నుంచి మిగులు విద్యుత్ రాష్ట్రంగా ఎదిగిందని అన్నారు. తెలంగాణ ప్రభుత్వం దేశంలో ఎక్కడా లేనివిధంగా వ్యవసాయానికి పంట పెట్టుబడి ఇస్తున్నదని, ఏ కారణంతోనైనా రైతు చనిపోతే అతడి కుటుంబానికి భరోసా ఇచ్చేలా సీఎం కేసీఆర్ రైతుబీమా పథకాన్ని ప్రవేశపెట్టారని తెలిపారు. కోటి ఎకరాలకు సాగునీళ్లిచ్చేలా సాగునీటి ప్రాజెక్టుల నిర్మాణం వేగంగా జరుగుతున్నదని.. ఈ నేపథ్యంలో కేసుల రూపంలో అభివృద్ధికి అడ్డుపడకుండా ప్రతిపక్షాలు కలిసి రావాలని కోరారు. తెలంగాణ రాష్ట్రంలో సీఎం కేసీఆర్ ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలు దేశానికే ఆదర్శంగా నిలిచాయన్నారు. ఈ ఫలాలు ప్రజలకు అందాయి కాబట్టే.. మరోసారి టీఆర్ఎస్‌కు పట్టం కట్టారని తెలిపారు. గవర్నర్ ప్రసంగం రాష్ట్రాభివృద్ధికి అద్దం పట్టిందని.. కోటి ఎకరాలకు నీరందించాలనే సంకల్పంతో సీఎం కేసీఆర్ ముందుకుసాగుతున్నారని తెలిపారు. గతంలో పింఛన్లు కంటి తుడుపుగా ఇస్తే.. తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక రూ.1000 నుంచి 1500 వరకు పెంచిందన్నారు. కల్యాణలక్ష్మి, షాదీముబారక్ పేరిట పేదింటి ఆడపిల్లల పెండ్లిళ్లకు రూ. లక్షానూట పదహార్లు అందిస్తున్నదని తెలిపారు. 'ఆసరా పింఛన్లను రూ.1000 నుంచి రూ.2,016కు, దివ్యాంగులకు రూ.1500 నుంచి రూ.3,016కు పెంచాలని నిర్ణయించింది. 57 ఏండ్ల వయస్సు దాటిన అందరికీ పింఛన్లు, నిరుద్యోగులకు నెలకు రూ.3,016 భృతి అందించనున్నది' అని వివరించారు. టీఎస్ఐపాస్ ద్వారా 8,858 పరిశ్రమలకు 15 రోజుల వ్యవధిలోనే అనుమతులు ఇవ్వగా, 5,570 పరిశ్రమలు ఉత్పత్తిని ప్రారంభించాయని పేర్కొన్నారు. రూ.1.32 లక్షల కోట్ల పెట్టుబడులు రాష్ట్రానికి తరలివచ్చాయి. 8.37 లక్షల మందికి ఉద్యోగ అవకాశాలు లభించాయి. ఐటీ రంగంలో బలీయమైన శక్తిగా రాష్ట్రం ఎదిగిందని, ప్రపంచంలోనే ప్రముఖ ఐటీ హబ్‌గా హైదరాబాద్ గుర్తింపు పొందిందని చెప్పారు.

పేదలు, రైతులు కేసీఆర్‌కు రెండుకండ్లు

- ప్రజలు కేంద్రంగా పరిపాలన
- మిషన్ భగీరథ 20 ఏండ్ల పని.. నాలుగున్నరేండ్లలో పూర్తి
- ప్రాజెక్టులు పూర్తి కావాలంటే కేసీఆర్ మళ్లీ సీఎంగా రావాలని ప్రజలు కోరుకున్నారు
- అసెంబ్లీలో వేముల ప్రశాంత్‌రెడ్డి



హైదరాబాద్, నమస్తే తెలంగాణ: ముఖ్యమంత్రి కే చంద్రశేఖర్‌రావు పేద ప్రజలు, రైతులను తన రెండుకండ్లుగా చూసుకున్నారని వేముల ప్రశాంత్‌రెడ్డి తెలిపారు. ఆదివారం అసెంబ్లీలో గవర్నర్ ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపే తీర్మానంపై చర్చ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రజలు కేంద్రంగా సీఎం కేసీఆర్ ఆలోచించి పరిపాలనచేశారని వివరించారు. ఆడబిడ్డలకు కేసీఆర్ అంటే ఒకధైర్యం.. 5 లక్షల మంది కల్యాణలక్ష్మి పథకం అందుకున్నారని, కేసీఆర్ కిట్‌ను మరో 5 లక్షల కుటుంబాలు అందుకున్నాయని, 20 లక్షల మంది విద్యార్థులకు హాస్టళ్లలో సన్నబియ్యం అన్నం అందుతున్నదని, పేదలకు ఒకేసారి 542 గురుకుల పాఠశాలలు ఏర్పాటుచేసి, 3 లక్షల మంది విద్యార్థులకు ఒక్కో విద్యార్థికి రూ.1.25 లక్షలు ఖర్చు చేస్తున్నారని, ప్రైవేట్ దవాఖానల్లో వైద్యం చేయించుకున్న వారికి సీఎంఆర్ఎఫ్ చెక్కులు అందించామని, 1.30 కోట్ల మందికి కంటి వెలుగు ద్వారా ఉచిత కంటి పరీక్షలు నిర్వహించి 25 లక్షల మందికి కండ్లద్దాలు అందించామని సంక్షేమ పథకాల అమలును వివరించారు. 20 ఏండ్లకాలం పట్టే మిషన్ భగీరథను సీఎం కేసీఆర్ పట్టుబట్టి నాలుగున్నరేండ్లలో పూర్తిచేసినట్టు ప్రశాంత్‌రెడ్డి వివరించారు. 23,698 ఆవాసాలకు బల్క్‌గా నీటి సరఫరా చేస్తున్నామని, 18,612 గ్రామాలకు నల్లాల ద్వారా ఇంటింటికీ మంచినీరు అందిస్తున్నామని తెలిపారు. ఈ పథకం చేపట్టడానికి ముందు సీఎం కేసీఆర్ గుజరాత్‌లో అమలవుతున్న మంచినీటి సరఫరా పథకాన్ని పరిశీలించడానికి పంపించారని, కేటీఆర్ నేతృత్వంలో అక్కడికి వెళ్లినప్పుడు తాము పథకాన్ని నాలుగేండ్లలో పూర్తిచేస్తామంటే నవ్వి, మోదీ నాయకత్వంలోనే 12 ఏండ్లు పట్టిందని చెప్పారని, ఆనాడు ఆ విషయాన్ని సీఎంకు చెపితే పూర్తి చేసి ప్రారంభానికి వారినే పిలుద్దామని అన్నారని గుర్తుచేశారు.

నిరంతర విద్యుత్ వెనుక కేసీఆర్ నిరంతర కృషి

24 గంటల నిరంతర విద్యుత్ సరఫరాతో తెలంగాణ వెలిగిపోతున్నదని ప్రశాంత్‌రెడ్డి తెలిపారు. నిరంతర విద్యుత్ సరఫరా వెనుక సీఎం కేసీఆర్ నిరంతర శ్రమ ఉందన్నారు. గ్రామాలు ఆర్థిక పరిపుష్టితో ఉండాలంటే కుల వృత్తులు బాగుపడాలని భావించి గొల్లకుర్మలకు గొర్రెలు, మత్స్యకారుల కోసం చెరువులు, రిజర్వాయర్లలో పెంచేందుకు చేపపిల్లలు పంపిణీ చేశారని, కల్లుగీత కార్మికుల కోసం చెట్టుపన్నును రద్దుచేశారని, రజకులు, చేనేత కార్మికుల సంక్షేమానికి ప్రత్యేక కార్యక్రమాలు అమలుచేశారని వివరించారు. ప్రాజెక్టులు పూర్తికావాలంటే కేసీఆర్ మళ్లీ సీఎంగా రావాలని ప్రజలు కోరుకొని ఓట్లు వేశారని, రైతులకు ఏడాదికి రూ.10 వేలు ఇచ్చే పెట్టుబడి పథకాన్ని దేశం అనుసరిస్తున్నదని అన్నారు. రైతుబీమా ద్వారా ఇప్పటికే 5,670 మంది కుటుంబాలకు రూ.5 లక్షల చొప్పున లబ్ధి జరిగిందని, భూరికార్డుల ప్రక్షాళనతో 90 శాతం రైతులు సంతోషంగా ఉన్నారని తెలిపారు. ప్రపంచంలో అతిపెద్ద ఏడు కంపెనీలను హైదరాబాద్‌కు కేటీఆర్ తీసుకువచ్చిన విషయాన్ని వివరించారు. సంపద సృష్టించడం, ఆ సంపదను పేదలకు పంచడం ద్వారా కేసీఆర్ జనరంజక పాలన అందించారన్నారు.

వినీలాకాశంలో నేడు మహాద్భుతం

- ఒకేసారి సంపూర్ణ చంద్రగ్రహణం, సూపర్‌మూన్
- భారతీయులకు లేని దర్శనభాగ్యం
- ఉత్తర, దక్షిణ అమెరికా, యూరప్‌లో మాత్రమే దర్శనం

కేప్ కెనవరాల్, జనవరి 20: వినీలాకాశంలో మరో మహాద్భుతం ఆవిష్కృతమయ్యేందుకు ఘడియలు సమీపిస్తున్నాయి. చంద్రుడు, భూమి, సూర్యుడు ఒకే సరళరేఖపైకి రానుండటంతో సోమవారం ఒకేసారి సంపూర్ణ చంద్రగ్రహణం, సూపర్‌మూన్ దర్శనమివ్వనున్నాయి. ఈ ఏడాదితోపాటు వచ్చే ఏడాది వరకు ఏర్పడే సంపూర్ణ చంద్రగ్రహణం ఇదొక్కటే. ఈ గ్రహణ సమయంలో చంద్రుడు భూమికి అత్యంత చేరువగా రానుండటంతో జాబిల్లి కొంచెం పెద్దదిగా, సాధారణ సూపర్‌మూన్ కంటే మరింత ప్రకాశవంతంగా కనిపిస్తుంది. సూపర్‌మూన్, సంపూర్ణ చంద్రగ్రహణం ఒకేసారి రావడం చాలా ప్రత్యేకమని రైస్ యూనివర్సిటీ ఖగోళ భౌతిక శాస్త్రవేత్త ప్యాట్రిక్ హార్టిగన్ తెలిపారు. ఈ గ్రహణం చాలాసేపు కొనసాగుతుందని, ప్రాంతాలను బట్టి గంట నుంచి మూడు గంటల వరకు గ్రహణం ఏర్పడుతుందని ఆయన చెప్పారు. అయితే ఈ అద్భుతాన్ని వీక్షించే అవకాశం భారతీయులకు లేదు. భారత కాలమానం ప్రకారం సోమవారం ఉదయం 9 గంటల 5 నిమిషాల నుంచి (యూరోపియన్ కాలమానం ప్రకారం ఆదివారం రాత్రి 10.34 నుంచి) భూగోళ నీడ చంద్రునిపై పడటం మొదలవడంతో పాక్షిక గ్రహణ దశ ఆరంభమవుతుంది. 10 గంటల 10 నిమిషాలకు (యూరోపియన్ కాలమానం ప్రకారం ఆదివారం రాత్రి 11.41 నిమిషాలకు) చంద్రుడిని భూమి నీడ పూర్తిగా కమ్మేయడంతో సంపూర్ణత్వాన్ని సంతరించుకునే ఈ గ్రహణం 62 నిమిషాలపాటు కొనసాగుతుంది. ఆకాశం నిర్మలంగా ఉంటే ఉత్తర అమెరికా, దక్షిణ అమెరికా, గ్రీన్‌ల్యాండ్, ఐస్‌ల్యాండ్, ఐర్లాండ్,



గ్రేట్ బ్రిటన్, నార్వే, స్వీడన్, పోర్చుగల్, ఫ్రాన్స్‌తోపాటు స్పెయిన్ తీరప్రాంతాల్లో ఈ గ్రహణం పూర్తిస్థాయిలో దర్శనమిస్తుంది. యూరప్ ఖండంలోని మిగిలిన ప్రాంతాలతోపాటు ఆఫ్రికా ఖండంలో చంద్రాస్థమయానికి ముందు ఈ గ్రహణం పాక్షికంగా కనిపిస్తుంది. ఈ గ్రహణం సంపూర్ణత్వాన్ని సంతరించుకున్న తర్వాత భూమి వాతావరణంలోని సూర్యరశ్మి కారణంగా జాబిల్లి ఎరుపు వర్ణంలో కనిపిస్తుంది. అందువల్ల దీన్ని బ్లడ్ మూన్ అని, జనవరి మాసంలో ఏర్పడటం వల్ల ఉల్ఫ్ మూన్ లేదా గ్రేట్ స్పిరిట్ మూన్ అని కూడా అంటారు.

శనిగ్రహంపై ఒక రోజు సమయం 10 గంటలు

- రహస్యాన్ని ఛేదించిన శాస్త్రవేత్తలు

హూస్టన్: శనిగ్రహంపై 3 రోజులు గడిస్తే భూమిపై 30 గంటలు గడిచినట్లు లెక్క. శని గ్రహంపై ఒక రోజు గడువాలంటే 10: 33:38 గంటల సమయం పడుతుందని అమెరికాలోని యూనివర్సిటీ ఆఫ్ కాలిఫోర్నియా-శాంటాక్రజ్ శాస్త్రవేత్తలు చెప్పారు. నాసా 'కాసిని' స్పేస్‌క్రాఫ్ట్ పంపిన సమాచారం ఆధారంగా శాస్త్రవేత్తలు శనిగ్రహం ఒకరోజు సమయం తేల్చారు. ఇనాళ్లు ఈ గ్రహంపై ఒక రోజు, ఒక ఏడాది సమయం ఎంత? అన్న సంగతి తేల్చడానికి తీవ్రంగా కృషి చేసినా దీని చుట్టూ గల రింగ్స్‌తో సాధ్యం కాలేదు. ఈ రింగ్స్‌లోని తరంగ నమూనాల విశ్లేషణతో ఒక రోజు సమయాన్ని నిర్ధారించారు. భూకంప సమయంలో సిస్మోమీటర్ల మాదిరే శనిగ్రహంలో జనించే కంపనాలకు ఈ రింగ్స్ స్పందిస్తున్నట్లు శాస్త్రవేత్తలు చెప్పారు.

దక్షిణ ధ్రువం చేరిన అపర్ణ కుమార్

- ఘనత సాధించిన తొలి ఐపీఎస్ అధికారిణిగా గుర్తింపు

న్యూఢిల్లీ: ఐపీఎస్ అధికారి అపర్ణ కుమార్ అరుదైన ఘనత సాధించారు. సుమారు 111 కిమీ దూరం మంచులో నడిచి ఈ నెల 13న ఆమె దక్షిణ ధ్రువాన్ని చేరుకున్నారు. ఈ ఘనత సాధించిన తొలి ఐపీఎస్ అధికారిగా రికార్డు సృష్టించారు. 2002వ బ్యాచ్ ఉత్తరప్రదేశ్ క్యాడర్ ఐపీఎస్ అధికారి అపర్ణ.. ప్రస్తుతం డెహ్రాడూన్‌లో ఇండో టిబెటన్ బోర్డర్ పోలీస్ (ఐటీబీపీ) డీఐజీగా విధులు నిర్వర్తిస్తున్నారు. ఈ యాత్రకు బయలుదేరే ముందు నిమోనియాతో బాధపడినా వెరువక మందులు తీసుకుంటూనే దక్షిణ ధ్రువానికి పయనమయ్యారు. పలు అవరోధాల మధ్య అక్కడి విపత్కర వాతావరణ పరిస్థితులను అధిగమించి ఆమె ఈ ఘనత సాధించారు. 'భూమిపైనే అత్యంత శీతల ప్రదేశం అంటార్కిటికా వద్ద వాతావరణం ఎప్పుడూ ఒకేలా ఉండదు. మేఘాలు కమ్మేవి. చలిగాలులు వీచేవి.



మంచు కురిసేది. ఈ విపత్కర వాతావరణ పరిస్థితుల్లో మైనస్ 40 డిగ్రీల ఉష్ణోగ్రతల మధ్య రోజుకు 8 గంటలు నడక మరిచిపోలేని అనుభూతి. నా చేతులు, వేళ్లు చలితో బిగుసుకుపోయేవి. ఫ్రాస్ట్‌బైట్ (మంచు తిమ్మిరి, చలితో మొద్దుబారిపోవడం) వస్తుందేమోనని భయమేసేది. ఆరోగ్య సమస్యలు రాకుండా మరింత శ్రద్ధ తీసుకోవాల్సి వచ్చేది. సమస్యల మధ్య యాత్ర పూర్తి చేయడం ఆనందంగా ఉంది. ఆరోగ్యం, ఇతర కారణాలతో ఇద్దరు సహచరులు, ఓ గైడ్ మధ్యలోనే వైదొలిగారు' అని అపర్ణ కుమార్ తన యాత్రను వివరించారు.

విపక్షాల్లో ఓటమి భయం

- అందుకే ఈవీఎంలపై అభాండాలు
- వారిది ధనబలం.. మనది జనబలం
- వారిది పార్టీల మధ్య పొత్తు.. మనది ప్రజలతో పొత్తు
- ఈబీసీ రిజర్వేషన్ల అమలుకు విద్యాసంస్థల్లో సీట్లు పెంచుతాం
- బీజేపీ కార్యకర్తలతో వీడియో కాన్ఫరెన్స్‌లో ప్రధాని మోదీ



వీడియో కాన్ఫరెన్స్ ద్వారా కార్యకర్తలతో మాట్లాడుతున్న ప్రధాని మోదీ

మార్గోవా (గోవా): కోల్‌కతాలో శనివారం ఐక్యతా సభను నిర్వహించిన విపక్ష కూటమిపై ప్రధాని నరేంద్రమోదీ తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. రానున్న ఎన్నికల్లో ఓటమి తప్పదన్న భయం విపక్షాలను వెంటాడుతున్నదని, అందుకే అవి సంజాయిషీ కోసం కారణాలను వెతుక్కుంటూ ఈవీఎంలను నిందిస్తున్నాయని విమర్శించారు. లోక్‌సభ ఎన్నికల్లో ఐక్యంగా పోరాడి మోదీ సర్కార్‌ను గద్దెదించాలని కోల్‌కతా సభలో ప్రతినబూనిన విపక్ష నేతలు.. ఎన్నికల్లో అన్నిరకాల అక్రమాలకు ఈవీఎంలే (ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాలే) కారణమని, కనుక ఇకపై ఎన్నికల్లో ఈవీఎంలకు బదులుగా బ్యాలెట్ పేపర్లను వినియోగించాలని డిమాండ్ చేసిన నేపథ్యంలో మోదీ ఈ విమర్శలు గుప్పించారు. అది మహాకూటమి కాదని, అవినీతి, అస్థిరతతో కూడిన తిరోగమన కూటమి అని మండిపడ్డారు. ఆదివారం ఆయన వీడియో కాన్ఫరెన్స్ ద్వారా మహారాష్ట్ర, దక్షిణ గోవాలోని కొల్హాపూర్, హత్కనంగ్లే, మాధా, సతా లోక్‌సభ స్థానాల బూత్ లెవెల్ బీజేపీ కార్యకర్తలతో మాట్లాడుతూ.. విపక్షాలకు ధనబలం ఉంటే.. బీజేపీకి ప్రజాబలం ఉన్నదన్నారు. జనరల్ క్యాటగిరీలోని ఈబీసీలకు 10 శాతం రిజర్వేషన్లను అమలుపరిచేందుకు విద్యాసంస్థల్లో సీట్ల సంఖ్యను పెంచుతామని మోదీ ప్రకటించారు. 'విపక్షాల సభలో వేదికను పంచుకున్న ఓ నాయకుడు బోఫోర్స్ కుంభకోణం గురించి ప్రస్తావించడాన్ని మీరు చూసే ఉంటారు. వాస్తవాన్ని ఎన్నటికీ దాచలేరు. ఆ కూటమిలో పార్టీలు పరస్పరం పొత్తు పెట్టుకుంటే.. మనం 125 కోట్ల మంది భారతీయులతో, వారి ఆశలు, ఆకాంక్షలతో పొత్తు పెట్టుకున్నాం' అని మోదీ ఓ కార్యకర్త అడిగిన ప్రశ్నకు సమాధానంగా చెప్పారు. కొన్ని గ్రూపులు ప్రజలను తెలివిలేనివారిగా భావించి తమ అవసరాలకు వాడుకోవడం ఆందోళనకరమని, ఇది ఎంతో ప్రమాదకరమైన క్రీడ అని వ్యాఖ్యానించారు. 'విపక్ష నేతలు తమ కుటుంబాల స్వార్థ ప్రయోజనాల కోసం పాకులాడుతుంటే.. మనం దేశాభివృద్ధికి పాటుపడుతున్నాం' అని మోదీ అన్నారు. ఆర్థికంగా వెనుకబడిన వర్గాలకు ప్రభుత్వ ఉద్యోగాలు, విద్యా సంస్థల్లో 10 శాతం రిజర్వేషన్లు కల్పించాలన్న కేంద్ర నిర్ణయం ప్రతిపక్షాలకు 'నిద్రలేని రాత్రులను' మిగిల్చిందన్నారు. ఈ నిర్ణయం బలమైనది కాకపోతే విపక్షాలకు నిద్రలేని రాత్రులు ఉండేవి కాదని, అప్పుడు ప్రజల మధ్యకు వెళ్లి అబద్ధాలను, వదంతులను వ్యాప్తి చేసేవని, దీన్నిబట్టి చూస్తే మనం సరిగానే పనిచేస్తున్నామని, దేశాభివృద్ధి కోసం కృషిచేస్తున్నామని స్పష్టమవుతున్నదని పేర్కొన్నారు. ఎస్సీ, ఎస్టీ, ఓబీసీ రిజర్వేషన్ల కోటా యథాతథంగా కొనసాగుతుందని మోదీ తెలిపారు. గతంలో మన ప్రభుత్వాలు కుంభకోణాలతో అంతర్జాతీయంగా ప్రధాన శీర్షికల్లో నిలిచేవని, ఇప్పుడు ఎక్కడా కుంభకోణాల ఊసే లేదన్నారు. అంతకుముందు ఆయన అనారోగ్యంతో బాధపడుతున్న గోవా సీఎం మనోహర్ పారికర్ త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. పారికర్‌ను ఆధునిక గోవా రూపకర్తగా మోదీ అభివర్ణించారు.

కాంగ్రెస్ ఎమ్మెల్యేల తన్నులాట

- బెంగళూరులో రచ్చకెక్కిన రిసార్ట్ రాజకీయం
- ఎమ్మెల్యే ఆనంద్‌సింగ్ తలపై బాటిల్‌తో దాడిచేసిన మరో ఎమ్మెల్యే గణేశ్
- తలకు గాయాలతో దవాఖానలో చేరిన ఎమ్మెల్యే.. ఛాతినొప్పి అన్న కాంగ్రెస్
- అంతర్గత కుమ్ములాటలకు ఇదే నిదర్శనం: బీజేపీ

బెంగళూరు, జనవరి 20: కర్ణాటక కాంగ్రెస్‌లో అంతర్గత పోరు రచ్చకెక్కింది. ఇద్దరు ఎమ్మెల్యేలు ఒకరిపై మరొకరు దాడి చేసుకున్నారు. ఈ ఘర్షణలో ఒక ఎమ్మెల్యే తల పగిలింది. బెంగళూరు శివారులోని ఈగల్టన్ రిసార్టులో శనివారం రాత్రి ఈ గొడవ చోటుచేసుకున్నది. మరోవైపు ఇదంతా అసత్య ప్రచారమని కాంగ్రెస్ కొట్టిపారేసింది.

బాహాబాహీకి దిగిన ఎమ్మెల్యేలు

కాంగ్రెస్-జేడీఎస్ సంకీర్ణ సర్కార్‌ను బీజేపీ కూల్చేందుకు యత్నిస్తుందన్న వార్తల నేపథ్యంలో తమ 76 మంది ఎమ్మెల్యేలను ఈగల్టన్ రిసార్టుకు కాంగ్రెస్ శుక్రవారం తరలించింది. రిసార్టులో శనివారం రాత్రి జరిగిన విందులో బళ్లారి జిల్లా హోస్పేట ఎమ్మెల్యే ఆనంద్‌సింగ్, కంప్లి ఎమ్మెల్యే జేఎన్ గణేశ్ మధ్య వాగ్వాదం చోటుచేసుకున్నదని పార్టీ వర్గాల సమాచారం. కాంగ్రెస్ రెబెల్ ఎమ్మెల్యేలతో గణేశ్ నిత్యం టచ్‌లో ఉన్నాడని, బీజేపీలోకి ఫిరాయించేందుకు ప్రయత్నిస్తున్నారని ఆనంద్‌సింగ్ వ్యాఖ్యానించారు. దీనికి గణేశ్ అభ్యంతరం తెలుపుతూ వాగ్వావాదానికి దిగారు. తర్వాత ఇద్దరు ఎమ్మెల్యేలు ఘర్షణ పడి తన్నుకున్నారు. దీంతో గణేశ్ ఆగ్రహంతో బాటిల్‌తో ఆనంద్ తలపై కొట్టినట్లు తెలిసింది. తల, కంటి ప్రాంతంలో గాయాలైన ఎమ్మెల్యే ఆనంద్‌సింగ్‌ను వెంటనే దవాఖానకు తరలించినట్లు పార్టీ వర్గాలు తెలిపాయి. ఎమ్మెల్యేలు కొట్టుకున్నారని వస్తున్న ప్రచారాన్ని కాంగ్రెస్ నేత, మంత్రి డీకే శివకుమార్ కొట్టిపారేశారు. 'ఛాతిలో నొప్పిగా ఉందని చెప్పడంతో ఆనంద్‌ను దవాఖానలో చేర్పించాం. ఆయనకు ఎలాంటి గాయాలు కాలేదు. బయట జరుగుతున్న ప్రచారం పూర్తిగా అవాస్తవం. ఆనంద్ తల్లిదండ్రులు ఇక్కడే ఉన్నారు. దయచేసి పుకార్లను నమ్మకండి' అని మీడియాతో అన్నారు. కాంగ్రెస్ ఎమ్మెల్యేలంతా ఐకమత్యంతో ఉన్నారని చెప్పారు. మరోవైపు ఈ ఘర్షణపై కాంగ్రెస్ అధికారప్రతినిధి, నిజామాబాద్ మాజీ ఎంపీ మధుయాష్కీ గౌడ్ మాట్లాడుతూ.. 'ఇది వారి వ్యక్తిగత విషయానికి సంబంధించిన అంశం. వారిద్దరూ ఒకే జిల్లాకు చెందినవారు. కలిసి వ్యాపారాలు కూడా



ఈగల్టన్ రిసార్ట్

చేస్తున్నారు. అది వ్యాపారాలకు సంబంధించిన స్వల్ప వివాదమేగానీ, రాజకీయపరమైనది కాదు' అని చెప్పారు. ఇద్దరు నేతలు తనతో కలిసే భోజనం చేశారని, తాను వెళ్లిన కొద్దిసేపట్లోనే ఈ ఘర్షణ చోటుచేసుకుందని చెప్పారు. మరోవైపు ఆనంద్‌సింగ్ చికిత్స పొందుతున్న అపోలో దవాఖానకు ఆదివారం ఎమ్మెల్యేలు, మద్దతుదారులు క్యూ కట్టారు. అయితే, పోలీసులు ఎవరినీ లోపలికి అనుమతించడం లేదు.

అంతర్గత కుమ్ములాటలతోనే సంకీర్ణ సర్కారు పతనం: బీజేపీ

కాంగ్రెస్-జేడీఎస్ సర్కారులో విభేదాలు తారాస్థాయికి చేరుకున్నాయని, అంతర్గత కుమ్ములాటలతో త్వరలోనే ప్రభుత్వం కుప్పకూలుతుందని మాజీ డిప్యూటీ సీఎంలు, బీజేపీ నేతలు కేఎస్ ఈశ్వరప్ప, ఆర్ అశోకా అన్నారు. బీజేపీ ప్రమేయం లేకుండానే సర్కారు పతనమవుతుందని, తాజాగా జరిగిన ఘర్షణలే ఇందుకు తార్కాణమని పేర్కొన్నారు. తొందరలోనే రాష్ట్రంలో బీజేపీ ప్రభుత్వం ఏర్పడుతుందని వారు జోస్యం చెప్పారు. 'కాంగ్రెస్ ఎమ్మెల్యేలు రిసార్ట్‌లో తన్నుకున్నారు. వారిలో ఒకరు దవాఖానలో చికిత్స పొందుతున్నారు. కానీ, డీకే శివకుమార్, సురేష్ సోదరులు అసత్యాలు ప్రచారం చేస్తూ ప్రజల్ని తప్పుదోవ పట్టిస్తున్నారు. ఆనంద్‌సింగ్ ఛాతినొప్పితో దవాఖానలో చేరారా? లేదంటే గాయాలతో చేరారా? అనే విషయాన్ని అపోలో వైద్యులు ప్రకటించాలి. పోలీసులు ఈ కేసును సుమోటోగా స్వీకరించి దర్యాప్తు చేయాలి' అని డిమాండ్ చేశారు. ఎమ్మెల్యేల ఘర్షణ వెనుక బీజేపీ ఉందనే అసత్య ప్రచారానికి కాంగ్రెస్ ఒడిగట్టినా ఆశ్చర్యపోనక్కర్లేదని ఎద్దేవా చేశారు. పీసీసీ అధ్యక్షుడు దినేశ్ గుండురావు సమక్షంలోనే దాడి జరుగుతున్నా ఆయన ఎందుకు అడ్డుకోలేకపోయారన్నారు. మరోవైపు ఎమ్మెల్యేల ఘర్షణపై తమకు ఎలాంటి ఫిర్యాదు అందలేదని రిసార్టు పరిధిలోని బిడడి పోలీసులు చెప్పారు.

నలుగురు ఎమ్మెల్యేలకు షోకాజ్ నోటీసులు

శుక్రవారం నిర్వహించిన సీఎల్పీ భేటీకి గైర్హాజరైన నలుగురు ఎమ్మెల్యేలు రమేశ్ జార్ఖిహోళి, బీ నాగేంద్ర, ఉమేశ్ జాదవ్, మహేశ్ కుమతహళ్లిలకు కాంగ్రెస్ అధిష్ఠానం ఆదివారం షోకాజ్ నోటీసులు జారీచేసింది. సమావేశానికి హాజరుకాకపోవడానికి గల కారణాలు చెప్పాలని కోరింది. పార్టీ ఫిరాయింపు నిరోధక చట్టం కింద మీపై ఎందుకు చర్యలు తీసుకోకూడదో చెప్పాలని ప్రశ్నించింది. మరోవైపు గుర్గావ్‌లోని ఓ రిసార్ట్‌లో బస చేసిన 104 మంది బీజేపీ ఎమ్మెల్యేలు కర్ణాటకకు చేరుకున్నారు.

లగ్జరీ కారు వివాదంలో సిద్దరామయ్య

ఓవైపు కాంగ్రెస్‌లో అంతర్గత కుమ్ములాటలు జరుగుతున్న క్రమంలోనే.. మరోవైపు మాజీ సీఎం సిద్దరామయ్య మరో వివాదంలో చిక్కుకున్నారు. ఎమ్మెల్యే బైరతి సురేశ్ మెర్సిడెస్ బెంజ్ కారును సిద్దరామయ్యకు బహుమతిగా ఇచ్చినట్లు వార్తలు వచ్చాయి. దీన్ని మంత్రి డీకే శివకుమార్ కొట్టిపారేశారు. 'సిద్దరామయ్యకు ఎలాంటి గిఫ్టులు, కానుకలు అందలేదు. ఏదైనా అత్యవసర ప్రయాణం లేదంటే అవసరం ఉన్నప్పుడు స్నేహితుల కార్లను తీసుకుని వెళతాం. ఇది అలాంటిదే. ఒకవేళ మీ వద్ద రుజువులు ఉంటే చూపించండి' అని ప్రశ్నించారు. గత ఏడాది మంత్రి కేజే జార్జి టొయోటా ల్యాండ్ క్రూయిజర్‌తోపాటు ఏడాదిపాటు ఇంధన కూపన్లు కూడా సిద్దరామయ్యకు ఉచితంగా ఇచ్చిన వ్యవహారం వివాదాస్పదమైంది. 2016లో వజ్రాలు పొదిగిన రూ.70 లక్షల ఖరీదైన హబ్లోట్ గడియారాన్ని దుబాయ్‌కి చెందిన ఎన్‌ఆర్‌ఐ సిద్దరామయ్యకు కానుకగా ఇచ్చారు. అప్పట్లో ఈ ఆరోపణలపై అసెంబ్లీలో పెద్ద దుమారమే లేచింది.

నిరంకుశ పాలన నుంచి విముక్తి కోసం ప్రజలు చేసిన రోదనలు అవి

- ప్రధాని వ్యాఖ్యలను తిప్పికొట్టిన రాహుల్



న్యూఢిల్లీ, జనవరి 20: కోల్‌కతా వేదికగా విపక్షాలన్నీ బచావో బచావో అంటూ రోదిస్తున్నాయని ప్రధాని మోదీ చేసిన వ్యాఖ్యలను కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు రాహుల్ గాంధీ తిప్పికొట్టారు. 'మీ నిరంకుశ, అసమర్థ' పాలన నుంచి విముక్తి కల్పించాలని వేడుకుంటూ ప్రజలు చేసిన రోదనలే అవి అని వ్యాఖ్యానించారు. 'లక్షలాది మంది నిరుద్యోగ యువత, సంక్షోభంలో కూరుకుపోయిన రైతన్నలు, అణచివేతకు గురైన ఆదివాసీలు, దళితులు, పీడిత మైనార్టీలు, చితికిపోయిన చిరు వ్యాపారులు మీ నిరంకుశ, అసమర్థ పాలన నుంచి విముక్తి కల్పించాలని వేడుకుంటూ చేసిన రోదనలే అవి. మరో వంద రోజుల్లో వారికి విముక్తి లభించనుంది' అని రాహుల్ ఆదివారం ట్వీట్ చేశారు.

రాహుల్ గాంధీ తదుపరి ప్రధాని

- మా వైఖరిలో మార్పులేదు: స్టాలిన్



చెన్నై: కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు రాహుల్‌గాంధీని ప్రధాని కావాలని తమిళనాడు ప్రజలు కోరుకుంటున్నారని డీఎంకే అధ్యక్షుడు ఎంకే స్టాలిన్ చెప్పారు. పశ్చిమబెంగాల్‌లో చాలా భిన్నమైన పరిస్థితి నెలకొన్నందు వల్లే 'రాహుల్‌గాంధీ'ని ప్రధానిని చేయాలన్న అభిప్రాయాన్ని అక్కడ పునరుద్ఘాటించలేదని ఆదివారం పేర్కొన్నారు. కోల్‌కతాలో పశ్చిమబెంగాల్ సీఎం మమతా బెనర్జీ నిర్వహించిన సభలో డీఎంకే అధ్యక్షుడు ఎంకే స్టాలిన్ పాల్గొన్న సంగతి తెలిసిందే.

శశికళకు జైల్లో రాజభోగాలు

- ఆమె సేవలో తరించిన జైలు అధికారగణం
- ఐదు గదులు, ప్రత్యేకంగా వంట మనిషి, టీవీ కేటాయింపు
- సన్నిహితులతో గంటలపాటు చర్చించేందుకు సమయం
- ఆర్టీఐ దరఖాస్తుతో వెలుగులోకి వచ్చిన జయలలిత నెచ్చెలి కటకటాల సిత్రాలు

బెంగళూరు, జనవరి 20: రాజభోగం అంటే ఇదే! ఐదు ప్రత్యేక గదులు, వంట చేసేందుకు ఓ మనిషి, సినిమాలు, సీరియళ్లు చూసేందుకు ఓ టీవీ, రుచికరమైన మాంసాహార భోజనం, బట్టలు ఉతికేందుకు మరో వ్యక్తి, వాకింగ్ చేసేందుకు విశాలమైన వరండా, సన్నిహితులతో మాట్లాడేందుకు గంటల కొద్దీ సమయం.. అబ్బో ఒక్కటి కాదు.. ఎన్నని చెప్పగలం. ఇవన్నీ ఏదైనా ఫైవ్‌స్టార్ హోటల్‌లోని ప్రత్యేక సదుపాయాలు అనుకుంటే పొరపడినట్లే! తమిళనాడు దివంగత ముఖ్యమంత్రి జయలలిత నెచ్చెలి, అన్నాడీఎంకే బహిష్కృత నేత శశికళకు కటకటాల్లో లభించిన వీఐపీ ట్రీట్‌మెంట్ ఇది. సమాచార హక్కు (ఆర్టీఐ) కార్యకర్త నరసింహమూర్తి దాఖలు చేసిన ఫిర్యాదుతో శశికళ జైలు సిత్రాలు వెలుగులోకి వచ్చాయి. ఆ నివేదికలోని వివరాలివి..



నాలుగు గదుల్ని ఖాళీ చేయించారు


అక్రమాస్తుల కేసులో శశికళకు 2017లో న్యాయస్థానం నాలుగేండ్ల జైలు శిక్ష విధించింది. ఆమెను పరప్పన అగ్రహార సెంట్రల్ జైలుకు తరలించారు. 2017, ఫిబ్రవరి 14న జైలులో శశికళ అడుగుపెట్టిన సమయంలో ఆమెకు కేవలం ఒక్క గది మాత్రమే కేటాయించారు. ఆ తర్వాత పక్కనే ఉన్న నాలుగు గదుల్ని ఖాళీ చేసి, అందులోని మహిళా ఖైదీలను పక్క సెల్‌లోకి పంపేశారు. ఆ తర్వాత మొత్తం ఐదు గదుల్ని శశికళకే కేటాయించారు. ఖైదీలకు ప్రత్యేకంగా వంటవండే నిబంధనలేవీ చట్టంలో లేవు. కానీ శశికళ కోసం అజంతా అనే మహిళా ఖైదీని ప్రత్యేకంగా వంట మనిషిగా నియమించారు. అవసరమైనప్పుడు బయటి నుంచి మాంసాహార భోజనాన్ని తెప్పించి శశికళ సేవలో అధికారులు పోటీపడ్డారు. మరోవైపు శశికళను కలిసేందుకు నాయకులు, అతిథులు పెద్దసంఖ్యలో నేరుగా ఆమె గదికి వెళ్లేవారని జైల్లోని సీసీటీవీ రికార్డుల్లో నమోదైంది. ఇందుకోసం ఐదు గదుల్లో ఒక దాన్ని మీటింగ్ రూమ్‌గా మార్చారు. నిబంధనల ప్రకారం సందర్శకులతో కేవలం 45 నిమిషాలపాటు మాట్లాడే అవకాశం మాత్రమే ఉంటుంది. కానీ, చిన్నమ్మ కోసం రూల్స్‌ను పక్కనపెట్టేశారు. అతిథులతో ఆమె ఏకంగా 3-4 గంటలపాటు చర్చలు జరిపేవారని తేలింది.

ఐపీఎస్ అధికారి రూప ఆరోపణలతో వెలుగులోకి

అయితే, శశికళకు జైల్లో వీఐపీ ట్రీట్‌మెంట్‌పై అప్పటి జైళ్ల శాఖ డీఐజీ డీ రూప సంచలన ఆరోపణలు చేశారు. జైలు ఉన్నతాధికారులు రూ. 2 కోట్ల వరకు లంచాలు తీసుకుని శశికళకు ప్రత్యేక వసతులు కల్పిస్తున్నారంటూ 2017 జూలై 12న ఆమె మీడియాకెక్కడం కలకలం రేపింది. ఆమె నేరుగా జైళ్లశాఖ డీజీ (ప్రిజన్స్) హెచ్‌ఎన్ సత్యనారాయణరావుపైనే ఆరోపణలు చేశారు. దీంతో అప్పటి సిద్దరామయ్య ప్రభుత్వం హుటాహుటిన రిటైర్డ్ ఐఏఎస్ అధికారి వినయ్‌కుమార్ నేతృత్వంలో కమిటీని నియమించింది. ఈ కమిటీ 2017 నవంబర్ 17న తన నివేదికను ప్రభుత్వానికి సమర్పించింది. శశికళకు జైల్లో రాజభోగాలు కల్పించిన విషయం వాస్తవమేనని కమిటీ విచారణలో తేలింది. అయితే, ఈ నివేదికను ప్రభుత్వం బహిర్గతం చేయలేదు. తాజాగా ఆర్టీఐ కార్యకర్త నరసింహమూర్తి ఈ 295 పేజీల రిపోర్టును సంపాదించారు. మరోవైపు వినయ్‌కుమార్ కమిటీ రిపోర్టును ప్రస్తుతం హోంగార్డులు, సివిల్ డిఫెన్స్ ఐజీపీ పనిచేస్తున్న రూప స్వాగతించారు. గతంలో తాను చేసిన ఆరోపణల్ని కమిటీ వాస్తవమేనని పేర్కొనడం తనకు సంతోషాన్నిచ్చిందని చెప్పారు.

మూతపడిన శబరిమల ఆలయం

- ముగిసిన బీజేపీ 49 రోజుల రిలే దీక్షలు
- ఎల్డీఎఫ్ సర్కార్, బీజేపీ మధ్య ఆరోపణల యుద్ధం



శబరిమల/ తిరువనంతపురం: శబరిమలలో 67 రోజులపాటు సాగిన అయ్యప్ప భక్తుల 'మకరవిళక్కు' యాత్ర ముగియడంతో ఆదివారం ఉదయం ఆలయాన్ని మూసివేశారు. కానీ రాష్ట్రంలోని ఎల్డీఎఫ్ ప్రభుత్వానికి, బీజేపీ, ఆరెస్సెస్ తదితర సంఘ్ పరివార్ సంస్థల మధ్య రాజకీయ ఆరోపణల యుద్ధం సాగుతూనే ఉన్నది. మరోవైపు శబరిమల పరిసరాల్లో నిషేధాజ్ఞలు ఎత్తివేయాలని 49 రోజులుగా బీజేపీ చేపట్టిన రిలే నిరాహారదీక్షలు కూడా ముగిశాయి. ఆదివారం ఉదయం పందళం రాజ కుటుంబ ప్రతినిధి పీ రాఘవ వర్మ రాజా దర్శనం చేసుకున్న తర్వాత పూజరులు 'భస్మాభిషేకం' చేశారు. చివరిగా 'హరివాసనం' ప్రార్థన చేశాక ఉదయం 6.15 గంటలకు ఆలయాన్ని మూసివేశారు. తిరిగి వచ్చే నెల 13న అయ్యప్ప దేవాలయాన్ని తెరుస్తారు.

కాంగ్రెస్ నుంచి శ్రీకాంత్ జెనా బహిష్కరణ

భువనేశ్వర్, జనవరి 20: కేంద్ర మాజీ మంత్రి శ్రీకాంత్ జెనాను పార్టీ నుంచి బహిష్కరిస్తున్నట్లు ఒడిశా ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ (ఓపీసీసీ) క్రమశిక్షణ కమిటీ కన్వీనర్ అనంత ప్రసాద్ సేథి తెలిపారు. మాజీ ఎమ్మెల్యే కృష్ణ చంద్ర సగారియాను కూడా బహిష్కరించినట్లు పేర్కొన్నారు. వారిద్దరూ పార్టీకి నష్టం కలిగించేలా ప్రకటనలు చేస్తున్నారని అనంత ప్రసాద్ సేథి తెలిపారు. శ్రీకాంత్ జెనా, కృష్ణ చంద్ర సగారియాలను బహిష్కరించాలని శనివారం రాత్రి తాము తీసుకున్న నిర్ణయానికి ఏఐసీసీ ఆమోదం లభించిందని సేథి ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

రాహుల్‌ను ఎండగడతా: శ్రీకాంత్ జెనా

కాంగ్రెస్ అధ్యక్షుడు రాహుల్‌గాంధీ వ్యవహారశైలిని ఎండగడతానని పార్టీ నుంచి బహిష్కరణకు గురైన కేంద్ర మాజీ మంత్రి శ్రీకాంత్ జెనా చెప్పారు. ఈ నెల 25న ఒడిశాలో రాహుల్ గాంధీ పర్యటించనున్నారని తనకు సమాచారం ఉన్నదన్నారు. ఆయన తీరును బయటపెట్టిన తర్వాత రాహుల్ ప్రజలకు తన ముఖం చూపించలేని పరిస్థితి తీసుకొస్తానని అన్నారు.

ట్రాన్స్‌జెండర్ కంటే హీనం!

- మిమ్మల్ని స్త్రీ అనాలో లేకుంటే పురుషుడు అనాలో అర్థం కావడంలేదు
- బీఎస్పీ అధ్యక్షురాలు మాయావతిని పరుష పదజాలంతో దూషించిన యూపీ బీజేపీ ఎమ్మెల్యే సాధనాసింగ్
- భగ్గుమన్న బీఎస్పీ, ఎస్పీ
- సాధనాసింగ్‌ను పిచ్చాసుపత్రిలో చేర్పించాలి: బీఎస్పీ నేత ఎస్సీ మిశ్రా
- సుమోటోగా స్వీకరించిన జాతీయ మహిళా కమిషన్

లక్నో: నోటిని అదుపులో పెట్టుకుని నలుగురికి నాలుగు మంచి మాటలు చెప్పాల్సిన ప్రజాప్రతినిధులు కట్టుతప్పుతున్నారు. సాటి నేతలపై అభ్యంతరకర వ్యాఖ్యలతో తమ స్థాయిని దిగజార్చుకుంటున్నారు. తాజాగా ఉత్తర్‌ప్రదేశ్‌లోని మొగల్‌సరాయ్ బీజేపీ ఎమ్మెల్యే సాధనాసింగ్ ఈ జాబితాలో చేరారు. బీఎస్పీ అధినేత్రి మాయావతిని.. 'ట్రాన్స్‌జెండర్ కంటే కూడా హీనం' అంటూ నీచమైన వ్యాఖ్యలు చేశారు. లక్నోలో శనివారం రాత్రి జరిగిన ఓ కార్యక్రమంలో ఎమ్మెల్యే సాధనాసింగ్ మాట్లాడుతూ.. 'మాయావతికి ఆత్మగౌరవం లేదు. తనపై దాడి చేసి, వేధించిన వారితోనే కలిసి సాగుతున్నారు. ఆ సమయంలో (1995లో) ఇంచుమించుగా ఆమెపై లైంగికదాడి జరిగింది. ద్రౌపదిపై లైంగిక వేధింపులకు దిగితే ఆమె ప్రతీకారాన్ని తీర్చుకుంది. కానీ, ఈ మహిళ (మాయావతి) మాత్రం కేవలం అధికారం కోసం ఆత్మగౌరవాన్ని తాకట్టు పెట్టారు. తనపై దాడి చేసి, అసభ్యకరంగా ప్రవర్తించిన వారితోనే జట్టు కట్టారు. మాయావతీజీ మీ చర్యలు మహిళా లోకానికే కళంకం.



సాధనాసింగ్



మాయావతి

మిమ్మల్ని స్త్రీ అనాలో లేకుంటే పురుషుడు అనాలో అర్థంకావడం లేదు. మీరు (మాయావతి) ట్రాన్స్‌జెండర్ కంటే కూడా హీనం' అని పరుష పదజాలంతో విమర్శించారు.

ఆమె మానసిక రోగి: బీఎస్పీ


సాధనాసింగ్ వ్యాఖ్యలపై బీఎస్పీ భగ్గుమంది. ఆమె వెంటనే తన వ్యాఖ్యలకు క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేసింది. 'ఎస్పీ-బీఎస్పీ పొత్తుతో బీజేపీ నేతల ఆత్మస్థైర్యం దెబ్బతిన్నది. దీంతో మానసిక సమతుల్యం దెబ్బతిని నీచస్థాయికి దిగజారి వారు ఇష్టానుసారం వ్యాఖ్యలు చేస్తున్నారు' అని బీఎస్పీ నేత ఎస్సీ మిశ్రా ఆదివారం లక్నోలో మండిపడ్డారు. సాధనాసింగ్‌ను ఒక మానసిక రోగిగా యన అభివర్ణించారు. ఇలాంటి వారిని ఆగ్రా/రాయ్‌బరేలీలోని పిచ్చాసుపత్రిలో చేర్పించాలని చురకలంటించారు. సాధనాసింగ్ వ్యాఖ్యలపై ఎస్పీ అధ్యక్షుడు అఖిలేశ్ యాదవ్ ఆగ్రహం వ్యక్తంచేశారు. ఎమ్మెల్యే వ్యాఖ్యల్ని కేంద్ర మంత్రి రాందాస్ అథావలే తీవ్రంగా ఖండించారు. వ్యక్తిగత విమర్శలు హద్దులు దాటవద్దని హితవు పలికారు. 'సాధనాసింగ్ వ్యాఖ్యలు సిగ్గుచేటు. వీటిని తీవ్రంగా ఖండిస్తున్నాం. బీజేపీ వెంటనే మాయావతికి బహిరంగ క్షమాపణలు చెప్పాలి ' అని కాంగ్రెస్ అధికారప్రతినిధి ప్రియాంక చతుర్వేది విమర్శించారు.

జాతీయ మహిళా కమిషన్ ఆగ్రహం

ఎమ్మెల్యే సాధనాసింగ్ అభ్యంతరకర వ్యాఖ్యలపై జాతీయ మహిళా కమిషన్ ఆగ్రహం వ్యక్తంచేసింది. ఈ వ్యాఖ్యలు ఎందుకు చేశారో చెప్పాలని సోమవారం నోటీసులు జారీచేయనున్నట్లు కమిషన్ చైర్మన్ రేఖా శర్మ తెలిపారు. 'ఉన్నతస్థానాల్లో ఉన్న మీలాంటి వ్యక్తుల నుంచి అభ్యంతరకర వ్యాఖ్యల్ని ఊహించలేం. మాయావతిని నిందిస్తూ మీడియాలో వచ్చిన వార్తల్ని కమిషన్ సుమోటోగా స్వీకరించింది' అని పేర్కొన్నారు. మరోవైపు సాధనాసింగ్‌పై లక్నోలో బీఎస్పీ నేతలు కేసు పెట్టారు. సర్వత్రా విమర్శలతో సాధనాసింగ్ తన వ్యాఖ్యలకు క్షమాపణ చెబుతున్నట్లు ప్రకటించారు.

24న సీబీఐ డైరెక్టర్ ఎంపిక కమిటీ భేటీ

న్యూఢిల్లీ: సీబీఐ కొత్త డైరెక్టర్‌ను ఎంపిక చేసేందుకు ప్రధానమంత్రి నరేంద్రమోదీ సారథ్యంలోని అత్యున్నత కమిటీ ఈ నెల 24న సమావేశం కానున్నది. ఈ సమావేశానికి సుప్రీంకోర్టు చీఫ్ జస్టిస్ రంజన్ గొగోయ్ గానీ, ఆయన ప్రతినిధి గానీ, లోక్‌సభలో కాంగ్రెస్ పక్ష నేత మల్లికార్జున ఖర్గే హాజరవుతారని అధికార వర్గాల కథనం. సీబీఐ డైరెక్టర్ పదవి కోసం 1982 బ్యాచ్‌కు చెందిన ఐపీఎస్ అధికారి జేకే శర్మతోపాటు హర్యానా క్యాడర్ అధికారి పర్మిందర్ రాయ్ పోటీ పడుతున్నారు. ప్రస్తుతం హర్యానా రాష్ట్ర విజిలెన్స్ బ్యూరో డీజీగా పని చేస్తున్న పర్మిందర్ రాయ్ ఈ నెలాఖరున పదవీ విరమణ చేయనున్నారు. ఇక 1983 బ్యాచ్ పోలీసు అధికారి హోంశాఖ అంతర్గత భద్రతా విభాగం ప్రత్యేక కార్యదర్శి రినా మిత్రా కూడా పోటీ పడుతున్నారు. గతంలో సీబీఐలో ఐదేండ్ల పాటు పనిచేసిన అనుభవం గల రినా మిత్రా.. మధ్యప్రదేశ్‌లో సుదీర్ఘ కాలం రాష్ట్ర విజిలెన్స్ విభాగంలో సేవలందించారు.



ఇతరులు చేయలేని పని చేసేవాడే హీరో.

రోమైన్ రోలాండ్




ఆఫ్రికా...ఆఫ్రికా!

ఆఫ్రికాకి చరిత్ర లేదని అన్నదెవరు?
మనిషికీ, మానవతకు పుట్టినిల్లది
ఆది మానవుడు అడుగులేసిన నేల
అగ్గిని తొలిసారిగ రాజేసిన నేల!
నైలునదీ జీవ జలాలు నడయాడిన బీళ్ళన్నీ
పచ్చని పంటలతో వసంత రాగం ఆలపిస్తాయి!
అంబరాన్నంటే పిరమిడ్లు
నిర్మాణ ప్రతిభకు నిలువెత్తు రూపాలమని నినదిస్తాయి!
కిలిమంజారో ఎక్కి చూడు
కనుచూపుమేర కమనీయ దృశ్యాలు
ఈజిప్టు చుట్టిరా ఓసారి
నాగరికతకది ఆనవాలు
ఐరోపా కన్ను తెరవకముందే
ఆఫ్రికా కంచును సృజించిన విజేత
పసిడి రాశుల్ని ప్రపంచానికి
అందించిన కనకగర్భ!
ఇనుమును ఇరుసుగా మార్చిన నిపుణ!
పశ్చిమాద్రి నుంచి వచ్చిన
మిడతలదండుకు చిక్కిన పరాధీన!
సామ్రాజ్యవాదం సమరనాదం చేసి
నీగ్రోవంటూ నీచంగా చూసినా
నీకు మనసే లేదన్నా
అసలు నువు మనిషివే కాదన్నా
బానిసని చేసినా
బజారులో అమ్మకానికి పెట్టినా
ఉక్కు పిడికిళ్ళ చైతన్యంతో
సంకెళ్లను బద్దలు కొట్టిన స్వేచ్ఛా పతాక!
బంధనాలు తొడిగి
అన్నానికి, అక్షరానికి దూరం చేసినా
వర్ణబేధం చూపి వంచింపజూసినా
వేల యేళ్ళ వైభవాన్ని వేర్లతో సహా పెకిలించివేసినా
కష్టాలు, కన్నీళ్ళే పాతాలుగా
మనిషీ మనిషీ కలిసి
అడుగూ అడుగూ కలిపి
అలుపెరుగని పోరాటంతో
సామ్రాజ్యవాదాన్ని పీచమడచి
స్వాతంత్ర్యాన్ని సాధించుకున్న ధీర!!
గర్వంగా తలెత్తుకుని
పునరుజ్జీవనదిశగా పురిటినొప్పులు పడుతూనే
ముందున్నది మనకు మంచి కాలమేనని
ఆశల చిగురుల్ని జనం మదిలో
అంకురింపజేసిన స్వాభిమాన!!

– రాపోలు సీతారామరాజు, rsrraju@gmail.com

(గ్రేటర్ శాక్రమెంటో తెలుగు సంఘం వారు ప్రపంచ ప్రవాస తెలుగు వారికి నిర్వహించిన పోటీలో ఉత్తమ కవితగా ఎంపికైంది)

ప్రపంచ కవిత



ఒసిప్ మాండెల్ స్టామ్

(1891, జనవరి 14-1938, డిసెంబర్ 27)

అప్పటి రష్యన్ సామ్రాజ్యంలో అంతర్భాగంగా ఉన్న వార్సా నగరంలో సంపన్న యూదు కుటుంబంలో జన్మించిన కవి, వ్యాసకర్త, ప్రజాహక్కుల కార్యకర్త ఒసిప్ ఎమిలివీచ్ మాండెల్ స్టామ్! పారిస్, జర్మనీ, సెయింట్ పీటర్స్‌బర్గ్‌లలో ఉన్నత విద్యాభ్యాసం చేసిన ఒసిప్ 1905లో తొలి రష్యన్ విప్లవ కాలంలో తన కవిత్వంతో ప్రజలను ఎంతో ఉత్తేజపరిచారు. కవులందరి తరపున ఓ ప్రజా మ్యానిఫెస్టోను 1913లో రాసి, విప్లవ రష్యన్ ప్రభుత్వానికి అందించారు. మొదట్లో ప్రభుత్వ అనుకూలంగా ఉన్నప్పటికీ, తర్వాత స్టాలిన్ విధానాలతో విభేదించి 1938లో మాస్కో వ్యతిరేక విధానాలను ప్రజల్లో వ్యాప్తి చేస్తున్నాడని, విప్లవ వ్యతిరేక కార్యకలాపాలను ప్రేరేపిస్తున్నాడనే ఆరోపణల మీద అరెస్టయ్యాడు. అలా ఐదేండ్ల పాటు జైలు జీవితం గడిపాడు. అయినా చివరివరకు అణిచివేతకు, నియంతృత్వానికి ఎదురొడ్డి నిలిచిన ఒసిప్ సాహిత్యంలో స్వేచ్ఛా భావనలకు జయ పతాకగా నిలిచాడు.! The Stone (1913) కవితా సంకలనంతో మొదలెట్టి, Tristia (1922), On Poetry (1928), The Egyptian Stamp (1928) వంటి సాహితీ జగతిలో కొత్త ఆలోచనలకు దారులు వేశాడు.

నా అరచేతుల్లో నుంచి...!

ఒకింత ఆనందం కోసం
కాసింత సూర్యుడిని
కొంచెం తేనెను
నా అరచేతుల్లో నుంచి తీసుకో..
Persephone భ్రమరాలు ఆదేశించినట్టుగా!
ముడితీసి వదిలేశాక
పడవ ఇంకెప్పుడూ తీరంలో నిలవదు
తోలు–ఉన్ని నీడల్లో
ఏ సందేశమూ వినిపించదు
ఇదో చిక్కటి కారడవి జీవితం
భయాన్ని అధిగమించటం దుర్గమం!
ఇక ఇప్పుడు మన కోసం
కేవలం చుంబనాలు మాత్రమే మిగిలాయి
చిక్కటి ఉన్నిలాగా చిన్నారి తేనెటీగలు
తుట్టెని విడిచిన మరుక్షణం మరణిస్తాయి!
పారదర్శకంగా కనిపించే నిశిరాత్రి
అవి చిటపటల సవ్వడి చేస్తాయి
దట్టమైన టైగా చెట్లే వాటి ఇల్లు
అదే వాటి ఆహారం, పుదీనా,
వాటి సమయం, వాటి నిధి అన్నీనూ...
అందుకే నేనిస్తున్న
ఈ మోహపూరిత కానుకను
స్వీకరించు.. ఆస్వాదించు !
అవి తేనెటీగలే..
తేనెపట్టు చుట్టూ కంఠహారంలా
అల్లుకొని ప్రాణత్యాగం చేశాయి
అవి ఎండిపోయి నిర్జీవమయ్యాయి
అయితేనేం..
అవి సేకరించిన తేనెను మాత్రం
సూర్యుడిగా మార్చాయి!

మూలం: ఒసిప్ మాండెల్ స్టామ్

స్వేచ్ఛానువాదం: మామిడి హరికృష్ణ, 80080 05231


కొత్త పుస్తకాలు

మందారం

(నందిని సిధారెడ్డి అభినందన సంచిక)

తెలంగాణ సాహిత్య, సాంస్కృతిక, అస్తిత్వ ఉద్యమాలలో మొదటి వరుసలో కనిపించే పేరు నందిని సిధారెడ్డి. ఆయన వ్యక్తిత్వం, జీవితం, సాహిత్య, సామాజిక ఉద్యమాలు, వాటి సాఫల్యతల గురించి తెలు గు సమాజంలోని ప్రముఖుల అభిప్రాయ, అభినందన మాల ఈ పుస్తకం.

సంపాదకులు: డాక్టర్ గంటా జలంధర్‌రెడ్డి, వెల: రూ. 500, ప్రతులకు: గంటా జలంధర్‌రెడ్డి, ఇంటి నెం:9-70 ఏ, ప్రజయ్ గుల్మోహర్ గేటెడ్ కమ్యూనిటీ, కుంట్లూర్‌రోడ్, పెద్ద అంబర్‌పేట్, రంగారెడ్డి జిల్లా. సెల్:9848292715



నా ప్రయాణం

సీహెచ్ హనుమంతరావు వృత్తిపరమైన జీవితకాలమంతా భారతదేశ అధ్యయనానికి సమర్పించిన ప్రతిష్ఠాత్మకమైన ఆర్థికవేత్త. నిబద్ధతగల విద్వాంసుడు. దేశ ఆర్థికాభివృద్ధి రూపకల్పనలో ఒక విద్యావేత్త ప్రత్యక్ష అనుభవాల అత్యంత ఆకర్షణీయమైన కథ ఇది. ప్రపంచీకరణ, ఆర్థిక సంస్కరణలు మొదలు పేదరికాన్ని, అసమానతలను అరికట్టేందుకు సామాజికంగా పేదల అనుకూల వృద్ధివైపు మౌలిక వర్తనలో ప్రత్యక్ష భాగస్వామ్యానికి సంబంధించిన పుస్తకం ఇది.


రచన: చెన్నమనేని హనుమంతరావు, వెల: రూ. 210, ప్రతులకు:నవచేతన పబ్లిషింగ్ హౌస్, గిరిప్రసాద్ భవన్, బండ్లగూడ, హైదరాబాద్-500068. ఫోన్:29884453

ప్రపంచమంతా అతని రంగస్థలమే

నాటకరంగంలో ఆయన నడిచే ఒక విజ్ఞాన సర్వస్వం. పాశ్చాత్య, భారతీయ నాటక రంగాలను ఔపోసన పట్టి తెలుగు నాటకరంగాన్ని ప్రభావితం చేసినవాడు ఆచార్య మొదలి నాగభూషణ శర్మ. ఐదు దశాబ్దాల పాటు నటుడిగా, నాటకకర్తగా, ప్రయోక్తగా, పరిశోధకుడిగా, విమర్శకుడిగా, అధ్యాపకుడిగా తెలుగు నాటకరంగంలో చెరగని సంతకమై కనిపిస్తాడు. ఆయన తెలంగాణ ప్రాంతాన్ని తన కార్యక్షేత్రంగా మలుచుకొని వరంగల్, హైదరాబాద్‌లలో అధ్యాపకుడిగా పనిచేస్తూనే నాటకరంగ వ్యాప్తికి అవిశ్రాంతంగా కృషిచేశాడు. ఉస్మానియా విశ్వవిద్యాలయం ప్రారంభించిన తొలిరోజుల్లో హరీంద్రనాథ్ ఛటోపాధ్యాయ, మఖ్దూమ్ మొహియుద్దీన్, మంత్రి శ్రీనివాసరావు వంటి వారు నాటకరంగ వ్యాప్తికి తొలి పునాదులు వేస్తే, 1980 దశకంలో నాగభూషణ శర్మ నాటకాన్ని విశ్వవిద్యాలయాల పీఠాలపై అధిరోహింపజేశాడు. భారతీయ నాటకరంగంలో తనకంటూ ఒక పేజీ సృష్టించుకున్న నాగభూషణ శర్మ సుదీర్ఘ నాటక ప్రస్థానంలో ఎన్నో మైలురాళ్లను దాటి ఈ నెల 15న తన జీవన నాటకరంగం నుంచి నిష్క్రమించి నాటకరంగానికి తీరని లోటును మిగిల్చాడు.

1936 జూలై 24న సుబ్రహ్మణ్యం, కామేశ్వరమ్మ దంపతులకు జన్మించారు. తండ్రి స్ఫూర్తితో బాల్యంలోనే నాటకరంగం పట్ల ఆకర్షితులై కన్యాశుల్కం నాటకంలో మధురవాణి పాత్రతో రంగస్థల వేదికను కనువిందు చేశాడు. గుంటూరులో కాలేజీ విద్యను అభ్యసించిన ఆయన ఉస్మానియా విశ్వవిద్యాలయంలో ఆంగ్లంలో ఎం.ఏ. డిగ్రీని పూర్తిచేశారు. కాని నాటకరంగంలో ఉన్నత చదువులు అభ్యసించాలన్న తపన ఆయనను అమెరికాలోని ఇల్లినాయిస్ విశ్వవిద్యాలయానికి చేర్చింది. అక్క డ నాటక దర్శకత్వంపై ఎం.ఎఫ్.ఏ. కోర్సు పూర్తిచేయడమే కాకుండా అమెరికన్ నాటకాలపై పీహెచ్‌డీ. అందుకున్నారు.

నాగభూషణశర్మ వరంగల్ డిగ్రీ కళాశాలలో అసిస్టెంట్ లెక్చరర్‌గా ఉద్యోగ జీవితాన్ని ప్రారంభించారు. ఆ తర్వాత పదోన్నతిపై ఓయూ ఆంగ్ల శాఖలో రీడర్‌గా చేరారు. ఆ సమయంలోనే వైస్ చాన్స్‌లర్ ఆచార్య జి.రామిరెడ్డిని ఒప్పించి ఓయూలో నాటక కోర్సును ప్రారంభించడంలో కీలక భూమిక పోషించారు. అదే శాఖకు 1982లో ఆచార్యుడిగా ఎంపికై తొలి అధిపతిగా నియమితులయ్యారు. రాజా రాందాస్, చాట్ల శ్రీరాములు వంటి ప్రతిభామూర్తులతో కలిసి ఉస్మానియా రంగస్థల శాఖను ఆధునిక ప్రయోగశాలగా మార్చారు. అంతకుపూర్వం 1960 దశకంలో తెలంగాణకు చెందిన మంత్రి శ్రీనివాసరావు ఆంధ్ర విశ్వవిద్యాలయ రంగస్థల శాఖను ఆధునిక నాటక ప్రయోగాలకు తొలి బీజం వేస్తే దాన్ని అందిపుచ్చుకొని నాగభూషణశర్మ హైదరాబాద్‌లో నవ్య నాటకాల ఆవిష్కరణకు తెరతీశాడు. ఆయన వారసత్వంగా చాట్ల శ్రీరాములు, ఆచార్య డి.ఎస్.ఎన్.మూర్తి కొనసాగించారు. ఆయన స్కూల్ నుంచే తనికెళ్ళ భరణి, తల్లావఝుల సుందరం, ఆచార్య ప్రసాదరెడ్డి, ఆచార్య భిక్షు, యాదగిరి వంటివారు వెలుగులోకి వచ్చా రు. ఆయన పర్యవేక్షణలో తనికెళ్ళ రాసిన 'గో గ్రహణం' వంటి ఎన్నో నాటకాలు ఉస్మానియా నాటక శాఖలో పురుడు పోసుకొని తెలుగు నాట ప్రఖ్యాతి పొందాయి. నాటి బ్రిటిష్ రెసిడెన్సీ భవనం నేటి ఉమెన్స్ డిగ్రీ కళాశాల ప్రాంగణాన్ని వేదికగా చేసుకొని తాను అనువాదం చేసిన 'రాజా ఈడిపస్' నాటకం స్వీయ దర్శకత్వంలో ప్రదర్శించబడింది. తెలుగు నాటక చరిత్రలో ఈ



ప్రదర్శన అత్యుత్తమ ప్రదర్శనగా మన్ననలు పొందింది. 1988లో హైదరాబాద్ కేంద్రీయ విశ్వవిద్యాలయంలో ప్రారంభించిన రంగస్థల శాఖకు తొలి శాఖాధిపతిగా, డీన్‌గా సేవలందించారు. పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం రంగస్థల విభాగానికి 1996లో శాఖాధిపతిగా నియమితులయ్యారు. ఆయన అక్కడ పనిచేసిన కాలంలోనే చంద్రశేఖర కంబార కన్నడంలో రాసిన నాటకాన్ని 'సాంబశివ ప్రహసనం'గా తెలుగులోకి అనువదించారు. ఈ నాటకాన్ని తల్లావఝుల సుందరం దర్శకత్వంలో విద్యార్థులు ప్రదర్శిస్తే ప్రేక్షకులే కాదు విమర్శకుల ప్రశంసలందుకున్నది. ఇతర భాషా నాటకాలను తెలుగులోకి అనువదించడంలో ఆయన సృజనాత్మక రచయితగా ఖ్యాతిగాంచారు. ఇబ్సన్ రాసి న డాల్స్ హౌజ్‌ను 'బొమ్మరిల్లు'గా, బ్రెక్ట్ రాసిన కకేసియన్ చాక్ సర్కిల్‌ను 'తెల్లసున్న'గా, శామ్యూల్ బకెట్ రాసిన నాటకాన్ని 'దేవుడయ్య వస్తాడట'గా అనువదించాడు. గిరీష్ కర్నాడ్ 'తుగ్లక్' వంటి నాటకాలను తెలుగులోకి అనువదించడమే కాకుండా దాదాపు 50కి పైగా ఇతర స్వతంత్ర నాటకాలు రచించారు.

నాగభూషణశర్మ తెలుగు నాటకాలే కాకుండా ఆంగ్ల నాటకాల ప్రదర్శనకు హైదరాబాద్ డ్రమెటిక్ సర్కిల్‌తో జతకట్టారు. ప్రయోక్తగా అనేక నాటకాలను హైదరాబాద్‌లోనే కాకుండా దేశంలోని ముఖ్య నగరాల్లో ప్రదర్శించారు. మాక్‌బెత్, డాల్స్‌హౌజ్, ఎనిమీ ఆఫ్ ద పీపుల్, ఎంపరర్ జోన్స్, వేయిటింగ్ ఫర్ గోడో, తుగ్లక్ వంటి నాటకాలు ఆయనకు ఖ్యాతిని తెచ్చి పెట్టాయి.

ఆయన తరగతి గదుల్లో బోధించిన పాఠాలు నాటక విద్యార్థుల్లో చెరగని ముద్ర వేశాయి. పాశ్చాత్య నాటకరంగం గురించి ఆయన సాధికారికంగా పాఠం చెబితే తరగతి గదులు పరవశించేవి. ఆయన నిరంతరం తరగతి గదిలోనో, నాటక రిహార్సల్స్ లోనో, గ్రంథాలయాల్లో గడపడంతోనే ఆనందాన్ని వెతుకున్నాడు. తన సంపాదనంతా నాటక, జానపద పరిశోధనలకు, పుస్తక ప్రచురణలకు ఖర్చుచేసి నిరాడంబరంగా జీవించాడు. ఆయన రాసిన రంగస్థల శాస్త్రం, నాటకశిల్పం, నాటకరంగ పరిభాషిక పదకోశం, ఆంధ్రప్రదేశ్ ఫోక్ పర్‌ఫార్మెన్స్ వంటి గ్రంథాలు ఈ తరానికి మార్గదర్శనం చేస్తాయి.

1993 మార్చి 9న హైదరాబాద్ బొగ్గులకుంటలో రసరంజని సంస్థ ప్రారంభించబడింది. దీనిని కె.వి.రమణాచారి, జే.వి.సోమయాజులు, గరిమెళ్ల రామ్మూర్తితో పాటు నాగభూషణ శర్మ ఓ మూలస్తంభమై నడిపించాడు. ఆయన ఈ సంస్థ ద్వారా 250 నాటకాలు 3,500 ప్రదర్శనలు జరుగడానికి కృషి చేసి నాటకానికి బ్రహ్మరథం పట్టే రోజులు రావాలని తపించాడు.

నాగభూషణశర్మ ప్రతిభ బహుముఖీనమైనది. నాటకానికి సమాంతరంగా శాస్త్రీయ, జానపద కళల వికాసానికి కృషిచేశారు. 1968లోనే జానపద కళలపై మక్కువ పెంచుకొని బొమ్మలాట ప్రదర్శించే పద్ధతిని నేర్చుకున్నాడు. బొమ్మలాట బృందాలను వెంటేసుకొని జపాన్, ఫ్రాన్స్, గ్రీసు దేశాల్లో ప్రదర్శించి తెలుగు జానపదానికి పట్టం కట్టాడు. పరిశోధకుడిగా అనేక అంశాలను వెలుగులోకి తీసుకురావడమే కాకుండా ఆయా ప్రక్రియలను, కళాకారులను జాతీయ, అంతర్జాతీయ వేదికలపై పరిచయం చేశారు. ఒగ్గు కథ, చిందు భాగవతం, తోలుబొమ్మలాట వంటి జానపద కళారూపాలకు అంతర్జాతీయ గుర్తింపు తెచ్చిపెట్టాడు. ఆయన ప్రదర్శించిన నాటకాల్లో జానపద కళారూపాలను ప్రవేశపెట్టి ప్రయోగాత్మకంగా ఆవిష్కరించాడు. ఆయన రాసిన 'తెలుగు నవలా వికాసం' సాహిత్యరంగంలో ప్రామాణిక గ్రంథంగా గుర్తింపు పొందింది.

నాగభూషణశర్మ నిత్య చలనశీలి. ఆ తత్వమే అతనిని అధ్యయనం వైపు నడిపించింది. 'ద సురభి థియేటర్', 'నాట్యాంభుజం', 'తొలి నాటి గ్రామ్‌ఫోన్ గాయకులు', 'కూచిపూడి గురుస్ అండ్ పర్‌ఫార్మెన్స్', 'ధర్మవరం నాటక సాహిత్యం' వంటి అనేక గ్రంథాలు పరిశోధనాత్మకంగా వెలువరించారు. భిన్న ప్రక్రియల్లో ఆంగ్లంలో 15 గ్రంథాలు, తెలుగులో 22 గ్రంథాలు ప్రచురించారు. పరిశోధనాత్మక పత్రికలకు సంపాదకులుగా వ్యవహరించారు. ఇండియన్ థియేటర్ జర్నల్, 'నర్తనం' మాగజైన్‌కు ఎడిటర్‌గా ఉంటూ ఎన్నో పరిశోధక వ్యాసాలు ప్రచురించారు. జానపద రూపకాలే కాకుండా భారతీయ శాస్త్రీయ నృత్య రీతులను వివేచించి, సమీక్షించే ప్రజ్ఞాశాలి. ఆయన కృషికి గుర్తింపుగా కేంద్ర సాహిత్య అకాడమీ, నేషనల్ స్కూల్ ఆఫ్ డ్రామా వంటి సంస్థల సభ్యుడిగా ఎంపిక చేసి గౌరవించాయి. పరిశోధకుడిగా, అధ్యాపకుడిగా ఆయన చేసిన నిర్విరామ కృషి ఈ తరానికి దిక్సూచిగా నిలుస్తుంది.

జానపద రూపకాలే కాకుండా భారతీయ శాస్త్రీ య నృత్య రీతులను వివేచించి, సమీక్షించే ప్రజ్ఞాశాలి. ఆయన కృషికి గుర్తింపుగా కేంద్ర సాహిత్య అకాడమీ, నేషనల్ స్కూల్ ఆఫ్ డ్రామా వంటి సంస్థల సభ్యుడిగా ఎంపిక చేసి గౌరవించా యి. పరిశోధకుడిగా, అధ్యాపకుడిగా ఆయన చేసిన నిర్విరామ కృషి ఈ తరానికి దిక్సూచిగా నిలుస్తుంది.

– డాక్టర్ జె.విజయ్‌కుమార్‌జీ, 9848078109

(ఈ నెల 15న కన్నుమూసిన ఆచార్య మొదలి నాగభూషణ శర్మకు నివాళిగా..)

ఒంకర టింకర తొవ్వల్లో..

లేఖిని బెట్టి వృత్తం గీయొచ్చు. పట్రీ బెట్టి సరళరేఖ గీయొచ్చు. డిగ్రీలు కొలిచి కోణం గీయొచ్చు. ఛందస్సులో పద్యం దించొచ్చు. ఆధారం లేని రాతలు కష్టం, ఒంకర టింకర గీతలు మరీ కష్టం. ఎందుకంటే అవి గీసి చూడమంటే ఎవరైనా ఎందుకు చూస్తారు. మన కంటి నుంచి జారిన కన్నీటి గీత ఇక్కడికెలా వచ్చిందని చూస్తారు. మనం సిద్ధం చేసుకున్న శవపేటికను ఇతడెలా దొంగిలించాడని చూస్తారు. భోరున వర్షం కురుస్తుంటే ఏటొడ్డున నిలబడి ఎకసెక్కాలాడే ధైర్యం వీడికెలా దొరికిందని పరికిస్తారు. ఒంకర గీతలు బాగా గీస్తే వంగివంగి చూస్తారు, నిటారుగా చూస్తారు, దాపెట్టుకొని వల్లె వేస్తారు, పక్కలో వేసుకొని పరవశిస్తారు. అప్పుడెప్పుడో చదివి వదిలేసిన వాక్యం సందర్భం రాగానే నేనున్నానని ఎదురొస్తే మాణిక్యం కొడుకు మామూలోడు కాడని సాపిస్తాం. ఎవడు తనను చదివితే వాణ్ణి ఆవహించే సన్ ఆఫ్ మాణిక్యంను ఏదన్నా ఒక ఫ్రేంలో బంధిద్దామనుకుంటామా! చతురాలు, దీర్ఘ చతురాలు, కోన్‌లు, కొలమానాలు బద్ధలైపోతాయి. వ్యాఖ్యానానికి అందడు, సిద్ధాంతానికి పొందడు. 'సూరి' పూని బాల వ్యాకరణం చెబుతున్నాడని మనం భ్రమపడకపోతే..

'మధ్య తరగతి తలలెత్తని
'విశ్వగ్రామము'న ఇల్లు కొనెను
మిగిలిన ధనముతో షేర్లు కొనెను
ఇంకా మిగులుతో ఆ ఇంటికి
స్టారు టీవీలు తొడిగెను
తిరిగి దైవము బ్రతికెను
ద్వేషమునే నగరములు శ్వాసించెను
కుగ్రామములు ఫ్లాట్లయ్యెను..'

అని ప్రపంచీకరణను ఎట్లా తిక్కగా సిద్ధాంతీకరిస్తడు! విమర్శకులకు అంత్యక్రియలు చేసినా బతికి వచ్చి సీతారాందీ గ్లోబలైజేషన్ కవిత్వమనిరి. కవి పంతం వేరే. డిసెంబర్ 6ను మాత్రమే చూడలే, పి.వి.నరసింహారావు మీద దుమ్ము వోయలే, ఎవ్వని పేరూ దీయలే. మూలాల సూత్రాలు పట్టి లాగిండు..!

'ఏమీ తోచనప్పుడు కెలికే మందిరాలు
ఏదైనా తోచినప్పుడు కూలే మజీదులు
2.77 ఎకరాల మేరకు విస్తరించిన
కులమతాలు..'

వాటిలో లోగుట్టూ తెలుసు. మజీదులో ఒకప్పటి గుడి కనబడింది కూడా ఒక లక్ష్యంతోనే. మజీదు కూలింది మాత్రం గుడి కట్టడానికి కాదు, రక్తం పారించడానికి. ఆ రక్తపు పాయ ద్వారా ప్రజాస్వామ్యాన్ని ఛానలైజ్ చేయడానికి. అటువైపు నుంచి కూడా గొప్ప వాదాన్నే అల్లారు. చరిత్రను తేదీలతో సహా ఏకరువు పెట్టారు. దానికి కవి దగ్గరేం జవాబుంటుంది? సీతారాం మనుషులను వెతుకుదామంటే కర సేవకులు మతాల్ని వెతుకుదామంటున్నారని..

'చరిత్ర కోసం మనం కొందరం
హిందువులమయ్యాం
ముస్లింలమూ అయ్యాం
కానీ, మనుషులం కాలేకపోయాం..' అని బిత్తర పోతాడు. అది పెట్టిన అనేక దాష్టీకాల్లో కర్ఫ్యూ అనేది ఒకటి. సీతారాం లాంటి కవులు సామాజిక సమస్య లను విస్మరించి తమ సమస్యల్నే సమాజానికి అంటగడుతు న్నారన్న అంజనీబాల అభిప్రాయాన్ని పూర్వపక్షం చేయడానికి ఈ కొన్ని కవితలు సరిపోతాయని చెప్పలేం కానీ మచ్చుకు ఒక్క దళిత కవిత కూడా లేకుండానే ఈ సంపుటి వేయడం దళిత ద్రోహమవుతుందా?' అని తనకుతానే సందేహించుకోవడం కూడా వ్యంగ్యం లేకుండా కవిత్వం రాయలేని తనంలో భాగమే. వందల కొద్దీ ఎలిజీలు కూడా మొనాటనీ వల్ల కదిలించలేకపోతున్న సందర్భం అన్ని వాదాల్లోనూ, మానవతా వాదంలోనూ చూస్తూ ఉన్నాం. మార్పును కలలుగన్న ఉద్యమకారుడి మరణాన్ని అద్భుతమైన ఎలిజీగా మలువడం వెనుక సీతారాం పరిశీలన, బాధ్యత ఎవరు కాదనగలరు? తూటాలకు పడిపోయిన వీరుడిని సంబోధిస్తూ 'ఆకాశం వాడి వేలిముద్ర' రాశాడు. 'ఇంత నిద్ర నువ్వెన్నడూ పోలేదు'ను శాశ్వత నిద్రకు అలవోకగా 'సింబల్' చేస్తాడు. 'అక్కలిద్దరూ వీలు దొరికినప్పుడల్లా కళ్లను తడి చేసుకుంటున్నారు' అని దుఃఖ సంకేతాలు కొత్తగా ప్రయోగిస్తాడు. ఆధునిక కవిత్వం ఒక అనుభవం, ఒక స్వీకరించగలిగే ఫీలింగ్ తిలక్‌లోలానే సీతారాంను కూడా వెన్నంటింది. 'ఉదా పడవ'ను మొదలుపెడు తూ..

'ఎంతకీ తీరం తగలదు
అసలీ నదికి వొడ్డుందో లేదో..' అంటూ ప్రయాణాన్ని జీవితంతో పోలుస్తూ నడుపుతాడు కవితను.

'కొండకింద ఇల్లు' శీర్షికన వేశ్య మీద రాసిన కవిత, యాక్సిడెంట్, అబ్బాయి మరణం మీద రాసిన 'ఏడుపు పుట్టినప్పుడు', 'పెనువెత' కవితలు, ప్రియురాలి పాత లేఖ' తదితర కవితల్లో సీతారాం సృజన లోతులు గుర్తించవచ్చు. ఒకచోట వస్తువు లేకుండా కవిత్వమెలా అల్లాలో అల్లి చూపించాడు. కవితలకు శీర్షికలు పెట్టడం లో ప్రత్యేకమైన శ్రద్ధ సీతారాంకు. ఆయన శీర్షికలు, భాష, ఆలోచనలు, అభివ్యక్తి ధోరణులు అన్నీ కొత్తగా ఉండేందుకు నిరంతరం పుటం పెట్టుకొని చూసే కవి సీతారాం. ఆయన కవిత్వం వ్యాఖ్యానానికి ఒదిగేది తక్కువ. అనుభవానికి అందుతుంది. వైయక్తిక అనుభవాన్ని కవిత్వం చేసి పాఠకులను కట్టి పడేయగల శక్తిమంతుడు.

కవిత్వ నిర్వహణ, అత్యాధునిక కవిత్వ నిర్వహణ కత్తి మీద సామే. ఎందుకంటే దానికి ఛందస్సు లేదు, అలంకారం ఆప్షనల్, కథ లేదు, పునాది కూడా లేదు. ఆధునిక వచన కవిత్వమంటే కనిపించని పునాదుల మీద కట్టవలసిన రంగుల హర్మ్యం. కవి తనకుతానుగా కనిపించని సొంత ఛందస్సొకటి ఏర్పరుచుకొని రాసుకుంటాడు. అతనికి ఒక తాత్విక పునాది, శైలీ పునాది ఉంటాయి. అతడు ఒక్కడే కానీ, ఒంటరి కాదనడంలో చమత్కారమే కవిత్వం, సీతారాం కవిత్వం. అంటాంగానీ వేలల్లో ఒక్కరే రాయగలరు కొత్తగా, ఒక్కరు కూడా ఒక్కసారే. వ్యంగ్యమే, తాత్విక వ్యంగ్యమే సీతారాం కవిత్వ ప్రాణం.

కవిత్వ నిర్వహణ, అత్యాధునిక కవిత్వ నిర్వహణ కత్తిమీద సామే. ఎందుకంటే దానికి ఛందస్సు లేదు, అలంకారం ఆప్షనల్, కథ లేదు, పునాది కూడా లేదు. ఆధునిక వచన కవిత్వమంటే కనిపించని పునాదుల మీద కట్టవలసిన రంగుల హర్మ్యం. కవి తనకుతానుగా కనిపించని సొంత ఛందస్సొకటి ఏర్పరుచుకొని రాసుకుంటాడు. అతనికి ఒక తాత్విక పునాది, శైలీ పునాది ఉంటాయి. అతడు ఒక్కడే కానీ, ఒంటరి కాదనడంలో చమత్కారమే కవిత్వం, సీతారాం కవిత్వం.

– ఏనుగు నర్సింహారెడ్డి

89788 69183

ప్రకటనలు



జైనీ జాతీయ సాహితీపురస్కారం-2019

లక్ష్మీనారాయణ జైనీ జాతీయ సాహితీపురస్కారం హైదరాబాద్ రవీంద్ర భారతి సమావేశ మందిరంలో 2019 జనవరి 29న సాయంత్రం 6 గంటలకు జరుగుతుంది. సుధామ అధ్యక్షతన జరుగు సభలో నందిని సిధారెడ్డి, శ్రీరాం తదితరులు హాజరవుతారు. అందరికీ ఆహ్వానం

- డాక్టర్ ప్రభాకర్ జైని, జైని ఇంటర్నేషనల్ ఫౌండేషన్

ఉగాది ఉత్తమ రచనల పోటీ

వంగూరి ఫౌండేషన్ ఆఫ్ అమెరికా.. ఉత్తమ కథానిక, ఉత్తమ కవిత పోటీలకు రచనలను ఆహ్వానిస్తున్నది. కథలు 15పేజీల లోపు, కవితలు ఐదు పేజీల లోపు ఉండాలి. ఎక్కడా, వ్యక్తిగత బ్లాగ్‌లు, వెబ్‌సైట్స్ సోషల్ మీడియా లో కూడా ప్రచురించబడని వాటికే ఆహ్వానం. అలాగే నా మొదటి కవిత, మొదటి కథకు కూడా ఆహ్వానం. రచనలు 2019 మార్చి 20లోపు అందాలి. రచనలు పీడీఎఫ్, జేపీఈజీ, యూనికోడ్ ఫాంట్‌లో పంపాలి. మెయిల్: sairacha@gmail.com,vangurifoundation@gmail.com

- వంగూరి ఫౌండేషన్ ఆఫ్ అమెరికా, హ్యూస్టన్, హైదరాబాద్, ఫోన్: 8325949054

కథ, కవితల పోటీలు-2019

దామోదరం సంజీవయ్య స్మారక కథ, కవితల పోటీలకు రచనలను ఆహ్వానిస్తున్నాం. కథలు చేతి రాతలో 5–7 పేజీలు, కవితలు 30 పంక్తులకు మించకుండా రాసి, 2019 ఫిబ్రవరి 21లోపు పంపించాలి. చిరునామా:డీఎస్ సిద్ధార్థ సాంస్కృతిక, సామాజిక సేవా సంస్థ, ప్లాట్ నెం:105, మహాలక్ష్మి టవర్స్, దేవాపురం 5వ లైన్, ఎన్టీఆర్ మున్సిపల్ స్టేడియం వెనుక, బృందావన్ గార్డెన్స్, గుంటూరు–522006. వివరాలకు:8008189979..

- ఎస్.ఆర్.రావు

ఆశావహ జీవన సందేశం- సాహిత్య సభ

పాలమూరు అధ్యయన వేదిక ఆధ్వర్యంలో 'కవిత్వంతో ఒకరోజు' సాహిత్య సభ 2019 ఫిబ్రవరి 3న మహబూబ్‌నగర్‌లోని రోజ్‌గార్డెన్ ఫంక్షన్ హాల్‌లో జరుగుతుంది. జస్టిస్ బి.సుదర్శన్‌రెడ్డి ప్రారంభోపన్యాసం చేసే సభలో ప్రొఫెసర్ హరగోపాల్, కె.శివారెడ్డి, ఖాదర్, దర్భశయనం శ్రీనివాసాచార్య, పాణి ప్రసంగిస్తారు. అలాగే నందిని సిధారెడ్డి, జి.లక్ష్మీనరసయ్య, కవి యాకుబ్, ఎ.కె.ప్రభాకర్, కోయి కోటేశ్వర్‌రావు, కొండేపూడి నిర్మల, దేవీప్రియ, వాసిరెడ్డి నవీన్, ఎన్.వేణుగోపాల్ హాజరవుతారు. ఎ.రాజేంద్రబాబు, సి.రామ్మోహన్, ఉదయమిత్ర, ఎ.తిమ్మప్ప, కె.సి.వెంకటేశ్వర్లు, ఎం.రాఘవాచారి, జి.బుచ్చన్న, జి.వెంకట్‌గౌడ్ తదితరులు పాల్గొంటారు.

- పాలమూరు అధ్యయన వేదిక

Printed and Published by **Damodar Rao Divakonda**, on behalf of Telangana Publications Pvt Ltd, Printed at Telangana Publications Pvt. Ltd, S.No.437, Near Velama Kalyana Mandapam, Devara Yamjaal, Shamirpet Mandal, Dist: Medchal - 500 078, Published At Telangana Publications Pvt Ltd. 8-2-603/1/7,8,9. Krishnapuram, Road No.10, Banjara Hills, Hyderabad, 500 034, Telangana State. Editor: **Katta Shekar Reddy.** Ph: +91 40 2329 1999, Fax: +91 40 2333 4242, 040-23291118, Toll Free: 1800 425 3666. RNI No. TELTEL/2011/37693.



యాదాద్రి పంచనారసింహ క్షేత్రానికి ఆదివారం భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చారు. క్యూలైన్లు, మండపాలు భక్తులతో కిక్కిరిసిపోయాయి. రద్దీ దృష్ట్యా స్వామివారి దర్శనానికి గంటల కొద్దీ సమయం పట్టింది. సత్యనారాయణ స్వామివారి వ్రతాలను భక్తులు పెద్ద ఎత్తున జరిపించారు. స్వామివారి ఖజానాకు రూ.16,66,732 ఆదాయం సమకూరింది. - యాదాద్రి భువనగిరి జిల్లాప్రతినిధి, నమస్తే తెలంగాణ



వరంగల్ అర్బన్ జిల్లా ఐనవోలు మల్లికార్జునస్వామిని దర్శించుకోవడానికి ఆదివారం భక్తులు భారీగా తరలి వచ్చారు. అర్చకులు స్వామివారికి రుద్రాభిషేకాలు జరిపించారు. శివసత్తుల నృత్యాలు ఆకట్టుకున్నాయి. ఒగ్గు పూజారులు పట్నాలువేసి ఒగ్గుకథలు చెప్పారు. స్వామివారికి, అమ్మవార్లకు భక్తులు ఒడి బియ్యం, వస్త్రాలు, అమ్మవారికి బోనాలు సమర్పించారు. రథ సేవ నిర్వహించారు. - ఐనవోలు





వరంగల్ అర్బన్ జిల్లా భీమదేవరపల్లి మండలం కొత్తకొండలోని వీరభద్రస్వామి వారిని భక్తులు పెద్దసంఖ్యలో దర్శించుకొన్నారు. ఆదివారం వేకువజాము నుంచే భక్తులు ఆలయానికి చేరుకొని ప్రత్యేక పూజలు చేశారు. ఆలయం చుట్టూ కోడె ప్రదక్షిణలు చేసి స్వామివారికి కోరమీసాలు సమర్పించారు. - భీమదేవరపల్లి

గ్రేటర్ వరంగల్ కమిషనర్‌గా రవికిరణ్



వరంగల్, నమస్తేతెలంగాణ: వరంగల్ మహానగర పాలక సంస్థ కమిషనర్‌గా నియమితులైన ఎన్ రవికిరణ్ ఆదివారం బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటివరకు ఇక్కడ కమిషనర్‌గా పనిచేసిన వీపీ గౌతమ్‌ను శనివారం రాత్రి బదిలీచేస్తూ ప్రభుత్వ ముఖ్య కార్యదర్శి ఎస్కేజోషి ఉత్తర్వులు జారీచేశారు. మున్సిపల్‌శాఖలో అడిషనల్ డైరెక్టర్‌గా ఉన్న రవికిరణ్‌ను గ్రేటర్‌వరంగల్ కమిషనర్‌గా బ దిలీచేస్తూ ఆదివారం ఉత్తర్వులు వెలువడ్డాయి. 1997 గ్రూప్-1 అధికారి అయిన రవికిరణ్ రాజేంద్రనగర్ మున్సిపాలిటీలో ప్రభుత్వసర్వీస్‌లో చేరారు. 2000 సంవత్సరం నుంచి హైదరాబాద్ మహా నగరపాలక సంస్థలో పనిచేస్తున్నారు.



టీఎన్జీవోస్ కేంద్రకమిటీ అధ్యక్షుడు కారం రవీందర్‌రెడ్డి తదితరులు ఆదివారం వరంగల్ అర్బన్ జిల్లా కొత్తకొండ వీరభద్రస్వామివారిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా వారికి ఆలయ ఈవో వెంకన్న మెమొంటోలను అందించారు



కోదాడలోని కిట్స్ పరీక్ష కేంద్రంలో ఫర్నిచర్‌ను ధ్వంసం చేస్తున్న అభ్యర్థులు

రైల్వే పరీక్ష నిలిచిపోవడంతో అభ్యర్థుల ఆందోళన

ఫర్నిచర్ ధ్వంసం

కోదాడ, నమస్తే తెలంగాణ: సూర్యాపేట జిల్లా కోదాడ పట్టణంలోని కిట్స్ కళాశాలలో ఆదివారం నిర్వహించిన రైల్వే ప్రొడక్షన్ ఫోర్స్ కానిస్టేబుల్ రిక్రూట్‌మెంట్ ఆన్‌లైన్ పరీక్ష సాంకేతిక కారణాలతో నిలిచిపోవడంతో అభ్యర్థులు ఆందోళన చేపట్టారు. ఆగ్రహంతో ఫర్నిచర్‌ను ధ్వంసం చేశారు. అధికారుల నిర్లక్ష్యం కారణంగానే ఇటువంటి చర్యలు చోటుచేసుకుంటున్నాయని అభ్యర్థులు ఆగ్రహం వ్యక్తం చేశారు. సీఐ శ్రీనివాస్‌రెడ్డి అభ్యర్థులకు నచ్చజెప్పడంతో ఆందోళన విరమించారు.



నిజామాబాద్ నగరంలో నిర్వహించిన ఇంధన పొదుపు సైకిల్ ర్యాలీలో పాల్గొన్న విద్యార్థులు

ఇంధన పొదుపు అందరి బాధ్యత

నిజామాబాద్ స్పోర్ట్స్: ఇంధనాన్ని ప్రతి ఒక్కరూ పొదుపుగా వినియోగించాలని నిజామాబాద్ జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారి కృష్ణప్రసాద్ పిలుపునిచ్చారు. హిందుస్థాన్ పెట్రోలియం కార్పొరేషన్ ఆధ్వర్యంలో ఆదివారం నిజామాబాద్ కలెక్టరేట్ మైదానంలో ఇంధన పొదుపుపై నిర్వహించిన సైకిల్ ర్యాలీని ప్రారంభించారు. ఈ సందర్భంగా కృష్ణప్రసాద్ మాట్లాడుతూ.. ఇంధన వినియోగంలో ప్రతిఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాల్సిన అవసరం ఉన్నదని సూచించారు. ఈ ర్యాలీలో హెచ్‌పీ గ్యాస్ డిస్ట్రిబ్యూటర్లు, హెచ్‌పీసీఎల్ పంపుల డీలర్లు, ఆర్టీసీ అధికారులు, వివిధ పాఠశాలల నుంచి సుమారు 500మంది విద్యార్థులు పాల్గొన్నారు.



కామారెడ్డి జిల్లా దోమకొండలో క్యాండిల్స్ తయారీపై శిక్షణ పొందుతున్న మహిళలు

స్వయం ఉపాధి రంగాల్లో రాణించాలి

హైదరాబాద్ యూత్ అసెంబ్లీ వైస్ చైర్మన్ అఖిల్ సూచన

కామారెడ్డి జిల్లా దోమకొండలో మహిళలకు శిక్షణ

బీబీపేట్ (దోమకొండ): యువత స్వయం ఉపాధి రంగాల్లో రాణించి పేదరికం నుంచి బయటపడాలని హైదరాబాద్ యూత్ అసెంబ్లీ వైస్ చైర్మన్ అఖిల్ పేర్కొన్నారు. ఆదివారం కామారెడ్డి జిల్లా దోమకొండలో మహిళలకు జెల్ వాసిలిన్, క్యాండిల్స్ తయారీపై శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన అవగాహన సదస్సులో అఖిల్ మాట్లాడుతూ.. నిరుద్యోగ సమస్యతో యువత, పనుల కొరతతో మహిళలు ఇబ్బందులు పడకుండా కుటీర పరిశ్రమలు దోహద పడతాయన్నారు. గ్రామీణ ప్రాంత మహిళలు వ్యవసాయం, బీడీ పరిశ్రమలో పనిచేసి రోగాల బారిన పడుతున్నారని, మహిళలు ఆర్థిక స్వావలంబన సాధించాల్సిన అవసరం ఉన్నదని చెప్పారు. కార్యక్రమంలో హైదరాబాద్ యూత్ అసెంబ్లీ సభ్యులు ప్రసాద్, గణేశ్, వినయ్ తదితరులు పాల్గొన్నారు.



రంగారెడ్డి జిల్లా షాబాద్ నుంచి పోలింగ్ కేంద్రాలకు బ్యాలెట్ బాక్సులు తీసుకెళ్తున్న పోలింగ్ సిబ్బంది



కరీంనగర్‌లోని రేకుర్తి లయోలా కళాశాలలో బ్యాలెట్ పత్రాలను లెక్కిస్తున్న ఎన్నికల సిబ్బంది

తొలిపోరుకు సర్వం సిద్ధం

గ్రామ స్వరాజ్యం

నమస్తే తెలంగాణ నెట్‌వర్క్: పంచాయతీ ఎన్నికల్లో భాగంగా సోమవారం జరిగే తొలిపోరుకు అధికారులు సర్వం సిద్ధం చేశారు. పోలింగ్‌తోపాటు, కౌంటింగ్‌కు అవసరమైన సామగ్రిని సమకూర్చారు. ఆదివారం మధ్యాహ్నం ఎన్నికల సిబ్బంది ఆయా మండలాల్లోని పంపిణీ కేంద్రాల్లో ఎన్నికల సామగ్రిని తీసుకొని పోలింగ్ స్టేషన్లకు బయలుదేరి వెళ్లారు. బ్యాలెట్ పత్రాలు, బ్యాలెట్ బాక్సులు, ఇంకు, ఇతర సామగ్రితో బస్సుల్లో ఆయా ప్రాంతాలకు చేరుకున్నారు. ఈ సందర్భంగా పోలీసు అధికారులు భారీ బందోబస్తు ఏర్పాటుచేశారు.



మెదక్‌లో పోలింగ్ సామగ్రి తీసుకొని గ్రామాలకు తరలివెళ్తున్న ఎన్నికల అధికారులు, సిబ్బంది



కాళేశ్వరం ప్రాజెక్ట్‌లో భాగంగా పెద్దపల్లి జిల్లా ధర్మారం మండలం నందిమేడారంలోని ఆరో ప్యాకేజీ అండర్ టన్నెల్ ను ఆదివారం టీఎస్‌పీఎస్సీ సభ్యుడు సీ విఠల్, ఉన్నత విద్యాశాఖ కౌన్సిల్ వైస్ చైర్మన్ వీ వెంకటరమణ, కరీంనగర్ డీఐజీ ప్రమోద్‌కుమార్, టీఎన్జీవో నేత జగదీశ్, రిటైర్డ్ జడ్జి రాజేంద్రకుమార్ తదితరులు సందర్శించారు. - ధర్మారం



ఉద్యోగ భద్రత కల్పిస్తామని సీఎం కేసీఆర్ ఆదివారం అసెంబ్లీలో ప్రకటించడాన్ని హర్షిస్తూ నిజామాబాద్‌లో సెర్ప్ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు ఏడెల్లి రవి ఆధ్వర్యంలో ఆయన చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న ఉద్యోగులు

సచ్చాడనుకున్నారు.. సజీవంగా ఇంటికి చేరాడు..

15 ఏండ్ల క్రితం తప్పిపోయి తిరిగివచ్చిన వ్యక్తి.. ఆ కుటుంబంలో వెల్లివిరిసిన ఆనందం

మోటకొండూర్(యాదగిరిగుట్ట రూరల్): 15 ఏండ్ల క్రితం తప్పిపోయిన మతిస్థిమితంలేని ఓ వ్యక్తి.. ఒక దశలో చనిపోయాడని భావించి ఆశలు వదులుకున్న తరుణంలో ఇంటికి తిరిగి రావడంతో ఆ కుటుంబంలో ఆనందం వెల్లివిరిసింది. పోలీసుల వివరాల ప్రకారం.. ఏపీలోని తూర్పుగోదావరి జిల్లా తూర్పుపాలేనికి చెందిన కుంచె సత్యనారాయణ పెద్ద కొడుకు రాఘవయ్య 15 ఏండ్ల క్రితం మతిస్థిమితం కోల్పోయి ఇంటినుంచి వెళ్లిపోయాడు. దీంతో కుటుంబీకులు అతడి కోసం ఎంతో వెదికి.. ఆచూకీ దొరక్కపోవడంతో ఆశలు వదులుకున్నారు. చనిపోయాడని భావించి వర్ధంతి నిర్వహిస్తున్నారు. రాఘవయ్య యాదాద్రి భువనగిరి జిల్లా ఆలేరు పరిసరాల్లో తిరుగుతుండగా స్థానికులు గమనించి 19 జూన్ 2016లో అమ్మఒడి ఆశ్రమంలో చేర్పించారు. ఆశ్రమ నిర్వాహకులు అతడికి చికిత్సఅందిస్తూ ఆచూకీని తెలుసుకునేందుకు ప్రయత్నించారు. గత డిసెంబర్ నుంచి రాఘవయ్య మానసికస్థితి నుంచి కుదుటపడి ఇంటి చిరునామా చెప్పడంతో ఆశ్రమ సిబ్బంది సదరు కుటుంబ సభ్యులకు సమాచారమందించారు. దీంతో రాఘవయ్య సోదరుడు ప్రసాద్ ఆదివారం ఇక్కడికి రాగా గుట్ట పోలీస్‌స్టేషన్‌లో సీఐ నరసింహారావు సమక్షంలో రాఘవయ్యను అతని సోదరుడికి అప్పగించారు.



యాదగిరిగుట్ట పోలీస్‌స్టేషన్‌లో రాఘవయ్యను కుటుంబ సభ్యులకు అప్పగిస్తున్న అమ్మఒడి ఆశ్రమ నిర్వాహకులు

స్నేహితులే మట్టుబెట్టారు..

పత్రి సాయి హత్య కేసును ఛేదించిన పోలీసులు

సిరిసిల్ల క్రైం: రాజన్న సిరిసిల్ల జిల్లా తంగళ్లపల్లి మండలం చీర్లవంచ గుట్టల్లో ఈనెల 16న జరిగిన పత్రి సాయి హత్య కేసును పోలీసులు ఛేదించారు. ఈ కేసులో ఐదుగురిని అదుపులోకి తీసుకున్నారు. ఎస్పీ రాహుల్ హెగ్డే ఆదివారం మీడియాకు వెల్లడించిన వివరాల ప్రకారం.. వేములవాడకు చెందిన పత్రి సాయి (22), కవిరాజు, నాగరాజు, అజయ్, కృష్ణ, నగేశ్ మిత్రులు. కవిరాజు సుభాష్‌నగర్‌లోని ఓ యువతితో సన్నిహితంగా ఉంటున్నాడనే విషయం సాయి కారణంగా బహిర్గతం కావడంతో స్థానికులు అతడిని చితకబాదారు. సాయిపై పగ పెంచుకున్న కవిరాజు తన స్నేహితులైన నాగరాజు, అజయ్, భార్గవ్ కృష్ణ, నగేశ్‌తో కలిసి కుట్ర పన్నాడు. 15న సాయిని పిలిచి మద్యం తాగించి.. చింతలఠాణ-చీర్లవంచ గ్రామాల మధ్యలోని గుట్టల వద్దకు తీసుకెళ్లి కర్రలతో కొట్టి.. షర్టుతో ఉరివేసి.. బ్లేడ్‌లతో గొంతు కోసి హతమార్చారు. తర్వాత వారంతా పారిపోయారు. ఆదివారం తిరిగి వేములవాడకు వస్తుండగా.. తంగళ్లపల్లి మండలం టెక్స్‌టైల్ పార్క్ గేట్ వద్ద అదుపులోకి తీసుకున్నట్టు ఎస్పీ తెలిపారు.



కాంగ్రెస్ నాయకుడు, మాజీ సింగిల్ విండో చైర్మన్ చిట్టుమల్ల శ్రీనివాస్‌కు కండువా కప్పి టీఆర్‌ఎస్‌లోకి ఆహ్వానిస్తున్న హుస్నాబాద్ ఎమ్మెల్యే సతీశ్‌కుమార్



నాగర్‌కర్నూల్ జిల్లా అమ్రాబాద్‌లో కాంగ్రెస్ యువ నాయకులకు గులాబీ కండువా కప్పి టీఆర్‌ఎస్‌లోకి ఆహ్వానిస్తున్న అచ్చంపేట ఎమ్మెల్యే గువ్వల బాలరాజు

టీఆర్‌ఎస్‌లోకి భారీగా వలసలు

నమస్తే తెలంగాణ నెట్‌వర్క్: టీఆర్‌ఎస్‌లోకి చేరికలు కొనసాగుతున్నాయి. ఆదివారం వివిధ పార్టీల నాయకులు, కార్యకర్తలు భారీగా గులాబీగూటికి చేరారు. కరీంనగర్ జిల్లా చిగురుమామిడికి చెందిన కాంగ్రెస్ నాయకుడు, సింగిల్ విండో మాజీ చైర్మన్ చిట్టుమల్ల శ్రీనివాస్, హమాలీ సంఘం అధ్యక్షుడు సందవేని మల్లేశం సహా 50 మంది హుస్నాబాద్ ఎమ్మెల్యే వొడితల సతీశ్‌కుమార్ సమక్షంలో టీఆర్‌ఎస్‌లో చేరారు. కరీంనగర్ జిల్లా తిమ్మాపూర్‌లో కాంగ్రెస్, బీజేపీకి చెందిన 50మంది ఐడీసీ చైర్మన్ ఈద శంకర్‌రెడ్డి సమక్షంలో, నాగర్‌కర్నూల్ జిల్లా అమ్రాబాద్, పదర మండలాల యువకులు అచ్చంపేట ఎమ్మెల్యే గువ్వల బాలరాజు సమక్షంలో టీఆర్‌ఎస్ కండువా కప్పుకొన్నారు.



కరీంనగర్ జిల్లా తిమ్మాపూర్‌లో కాంగ్రెస్ నాయకులకు కండువా కప్పి గులాబీ పార్టీలోకి స్వాగతిస్తున్న ఐడీసీ చైర్మన్ ఈద శంకర్‌రెడ్డి

సర్పంచ్ బరిలో సమీపబంధువులు

పంచాయతీ ఎన్నికల్లో ఆసక్తికర పోటీ

హాలియా, నమస్తే తెలంగాణ: పంచాయతీ ఎన్నికల్లో సమీపబంధువులు బరిలో నిలిచారు. అత్తా కోడళ్లు, అన్నాదమ్ములు, తోటి కోడళ్లు, వదినా మరదళ్లు ప్రత్యర్థులుగా తలపడుతున్నారు. గెలుపే లక్ష్యంగా పోటీపోటీగా ప్రచారం చేస్తున్నారు. దీంతో రాష్ట్రంలోని పలు పంచాయతీల్లో పోటీ ఆసక్తిరేపుతున్నది.

అత్తా, కోడళ్ల సవాల్



లలిత (కోడలు)



మణెమ్మ (అత్త)

నల్లగొండ జిల్లా అనుముల మండలంలోని పంగవాని కుంట సర్పంచ్ స్థానం జనరల్ మహిళకు రిజర్వ్ అయ్యింది. టీఆర్‌ఎస్ బలపర్చిన అభ్యర్థిగా తేరా లలిత, కాంగ్రెస్ బలపరిచిన అభ్యర్థిగా ఆమె అత్త తేరా మణెమ్మ పోటీపడుతున్నారు. అత్తాకోడళ్లు పోటీచేస్తుండటంతో ఇక్కడ ఎన్నిక రసవత్తరంగా మారింది.

అన్నదమ్ముల పోటీ

అనుముల మండలం అన్నారం, పులిమామిడి పంచాయతీల్లో వరుసకు అన్నదమ్ములు పంచాయతీ ఎన్నికల్లో తలపడుతున్నారు. అన్నారం సర్పంచ్ స్థానానికి టీఆర్‌ఎస్ బలపరిచిన అభ్యర్థిగా కట్టా సత్యనారాయణరెడ్డి పోటీ చేస్తుండగా.. కాంగ్రెస్ బలపరిచిన అభ్యర్థిగా అతడికి సోదరుడి వరుసయ్యే కట్టా సత్యనారాయణరెడ్డి బరిలో ఉన్నారు. ఇద్దరి పేర్లు ఒకటే కావడంతో ఓటర్లు అయోమయానికి గురవుతున్నారు. పులిమామిడిలో టీఆర్‌ఎస్ బలపరిచిన అభ్యర్థిగా మాలె వెంకట్‌రెడ్డి, కాంగ్రెస్ బలపరిచిన అభ్యర్థిగా మాలే సత్యనారాయణరెడ్డి బరిలో నిలిచారు. వీరు కూడా వరుసకు అన్నదమ్ములు కావడం విశేషం.

ముగ్గురు అభ్యర్థుల ఇంటిపేరు ఒకటే

అనుముల మండలం ముక్కమాలలో ఒకే ఇంటి పేరు కలిగిన గోన దేవకమ్మ, గోన పద్మ, గోన లక్ష్మీ సర్పంచ్ అభ్యర్థులుగా పోటీ పడుతున్నారు. పోటీలో ఉన్న ముగ్గురి ఇంటి పేరు ఒకటే కావడంతో పాటుగా అందరూ దగ్గరి బంధువులు కావడంతో త్రిముఖ పోరు రసవత్తరంగా మారింది.



'పడిలేచిన కెరటం', 'అంకురం' పుస్తకాలను ఆవిష్కరిస్తున్న తెలంగాణ సాహిత్య అకాడమీ చైర్మన్ నందిని సిధారెడ్డి, తదితరులు

గాఢమైన కవిత్వం పరిణతితోనే సాధ్యం

తెలంగాణ సాహిత్య అకాడమీ చైర్మన్ నందిని సిధారెడ్డి

కరీంనగర్ కల్చరల్: గాఢమైన కవిత్వం పరిణతితోనే సాధ్యమవుతుందని తెలంగాణ సాహిత్య అకాడమీ చైర్మన్ డాక్టర్ నందిని సిధారెడ్డి పేర్కొన్నారు. తెలంగాణ కళావేదిక ఆధ్వర్యంలో ఆదివారం కరీంనగర్ ఫిలింభవన్‌లో సిరిపురం వాణిశ్రీ రచించిన 'పడిలేచిన కెరటం', సంగీతం శ్రీలేఖ రచించిన 'అంకురం' పుస్తకాలను ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా నందిని సిధారెడ్డి మాట్లాడుతూ.. కవులు ప్రత్యేకతను చాటుకోవడానికి పదునుగా, బలంగా రాయాల్సిన అవసరం ఉన్నదని చెప్పారు. అనంతరం 'పడిలేచిన కెరటం' పుస్తకాన్ని డాక్టర్ అడువాల సుజాత, 'అంకురం' పుస్తకాన్ని చిందం సునీత సమీక్షించారు. కార్యక్రమంలో తెలంగాణ కళావేదిక అధ్యక్షుడు దయాకర్ తదితరులు పాల్గొన్నారు.

కారు బోల్తా.. విజిలెన్స్ సీఐకి తీవ్రగాయాలు

నాగారం: ప్రమాదవశాత్తు కారు బోల్తా పడటంతో సంగారెడ్డి విజిలెన్స్ సీఐకి తీవ్రగాయాలయ్యాయి. ఈ ఘటన సూర్యాపేట జిల్లా నాగారం మండలంలోని నాగారంబంగ్లా వద్ద ఆదివారం తెల్లవారుజామున చోటుచేసుకున్నది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. సంగారెడ్డి జిల్లా విజిలెన్స్ సీఐగా పనిచేస్తున్న పెరుమాళ్ల నిర్మల తన తల్లిగారి స్వస్థలమైన నాగారానికి వచ్చి సొంత పనిపై తిరిగి తిరుమలగిరి వైపు కారులో తన కుమార్తె జాజి, అల్లుడు చింటు, చెల్లి కొడుకు సుహాన్‌లతో కలిసి వెళ్తున్నారు. నాగారం బంగ్లా శివారులోని రైస్‌మిల్లు వద్ద కారు అదుపు తప్పి పల్టీ కొట్టింది. ఈ ఘటనలో నిర్మలకు తీవ్ర గాయాలు కాగా ముగ్గురు చిన్నారులు స్వల్పంగా గాయపడ్డారు. బాధితులను చికిత్స నిమిత్తం హైదరాబాద్‌కు తరలించారు. ఘటనా స్థలాన్ని నాగారం సీఐ జే రవీందర్, ఎస్సై ఎం లింగం పరిశీలించారు.



వరంగల్ ఆటోనగర్‌లో కాలిపోయిన కార్లు

వరంగల్‌లో ఐదు వాహనాలు దగ్ధం

పోచమ్మమైదాన్(వరంగల్): వరంగల్ ఆటోనగర్‌లో రిపేర్‌కోసం పార్క్ చే సి ఉంచిన ఐదు వాహనాలు కాలిపోయాయి. పోలీసుల తెలిపిన వివరాల ప్రకారం.. ఆటోనగర్‌లో మరమ్మతు కోసం పాత వాహనాలను పార్క్ చేస్తుంటారు. ఆదివారం తెల్లవారుజామున 3 గంటల ప్రాంతంలో ఆటోనగర్‌లో పార్క్‌చేసిన ఐదుకార్లు కాలిపోతూ మంటలు లేచాయి. అక్కడి వాచ్‌మన్లు గమనించి మెకానిక్‌లకు సమాచారం అందించడంతో వారు అగ్నిమాపక అధికారులకు ఫోన్ చేశారు. దీంతో ఫైర్ సిబ్బంది చేరుకొని మంటలను అదుపులోకి తీసుకురాగా అప్పటికే చాలావరకు వాహనాలు కాలిపోయాయి. సుమారు రూ.5 లక్షల నష్టం వాటిల్లిందని మెకానిక్‌లు చెప్పారు. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసుకొని పలు కోణాల్లో దర్యాప్తు చేస్తున్నారు.

సీఎం కేసీఆర్‌ను కలిసిన
కాంగ్రెస్ ఎమ్మెల్యేలు

నియోజకవర్గాల్లో అభివృద్ధి పనుల కోసం వినతి

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: నియోజకవర్గాల్లో అభివృద్ధి పనులు చేపట్టాలని కోరుతూ పలువురు కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యేలు ముఖ్యమంత్రి కే చంద్రశేఖర్‌రావుకు వినతి పత్రం అందజేశారు. ఆదివారం అసెంబ్లీలోని సీఎం చాంబర్‌లో కేసీఆర్‌ను ఎమ్మెల్యేలు కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి, చిరుమర్తి లింగయ్య, హరివర్ధన్‌రెడ్డి కలిశారు. వచ్చే నెల 12న జరిగే నకిరేకల్ నియోజకవర్గంలోని చెరువుగట్టు బ్రహ్మోత్సవాలకు హాజరుకావాలని ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య ముఖ్యమంత్రిని ఆహ్వానించారు. అలాగే నార్కట్‌పల్లి-అద్దంకి హైవే సర్వీస్‌రోడ్డును పూర్తిచేయాలని కోరారు. మునుగోడులో పలు అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టాలని రాజగోపాల్‌రెడ్డి, సోమశిల సిద్దేశ్వరం ఆలయ బ్రిడ్జిని చేపట్టాలని కొల్లాపూర్ ఎమ్మెల్యే హర్షవర్ధన్‌రెడ్డి విజ్ఞప్తి చేశారు.



సీఎం కేసీఆర్‌కు వినతిపత్రం అందజేస్తున్న కాంగ్రెస్ ఎమ్మెల్యేలు రాజగోపాల్‌రెడ్డి, హర్షవర్ధన్‌రెడ్డి, చిరుమర్తి లింగయ్య



ఆదివారం తన పుట్టినరోజు సందర్భంగా అసెంబ్లీలో సీఎం కేసీఆర్ ఆశీర్వాదం తీసుకుంటున్న ఎమ్మెల్యే నరేందర్‌రెడ్డి

వరంగల్ మేయర్ ఎన్నికపై అభిప్రాయ సేకరణ

- ఎమ్మెల్యేలతో మాట్లాడిన టీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: వరంగల్ మేయర్ ఎన్నికపై టీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కే తారకరామారావు దృష్టిపెట్టారు. ఆదివారం టీఆర్‌ఎస్‌ఎల్పీ కార్యాలయంలో గ్రేటర్ వరంగల్ పరిధిలోని స్టేషన్‌ఘన్‌పూర్, పరకాల ఎమ్మెల్యేలు టీ రాజయ్య, చల్లా ధర్మారెడ్డి అభిప్రాయాలను తెలుసుకున్నారు. వీరితోపాటు మేయర్ స్థానాన్ని ఆశిస్తున్న కార్పొరేటర్, తనకోడలు అశ్రితారెడ్డితో కలిసి ఉమెన్స్ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్‌పర్సన్ గుండు సుధారాణి.. కేటీఆర్‌ను కలిశారు. పార్టీ ముఖ్యుల అభిప్రాయాలను తీసుకొని మేయర్ ఎంపికపై సీఎం కేసీఆర్‌కు నివేదించనున్నట్టు సమాచారం. ఇప్పటివరకు మేయర్‌గా ఉన్న నన్నపనేని నరేందర్ వరంగల్ ఈస్ట్ శాసనసభ్యుడిగా ఎన్నికకావడంతో మేయర్ పదవికి రాజీనామా చేశారు. కేటీఆర్‌ను కలిసినవారిలో మాజీమంత్రి జగదీశ్‌రెడ్డి, రామగుండం, ధర్మపురి, పెద్దపల్లి, చెన్నూరు, వనపర్తి ఎమ్మెల్యేలు కోరుకంటి చందర్, కొప్పుల ఈశ్వర్, దాసరి మనోహర్‌రెడ్డి, బాల్కసుమన్, సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డితోపాటు ఖమ్మం ఎంపీ పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి తదితరులున్నారు. రామగుండం ఎమ్మెల్యే చందర్ రూపొందించిన క్యాలెండర్‌ను ఈ సందర్భంగా కేటీఆర్ ఆవిష్కరించారు.



దుండిగల్‌లోని ఏరోనాటికల్ కళాశాలలో ఆందోళన చేస్తున్న అభ్యర్థులు

ఆర్పీఎఫ్ పరీక్షలో గందరగోళం

- అభ్యర్థుల ఆందోళనతో పరీక్ష రద్దు
- త్వరలో మళ్లీ నిర్వహణ

దుండిగల్, నమస్తే తెలంగాణ: ఆర్పీఎఫ్, ఎన్‌ఎస్‌ఈఐటీ నిర్వాహణ లోపం కారణంగా ఆర్పీఎఫ్ పరీక్షల్లో గందరగోళం నెలకొంది. ఫలితంగా సమయం మించిపోవడంతో అభ్యర్థులు ఆందోళనకు దిగి, న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. అభ్యర్థుల ప్రశ్నలకు సమాధానం చెప్పలేని నిర్వాహకులు తాత్కాలికంగా పరీక్షను రద్దుచేశారు. తిరిగి పరీక్ష నిర్వహించే తేదీలను రెండుమూడురోజుల్లో ప్రకటిస్తామని చెప్పారు. దీంతో పరీక్ష రాసేందుకు వచ్చినవారంతా నిరాశగా వెనుదిరిగారు. ఆర్పీఎఫ్ (రైల్వే ప్రొటెక్షన్ ఫోర్స్) కానిస్టేబుళ్ల నియామకానికి ఎన్‌ఎస్‌ఈఐటీ సంస్థ అదివారం దేశవ్యాప్తంగా ఆన్‌లైన్ పరీక్షను నిర్వహించింది. నగరశివారు కుత్బుల్లాపూర్ నియోజకవర్గం, దుండిగల్ గ్రామపరిధిలోని ఏరోనాటికల్ కళాశాలలో పరీక్ష కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. 800 మంది చొప్పున మూడు విడతలల్లో 2,400 మంది పరీక్షలు రాయాల్సి ఉంది. దీంతో అభ్యర్థులు ఉదయాన్నే కళాశాల వద్దకు చేరుకున్నారు. మొదటివిడుతలో 9.30 గంటలకు పరీక్షకు అనుమతించేందుకు గంటముందుగా బయోమెట్రిక్ పద్ధతిని వాడారు. పరీక్ష సమయానికి కేవలం130 మంది బయోమెట్రిక్ పూర్తిచేసుకొని పరీక్ష హల్‌లోకి వెళ్లగా, సమయం దాటిపోయిందంటూ మిగతా వారిని వెనక్కి పంపారు. అభ్యర్థులు అధికారులతో వాగ్వాదానికి దిగగా సర్దిచెప్పే ప్రయత్నం చేసేలోపే రెండు, మూడో విడుతలో పరీక్ష రాసే అభ్యర్థులు అక్కడికి చేరుకొని ఆందోళనకు దిగారు. అదే సమయంలో ఎన్‌ఎస్‌ఈఐటీ సర్వర్‌లు సైతం పనిచేయకపోవడంతో పాటు పరీక్ష రాసే సమయంలో వివిధ బ్రౌజర్లు ఓపెన్ అవడంతో పరిస్థితి మరింత గందరగోళంగా మారింది. అభ్యర్థులు ఆన్‌లైన్ విధానం అంటే ఇదేనా అని ప్రశ్నించడంతో చేసేదేమీలేక అధికారులు పరీక్షను తాత్కాలికంగా రద్దు చేస్తున్నట్లు ప్రకటించారు. పరీక్ష తేదీలను రెండుమూడురోజుల్లో ప్రకటిస్తామని చెప్పారు.

సర్వర్లు పనిచేయక.. బయోమెట్రిక్ విధానంతో జాప్యం

ఆర్పీఎఫ్ పరీక్ష నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేశామని, విడుతకు వేయి చొప్పున 3 వేల కంప్యూటర్లను అందుబాటులో ఉంచామని ఏరోనాటికల్ కళాశాల యాజమాన్యం తెలిపింది. ఎన్‌ఎస్‌ఈఐటీ సంస్థ సర్వర్లు సరిగా పనిచేయకపోవడంతోపాటు బయోమెట్రిక్ విధానంతో కాలయాపన జరిగింది తప్ప తమ పొరపాటు లేదని పేర్కొంది.

ఏపీ బీజేపీ ఎమ్మెల్యే రాజీనామా

- పార్టీ సభ్యత్వాన్నీ త్యజించిన ఆకుల సత్యనారాయణ

అమరావతి: ఏపీలో బీజేపీకి భారీ షాక్. ఆ పార్టీకి ఉన్న నలుగురు ఎమ్మెల్యేల్లో ఒకరు ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేసి, పార్టీని వీడారు. రాజమహేంద్రవరం నగర బీజేపీ ఎమ్మెల్యే ఆకుల సత్యనారాయణ ఆదివారం శాసనసభ్యత్వానికి రాజీనామా చేశారు. రాజీనామా లేఖను స్పీకర్ కోడెల శివప్రసాద్‌కు అందజేశారు. భాజపా ప్రాథమిక సభ్యత్వాన్ని సైతం త్యజించి, ఈ మేరకు పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు కన్నా లక్ష్మీనారాయణకు ఫ్యాక్స్ ద్వారా రాజీనామా లేఖ పంపించారు. రాష్ట్ర విభజన తర్వాత కేంద్రం ఏపీకి అన్యాయం చేసిందని.. కొంతకాలంగా ఆయన పార్టీ కార్యక్రమాలకు దూరంగా ఉంటున్నారు. ఆకుల సత్యనారాయణ కుటుంబసభ్యులతో కలిసి సోమవారం పవన్‌కల్యాణ్ జనసేన పార్టీలో చేరనున్నట్టు తెలిసింది.

మళ్లీ వణికిస్తున్న చలి

- రాష్ట్రంలో పడిపోయిన ఉష్ణోగ్రతలు
- సిద్దిపేట జిల్లాలో కనిష్ఠంగా 8.3 డిగ్రీలు
- హైదరాబాద్‌లో 13.3గా నమోదు

హైదరాబాద్ సిటీబ్యూరో, నమస్తే తెలంగాణ: ఉత్తర, ఈశాన్య దిశనుంచి వీస్తున్న శీతలగాలుల ప్రభావంతో రాష్ట్రం మళ్లీ వణుకుతున్నది. నిన్నటివరకు కొంత ఉపశమనం కలిగించిన ఉష్ణోగ్రతలు ఆదివారం ఒక్కసారిగా పడిపోయాయి. దీంతో చాలా జిల్లాల్లో కనిష్ఠ ఉష్ణోగ్రతలు సాధారణం కంటే 2 నుంచి 9 డిగ్రీల మేర తక్కువగా నమోదయ్యాయి. కనిష్ఠంగా సిద్దిపేట జిల్లాలో 8.3 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదవగా, సంగారెడ్డిలో 8.5, మెదక్ 9గా రికార్డయింది. హైదరాబాద్‌లో రాత్రి ఉష్ణోగ్రత సాధారణంకంటే 3.7 డిగ్రీలు పడిపోయి 13.3 డిగ్రీలుగా నమోదైనట్టు హైదరాబాద్ వాతావరణ కేంద్రం అధికారులు వెల్లడించారు. పగటి ఉష్ణోగ్రత సాధారణంకంటే 1.6 డిగ్రీలు తగ్గి 29.4గా రికార్డయినట్టు తెలిపారు. రానున్న రెండు మూడురోజుల్లో ఉష్ణోగ్రతలు మరింత పడిపోయి చలితీవ్రత పెరిగే అవకాశమున్నట్టు అధికారులు వివరించారు.

చలికాలం

జిల్లా	కనిష్ఠం	గరిష్ఠం
సిద్దిపేట	8.3	34.6
సంగారెడ్డి	8.5	34.8
మెదక్	9.0	34.6
మంచిర్యాల	9.2	31.5
ఆసిఫాబాద్	9.2	31.5
ఆదిలాబాద్	9.2	31.5
నాగర్‌కర్నూల్	10.0	34.9
వికారాబాద్	10.4	30.0
మహబూబ్‌నగర్	10.4	34.9
యాదాద్రి	10.8	34.7
జనగామ	11.5	33.4
పెద్దపల్లి	11.8	31.4
వరంగల్ రూరల్	12.0	30.0
వరంగల్ అర్బన్	13.0	29.0
కామారెడ్డి	13.0	29.0
నిర్మల్	13.0	32.0
హైదరాబాద్	13.3	29.4
మేడ్చల్‌మల్కాజిగిరి	13.3	29.4
మహబూబాబాద్	13.5	34.6
జోగుళాంబ గద్వాల	13.6	36.4
సూర్యాపేట	14.0	30.0
రంగారెడ్డి	14.0	31.0
జగిత్యాల	14.0	34.0
వనపర్తి	14.1	35.8
నిజామాబాద్	15.1	30.9
జయశంకర్	16.0	31.0
భద్రాద్రి కొత్తగూడెం	16.0	32.0
కరీంనగర్	16.9	36.8
రాజన్న సిరిసిల్ల	17.0	32.0
ఖమ్మం	17.0	32.0
నల్లగొండ	18.4	31.0

కంపా నిధులు పెంచండి

- అర్బన్‌పార్కులకు రూ.100 కోట్లు విడుదలచేయండి
- నిధుల విడుదలలో తెలంగాణకు వెసులుబాటు కల్పించండి
- కేంద్ర అటవీ, పర్యావరణ డీజీకి అధికారుల నివేదన
- రాష్ట్రంలో ముగిసిన డైరెక్టర్ జనరల్ పర్యటన

ప్రత్యేక ప్రతినిధి, నమస్తే తెలంగాణ: కంపెన్సేటరీ ఎఫారెస్టేషన్ ఫండ్ మేనేజ్‌మెంట్ అండ్ ప్లానింగ్ అథారిటీ (కంపా) నిధుల విడుదలలో తెలంగాణ రాష్ట్రానికి ప్రత్యేక వెసులుబాటు కల్పించాలని, 20 శాతం నిధులు విడుదలచేయాలని రాష్ట్ర అటవీ శాఖ అధిపతి, పీసీసీఎఫ్ ప్రశాంత్‌కుమార్ ఝా కేంద్ర అటవీ, పర్యావరణ మంత్రిత్వశాఖ డైరెక్టర్ జనరల్ సిద్ధాంత్‌దాస్‌ను కోరారు. పర్యావరణ పరిరక్షణ కోసం అర్బన్ పార్కుల నిర్మాణానికి రూ.100 కోట్లు మంజూరుచేయాలని అభ్యర్థించారు. ఈ మేరకు పీసీసీఎఫ్ కేంద్రానికి ఒక నివేదిక సమర్పించారు. కేంద్ర అటవీ, పర్యావరణ మంత్రిత్వశాఖ డైరెక్టర్ జనరల్ సిద్ధాంత్‌దాస్ శని, ఆదివారాల్లో రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల్లో పర్యటించి అడవుల అభివృద్ధికి, అర్బన్‌పార్కుల ఏర్పాటుకు, పర్యావరణ పరిరక్షణకు తీసుకుంటున్న చర్యలను పరిశీలించారు. మహబూబ్‌నగర్, గజ్వేల్ తదితర ప్రాంతాల్లో క్షేత్రస్థాయిలో పర్యటించి వివరాలను తెలుసుకున్నారు. మహబూబ్‌నగర్ శివారులో రెయిన్ ఫారెస్ట్‌ను తలపించేలా వినూత్నంగా నిర్మించిన అర్బన్‌పార్కు, గజ్వేల్ కోమటిబండలో తెలంగాణకు హరితహారంలో భాగంగా పరుచుకున్న పచ్చదనాన్ని చూసి పూర్తి సంతృప్తిని వ్యక్తంచేశారు. గజ్వేల్ నియోజకవర్గంలో అడవుల పునరుజ్జీవన పథకం సమర్థంగా అమలుచేస్తున్నారని అధికారులను ప్రశంసించారు. రాష్ట్రంలో పర్యావరణ పరిరక్షణకు గతంలో ఎన్నడూ లేని విధంగా ప్రస్తుత ప్రభుత్వం చేపడుతున్న పలు కార్యక్రమాలను పీసీసీఎఫ్ డైరెక్టర్ జనరల్‌కు వివరించారు. కేంద్ర ప్రభుత్వం విడుదలచేసిన కంపా నిధులను ఎప్పటికప్పుడు వినియోగించుకుని ప్రత్యామ్నాయ అడవులను సృష్టించడంలో తెలంగాణ ప్రభుత్వం ముందుందని ముఖ్యమంత్రి కార్యాలయంలో ఓఎస్డీ ప్రియాంక వర్గీస్ వివరించారు.

కంపా నిబంధనల నుంచి వెసులుబాటు కావాలి

నిధుల వినియోగంలో రాష్ట్రం రికార్డు సాధించినందున తెలంగాణకు 20 శాతం నిధులు ఇవ్వాలని డీజీ సిద్ధాంత్‌దాస్‌ను కోరారు. కంపా కింద తాము లక్ష్యానికి మించి పనులు చేపడుతున్నామని, కాళేశ్వరం ప్రాజెక్ట్ కింద పెద్దఎత్తున ప్లాంటేషన్ చేపట్టడం, అర్బన్ పార్కుల ఏర్పాటు కారణాల వల్ల తమకు అదనంగా మరో రూ. 370 కోట్లు విడుదలచేయాలని తాము ఇప్పటికే నివేదించిన విషయాన్ని ఆయన దృష్టికి తీసుకొచ్చారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ 2009 నుంచి 2017-18 వరకు కంపా కింద రాష్ట్రానికి 662.37 కోట్లు విడుదల కాగా, అందులో ఇప్పటివరకు 645.36 కోట్ల వరకు ఖర్చయ్యాయని, ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో 60 శాతం దాటని నిధుల వినియోగం తెలంగాణలో 98 శాతాన్ని దాటాయని పేర్కొన్నారు.

అర్బన్‌పార్కుల నిధులపై త్వరలో నిర్ణయం తీసుకుంటాం: డీజీ

దేశంలో ఎక్కడా ఇంత పెద్దస్థాయిలో నిధులను వినియోగించిన రాష్ట్రం లేదని, ఆ ఘనతను సాధించినది తమదే కాబట్టి నిబంధనలను సడలించి కొంత అదనపు నిధులను మంజూరు చేయాలని పీసీసీఎఫ్ ఝా డీజీ సిద్ధాంత్‌దాస్‌ను కోరారు. కానీ, కంపా నిధుల విషయంలో సుప్రీంకోర్టు 10శాతం కంటే ఎక్కువనిధులను ఇవ్వడానికి వీలులేదని తీర్పు ఇచ్చినందున ఇప్పటికిప్పుడు అది సాధ్యం కాకపోవచ్చని ఈ విషయాన్ని కేంద్రప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి వీలైనంత వరకు సహకారం అందిస్తామని సిద్ధాంత్‌దాస్ అధికారులకు చెప్పారు.

మెదక్ ఎంపీ టికెట్ అడుగుతా

- కేసీఆర్ చండీయాగంతో ప్రజలకు మేలు జరుగొచ్చు
- రాజగోపాల్‌రెడ్డికి ఆయన కోపమే శత్రువుగా మారుతుంది
- ఉత్తమ్‌పై వ్యాఖ్యలు సర్వే సత్యనారాయణ వ్యక్తిగతం
- మీడియాతో చిట్‌చాట్‌లో కాంగ్రెస్ ఎమ్మెల్యే జగ్గారెడ్డి



హైదరాబాద్, నమస్తే తెలంగాణ: మెదక్ ఎంపీ టికెట్‌ను తన భార్యకు ఇవ్వాలని పార్టీ అధిష్ఠానాన్ని అడుగుతానని.. విజయశాంతి పోటీచేస్తానంటే మాత్రం తప్పుకొంటామని కాంగ్రెస్ ఎమ్మెల్యే జగ్గారెడ్డి అన్నారు. ఆదివారం సీఎల్పీ కార్యాలయంలో మీడియాతో ఆయన చిట్‌చాట్‌గా మాట్లాడారు. సరైనవ్యక్తికి టికెట్ ఇస్తే మెదక్‌లో కాంగ్రెస్ గెలిచే అవకాశాలున్నాయని తెలిపారు. సీఎం కేసీఆర్ చేసే చండీయాగం ఆయన వ్యక్తిగతమని, ఈ యాగంవల్ల ప్రజలకు, రాష్ట్రానికి మేలు జరుగవచ్చునని అభిప్రాయపడ్డారు. కేసీఆర్ సంక్షేమ పథకాల అమలుతీరును నమ్మిన ప్రజలు రెండోసారి గెలిపించారని చెప్పారు. కాంగ్రెస్‌లో ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి అత్యంత కోపిష్టి అని, ఆయన కోపమే ఆయనకు శత్రువుగా మారుతుందని చెప్పారు. రాజకీయాల్లో ఎంతో సహనం, ఓపిక ఉండాలని.. కోపాన్ని తగ్గించుకుంటే రాజగోపాల్‌రెడ్డి రాజకీయాల్లో మరింత ముందుకు సాగుతారని అన్నారు. ఉత్తమ్‌కుమార్‌రెడ్డిపై కేంద్ర మాజీ మంత్రి సర్వే సత్యనారాయణ చేసిన వ్యాఖ్యలు ఆయన వ్యక్తిగతమని అన్నారు. ముఖ్యమంత్రి కేసీఆర్.. భట్టి విక్రమార్కకు ఇచ్చే ప్రాధాన్యం ఉత్తమ్‌కుమార్‌రెడ్డికి ఇవ్వకపోవచ్చని చెప్పారు.

13 ఏండ్ల తరువాత సీఎం కేసీఆర్‌తో మాట్లాడా..

ముఖ్యమంత్రి కేసీఆర్‌తో పదమూడేండ్ల తరువాత మాట్లాడానని సంగారెడ్డి ఎమ్మెల్యే జగ్గారెడ్డి చెప్పారు. నియోజకవర్గానికి మెడికల్ కళాశాల మంజూరు చేసిన సీఎంకు కృతజ్ఞతలు తెలుపుతున్నానని, కళాశాల మంజూరు జీవో రాగానే కేసీఆర్‌ను వ్యక్తిగతంగా కలిసి సంగారెడ్డికి ఆహ్వానిస్తానని తెలిపారు. తాను తొలిసారి టీఆర్‌ఎస్ నుంచే ఎమ్మెల్యేగా ఎన్నికయ్యానని గుర్తుచేసుకున్నారు.

అందరి ఆశీస్సులతోనే.. : సీఎల్పీనేత భట్టి విక్రమార్క

పార్టీలో పెద్దలందరి ఆశీస్సులు, ఆమోదంతోనే సీఎల్పీ నేతగా ఎంపికయ్యానని కాంగ్రెస్ ఎమ్మెల్యే భట్టివిక్రమార్క అన్నారు. ఆదివారం సీఎల్పీ కార్యాలయంలో మీడియాతో మాట్లాడుతూ.. పీసీసీ అధ్యక్షుడు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, పార్టీ సీనియర్‌నేత జానారెడ్డి ఆశీస్సులతో ప్రభుత్వంపై నిర్మాణాత్మకంగా పోరాటం చేస్తామని చెప్పారు.

గని కార్మికుల భద్రతపై దృష్టిపెట్టండి

- పరిశ్రమలశాఖ ముఖ్యకార్యదర్శి జయేశ్‌రంజన్

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: గనుల తవ్వకాలతోపాటు గని కార్మికుల భద్రతపైనా దృష్టిపెట్టాలని పరిశ్రమలశాఖ ముఖ్యకార్యదర్శి జయేశ్‌రంజన్ అన్నారు. దేశ ఆదాయానికి గనులు, ఖనిజాలు అత్యంత కీలకమైనవే అయినా భద్రత అంశాలపై సంస్థలు శ్రద్ధచూపాలని సూచించారు. ఆదివారం ఎంసీఆర్‌హెచ్చార్డీలో మైనింగ్ ఇంజినీర్స్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా, తెలంగాణ ప్రభుత్వం, కేంద్ర కార్మిక మంత్రిత్వశాఖ, గనుల భద్రత డైరెక్టర్ జనరల్ ఆధ్వర్యంలో గనుల భద్రత నిర్వహణ, స్థిరమైన ఖనిజాభివృద్ధి అంశంపై నిర్వహించిన జాతీయ స్థాయి సదస్సులో జయేశ్‌రంజన్ మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం గనుల తవ్వకాల్లో కార్మికుల భద్రతకు చర్యలు తీసుకుంటున్నదని, మైనింగ్ పాలసీలోనూ భద్రతను ప్రముఖంగా పేర్కొన్నామని చెప్పారు. రాష్ట్ర గనులశాఖ డైరెక్టర్, మైనింగ్ ఇంజినీర్స్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా హైదరాబాద్ చాప్టర్ చైర్మన్ బీఆర్వీ సుశీల్‌కుమార్ మాట్లాడుతూ గనుల తవ్వకాలు జరిగే ప్రాంతాల్లో ప్రత్యేక భద్రతా చర్యలు తీసుకోవాలన్నారు. ఈ సందర్భంగా టెక్నికల్ సెషన్స్‌లో పలుఅంశాలపై చర్చించారు. మైనింగ్ భద్రతపై ప్రభుత్వం, ప్రైవేటు సంస్థలు పాటించాల్సిన అంశాలను సిఫార్సు చేశారు. సదస్సును ఉద్దేశించి కేంద్ర గనుల భద్రత డైరెక్టర్ జనరల్ పీకే సర్కార్ పంపించిన సందేశాన్ని డీజీఎంఎస్ డైరెక్టర్ ఎం నర్సయ్య చదివి వినిపించారు. ఈ కార్యక్రమంలో టీఎస్‌ఎండీసీ ఎండీ మల్సూరు, గనులశాఖ మాజీ డైరెక్టర్ వీడీ రాజగోపాల్, ఎన్‌ఐఆర్‌ఎం డైరెక్టర్ హెచ్‌ఎస్ వెంకటేశ్, గనుల భద్రత రిటైర్డ్ డైరెక్టర్ లక్ష్మీనారాయణ, మైనింగ్ ఇంజినీర్స్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా అధ్యక్షుడు ఏకే కొటారి, గనుల భద్రత డైరెక్టర్ ఎం నర్సయ్య తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ ఉద్యోగుల విభజనకు ఏపీ అడ్డుకట్ట

- ముల్కీరూల్స్ అమలుచేయని ఏపీ సర్కార్
- తెలంగాణ విద్యుత్ ఉద్యోగుల అసోసియేషన్ మండిపాటు



మీడియాతో మాట్లాడుతున్న తెలంగాణ విద్యుత్ ఇంజినీర్ల అసోసియేషన్ అధ్యక్షుడు శివాజీ, విద్యుత్ అకౌంట్స్ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు అశోక్

హైదరాబాద్, నమస్తే తెలంగాణ/ఖైరతాబాద్: రాష్ట్రం విడిపోయినా, సంస్థలువిడిపోయినా, ఆంధ్ర ప్రాంత ఇంజినీర్లు ఇంకా ఇక్కడే ఉంటున్నారని, ఏపీ ప్రభుత్వం ఉద్యోగుల విభజన జరుగకుండా చూస్తున్నదని తెలంగాణ విద్యుత్ ఇంజినీర్ల అసోసియేషన్ అధ్యక్షుడు శివాజీ, విద్యుత్ అకౌంట్స్ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు అశోక్ మండిపడ్డారు. 370 డీ ఆర్టికల్‌ను అడ్డంపెట్టుకొని అన్యాయంగా చొరబడిన ఏపీ ఉద్యోగులను ప్రభుత్వం వెంటనే రిలీవ్‌చేయాలని కోరారు. విద్యుత్ ఉద్యోగుల అసోసియేషన్ల ఆధ్వర్యంలో ఏపీ సర్కార్ తీరును ఖండించారు. ఆదివారం మింట్ కాంపౌండ్‌లో వారు మీడియాతో మాట్లాడుతూ 1,157 మంది ఇంజినీర్లను వారి ప్రాంతానికి పంపాలని సుప్రీంకోర్టులో వాదిస్తున్నట్టు చెప్పారు. 1,150 మంది అధికారుల్లో చాలామంది ఏపీకి వెళ్లేందుకు సిద్ధంగా ఉన్నారని, కానీ, ఏపీ ప్రభుత్వం ముల్కీరూల్స్‌ను ఏమాత్రం అమలుచేయడం లేదని విమర్శించారు. ఆప్షన్ల పేరుతో బలవంతంగా ఆంధ్ర ప్రాంత ఉద్యోగులను ఇక్కడ చొప్పించేందుకు ఆంధ్ర ప్రభుత్వం కుట్ర చేస్తున్నదని ఆరోపించారు.

స్టార్టప్‌లకు అండగా నిలుస్తాం

- తెలంగాణ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ అసోసియేషన్ నూతన కమిటీ

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: రాబోయే మూడేండ్ల కాలంలో స్టార్టప్‌లకు ప్రోత్సాహం ఇచ్చేందుకు కృషిచేస్తామని తెలంగాణ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ అసోసియేషన్ (టీటా) నూతన కమిటీ ప్రకటించింది. ఇప్పటివరకు గ్రామీణ ప్రాంతాల్లో సాంకేతిక అక్షరాస్యతకు చేసిన కృషికి కొనసాగింపుగా ఈ కార్యాచరణ చేపట్టనున్నట్లు తెలిపింది. ఆదివారం టీటా నూతన కమిటీ తెలంగాణ జలవనరుల అభివృద్ధి సంస్థ చైర్మన్ వీ ప్రకాశ్ సమక్షంలో ప్రమాణస్వీకారం చేసింది. టీటా గ్లోబల్ ప్రెసిడెంట్ సందీప్‌కుమార్ మక్తాల మాట్లాడుతూ స్టార్టప్‌లను ప్రోత్సహించేందుకు చర్యలు తీసుకోవడంతోపాటు విదేశాల్లో తెలంగాణ ఐటీ కాంగ్రెస్ నిర్వహించేందుకు ఎన్నారైలతో చర్చలు జరుపుతున్నట్టు తెలిపారు.

మరింత ఆయుధ సంపత్తి అవసరం

- సాంకేతికంగా ముందడుగు వేయాలి
- ఎఫ్‌ఐఎన్‌ఎస్ ముగింపు సదస్సులో ఆర్మీ చీఫ్ జనరల్ బిపిన్‌రావత్

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: సరిహద్దుల్లో ఎప్పుడు ఎలాంటి పరిస్థితినైనా సమర్థవంతంగా ఎదుర్కొనేందుకు సైన్యానికి మరింత అత్యాధునిక ఆయుధ సంపత్తి అవసరమని భారత ఆర్మీ చీఫ్ జనరల్ బిపిన్‌రావత్ అన్నారు. ఇందుకు సాంకేతికంగా ఇంకా ముందడుగు పడాలని అభిప్రాయపడ్డారు. మారుతున్న కాలంలో యుద్ధాల రీతి మారుతున్నదని, భవిష్యత్‌లో సైబర్ యుద్ధాలను ఎదుర్కోక తప్పదని పేర్కొన్నారు. ఆదివారం ఫోరం ఫర్ ఇంటిగ్రేటెడ్ నేషనల్ సెక్యూరిటీ (ఎఫ్‌ఐఎన్‌ఎస్) సంస్థ ఆధ్వర్యంలో హైదరాబాద్‌లో జరుగుతున్న 'దేశ రక్షణరంగంలో స్వావలంబన' సదస్సు ముగింపు కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ.. సరిహద్దు భద్రతలో పెరుగుతున్న సవాళ్లను ఎదుర్కోవడంలో కేవలం డీఆర్డీవో తయారుచేసే ఆయుధాలే దేశ సైన్యం అవసరాలను తీర్చలేవని అభిప్రాయపడ్డారు. ఇందుకు ఈ సదస్సు ఉపయోగపడుతుందని, సైన్యానికి సంబంధించిన అధికారులు, ఈ రంగంలో నిపుణులు, ఆయుధాల తయారీకంపెనీల ప్రతినిధులు ఒక్కచోటకుచేరి రక్షణ అవసరాలపై చర్చించడం ఎంతో ఉపయుక్తమైందని పేర్కొన్నారు. కేవలం జవాన్ల గస్తీతోనే భద్రత, శత్రు కదలికలపై సమాచార సేకరణ సాధ్యంకాదని, మరింత నిఘా కోసం డ్రోన్లు, రిమోట్ పైలెట్ వెహికిల్స్ వంటి పరికరాలు మరింత అందుబాటులోకి రావాలన్నారు. కేంద్రం సైతం 'మేక్‌ఇన్ ఇండియా' ద్వారా ఆయుధాలను మన దేశంలోనే తయారుచేయడంపై దృష్టిపెట్టిందని చెప్పారు. సదస్సులో పలు రంగాల నిపుణులు, భారత సైన్యంలో పనిచేసిన మాజీ అధికారులందరి ఆలోచనలను క్రోడీకరించి రక్షణశాఖకు నివేదిక రూపంలో ఇస్తామని రిటైర్డ్ లెఫ్టినెంట్ జనరల్ డీబీ శేఖత్కర్ చెప్పారు. కార్యక్రమంలో రిటైర్డ్ మేజర్‌జనరల్ ఏబీ గోర్తి పాల్గొన్నారు.

వైసీపీని వీడిన వంగవీటి

విజయవాడ: వైసీపీ నేత, మాజీ ఎమ్మెల్యే వంగవీటి రాధాకృష్ణ ఆదివారం ఆ పార్టీకి రాజీనామా చేశారు. రాజీనామా లేఖను పార్టీ అధినేత జగన్మోహన్‌రెడ్డికి పంపినట్టు సమాచారం. విజయవాడ సెంట్రల్ సీటుపై హామీ రాకపోవడంతో ఆయన వైసీపీని వీడుతున్నట్టు తెలిసింది. పార్టీ సీనియర్ నేత బొత్స సత్యనారాయణ రంగంలోకి దిగి రాధాకృష్ణను బుజ్జగించినా.. ఆయన శాంతించలేదు. విజయవాడ సెంట్రల్ నుంచి పోటీ చేసేందుకు రాధాకృష్ణ సిద్ధమైన తరుణంలో ఆ నియోజకవర్గం బాధ్యతలను వైసీపీ అధ్యక్షుడు జగన్.. మాజీ ఎమ్మెల్యే మల్లాది విష్ణుకు అప్పగించారు. తీవ్ర అసంతృప్తికి గురయిన రాధాకృష్ణ పార్టీ నిర్ణయంపై గతంలోనూ నిరసన తెలిపారు. రాధాకృష్ణను పార్టీ అధిష్ఠానం మచిలీపట్నం పార్లమెంట్ అభ్యర్థిగా బరిలో నిలుపాలని భావిస్తుండగా, ఆయన మాత్రం సెంట్రల్ టికెట్ కోసం పట్టుబట్టి హామీ రాకపోవడంతో పార్టీ వీడారు.

బ్రిటిష్‌కాలం నాటి చట్టాలతో న్యాయం జరుగదు

- సమూలంగా ప్రక్షాళన చేయాలి
- ప్రభుత్వాలే చట్టాలను సంస్కరించాలి
- అఖిల భారత న్యాయమూర్తుల సంఘం అధ్యక్షుడు రాజేంద్రప్రసాద్ వెల్లడి



మీడియాతో మాట్లాడుతున్న అఖిల భారత న్యాయమూర్తుల సంఘం అధ్యక్షుడు రాజేంద్రప్రసాద్, వసంత్‌కుమార్‌షా

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: బ్రిటిష్‌కాలం నాటి చట్టాలతో న్యాయం జరుగడం అసాధ్యమని అఖిల భారత న్యాయమూర్తుల సంఘాధ్యక్షుడు రాజేంద్రప్రసాద్, వర్కింగ్ ప్రెసిడెంట్ వసంత్‌కుమార్‌షా పేర్కొన్నారు. చట్టాలను ప్రభుత్వాలే సంస్కరించాలని, 1976 నుంచి దేశంలో న్యాయవ్యవస్థ మార్పులు లేకుండా కొనసాగుతున్నదని చెప్పారు. ఆదివారం హైదరాబాద్‌లో న్యాయమూర్తుల కార్యవర్గ సమావేశం అనంతరం వారుమీడియాతో మాట్లాడుతూ న్యాయం ఖరీదైన వ్యవహారంగా మారిపోయిందన్నారు. లోక్‌పాల్ కోసం అన్నాహజారే చేస్తున్నట్టు బలమైన ఉద్యమం రావాల్సిన అవసరం ఉందన్నారు. సుప్రీంకోర్టు ఇచ్చినవే తుది తీర్పులనే భావన పెరుగుతుండటంతో దిగువ కోర్టులపై విశ్వాసం సడలుతున్నదని, జిల్లాస్థాయిలో తుది పరిష్కారం లభించే వ్యవస్థ ఏర్పాటుకావాలని పేర్కొన్నారు. దేశవ్యాప్తంగా ఉన్న 20 వేల మంది జడ్జీలకు న్యాయం జరిగేలా సంఘం కృషి చేస్తుందని చెప్పారు. సెకండ్ నేషనల్ జ్యుడీషియల్ పే కమిషన్ సిఫారసులను అమలు చేయాలన్నారు. సుప్రీంకోర్టు తీర్పు, హైకోర్టు నిర్ణయాల ప్రకారమే విభజన ఉమ్మడి హైకోర్టు విభజన జరిగిందని చెప్పారు.

జడ్జి వరప్రసాద్ విషయమై సీజేను కలుస్తాం

ఉమ్మడి హైకోర్టు విభజనకు ముందు తెలంగాణకు చెందిన జడ్జి వరప్రసాద్‌పై ఏసీబీ దాడులు జరుగడాన్ని న్యాయమూర్తుల అసోసియేషన్ ఖండించింది. తెలంగాణ ఉద్యమంలో ముందుండటంతోనే దాడులు చేయించారని తమ దృష్టికి వచ్చిందని అఖిల భారత న్యాయమూర్తుల సంఘం సభ్యుడొకరు తెలిపారు. ఈ అంశంపై సంఘం తరపున హైకోర్టు ప్రధాన న్యాయమూర్తిని, రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాలను కలుస్తామని తెలిపారు. అవసరమైతే సుప్రీంకోర్టుకు విజ్ఞాపన అందజేస్తామని, జడ్జి వరప్రసాద్‌కు న్యాయం జరిగే వరకు సంఘం అండగా ఉంటుందని తెలిపారు.

విదేశీ విద్యకు ఓవర్సీస్ అండ

మొదటిపేజీ తరువాయి...

అమలుచేస్తున్నది. దరఖాస్తు చేసుకునే విద్యార్థి కుటుంబ వార్షిక ఆదాయం గ్రామీణ ప్రాంతాలవారికి రూ.1.5 లక్షలు, పట్టణ ప్రాంతాలవారికి రూ.2 లక్షలు ఉండాలని నిర్ణయించి.. అర్హులను ఎంపికచేస్తున్నది. అమెరికా, లండన్, ఆస్ట్రేలియా, కెనడా, సింగపూర్ దేశాల్లోని విశ్వవిద్యాలయాల్లో ఉన్నతవిద్యను అభ్యసించేందుకు ఆర్థికసాయం అందిస్తున్నది. విదేశాల్లో ఉన్నతవిద్యను అభ్యసిస్తున్న విద్యార్థుల పరిస్థితులను రాష్ట్ర ప్రభుత్వం ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తున్నది. తాజాగా ఎస్సీ అభివృద్ధిశాఖ అధికారులు అంబేద్కర్ ఓవర్సీస్ విద్యానిధి పథకం కింద ఎస్సీ విద్యార్థులకు గత శుక్రవారం ఇంటర్వ్యూలు నిర్వహించి 42 మందిని ఎంపికచేశారు. వీరికి త్వరలోనే ఆర్థికసాయం అందించనున్నారు.

8,558 నామినేషన్లు తిరస్కరణ

మూడోవిడుతలో 1,11,066 నామినేషన్లు

రేపు ఉపసంహరణ, తుదిజాబితా

10 పంచాయతీలు, 184 వార్డుల్లో ఎన్నికలకు బ్రేక్

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: పంచాయతీ ఎన్నికల్లో భాగంగా మూడోవిడుతలో 8,558 నామినేషన్లను తిరస్కరణకు గురయ్యాయి. నామినేషన్ల ప్రక్రియలో భాగంగా శనివారం రాత్రివరకు నామినేషన్లను పరిశీలించారు. ఈ సందర్భంగా సంతకాలు సరిగా చేయకపోవడం, పత్రాలు సమర్పించకపోవడం, ప్రతిపాదకుల వివరాలు లేకపోవడం వంటి కారణాలతో పలు నామినేషన్లను తిరస్కరించారు. మొత్తం అర్హత సాధించిన నామినేషన్లు 1,11,066 ఉన్నట్టు ఎన్నికల అధికారులు లెక్కతేల్చారు. రిజర్వేషన్ల కారణంగా మూడోవిడుతలో 10 పంచాయతీలు, 184 వార్డుల్లో ఎన్నికలు నిర్వహించడంలేదు. రిజర్వ్‌చేసిన సామాజికవర్గాల ఓటర్లు ఆయా గ్రామాల్లో లేకపోవడంతో నామినేషన్లు దాఖలుకాలేదు. మంచిర్యాల జిల్లాలో 3 పంచాయతీలు, నిజామాబాద్ 2, రాజన్న సిరిసిల్ల, జనగామ, యాదాద్రి భువనగిరి, కామారెడ్డి, కుమ్రంభీం ఆసిఫాబాద్ జిల్లాల్లో ఒక్కొక్కటి చొప్పున గ్రామ పంచాయతీలకు ఎన్నికలు జరుగడంలేదు. దీంతో మూడోవిడుతలో 4,116 పంచాయతీలకు 4,106 గ్రామాలకు ఎన్నికలు జరుగనున్నాయి. నామినేషన్ల తిరస్కరణ తర్వాత 4,106 సర్పంచ్‌స్థానాలకు 21,272 నామినేషన్లు ఉన్నాయి. మొత్తం 36,728 వార్డులకు 184 వార్డుల్లో నామినేషన్లు దాఖలుకాలేదు. దీంతో 36,462 వార్డులకు ఎన్నికలు జరుగనుండగా, ఈ స్థానాలకు 89,974 నామినేషన్లు దాఖలయ్యాయి. సర్పంచ్‌స్థానాల్లో 4,834 నామినేషన్లు, వార్డుస్థానాల్లో 3,724 నామినేషన్లను తిరస్కరణకుగురయ్యాయి. ఆదివారం అభ్యంతరాలను స్వీకరించారు. సోమవారం ఈ అభ్యంతరాలను పరిష్కరించనున్నారు. మంగళవారం నామినేషన్ల ఉపసంహరణకు అవకాశం కల్పిస్తారు. మధ్యాహ్నం 3 గంటల తర్వాత బరిలో నిలిచే అభ్యర్థులకు గుర్తులు కేటాయించి తుదిజాబితా విడుదల చేయనున్నారు.



పంచాయతీ ఎన్నికల నిర్వహణ కోసం ఆదివారం జనగామ నుంచి ఎన్నికల సామగ్రి పట్టుకుని పోలింగ్ కేంద్రానికి బయలుదేరిన సిబ్బంది

ఓటెత్తనున్న పల్లెలు

3,701 పంచాయతీల్లో నేడు తొలివిడుత పోలింగ్

మధ్యాహ్నం ఒంటిగంటవరకే ఓటింగ్ ▪ ఆ తర్వాత ఓట్ల లెక్కింపు.. ఉప సర్పంచ్ ఎన్నిక కూడా

ఏర్పాట్లు పూర్తిచేసిన రాష్ట్ర ఎన్నికల సంఘం

హైదరాబాద్, నమస్తే తెలంగాణ:

పంచాయతీ ఎన్నికల్లో భాగంగా తొలివిడుత పోలింగ్ సోమవారం జరుగునున్నది. గ్రామ పంచాయతీ ఎన్నికలకోసం గతేడాది ఆగస్టునుంచి ఎదురుచూస్తున్న పల్లెవాసులు సోమవారం ఓటువేసి తమ గ్రామ మొదటి పౌరున్ని ఎన్నుకోనున్నారు. పోలింగ్‌కు రాష్ట్ర ఎన్నికల సంఘం ఏర్పాట్లు పూర్తిచేసింది. తొలివిడుతలో 4,479 గ్రామాల్లో ఎన్నికలు జరుగాల్సి ఉండగా, రిజర్వేషన్లు కలిసిరాకపోవడం, కోర్టు కేసుల నేపథ్యంలో తొమ్మిది గ్రామాలకు ఎన్నికలు నిర్వహించడంలేదు. ఈ విడుతలో 769 పంచాయతీలు ఏకగ్రీవమయ్యాయి. దీంతో 3,701 గ్రామాల్లో ఎన్నికలు నిర్వహిస్తుండగా, 12,202 మంది సర్పంచ్ అభ్యర్థులు బరిలో నిలిచారు. 39,822 వార్డుస్థానాలకు ఎన్నికలు జరుగాల్సి ఉండగా, కోర్టు కేసులు, రిజర్వేషన్లు అనుకూలంగా లేకపోవడంతో 192 వార్డుల్లో ఎన్నికలు వాయిదా పడ్డాయి. 10,654 వార్డులు ఏకగ్రీవమయ్యాయి. ప్రస్తుతం 28,976 వార్డులకు పోలింగ్ జరుగుతుండగా, 70,094 మంది పోటీ పడుతున్నారు.

ఉదయం 7 గంటలనుంచే పోలింగ్

3,701 గ్రామాల్లో సోమవారం ఉదయం 7 గంటలనుంచే పోలింగ్ మొదలుకానున్నది. మధ్యాహ్నం ఒంటిగంటవరకే పోలింగ్ నిర్వహిస్తారు. మధ్యాహ్నం 2 గంటలనుంచి ఓట్ల లెక్కింపు ప్రారంభిస్తారు. ముందుగా వార్డుస్థానాలు, తర్వాత సర్పంచ్‌స్థానాల ఓట్లను లెక్కిస్తారు. లెక్కింపు తర్వాత ఉప సర్పంచ్ ఎన్నికకు అధికారులు నోటిఫికేషన్ జారీచేస్తారు. ఆయా గ్రామపంచాయతీ కార్యాలయాలు లేదా పోలింగ్ కేంద్రాల శివారు ప్రాంతాల్లోని కార్యాలయాల్లో ఉప సర్పంచ్ ఎన్నిక నిర్వహిస్తారు. చేతులెత్తే పద్ధతిలోనే ఈసారి కూడా ఉప సర్పంచ్‌ను ఎన్నుకుంటారు. తొలివిడుత ఎన్నికల కోసం 1,48,033 మంది పోలింగ్ సిబ్బందిని వినియోగిస్తున్నారు. 26 వేల మంది పోలీసులతో బందోబస్తు నిర్వహిస్తున్నారు.

సామగ్రి సరఫరా

తొలివిడుతలో ఎన్నికలుజరిగే గ్రామాలకు పోలింగ్ సిబ్బంది తరలివెళ్లారు. బ్యాలెట్ పేపర్లు, ఇంక్, బాక్సులు తీసుకెళ్లి బూత్‌లను సిద్ధంచేశారు. ఇటీవల అసెంబ్లీ ఎన్నికల్లో ఓటర్లకు ఎడమ చేయి చూపుడువేలుకు పెట్టిన ఇంక్ చాలావరకు తొలిగిపోనందున, పంచాయతీ ఎన్నికల్లో ఇంక్‌ను ఎడమచేయి మధ్యవేలుకు పెట్టాలని ఆదేశాలిచ్చారు. అన్నిపోలింగ్ కేంద్రాలను సర్కారు బడుల్లోనే ఏర్పాటుచేశారు.



జోగుళాంబ గద్వాల జిల్లా కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయం వద్ద విధుల కేటాయింపు కోసం ఎదురుచూస్తున్న ఎన్నికల సిబ్బంది

బ్యాలెట్ పేపర్‌ను ఇలా మడువాలి

- ఓటేసిన తర్వాత బ్యాలెట్ పేపర్లను సరైన రీతిలో మడిచి బాక్సుల్లో వేయాలని రాష్ట్ర ఎన్నికల సంఘం సూచించింది. ఈ మేరకు పలు సూచనలు జారీ చేసింది. సర్పంచ్ అభ్యర్థి కోసం గులాబీరంగు, వార్డుసభ్యుల కోసం తెలుపురంగు బ్యాలెట్ పేపరు ఇస్తారు. గుర్తుపై ముద్రవేసిన తర్వాత పేపర్‌ను ఎడమ నుంచి కుడికి మూడు మడతలు వచ్చేలా మడువాలి. ఆ తర్వాత పైనుంచి కిందికి మడిచి సర్పంచ్, వార్డుసభ్యుల కోసం వేర్వేరుగా ఏర్పాటుచేసిన బాక్కుల్లో వేయాలి. బ్యాలెట్ పేపర్‌ను ముందుగానే పైనుంచి కిందకు మడువవద్దు. అలా చేస్తే ఒక గుర్తుకు వేసిన ముద్ర మరో గుర్తుపైపడే అవకాశం ఉంటుంది. అలా రెండు గుర్తులపై ముద్ర పడితే చెల్లని ఓటుగా పరిగణిస్తారు.
- బ్యాలెట్‌పై ప్రతిగుర్తు తర్వాత నల్లని గీత ఉంటుంది. దానికి అంటకుండా ముద్రవేయాలి. మధ్య గీతపై ముద్రవేస్తే చెల్లని ఓటుగానే భావిస్తారు. అభ్యర్థులెవ్వరూ నచ్చకుంటే బ్యాలెట్ పేపర్‌లోని చివరిగుర్తు నోటాకు ఓటేయవచ్చు.
- మీ ఓటును మరొకరు వేశారని పోలింగ్ అధికారులు చెప్తే.. మీ దగ్గరున్న ఆధారాలతో ఎన్నికల అధికారులను అడిగి టెండరు ఓటు వేయవచ్చు.
- వికలాంగులు తమవెంట ఒకరిని సహాయకుడిగా తీసుకెళ్లవచ్చు. అంధ ఓటర్లు పోలింగ్ అధికారుల సాయం తీసుకోవచ్చు.
- మద్యం, మత్తుపదార్థాలు తీసుకొని పోలింగ్ బూత్‌లోకి వెళ్లవద్దు. మారణాయుధాలను తీసుకెళ్లకూడదు. బూత్ పరిసరాల్లో గుమిగూడి ఉండరాదు. వాహనాలను పోలింగ్ కేంద్రాలకు 100 మీటర్ల దూరంలో నిలుపాలి. చుట్ట, బీడీ, సిగరెట్‌వంటి పొగాకు ఉత్పత్తులు, అగ్గిపెట్టె, లైటర్ వాటివికూడా పోలింగ్ బూత్‌లోకి తీసుకెళ్లరాదు.

సోపానం

వార్డు సభ్యుడి నుంచి అసెంబ్లీ వరకు..

▪ **నాలుగుసార్లు ఎమ్మెల్యేగా గెలిచిన వేనేపల్లి చందర్‌రావు**



కోదాడ, నమస్తే తెలంగాణ: వార్డు సభ్యుడిగా రాజకీయ ప్రస్థానాన్ని ప్రారంభించిన వేనేపల్లి చందర్‌రావు ఆ తరువాత నాలుగు విడుతలు కోదాడ ఎమ్మెల్యేగా గెలిచి ఘనతను చాటుకున్నారు. సూర్యాపేట జిల్లా అనంతగిరి మండల కేంద్రానికి చెందిన వేనేపల్లి చందర్‌రావు 1970లో అనంతగిరి గ్రామ పంచాయతీలో వార్డు సభ్యుడిగా గెలిచారు. ఆ తర్వాత 1975-79లో అనంతగిరి పీఏసీఎస్ చైర్మన్‌గా, 1979-80లో మార్కెట్ కమిటీ చైర్మన్‌గా పనిచేశారు. 1981-85లో కోదాడ మేజర్ గ్రామ పంచాయతీ సర్పంచ్‌గా కొనసాగారు. 1985, 1989, 1994, 2009లో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో కోదాడ నుంచి ఎమ్మెల్యేగా గెలుపొందారు. నియోజకవర్గ ఓటర్లలో ఒకశాతం సామాజిక వర్గానికి చెందిన వేనేపల్లి చందర్‌రావు నాలుగు విడుతలు ఎమ్మెల్యేగా గెలుపొందడం గమనార్హం. నియోజకవర్గంలోని ముఖ్య నాయకులతోపాటు కార్యకర్తలను భుజంతట్టి, పేరు పెట్టి పలుకరించే చొరవ వేనేపల్లికి ఉన్నది. ప్రతి ఎన్నికల్లోనూ ప్రతికూల పరిస్థితులను సైతం తనకు అనుకూలంగా మల్చుకొని విజయం సాధించారని చెప్పవచ్చు. ఏడుపదుల వయస్సులోనూ ఆయన ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో టీఆర్‌ఎస్ అభ్యర్థి పక్షాన విస్తృత ప్రచారం నిర్వహించి, అభ్యర్థి గెలుపులో ప్రధాన భూమికను పోషించారు.



చిన్నమునిగల్ గ్రామం

మొదటినుంచీ ఏకగ్రీవమే

నేరేడుగొమ్ము(చందంపేట): నల్లగొండ జిల్లా నేరేడుగొమ్ము మండలంలోని చిన్నమునిగల్ గ్రామానికి ఓ ప్రత్యేకత ఉంది. ఈ పంచాయతీ ఏర్పాటైనప్పటి నుంచి ఇప్పటివరకు ప్రజలంతా కలిసి సర్పంచ్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకుంటున్నారు. చిన్నమునిగల్ గ్రామం గతంలో పెద్దమునిగల్ పంచాయతీలో భాగంగా ఉండేది. 1993లో ప్రత్యేక గ్రామపంచాయతీగా ఏర్పాటైంది. 1994లో మొదటిసారి ఎన్నికల నోటిఫికేషన్ జారీచేశారు. మొదటి సర్పంచ్‌గా కేతావత్ రాజేశ్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. రెండోసారి కేతావత్ దస్రూనాయక్‌ను, మూడోసారి చాపల మీసనమ్మను, నాలుగోసారి వాంకునాత్ పాపానాయక్‌ను, ఐదోసారి కేతావత్ మకట్‌లాల్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ప్రస్తుతం టీఆర్‌ఎస్ మద్దతు తెలిపిన కేతావత్ జంకును ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఇలా గ్రామం ఏర్పాటైనప్పటి నుంచి ఇప్పటి వరకు ఒక్కసారి కూడా ఎన్నికలు జరుగకుండా సర్పంచ్‌లను ఏకగ్రీవంగా ఎన్నుకుంటూ అందరికీ ఆదర్శంగా నిలుస్తున్నారు.

పంప్ ఆపరేటర్‌ను వరించిన సర్పంచ్ పీఠం

▪ **18 ఏండ్లుగా సీతరామపురంలో సైదేశ్వరరావు పంప్ ఆపరేటర్**



హుజూర్‌నగర్‌టౌన్ : సూర్యాపేట జిల్లా హుజూర్‌నగర్ మండలంలోని సీతరామపురం లింగగిరి గ్రామ పంచాయతీకి ఆవాస గ్రామంగా ఉండేది. తెలంగాణ రాష్ట్రంలో సీతరామపురం నూతన పంచాయతీగా ఇటీవల ఏర్పడింది. సీతరామపురంలో 18 సంవత్సరాలుగా పంప్ ఆపరేటర్‌గా పనిచేస్తున్న అద్దంకి సైదేశ్వరరావును తొలి సర్పంచ్ పదవి వరించింది. గ్రామంలోని పెద్దలందరూ కలిసి గ్రామ పంచాయతీ పాలకమండలిని ఏకగ్రీవంగా ఎన్నుకోవాలని నిర్ణయించారు. 449 జనాభా కలిగి 385 ఓట్లు ఉన్న ఈ గ్రామంలో 6 వార్డులు ఉన్నాయి. ఈ గ్రామ పంచాయతీని జనరల్ స్థానంగా కేటాయించినప్పటికీ బీసీ వర్గానికి చెందిన సైదేశ్వరరావు వైపే అన్ని వర్గాల ప్రజలు మొగ్గు చూపారు.

అంతా డబుల్

12 గ్రామాల్లో రెండు రాష్ట్రాల ఎన్నికల గుర్తింపు కార్డులు

రెండుసార్లు పంచాయతీ ఎన్నికలు.. ఇద్దరేసి సర్పంచ్‌లు

తెలంగాణ- మహారాష్ట్ర సరిహద్దులోని వివాదాస్పద గ్రామాల్లో వింత పరిస్థితి



సరిహద్దులోని ఓ గ్రామంలో రెండు రాష్ట్రాలకు చెందిన పాఠశాలలు



ఒకే వ్యక్తికి రెండు రాష్ట్రాల ఓటర్‌కార్డులు

కుమ్రం భీం ఆసిఫాబాద్ ప్రతినిధి, నమస్తే తెలంగాణ: సాధారణంగా ఒక గ్రామానికి ఒకే సర్పంచ్ ఉంటాడు.. ఐదేండ్లకు ఒకసారి సర్పంచ్ ఎన్నికలు జరుగుతుంటాయి.. ఓటర్లకు ఒకే రాష్ట్రానికి చెందిన ఓటర్‌ఐడీ ఉంటుంది.. కానీ కుమ్రం భీం ఆసిఫాబాద్ జిల్లా కెరమెరి మండలంలోని నాలుగు గ్రామ పంచాయతీల పరిధిలో ఉన్న 12 గ్రామాల్లో మాత్రం అంతా డబుల్. తెలంగాణ- మహారాష్ట్ర సరిహద్దులో ఉన్న ఈ గ్రామాల్లో ప్రతి ఒక్కరికీ రెండు రాష్ట్రాల ఓటర్ గుర్తింపు కార్డులు ఉంటాయి. రెండు రాష్ట్రాల ప్రభుత్వాలు పంచాయతీ ఎన్నికలు నిర్వహిస్తాయి. ఓటర్లు రెండుసార్లు ఓటేసి తమ సర్పంచ్‌లను ఎన్నుకుంటారు. ఇలా ఆ గ్రామాల్లో 40 ఏండ్లుగా ఇద్దరు సర్పంచ్‌ల పాలన సాగుతున్నది. ప్రస్తుతం తెలంగాణ గ్రామపంచాయతీ ఎన్నికల్లో ఓట్లు వేసేందుకు ఇక్కడి ఓటర్లు సిద్ధమవుతున్నారు. గతంలో ఇక్కడ అంతాపూర్, పరంధోళి అనే రెండు గ్రామ పంచాయతీలు ఉండేవి. తెలంగాణ ప్రభుత్వం గ్రామ పంచాయతీలను పునర్విభజన చేయడంతో అంతాపూర్, పరంధోళితోపాటు ముకద్ధంగూడ, బోలాపటార్ పంచాయతీలు కొత్తగా ఏర్పడ్డాయి. అంతపూర్‌లో 462 మంది ఓటర్లు, పరంధోళిలో 605 మంది, ముకద్ధంగూడలో 482 మంది, బోలాపటార్‌లో 632 మంది ఓటర్లు ఉన్నారు. వీరందరికీ రెండు రాష్ట్రాలకు చెందిన ఓటరు కార్డులు ఉన్నాయి. ఈ పంచాయతీలకు మూడో విడుతలో పోలింగ్ జరుగనుంది.

రెండు రాష్ట్రాల సంక్షేమ పథకాలు అమలు

కెరమెరి మండలంలోని ఈ 12 గ్రామాల పరిధిలో తెలంగాణకు చెందిన భూములు ఉండగా, ఇక్కడ నివసిస్తున్న గిరిజనులు, ఇతర జాతుల వారు మహారాష్ట్రకు చెందిన వారు. 1952లో భాషా ప్రయుక్త రాష్ట్రాల ఏర్పాటు సమయంలో మహారాష్ట్రలోని తెలుగు మాట్లాడేవారిని ఆంధ్రప్రదేశ్‌లో (ప్రస్తుత తెలంగాణ) కలుపగా.. ఇక్కడ హిందీ మాట్లాడే వారిని మహారాష్ట్రలో కలిపారు. ఈ సమయంలో రెండు రాష్ట్రాల మధ్య భౌగోళికంగా సరిహద్దు ఎక్కడివరకు ఉన్నదో స్పష్టత ఇవ్వలేదు. దీంతో ఈ 12 గ్రామాలు నేటికీ సమస్యాత్మకంగానే మిగిలిపోయాయి. గతంలో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ హైకోర్టు ఈ వివాదాస్పద గ్రామాలు తెలుగు రాష్ట్రానికి చెందినవేనని తీర్పు చెప్పింది. కానీ మహారాష్ట్ర ప్రభుత్వం సుప్రీంకోర్టును ఆశ్రయించింది. దీంతో ఈ సమస్య అపరిష్కృతంగా మిగిలిపోయింది. ఈ గ్రామాలు రెండు రాష్ట్రాల పరిధిలోకి వస్తుండటంతో రెండు ఓటరు గుర్తింపుకార్డులతోపాటు మహారాష్ట్ర, తెలంగాణ ప్రభుత్వాలు అమలుచేసే సంక్షేమ పథకాలు కూడా పొందుతున్నారు. అంతేకాదు ఇక్కడ రెండు రాష్ట్రాల ప్రభుత్వాలు నిర్వహించే పాఠశాలలు నడుస్తున్నాయి. తమకు ఈ పరిస్థితి ఇబ్బందికరంగా మారిందని, ఏదో ఒక రాష్ట్రంలో కలుపాలని ఇక్కడి ప్రజలు కోరుతున్నారు.

రెండు ఓట్లు, ఇద్దరు సర్పంచ్‌లు



ఇక్కడ అందరికీ తెలంగాణ, మహారాష్ట్ర ఓట్లు ఉన్నాయి. రెండుసార్లు ఓటుహక్కు వినియోగించుకుంటాం. ప్రతి పంచాయతీకి ఇద్దరు సర్పంచ్‌లు ఉన్నారు. రెండు రాష్ట్రాల ప్రభుత్వాలు అమలు చేసే సంక్షేమ పథకాలను వినియోగించుకుంటున్నాం. మమ్మల్ని తెలంగాణలో కలుపాలని అనేకసార్లు విన్నవించాం.

- కాంబ్లె లక్ష్మణ్, మాజీ సర్పంచ్, పరంధోళి

తెలంగాణలోనే కలపాలి



మా 12 గ్రామాల ప్రజలకు తెలంగాణ ప్రభుత్వం అమలుచేస్తున్న సంక్షేమ పథకాలు సక్రమంగా అందుతున్నాయి. కాబట్టి మమ్మల్ని తెలంగాణలోనే కలపాలని కోరుతున్నాం. మా గ్రామాల్లో అనేక కార్యక్రమాలు అమలవుతున్నా ఆశించినవిధంగా అభివృద్ధి జరుగడంలేదు. తెలంగాణలో కలిపితేనే మాకు లాభం.

- కాంబ్లె ప్రభు, బోలాపటార్, మాజీ సర్పంచ్

మీడియా పాయింట్

ప్రతిపక్షాల తీరు మారలేదు: ఎమ్మెల్యే ముత్తిరెడ్డి



ప్రజలు తిరస్కరించినా ప్రతిపక్షాల తీరు మారలేదని జనగామ ఎమ్మెల్యే ముత్తిరెడ్డి యాదగిరిరెడ్డి విమర్శించారు. ఆదివారం ఆయన అసెంబ్లీ మీడియా పాయింట్ వద్ద మాట్లాడుతూ గవర్నర్ ప్రసంగం ఆశాజనకంగా ఉన్నదన్నారు. రైతుబంధుతో తెలంగాణ దేశానికే ఆదర్శంగా నిలిచిందని, అనేక రాష్ట్రాలు ఈ పథకాన్ని అమలు చేశాయని, ఆసరా పింఛన్ల అమలుకు కృషి చేస్తున్నాయని చెప్పారు. ప్రతిపక్షాలకు ప్రజా సంక్షేమం పట్టదని, అధికార పార్టీని విమర్శించడం ఒక్కటే తెలుసునని ఎద్దేవాచేశారు. 60 ఏండ్లలో వారు చేయలేని పనులను టీఆర్‌ఎస్ ప్రభుత్వం చేసింది కాబట్టే ప్రజలు మరోసారి పట్టం కట్టారన్నారు. వారు గెలిచినా, ఓడినా ఇంట్లోనే ఉంటారని విమర్శించారు. ఇకనైనా తీరు మార్చుకోవాలని సూచించారు.

అన్నివర్గాల మద్దతు టీఆర్‌ఎస్‌కే

▪ **ఎంఐఎం ఎమ్మెల్యే అహ్మద్ బలాల**



హైదరాబాద్, నమస్తే తెలంగాణ: రాష్ట్ర ప్రభుత్వం నాలుగున్నరేండ్లలో అమలుచేసిన సంక్షేమ పథకాలతో లబ్ధి పొందిన అన్నివర్గాల ప్రజలు టీఆర్‌ఎస్‌కు మద్దతుగా నిలిచారని, ఎన్నికల్లో ఘన విజయం కట్టబెట్టారని ఎంఐఎం ఎమ్మెల్యే అహ్మద్ బలాల పేర్కొన్నారు. గవర్నర్ ప్రసంగంపై ధన్యవాద తీర్మాన చర్చలో పాల్గొని మాట్లాడుతూ.. గవర్నర్ ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపారు. అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్, బీజేపీ, టీడీపీకి ప్రజలు తగిన బుద్ధి చెప్పారన్నారు. దేశంలోనే తొలిసారిగా చిన్న ఘర్షణ లేకుండా అసెంబ్లీ ఎన్నికలను విజయవంతంగా పూర్తి చేశారంటూ ఎన్నికల కమిషన్‌ను అభినందించారు. ప్రభుత్వం రైతుల సంక్షేమానికి ప్రాధాన్యం ఇచ్చిందని, మైనార్టీల సంక్షేమానికి అత్యధిక నిధులు కేటాయించిందని చెప్పారు. పార్లమెంటు ఎన్నికల్లోనూ కాంగ్రెస్, బీజేపీకి ఓటమి తప్పదని, టీఆర్‌ఎస్ 16 స్థానాలు, ఎంఐఎం ఒక సీటు గెలువడం ఖాయమన్నారు. సీఎం కేసీఆర్ ఫెడరల్ ఫ్రంట్‌కు ఎంఐఎం మద్దతు తెలుపుతుందన్నారు.

పేదలను ఆదుకునేలా ప్రభుత్వ పథకాలు: బీజేపీ ఎమ్మెల్యే రాజాసింగ్



టీఆర్‌ఎస్ ప్రభుత్వం అమలుచేస్తున్న రైతుబంధు, రైతుబీమా, కల్యాణలక్ష్మి, షాదీముబారక్, కంటివెలుగు, ఆసరా పింఛన్లు వంటి పథకాలు పేదలకు ఉపయోగకరంగా ఉన్నాయని, వీటిని మరింత పారదర్శకంగా అమలుచేయాలని బీజేపీ ఎమ్మెల్యే రాజాసింగ్ కోరారు. చర్చలో ఆయన పాల్గొని మాట్లాడుతూ గవర్నర్ ప్రసంగానికి ఆమోదం తెలిపారు. కంటివెలుగులో కేంద్రం నిధుల వాటా ఏమైనా ఉందా? అని ప్రశ్నించారు. ఉస్మానియా దవాఖాన శిథిలావస్థలో ఉన్నదని, దాని స్థానంలో కొత్త భవనాన్ని నిర్మించాలని కోరారు. ధూల్‌పేట్‌లో గుడుంబా తయారీని మూసేయడంతో దానిపై ఆధారపడ్డవారు ఆర్థికంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, వారికి ప్రత్యామ్నాయ ఉపాధి కల్పించాలని ఆయన కోరారు.

అసెంబ్లీలో ప్రతిపక్షనేత భట్టి విక్రమార్క

▪ **ప్రకటించిన స్పీకర్ పోచారం శ్రీనివాస్‌రెడ్డి**

▪ **భట్టి స్థానం వద్దకు వెళ్లి అభినందించిన సీఎం కేసీఆర్**



హైదరాబాద్, నమస్తే తెలంగాణ: కాంగ్రెస్ శాసనసభా పక్షనేత భట్టి విక్రమార్కను అసెంబ్లీలో ప్రధాన ప్రతిపక్ష నేతగా స్పీకర్ పోచారం శ్రీనివాస్‌రెడ్డి ఆదివారం సభలో ప్రకటించారు. కాంగ్రెస్ పార్టీని ప్రధాన ప్రతిపక్షంగా గుర్తిస్తున్నట్టు వెల్లడించారు. ఎంఐఎం పక్షనేతగా అక్బరుద్దీన్ ఒవైసీని ప్రకటించారు. అసెంబ్లీలో గవర్నర్ ప్రసంగంపై ధన్యవాదాలు తెలిపే తీర్మానంపై చర్చను చేపట్టేముందు.. సీఎల్పీ నుంచి అందిన సమాచారం మేరకు మధిర ఎమ్మెల్యే మల్లు భట్టివిక్రమార్కను ప్రతిపక్షనేతగా ప్రకటిస్తున్నట్టు తెలిపారు. కాగా, ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రతిపక్షనేతగా ఎన్నికైన భట్టి విక్రమార్కను ఆయన స్థానం వద్దకు వెళ్లి అభినందనలు తెలిపారు. ఈ విషయంపై అధికార ప్రతిపక్ష పార్టీకి చెందిన నేతలు హర్షం వ్యక్తం చేశారు. ప్రతిపక్షనేత స్థానం వద్దకు స్వయంగా అభినందించి సీఎం కేసీఆర్ సభ హుందాతనాన్ని మరింత పెంచారని కొనియాడారు. అసెంబ్లీ సమావేశాల సందర్భంగా తొలిరోజు సైతం విపక్ష సభ్యుల వద్దకు వెళ్లి వారితో కరచాలనం చేశారని ఈ సందర్భంగా పలువురు ఎమ్మెల్యేలు గుర్తు చేసుకున్నారు.

ఎమ్మెల్యేగా ప్రమాణస్వీకారం చేసిన సండ్ర



టీడీపీకి చెందిన సత్తుపల్లి ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య ఆదివారం ప్రమాణ స్వీకారం చేశారు. స్పీకర్ పోచారం శ్రీనివాస్ రెడ్డి ఆయనతో ప్రమాణ స్వీకారం చేయించారు. కాగా, ఎజెండాలో పెట్టినవన్నీ టేబుల్ చేసినట్టుగా భావించాలని స్పీకర్ సభకు తెలిపారు.

స్టార్లకు చుక్కెదురు



ఫెదరర్



సిట్సిపాస్

కుర్రాడి చేతిలో ఓడిన ఫెదరర్ ■ కెర్బర్, షరపోవా, స్టీఫెన్స్ ఔట్
క్వార్టర్‌ఫైనల్లో నాదల్, అగుట్, సిట్సిపాస్ ■ క్విటోవా, కొలిన్స్, బార్టీ కూడా..

ఓవైపు ఎండ వేడిమి.. మరోవైపు ఊపిరి సలుపకుండా కుర్ర ప్లేయర్ల ఎదురుదాడి.. అనుభవం ఎంతున్నా.. ఆటలో వాడి తగ్గడంతో.. ఆస్ట్రేలియన్ ఓపెన్‌లో ఏడో రోజు అతిపెద్ద సంచలనాలు నమోదయ్యాయి. 20 ఏండ్ల కుర్రాడి దెబ్బకు డిఫెండింగ్ చాంపియన్ ఫెదరర్ బోల్తా కొడితే.. తొలిసారి టోర్నీ ఆడుతున్న అన్‌సీడెడ్ చేతిలో ప్రపంచ రెండో ర్యాంకర్ కెర్బర్, ఓ అనామక క్రికెటర్ కమ్ టెన్నిస్ ప్లేయర్ చేతిలో షరపోవా కంగుతిన్నారు. ఓవరాల్‌గా సీడెడ్‌లుగా బరిలోకి దిగిన స్టార్లు.. తమకంటే తక్కువస్థాయి ప్రత్యర్థుల చేతిలో బలైపోయారు. కానీ.. 'స్పెయిన్ బుల్' నాదల్ మాత్రం తనపట్టు జారకుండా క్వార్టర్స్ బెర్త్‌ను ఖాయం చేసుకుని 18వ గ్రాండ్‌స్లామ్ వేటలో మరో అడుగు ముందుకేశాడు.

మెల్‌బోర్న్: కెరీర్‌లో ఏడో ఆస్ట్రేలియా ఓపెన్ టైటిల్‌పై కన్నేసిన డిఫెండింగ్ చాంపియన్ రోజర్ ఫెదరర్‌కు ఈసారి కలిసి రాలేదు. ఆదివారం జరిగిన పురుషుల సింగిల్స్ నాలుగో రౌండ్‌లో 14వ సీడ్ స్టెఫానోస్ సిట్సిపాస్ (గ్రీక్) 6-7 (11/13), 7-6 (7/3), 7-5, 7-6 (7/5)తో మూడో సీడ్ ఫెదరర్ (స్విట్జర్లాండ్)ను ఓడించి క్వార్టర్‌ఫైనల్లోకి దూసుకెళ్లాడు. దీంతో క్వార్టర్స్ చేరిన తొలి గ్రీక్ ఆటగాడిగా రికార్డులకెక్కాడు. ఈ నెల ఆరంభంలో జరిగిన హాప్‌మన్ కప్‌లో మిక్స్‌డ్ డబుల్స్ మ్యాచ్‌లో ఈ ఇద్దరు తొలిసారి తలపడ్డారు. ఆ మ్యాచ్‌లోనూ గ్రీక్ కుర్రాడు గట్టిపోటీ ఇచ్చినా.. రెండు టైబ్రేక్‌ల్లో స్విస్ స్టార్ వీరోచితంగా పోరాడి నెగ్గాడు. హోరాహోరీగా సాగిన ఈ మ్యాచ్‌లోనూ తొలి, నాలుగో సెట్లు టైబ్రేక్‌కు దారితీయడంతో ఫలితం స్విస్ ప్లేయర్‌కు అనుకూలంగా వస్తుందని భావించారు. తొలిసెట్ టైబ్రేక్‌లో ఫెదరర్ 12-11తో ఆధిక్యం ఉన్న దశలో ఓ అభిమాని కాస్త అనుచితంగా ప్రవర్తించాడు. దీంతో ఏకాగ్రత కోల్పోయిన సిట్సిపాస్ ఫోర్‌హ్యాండ్ షాట్‌ను నెట్‌కు కొట్టడంతో సెట్ కోల్పోయాడు. రెండోసెట్ టైబ్రేక్‌లో వీరోచితంగా పోరాడిన గ్రీక్ ప్లేయర్ 10 బ్రేక్ పాయింట్లు సాధించాడు. ఫెదరర్ సర్వీస్‌లో మరో రెండు పాయింట్లు నెగ్గి స్కోరు సమం చేశాడు. మూడోసెట్ 4-5 దశలో ఉన్న సిట్సిపాస్ రెండు బ్రేక్ పాయింట్లను కోల్పోయాడు. కానీ ఫెదరర్ దీనిని సద్వినియోగం చేసుకోలేకపోయాడు. ఫోర్‌హ్యాండ్ షాట్లలో వరుసగా తప్పిదాలు చేస్తూ మూల్యం చెల్లించుకున్నాడు. తర్వాతి గేమ్ సర్వీస్‌లో 15-40 వద్ద ఫెదరర్ 42వ తప్పిదం చేయడంతో మ్యాచ్‌లో వెనుకబడిపోయాడు. ఏడో గేమ్‌లో ఎండ వేడిమికి సిట్సిపాస్ కండరాలు పట్టేశాయి. దీంతో మునుపటి వేగంతో కదల్లేకపోయాడు. అయినా స్విస్ ప్లేయర్ దీనిని సద్వినియోగం చేసుకోలేకపోయాడు. ఫలితంగా మూడో టైబ్రేక్‌లో మ్యాచ్ పాయింట్‌ను కాపాడుకున్న సిట్సిపాస్ చిరస్మరణీయ విజయాన్ని అందుకున్నాడు. పాదం గాయానికి శస్త్రచికిత్స తర్వాత మళ్లీ రాకెట్ పట్టిన రెండోసీడ్ నాదల్ మునుపటి ఫామ్‌ను చూపెడుతున్నాడు. ప్రిక్వార్టర్స్‌లో నాదల్ (స్పెయిన్) 6-0, 6-1, 7-6 (7/4)తో ప్రపంచ నాలుగో ర్యాంకర్ థామస్ బెర్డిచ్ (చెక్)పై గెలిచి క్వార్టర్‌ఫైనల్లోకి అడుగుపెట్టాడు. ఇతర మ్యాచ్‌ల్లో నిరుటి రన్నరప్, ఆరోసీడ్ మారిన్ సిలిచ్‌కు చుక్కెదురైంది. 22వ సీడ్ రొబెర్టో బుటిస్టా అగుట్ (స్పెయిన్) 6-7 (6/8), 6-3, 6-2, 4-6, 6-4తో సిలిచ్‌ను ఓడించి తుది ఎనిమిది దశకు చేరుకున్నాడు. ఫ్రాన్సెస్ తియాఫో (అమెరికా) 7-5, 7-6 (8/6), 6-7 (1/7), 7-5తో 20వ సీడ్ దిమిత్రోవ్ (బల్గేరియా)పై గెలిచాడు.

కెర్బర్ ఔట్

టైటిల్ ఫేవరెట్‌గా బరిలోకి దిగిన ఏంజెలిక్ కెర్బర్ (జర్మనీ) అనూహ్యంగా టోర్నీ నుంచి నిష్క్రమించింది. నాలుగోరౌండ్‌లో 35వ ర్యాంకర్ డానియెల్లి కొలిన్స్ (అమెరికా) 6-0, 6-2తో అలవోకగా కెర్బన్‌ను ఓడించి క్వార్టర్స్‌లోకి ప్రవేశించింది. తొలిసారి ఈ టోర్నీలో బరిలోకి దిగిన కొలిన్స్.. ఇంతవరకు గ్రాండ్‌స్లామ్‌లో ఒక్క మ్యాచ్ కూడా నెగ్గలేదు. డబ్ల్యూటీఏ సర్క్యూట్‌లో తన పేరు పెద్దగా తెలియకపోయినా.. అతిపెద్ద విజయంతో కెరీర్‌ను ఘనంగా ఆరంభించింది. దాదాపు గంటపాటు సాగిన ఈ మ్యాచ్‌లో.. కొలిన్స్ 2 ఏస్‌లు సంధించింది. రిటర్న్ షాట్లలో మంచి పరిణతి చూపెట్టిన అమెరికన్.. సర్వీస్‌లోనూ చెలరేగిపోయింది. వేగానికి తోడు కచ్చితత్వంతో కూడిన క్రాస్ కోర్టు విన్నర్లతో కెర్బర్‌ను కట్టిపడేసింది. నెట్ వద్ద 70 శాతం పాయింట్లు సంపాదించడం బాగా కలిసొచ్చింది. నెట్ వద్ద బోల్తా కొట్టిన కెర్బర్.. విన్నర్లు (6) సంధించడంలో ఘోరంగా విఫలమైంది. చెరో 17 అనవసర తప్పిదాలు చేశారు.



కెర్బర్

క్రికెటర్ చేతిలో..

రష్యా అందాల తార మరియా షరపోవాకు ఈసారి అదృష్టం కలిసి రాలేదు. ప్రిక్వార్టర్స్‌లో క్రికెటర్ కమ్ టెన్నిస్ ప్లేయర్ ఆష్‌బార్టీ (ఆస్ట్రేలియా) 4-6, 6-1, 6-4తో 30వ సీడ్ షరపోవాపై గెలిచి కెరీర్‌లో తొలి గ్రాండ్‌స్లామ్ క్వార్టర్స్ బెర్త్‌ను ఖాయం చేసుకున్నది. 2017 డ్రగ్స్ నిషేధం తర్వాత మళ్లీ రాకెట్ పట్టిన రష్యన్.. మూడో రౌండ్‌లో వోజ్నియాకిని ఓడించడంతో ఈసారి టైటిల్ సాధిస్తుందని అంచనాలు పెరిగాయి. అందుకు అనుగుణంగానే 2 గంటల 22 నిమిషాల పాటు జరిగిన ఈ మ్యాచ్‌లో.. షరపోవా తొలిసెట్‌లో తన మార్క్ షాట్లను చూపెట్టింది. ప్రత్యర్థి సర్వీస్‌ను బ్రేక్ చేస్తూ బలమైన ఫోర్‌హ్యాండ్, బ్యాక్‌హ్యాండ్ షాట్లతో విరుచుకుపడింది. కానీ రెండోసెట్‌లో అభిమానుల గోల మధ్య ఏకాగ్రతను కోల్పోయింది. ఫలితంగా వరుసగా తొమ్మిది గేమ్‌లు చేజార్చుకుని సెట్‌ను కోల్పోయింది. ఇక నిర్ణయాత్మక మూడో సెట్‌లో రెండుసార్లు సర్వీస్‌ను కోల్పోవడంతో పుంజుకోలేక మూల్యం చెల్లించుకుంది. మ్యాచ్ మొత్తంలో షరపోవా 2 ఏస్‌లు, 51 అనవసర తప్పిదాలు చేయగా, బార్టీ 6 ఏస్‌లు 45 అనవసర తప్పిదాలు చేసింది. 2014లో టెన్నిస్‌కు విరామం ఇచ్చిన 22 ఏండ్ల బార్టీ.. క్రికెట్ బ్యాట్ పట్టింది. మహిళల బిగ్‌బాష్ లీగ్‌లో బ్రిస్బేన్ హీట్‌కు ప్రాతినిధ్యం వహించి అరంగేట్రం మ్యాచ్‌లోనే 37 (29 బంతుల్లో) పరుగులు చేసి అందరి దృష్టిని ఆకర్షించింది. సాఫీగా సాగుతున్న క్రికెట్ కెరీర్‌కు గుడ్‌బై చెప్పిన బార్టీ.. మళ్లీ రాకెట్‌తో సంచనాలు సృష్టిస్తూ గతేడాది టాప్-15 ర్యాంక్‌ను సొంతం చేసుకుంది. మరో మ్యాచ్‌లో 8వ సీడ్ క్విటోవా (చెక్) 6-2, 6-1తో అమండ అన్సిమోవా (అమెరికా)పై, పావులుంచెకోవా (రష్యా) 6-7 (3/7), 6-3, 6-3తో ఐదోసీడ్ స్టోనీ స్టీఫెన్స్ (అమెరికా) నెగ్గింది.



షరపోవా



ఆదివారం కరీంనగర్‌లో ముగిసిన జాతీయ కరాటే టోర్నీలో ఓవరాల్ చాంప్ ట్రోఫీని అందుకున్న తెలంగాణ జట్టు

ఓవరాల్ చాంప్ తెలంగాణ

ముగిసిన జాతీయస్థాయి కరాటే పోటీలు

కరీంనగర్ స్పోర్ట్స్ : జిల్లా కేంద్రంలోని అంబేద్కర్ స్టేడియంలో జాతీయ స్థాయి కరాటే పోటీలు ఆదివారం ముగిశాయి. కాంటినెంటల్ షోటోకాన్ ఇండియా (సీఎస్‌కేఐ) ఆధ్వర్యంలో మూడు రోజుల పాటు జరిగిన పోటీల్లో రాష్ట్ర క్రీడాకారులు అద్భుత ప్రతిభ కనబరిచి ఓవరాల్ చాంపియన్‌షిప్‌ను కైవసం చేసుకున్నారు. మొత్తం 167 పతకాలతో తెలంగాణ అగ్రస్థానాన్ని దక్కించుకోగా, ఆంధ్రప్రదేశ్(156), హర్యానా(122), తమిళనాడు(101) ఆ తర్వాతి స్థానాల్లో నిలిచాయి. ఈ పోటీల్లో 20 రాష్ర్టాలకు చెందిన క్రీడాకారులు పాల్గొన్నారు. విజేతలకు సీఎస్‌కేఐ చైర్మన్ చల్ల హరిశంకర్, డీవైఎస్‌ఓ అశోక్‌కుమార్, ఒలింపిక్ అసోసియేషన్ కార్యదర్శి జనార్దన్‌రెడ్డి, సీఎస్‌కేఐ ఇండియా చీఫ్ ఈ శ్రీనివాస్, ప్రవీణ్‌కుమార్ బహుమతులను ప్రదానం చేశారు.

జీవితం కంటే ఏదీ ఎక్కువ కాదు



కోహ్లీ


న్యూఢిల్లీ: జీవితంలో క్రికెట్ ఒక భాగమే అయినా.. కుటుంబం కంటే ఏదీ ఎక్కువ కాదని భారత కెప్టెన్ విరాట్ కోహ్లీ అన్నాడు. ఆటకే కాకుండా కుటుంబానికి కూడా సమయం కేటాయించాల్సిన అవసరం చాలా ఉందన్నాడు. 'ఎనిమిదేండ్లు ఆటలోనే గడిపేశాను. నాకోసం కూడా సమయం కేటాయించుకోలేదు. నా జీవితంలోకి అనుష్క కూడా వచ్చేసింది. అందుకే ఆమెకు, నా కుటుంబానికి ప్రాధాన్యం ఇవ్వాలని అనుకుంటున్నా. జీవితంలో క్రికెట్ ఒక భాగమే కానీ జీవితం కంటే ఎక్కువ కాదు. నా శ్రీమతి అర్థం చేసుకోగలుగుతుంది కాబట్టి విదేశాల్లో ఎలాంటి ఒత్తిడి లేకుండా ఆడుతున్నా. కొంతమంది జీవితాన్ని సీరియస్‌గా గడిపేస్తుంటారు. క్రికెట్‌ను కూడా సీరియస్‌గా తీసుకోకుంటే జీవితంలో ఏదీ సాధించలేకపోయే వాడినేమో అని అంటుంటారు. కానీ వాటన్నింటిని నేను నమ్మను. ఎందుకంటే జీవితం అనే పెద్ద పిక్చర్‌లో ఏదీ రాసిపెట్టి ఉంటే అది జరుగుతుంది. ఏదీ జరిగినా చివరకు రావాల్సింది మళ్లీ ఇంటికే. కాబట్టి నా మొదటి ప్రాధాన్యం మాత్రం కుటుంబానికే. జీవితంలో క్రికెట్ అనేది ప్రత్యేకమైన ఓ భాగమే కానీ అన్నింటికంటే మించింది మాత్రం కాదు. చూస్తుండగానే ఏండ్లకు ఏండ్లు గడిచిపోయాయి. కనీసం ఇప్పుడైనా కుటుంబానికి సమయం కేటాయించాలని అనుకుంటున్నా' అని కోహ్లీ వ్యాఖ్యానించాడు.



అంకిత టైటిల్ బోణీ

న్యూఢిల్లీ: భారత యువ టెన్నిస్ స్టార్ అంకితా రైనా ఈసీజన్‌లో అదిరిపోయే బోణీ కొట్టింది. సీజన్ తొలి గ్రాండ్‌స్లామ్ ఆస్ట్రేలియా ఓపెన్‌లో అర్హత రౌండ్‌లోనే వెనుదిరిగినా ఆత్మవిశ్వాసం కోల్పోని అంకిత..సింగపూర్ ఓపెన్‌లో సత్తాచాటింది. ఆదివారం జరిగిన మహిళల సింగిల్స్ ఫైనల్లో రైనా 6-3, 6-2 తేడాతో టాప్‌సీడ్ ఆరంత్ర రస్‌పై విజయం సాధించింది. గంటా 23 నిమిషాల పాటు జరిగిన తుదిపోరులో ఈ 25 ఏండ్ల భారత టెన్నిస్ ఏస్ ప్రత్యర్థిపై పూర్తి ఆధిపత్యం ప్రదర్శించింది. ఏ దశలోనూ పట్టువదలకుండా సర్వ్‌లకు తోడు ఏస్‌లతో ఉక్కిరిబిక్కిరి చేసింది. ఈ విజయం ద్వారా 50 రేటింగ్ పాయింట్లను ఖాతాలో వేసుకున్న రైనా..తన డబ్ల్యూటీఏ ర్యాంకింగ్‌ను మెరుగుపర్చుకునే అవకాశముంది. ఫెడ్‌కప్ టోర్నీకి ముందు జరిగే మరో రెండు టోర్నీల్లో అంకిత బరిలోకి దిగుతున్నది.

ధోనీ ఇప్పటికీ అత్యుత్తమ ఫినిషర్



ఇయాన్ చాపెల్

న్యూఢిల్లీ: భారత సీనియర్ క్రికెటర్ మహేంద్రసింగ్ ధోనీ ఇప్పటికీ ప్రపంచంలో అత్యుత్తమ మ్యాచ్ ఫినిషర్ అని ఆస్ట్రేలియా మాజీ కెప్టెన్ ఇయాన్ చాపెల్ ప్రశంసించాడు. ఆస్ట్రేలియాతో ద్వైపాక్షిక వన్డే సిరీస్ విజయంలో ధోనీ కీలకంగా వ్యవహరించాడు. తనపై వస్తున్న విమర్శలకు దీటైన సమాధానమిస్తూ భారత్‌కు చిరస్మరణీయ విజయాన్ని కట్టబెట్టాడు. ఏండ్లుగా సాధ్యం కాని రికార్డును జట్టుకు కట్టబెట్టాడు. ఈనేపథ్యంలో ధోనీ సామర్థ్యంపై చాపెల్ ఈఎస్‌పీఎన్‌కు ప్రత్యేక కాలమ్‌లో ఇలా రాసుకొచ్చాడు. 'ధోనీ లాగా మ్యాచ్‌లను విజయవంతంగా ముగించడం ఎవరికీ సాధ్యం కాకపోవచ్చు. నరాలు తెగే సమయంలో కూడా ఏకాగ్రత కోల్పోకుండా సమయోచితంగా ఆడటం మామూలు విషయం కాదు. అంత ఒత్తిడిలో కూడా మెదడు చురుకుగా పనిచేయడం అతనిలా మరెవరికీ సాధ్యం కాకపోవచ్చు. మ్యాచ్‌లను ముగించడంలో ఆసీస్ మాజీ క్రికెటర్ మైఖేల్ బెవాన్‌ను ధోనీ ఎప్పుడో అధిగమించాడు. బెవాన్ ఫోర్లతో మ్యాచ్‌ను ముగిస్తే..మహీ సిక్స్‌లతో కానిస్తున్నాడు. దీనికి తోడు 37 ఏండ్ల వయసులో కూడా వికెట్ల మధ్య యువ క్రికెటర్లకు పోటీగా పరిగెత్తడం అతనికే చెల్లింది. ఇలా ఏ విషయంలో చూసుకున్నా బెవాన్ కంటే ధోనీ ఎన్నో రెట్లు మెరుగని చెప్పొచ్చు. మైదానంలో ప్రశాంతంగా ఉంటూ పనిని పూర్తి చేయడంలో ధోనీ దిట్ట. వెస్టిండీస్ దిగ్గజం వీవీయన్ రిచర్డ్స్‌ను విరాట్ కోహ్లీ మరిపిస్తున్నాడు. వన్డేల్లో రిచర్డ్స్, సచిన్, డివిలీయర్స్‌ను కోహ్లీ అధిగమించాడు' అని చాపెల్ అన్నాడు.

ముగిసిన ఖేలో ఇండియా పోటీలు

22 పతకాలతో 14వ స్థానంలో నిలిచిన తెలంగాణ ■ మహారాష్ట్రకు ఓవరాల్ చాంపియన్‌షిప్




ఆదివారం ఖేలో ఇండియా ఓవరాల్ చాంపియన్‌షిప్‌ను మహారాష్ట్ర జట్టుకు అందజేస్తున్న కేంద్ర మానవ వనరుల శాఖ మంత్రి జవదేకర్.

పుణె: దేశంలో ప్రతిభ కల్గిన క్రీడాకారులను వెలుగులోకి తీసుకొచ్చే ఉద్దేశంతో కేంద్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా తీసుకొచ్చిన ఖేలో ఇండియా పోటీలు ఆదివారం అట్టహాసంగా ముగిశాయి. 14 రోజుల పాటు అభిమానులను అలరించిన పోటీల్లో ఆతిథ్య మహారాష్ట్ర ఓవరాల్ చాంపియన్‌షిప్‌ను కైవసం చేసుకుంది. టోర్నీలో 85 స్వర్ణాలు, 62 రజతాలు, 81 కాంస్యాలతో మొత్తం 228 పతకాలతో మహారాష్ట్ర టాప్‌లో నిలిచింది. హర్యానా(178), ఢిల్లీ(136), కర్నాటక(77) ఆ తర్వాత స్థానాల్లో నిలిచాయి. 5 స్వర్ణాలు, 8 రజతాలు, 9 కాంస్యాలతో తెలంగాణ రాష్ర్టానికి 22 పతకాలతో 14వ స్థానం దక్కింది. ఛత్రపతి స్పోర్ట్ కాంప్లెక్స్‌లో జరిగిన ముగింపు కార్యక్రమానికి కేంద్ర మానవ వనరుల శాఖ మంత్రి ప్రకాశ్ జవదేకర్, మహారాష్ట్ర క్రీడా శాఖ మంత్రి వినోద్ తావ్డే, భారత క్రీడా ప్రాధికార సంస్థ(సాయ్) డైరెక్టర్ జనరల్ నీలమ్ కపూర్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. మంత్రి జవదేకర్ చేతుల మీదుగా మహారాష్ట్ర జట్టు ట్రోఫీని అందుకుంది. గతేడాది కంటే ఈసారి 5,925 మంది అథ్లెట్లు, 1096 మంది సహాయక బృందం, 893 మంది టెక్నికల్ సిబ్బంది, 36 మంది చెఫ్ డీ మిషన్స్, 1010 వాలంటీర్లు, 1500 మంది అధికారులు పాల్గొన్నట్లు నీలమ్ కపూర్ పేర్కొన్నారు. ఇది గత ఖేలో ఇండియా గేమ్స్ కంటే రెట్టింపని ఆమె తెలిపారు. ఆఖరి రోజు 15 పతకాలు కోసం జరిగిన వేర్వేరు పోటీల్లో మహారాష్ట్ర, జార్ఖండ్, హర్యానా పోటాపోటీగా నిలిచాయి.

న్యూజిలాండ్ చేరుకున్న టీమ్ ఇండియా



ఆక్లాండ్: మూడు వారాల పర్యటన కోసం భారత క్రికెట్ జట్టు ఆదివారం న్యూజిలాండ్‌కు చేరుకుంది. అభిమానుల కేరింతల మధ్య ఆక్లాండ్ ఎయిర్‌పోర్ట్‌లో టీమ్‌ఇండియా క్రికెటర్లు కేదార్ జాదవ్, దినేశ్ కార్తీక్ ఆటోగ్రాఫ్‌లు ఇస్తూ కనిపించారు. మరోవైపు కెప్టెన్ విరాట్‌కోహ్లీ, అనుష్కశర్మ కనబడగానే ఫ్యాన్స్ ఒక్కసారిగా అరుపులు, కేకలతో సందడి చేశారు. దీనికి సంబంధించిన ఓ వీడియోను బీసీసీఐ తమ అధికారిక ట్విట్టర్ పేజీలో పోస్ట్ చేసింది. ఆస్ట్రేలియా పర్యటనను దిగ్విజయంగా ముగించుకున్న కోహ్లీసేన కివీస్‌లోనూ జోరు కొనసాగించాలన్న పట్టుదలతో ఉన్నది. టూర్‌లో భాగంగా కివీస్‌తో భారత్ ఐదు వన్డేలు, మూడు టీ20 మ్యాచ్‌లు ఆడనుంది. ఈనెల 23న నేపియర్‌లో టీమ్‌ఇండియా తొలి వన్డే మ్యాచ్ ఆడుతుంది. వచ్చే నెల 10న హామిల్టన్‌లో జరిగే టీ20తో జట్టు పర్యటన పూర్తవుతుంది.



ఆదివారం ప్రో రెజ్లింగ్ లీగ్(పీడబ్ల్యూఎల్)లో జరిగిన 65కిలోల బౌట్‌లో అంద్రె కివియాతోవ్‌స్కీ (ఢిల్లీ సుల్తాన్స్)పై 9-0తో విజయం సాధించిన పంజాబ్ రాయల్స్ రెజ్లర్ బజ్‌రంగ్ పూనియా

కోహ్లీ గ్రేట్ బ్యాట్స్‌మన్



క్లార్క్

న్యూఢిల్లీ: భారత కెప్టెన్ విరాట్‌కోహ్లీపై ఆస్ట్రేలియా మాజీ సారథి మైఖేల్‌క్లార్క్ ప్రశంసల వర్షం కురిపించాడు. వన్డే క్రికెట్ చరిత్రలో కోహ్లీ ఆల్‌టైమ్ గ్రేట్ బ్యాట్స్‌మన్ అని కితాబిచ్చాడు. బ్యాటింగ్‌లోనే కాకుండా సారథిగా ముందుండి నడిపిస్తూ జట్టుకు చిర్మసరణీయ విజయాలు కట్టబెడుతున్నాడని చెప్పుకొచ్చాడు. తాజాగా ముగిసిన ఆస్ట్రేలియా పర్యటనలో ఏడు దశాబ్దాల సుదీర్ఘ నిరీక్షణకు తెరదించుతూ టెస్ట్ సిరీస్‌తో పాటు ద్వైపాక్షిక వన్డే సిరీస్‌ను గెలువడం ద్వారా భారత జట్టు సరికొత్త చరిత్ర లిఖించిన సంగతి తెలిసిందే. ఇందులో విరాట్ కోహ్లీ కీలక భూమిక పోషించాడు. ఈ నేపథ్యంలో మీడియాతో మాట్లాడుతూ 'వన్డే క్రికెట్‌లో ఇప్పటి వరకు చూసిన వారిలో విరాట్ కోహ్లీ అత్యుత్తమ బ్యాట్స్‌మన్. 219 వన్డేల్లో 59 సగటు, 39 సెంచరీలతో 10,385 పరుగులు చేయడమంటే మామూలు విషయం కాదు. ప్రత్యర్థి ఎవరైనా, వేదిక ఏదైనా అతను సాగించే పరుగుల విధ్వంసం మాటలకందనిది. కేవలం బ్యాట్స్‌మన్‌గానే గాకుండా దేశానికి విజయమందించడంలో అతను పడే తపన వెలకట్టలేనిది. ఆ సమయంలో అతను ప్రదర్శించే దూకుడు, నిబద్ధతను ప్రశ్నించే హక్కు ఎవరికీ లేదు. మాజీ కెప్టెన్ ధోనీ ప్రస్తుత ఫామ్‌పై విమర్శలు వస్తున్నా..అంతగా ఆందోళన పడాల్సిన అవసరం లేదు. పరిస్థితులకు తగ్గట్లు ఎలా ఆడాలో మహీకి బాగా తెలుసు. 300 వన్డేలకు పైగా ఆడిన అనుభవమున్న ధోనీ బాధ్యత ఏంటో అతనికి బాగా తెలుసు. ఆసీస్‌తో వన్డే సిరీస్‌లో ఇది తెలిసొచ్చింది. బ్యాటింగ్ ఆర్డర్‌లో ఏ స్థానంలోనైనా ఆడే సత్తా ధోనీకి ఉంది. రానున్న ప్రపంచకప్‌లో మహీ సేవలను కోహ్లీ సరిగ్గా ఉపయోగించుకుంటాడని భావిస్తున్నాను. ఆల్‌రౌండర్ హార్దిక్ పాండ్యా లేకపోవడం లోటే. బ్యాటింగ్‌తో పాటు బౌలింగ్ పరంగా పనికొచ్చే హార్దిక్ లేకపోతే జట్టు సమతూకం దెబ్బతింటుంది. సొంతగడ్డపై వన్డేల్లో ఇంగ్లండ్ చాలా బలమైన జట్టు. ప్రపంచకప్ నాటికి ఆస్ట్రేలియా జట్టు పుంజుకుంటుదన్న నమ్మకముంది' అని క్లార్క్ అన్నాడు.

ఆగని ఎఫ్‌ఐఐల అమ్మకాలు

■ రూ. 4,040 కోట్ల విరమణ

న్యూఢిల్లీ, జనవరి 20: దేశీయ క్యాపిటల్ మార్కెట్లనుంచి విదేశీ సంస్థాగత ఇన్వెస్టర్ల పెట్టుబడుల ఉపసంహరణ కొనసాగుతూనే ఉంది. ఈనెలలో ఇప్పటివరకు రూ. మొత్తం రూ. 4,040 కోట్ల పెట్టుబడులను ఉపసంహరించుకున్నారు. అంతకుముందు నవంబర్, డిసెంబర్ నెలల్లో దాదాపు రూ.17,000 కోట్ల పెట్టుబడులను నికరంగా పెట్టిన ఎఫ్ఐఐలు ఈ నెలలో మాత్రమే అమ్మకాలకే మొగ్గు చూపుతున్నారు. ఈక్విటీల నుంచి ఈ నెలలో మొత్తం రూ. 3,987 కోట్ల పెట్టుబడులను ఉపసంహరించుకోగా, రుణ మార్కెట్ల నుంచి మరో రూ. 53 కోట్లను ఉపసంహరించుకున్నారు. దీంతో మొత్తం రూ. 4,040 కోట్ల పెట్టుబడులను జనవరి 1 - 18 తేదీల మధ్య విరమించుకున్నట్టు అయింది. ఎఫ్ఐఐలు ఇప్పటికీ కొత్త పెట్టుబడులపై వేచి చూసే ధోరణిని అవలంభిస్తున్నారని



విశ్లేషకులు భావిస్తున్నారు. మరో రెండు వారాల్లో బడ్జెట్ ప్రవేశపెట్టనున్నందున విధానపర నిర్ణయాలపై వేచి చూస్తున్నారు.

స్థిరంగానే స్టాక్ మార్కెట్లు

■ కార్పొరేట్ సంస్థల ఆర్థిక ఫలితాలే కీలకం
■ పాజిటివ్ ట్రిగ్గర్స్ కోసం ఎదురు చూపులు

ఇండెక్స్ హెవీవెయిట్స్ ప్రోత్సాహకర ఫలితాలతో గత వారం మార్కెట్లు దాదాపు ఒక శాతం లాభాలతో ముగిశాయి. అయితే మంగళవారం నాటి భారీ పెరుగుదల తర్వాత కొనుగోళ్ల మద్దతు కొనసాగకపోవడంతో మార్కెట్ మళ్లీ స్వల్ప రేంజ్‌లోనే ట్రేడ్ అయింది. గత ఐదు ట్రేడింగ్ సెషన్లలో సెన్సెక్స్ 377 పాయింట్లు లాభపడగా, నిఫ్టీ 112 పాయింట్ల లాభంతో ముగిసింది. అయితే మిడ్‌క్యాప్ ఇండెక్స్ దాదాపు ఒక శాతం నష్టపోతే, స్మాల్ క్యాప్ ఇండెక్స్ అర శాతం మేర నష్టపోయింది. మార్కెట్ బ్రెడ్త్ మాత్రం వారం అంతా నెగటివ్‌గానే ఉంది. గత వారం వెలువడిన రిలయన్స్, హిందుస్తాన్ యూనీ లీవర్ వంటి హెవీవెయిట్ ఆర్థిక ఫలితాలు ప్రోత్సాకరంగా ఉన్నాయి.

వచ్చే వారంలో మరిన్ని...

ఆర్థిక ఫలితాల సీజన్ ఊపందుకుంది. ఈ వారంలో మారుతి, ఎల్అండ్‌టీ, కోటక్ బ్యాంక్, యెస్‌బ్యాంక్, ఏషియన్ పెయింట్స్ వంటి ఇండెక్స్ కంపెనీలు ఫలితాలను ప్రకటించనున్నాయి. ఇవికాక దాదాపు 200కి పైగా కంపెనీలు ఈ వారంలోనే ఫలితాలను ప్రకటించనున్నాయి. ఈ నేపథ్యంలో మార్కెట్ కదలికలు ప్రభావితం కానున్నాయి. శుక్రవారం వెలువడిన హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్, విప్రో ఫలితాల ప్రభావం కూడా ఈ వారంలోనే ఉండబోతున్నది. ఎల్ అండ్ టీ ఫలితాలకు తోడు బైబ్యాక్ ఆఫర్ ప్రతిపాదనను సెబీ తిరస్కరించింది. ఈ అంశాన్ని మార్కెట్ ఎలా పరిగణిస్తుందో వేచి చూడాలి. రూపాయి, క్రూడాయిల్ కదలికలు కూడా ఈ వారంలో ప్రాధాన్యతను సంతరించుకున్నాయి. మరోసారి రూ.71కి చేరిన రూపాయి మారకం విలువ క్రూడాయిల్ ధరలు పెరిగితే మరింత క్షీణించే అవకాశాలున్నాయి. అంతర్జాతీయ మార్కెట్‌లో బ్యారెల్ బ్రెంట్ క్రూడాయిల్ ధరలు ఇప్పటికే 61 డాలర్లను దాటేసింది. సప్లయ్-డిమాండ్ గణాంకాలకు తోడు ఇన్వెంటరీ వివరాలు బుధవారం వెలువడనున్నాయి. క్రూడాయిల్ ధరలు పెరిగితే మార్కెట్‌లో ప్రతికూలంగా భావించవచ్చు. గ్లోబల్ మార్కెట్ల విషయానికి వస్తే అమెరికా ప్రభుత్వ షట్‌డౌన్ ఇంకా కొనసాగుతున్నది. అమెరికా-చైనా వాణిజ్య చర్చలు ఒక కొలిక్కి వస్తాయని విశ్లేషకులు భావిస్తున్నారు. అంతర్జాతీయ మార్కెట్ల కదలికలు మన మార్కెట్‌ను ప్రభావితం చేసే అవకాశం ఉంది. కాగా, చైనా జీడీపీ గణాంకాలు, అమెరికా హోమ్‌సేల్స్, జపాన్ వాణిజ్య లోటు వివరాలు ఈవారం లోనే వెలువడుతున్నాయి.



టెక్నికల్స్: స్థిరీకరణ నుంచి బయటకు?

గత రెండు మూడు నెలలుగా స్వల్ప రేంజ్‌లోనే ట్రేడ్ అవుతున్న నిఫ్టీ బ్రేకవుట్ జరగడానికి సమయం దగ్గర పడింది. అసెండింగ్ ట్రయంగిల్ వంటి బుల్లిష్ ప్యాట్రన్ ఏర్పడింది. 10,920-10,985 స్థాయిల్లోనే రెసిస్టెన్స్‌లను అధిగమించగలిగితే 11,090 వరకు నిఫ్టీ పెరిగే అవకాశం కనిపిస్తున్నది. 50 రోజుల చలన సగటును మద్దతుగా తీసుకుని మార్కెట్ స్థిరపడుతున్నది. ఇప్పటివరకు క్రితం స్వింగ్ కనీస స్థాయిని దిగిపోనందున మార్కెట్‌లో ట్రెండ్ బలహీనపడలేదు. స్వల్ప, దీర్ఘకాల చలన సగటులకు ఎగువన ట్రేడ్ అవుతున్నంత కాలం మార్కెట్‌పై పాజిటివ్ దృక్పథంలోనే ఉండాలి. అయితే 10,750 స్థాయిలోని మద్దతుని దిగిపోతేనే మార్కెట్ బలహీనపడే అవకాశాలున్నాయి. ఆ తర్వాత 10,690 స్థాయిలో మద్దతు ఉంది. ఇండికేటర్లు కూడా మార్కెట్ సైడ్‌వేస్‌లో కొనసాగే అవకాశాలనే సూచిస్తున్నాయి. స్టోకాస్టిక్స్ ఆసిలేటర్ మాత్రమే మార్కెట్‌లో లాభాల స్వీకరణ ఊపందుకునే అవకాశాలున్నాయని చెబుతున్నది. గత మూడు రోజులుగా ఏర్పడుతున్న బేరిష్ క్యాండిల్ ప్యాట్రన్స్ దీన్ని ధృవీకరిస్తున్నాయి. ప్రస్తుతానికి ఆర్థిక ఫలితాలను ప్రోత్సాహకరం ప్రకటిస్తున్న కంపెనీలపైనే దృష్టిని సారించాలి. గత వారం కూడా డిస్ట్రిబ్యూషన్ మరో రోజు పెరిగినందున మార్కెట్ అమాంతం పెరిగేందుకు కూడా అవకాశాలు తక్కువగా ఉన్నాయి. ఈ నేపథ్యంలో ఇన్వెస్టర్లు అప్రమత్తంగా వ్యవహరిస్తూ మార్కెట్ స్పష్టమైన దిశను ఏర్పాటు చేసుకునే వరకు వేచి చూడడమే మంచిది.

నిఫ్టీ
మద్ధతు స్థాయిలు : 10,750 - 10,690 - 10,535
నిరోధక స్థాయిలు : 10,920, 10,985 - 11,090

కుంభమేళాతో కాసుల పంట

ఉత్తరప్రదేశ్‌కు రూ.1.2 లక్షల కోట్లదాకా ఆదాయం: సీఐఐ అంచనా

త్రివేణి సంగమ పరిసరాల్లో ఆవిష్కృతమైన టెంట్ సిటీ

ప్రయాగ్‌రాజ్ (యూపీ), జనవరి 20: కనీవినీ ఎరుగని రీతిలో జరుగుతున్న కుంభమేళా.. ఉత్తరప్రదేశ్‌కు కాసుల వర్షాన్నే కురిపిస్తున్నది. అశేష భక్తజనంతో కిటకిటలాడుతున్న త్రివేణి సంగమం పరిసరాలు.. ప్రత్యక్షంగా, పరోక్షంగా పలు రంగాల్లో వేల కోట్ల రూపాయల లావాదేవీలను జరిపిస్తున్నాయి. ఈ క్రమంలోనే ఈసారి ఉత్తరప్రదేశ్‌కు రూ.1.2 లక్షల కోట్ల ఆదాయం రావొచ్చని వ్యాపార, పారిశ్రామిక సంఘం సీఐఐ అంచనా వేస్తున్నది. మునుపెన్నడూ లేనివిధంగా యూపీ సర్కారు..ఈ ఆధ్యాత్మిక, మతపరమైన వేడుకకు ఘనమైన ఏర్పాట్లు చేసిన విషయం తెలిసిందే. ఈ నెల 15న మొదలైన ఈ మెగా కుంభమేళా.. మార్చి 4దాకా జరుగనున్నది. దీంతో కుంభమేళా నిర్వహణకుగాను ఏకంగా రూ.4,200 కోట్లను యోగి ఆదిత్యనాథ్ ప్రభుత్వం కేటాయించింది. 2013తో పోల్చితే ఇది మూడు రెట్లు అధికం కావడం గమనార్హం. కాగా, వివిధ రంగాల్లోని మొత్తం 6 లక్షలకుపైగా మందికి ఈ కుంభమేళాతో ఉపాధి దక్కిందన్న సీఐఐ.. దేశ, విదేశాల నుంచి పెద్ద ఎత్తున భక్తులు తరలి వస్తుండటంతో ఒక్క ఆతిథ్య రంగంలోనే 2.50 లక్షల మందికి పని దొరికిందని పేర్కొన్నది. ఎయిర్‌లైన్స్, ఎయిర్‌పోర్ట్స్‌ల్లో దాదాపు 1.50 లక్షల మందికి, పర్యాటక రంగంలో సుమారు 45 వేల మందికి ఉద్యోగాలు లభించాయని తమ నివేదికలో సీఐఐ వెల్లడించింది. ఎకో-టూరిజం, మెడికల్ టూరిజంలలోనూ 85,000 మందికి ఉపాధి దక్కినట్లు తెలుస్తున్నది. టూర్ గైడ్స్, ట్యాక్సీ డ్రైవర్లు, వాలంటీర్లతో కూడిన అసంఘటిత రంగంలో మరో 55,000 వరకు కొత్త ఉద్యోగాలు వచ్చాయంటున్నది. దీంతో ఉత్తరప్రదేశ్‌లోని ప్రభుత్వ ఏజెన్సీలకు, ప్రైవేట్ రంగ వ్యాపారులకు కాసుల పంటే పండుతున్నదని సీఐఐ అభిప్రాయపడింది.

కొలువుదీరిన టెంట్ సిటీ

కుంభమేళాకు 15 కోట్ల మంది భక్తులు వస్తారని అంచనా ఉన్న నేపథ్యంలో ప్రయాగ్‌రాజ్ వద్ద 32 చదరపు కిలోమీటర్ల పరిధిలో యూపీ సర్కారు ప్రపంచంలోనే అతిపెద్ద తాత్కాలిక నగరాన్ని నిర్మించింది. ఈ టెంట్ సిటీలో టాయిలెట్లు, హోటల్స్, హాస్పిటల్స్, పోలీస్ స్టేషన్లు, షాపింగ్ మాల్స్ అన్నీ ఉన్నాయి. ఈ నగరంలో 4 వేలకుపైగా టెంట్లు, 40 వేలకుపైగా ఎల్ఈడీ లైట్లను అమర్చారు. ఇక 3,200 హెక్టార్ల విస్తీర్ణంలో విస్తరించిన కుంభమేళా ప్రాంతంలో 250 కిలోమీటర్ల స్థాయిలో రోడ్లు, 22 బల్లకట్టు వంతెనలను ఏర్పాటు చేశారు.



పొరుగు రాష్ర్టాలకూ పండుగే

కుంభమేళా కారణంగా ఉత్తరప్రదేశ్ పొరుగు రాష్ర్టాలకూ పండుగ వాతావరణం వచ్చింది. రాజస్థాన్, ఉత్తరాఖండ్, పంజాబ్, హిమాచల్ ప్రదేశ్ రాష్ర్టాలకూ పర్యాటకుల తాకిడి అధికంగా ఉన్నది. దీంతో ఆయా రాష్ర్టాల ఆదాయం కూడా భారీగా పెరుగవచ్చని సీఐఐ అంచనా వేసింది. ఇక్కడి పర్యాటక ప్రాంతాలకు రద్దీ పెరుగగా, వ్యాపార లావాదేవీలు జోరుగా సాగుతున్నట్లు సీఐఐ తాజా అధ్యయనం తేటతెల్లం చేస్తున్నది.



ఆతిథ్య రంగానికి జోష్

ఉత్తరప్రదేశ్‌లోని అలహాబాద్‌లోగల త్రివేణి సంగమం వద్ద జరుగుతున్న కుంభమేళాకు దేశం నలుమూలల నుంచేగాక ప్రపంచవ్యాప్తంగా పలు దేశాల నుంచీ భక్తజనం పోటెత్తుతున్నారు. ఆస్ట్రేలియా, బ్రిటన్, కెనడా, మలేషియా, సింగపూర్, దక్షిణాఫ్రికా, న్యూజీలాండ్, మారిషస్, జింబాబ్వే, శ్రీలంక తదితర దేశాల నుంచి భారీగా తరలి వస్తున్నారు. దీంతో ఆతిథ్య రంగం ఒక్కసారిగా ఊపందుకున్నది. కుంభమేళా పరిసర ప్రాంతాల్లో అటు ప్రభుత్వం, ఇటు ప్రైవేట్ రంగ సంస్థలు అతిథుల కోసం ప్రత్యేక ఏర్పాట్లనే చేశాయి. వారి విడిది కోసం తాత్కాలికంగా లగ్జరీ సదుపాయాలను కల్పించాయి. టెంట్లు వేసి సకల సౌకర్యాలతో తీర్చిదిద్దిన గదులకు ఒక్కరోజుకుగాను ప్రభుత్వం కనిష్ఠంగా రూ.2,500, గరిష్ఠంగా రూ.10,000 అద్దె వసూలు చేస్తున్నది. బెడ్, బ్రేక్‌ఫాస్ట్ సౌకర్యాలను అందిస్తున్నది. ఇక ప్రైవేట్ రంగ సంస్థలైతే ఒక్క రాత్రికి ఏకంగా రూ.32,000 చార్జ్ చేస్తుండటం గమనార్హం. చలి తీవ్రత మధ్య ఎయిర్ కండీషనర్ రూమ్స్‌ను అందుబాటులో ఉంచాయి. 50 రోజులపాటు ఈ కుంభమేళా జరుగనుండటంతో విదేశాల నుంచి వచ్చినవారు ఇక్కడే ఎక్కువ రోజులు ఉండేలా ప్లాన్ చేసుకుంటున్నారు. దీంతో హోటల్ యజమానుల ఆదాయం గణనీయంగా పెరుగుతున్నది.

బ్రిటన్‌ను దాటేయనున్న భారత్

అతిపెద్ద ఆర్థిక వ్యవస్థ కలిగిన దేశాల ర్యాంక్‌పై పీడబ్ల్యూసీ

న్యూఢిల్లీ, జనవరి 20: భారత ఆర్థిక వ్యవస్థ శరవేగంగా దూసుకుపోతున్నది. ప్రపంచ దేశాల్లో అత్యధిక వృద్ధిరేటును నమోదు చేసుకుంటున్న భారత్.. ప్రస్తుత సంవత్సరంలో బ్రిటన్‌ను అధిగమించనున్నదని ప్రపంచ కన్సల్టెన్సీ సంస్థ పీడబ్ల్యూసీ అంచనావేస్తున్నది. ప్రస్తుతం బ్రిటన్, ఫ్రాన్స్ దేశాల ఆర్థిక వ్యవస్థలు ఇంచుమించు భారత్‌కు దరిదాపుల్లో ఉన్నాయని, 2019లో ఈ రెండు దేశాల ర్యాంకులను అధికమించి ఐదో స్థానానికి ఎగబాకనున్నదని పీడబ్ల్యూసీ విడుదల చేసిన నివేదికలో వెల్లడించింది. బ్రిటన్ దేశ వృద్ధిరేటు 1.6 శాతంగా ఉంటుందని అంచనావేసిన నివేదిక..ఫ్రాన్స్ 1.7 శాతంగాను, ఇదే సమయంలో భారత్ 7.6 శాతం ఉంటుందని పేర్కొంది. ప్రస్తుత సంవత్సరంలో ఆర్థిక ర్యాంకింగ్‌లో పలు మార్పులు చోటుచేసుకునే అవకాశాలున్నాయన్న నివేదిక..బ్రిటన్‌ను భారత్‌తోపాటు ఫ్రాన్స్ కూడా దాటేయనున్నదని పేర్కొంది. దీంతో ఈ దేశ ర్యాంక్ ఐదో స్థానం నుంచి ఏడో స్థానానికి పడిపోనున్నది. ముఖ్యంగా బ్రెగ్జిట్ నుంచి బ్రిటన్ వైదొలుగుతుండటంతో ఆ దేశ ఆర్థిక వ్యవస్థ బలహీన పడటానికి ప్రధాన కారణమని నివేదిక విశ్లేషించింది. వరల్డ్ బ్యాంక్ అంచనాప్రకారం 2017లో ఆరో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థ కలిగిన భారత్..అతి త్వరలో ఫ్రాన్స్, బ్రిటన్‌లను అధిగమించి ఐదో స్థానాన్ని చేజిక్కించుకోనున్నదని తెలిపింది. మిగతా దేశాలతో పోలిస్తే భారత్ అధిక వృద్ధిని నమోదు చేసుకుంటున్నదని, 2019-20లో 7.6 శాతం వృద్ధిని సాధించనున్నదని, చమురు సరఫరాలో ఎలాంటి ఇబ్బందులు తలెత్తిన ఆయా దేశాల వృద్ధికి ఢోకాలేదని పేర్కొంది. రెండేండ్ల క్రితం అమలులోకి వచ్చిన జీఎస్టీలో మరింత పారదర్శకత నెలకొననుండటం, నూతనంగా ఏర్పడనున్న ప్రభుత్వం కూడా పాలసీలకు పెద్దపీట వేస్తే వృద్ధికి మరింత ఊతమిచ్చినట్లు అవుతున్నదని పీడబ్ల్యూసీ ఇండియా భాగస్వామి రానెన్ బెనర్జీ తెలిపారు. బ్రిటన్, ఫ్రాన్స్‌లు తమ ర్యాంకులు సర్వసాధారణంగా మారుతున్నాయని, 2018లో బ్రిటన్ పరిమిత వృద్ధిని నమోదు చేసుకోవడం భారత్‌కు కలిసొచ్చే అంశమని ఆయన పేర్కొన్నారు. ఇతర కరెన్సీలతో పోలిస్తే యూరో బలపడటంతో ఫ్రాన్స్ ఆర్థిక వ్యవస్థ మెరుగుపడేందుకు దోహదపడుతున్నది. 2016 చివరి నాటికి నమోదైన పలు దేశాల ఆర్థిక వ్యవస్థలు..2018 తొలినాటికి మెరుగుపడ్డాయని పీడబ్ల్యూసీ అంచనావేస్తున్నది.



2017కిగాను ప్రపంచ బ్యాంక్ విడుదల చేసిన ర్యాంకులు

దేశం	ఆర్థిక వ్యవస్థ (ట్రిలియన్ డాలర్లలో)	ర్యాంక్
అమెరికా	19.39	1
చైనా	12.23	2
జపాన్	4.87	3
జర్మనీ	3.67	4
బ్రిటన్	2.62	5
భారత్	2.59	6
ఫ్రాన్స్	2.58	7
ఇటలీ	2.08	8
బ్రెజిల్	1.90	9
కెనడా	1.73	10

మరో రెండేండ్లు గడువు ఇవ్వండి

■ స్పెక్ట్రం చెల్లింపులపై కేంద్రాన్ని కోరిన వొడాఫోన్ ఐడియా

న్యూఢిల్లీ, జనవరి 20: దేశంలో అతిపెద్ద టెలికం సంస్థ వొడాఫోన్ ఐడియా.. ఈ ఏడాదికిగాను స్పెక్ట్రం కోసం చెల్లింపుల గడువును మరో రెండేండ్లు ఇవ్వాలని కోరుతున్నది. ఇటీవల విలీనమైన సంస్థ భారీ అప్పులతో సతమతమవుతున్నదని, ముఖ్యంగా బ్యాలెన్స్ షీట్ అంతంతమాత్రంగా ఉండటంలో ప్రస్తుత సంవత్సరానికిగాను పది వేల కోట్ల రూపాయలను చెల్లించడానికి మరో రెండేండ్లు అవకాశం ఇవ్వాలని టెలికం డిపార్ట్‌మెంట్‌ను అభ్యర్థించినట్లు ప్రభుత్వవర్గాలు వెల్లడించాయి. ప్రస్తుత అంచనాప్రకారం వొడాఫోన్ ఐడియా ఈ ఏడాదికిగాను రూ.10 వేల కోట్ల మేర చెల్లించాల్సి ఉంటుంది. దీనిపై కంపెనీ ప్రతినిధి మాట్లాడుతూ..130 కోట్ల మంది భారతీయులకు డిజిటల్ సేవలు అందించడం టెలికం రంగ సంస్థలకు చాలా క్లిష్టమైన సమస్యని, పలు సంస్థలు సేవలు అందిస్తుండటంలో ఏ సంస్థనైనా ఎన్నుకునే అవకాశం వినియోగదారుడికి ఉంటుందని, ఇదే సమయంలో సంస్థల మధ్య పోటీ రోజురోజుకు పెరుగుతుండటంతో స్పెక్ట్రం కోసం అధికంగా నిధులు వెచ్చించాల్సి వస్తున్నదన్నారు. ప్రస్తుతం దేశీయ టెలికం ఇండస్ట్రీ ఆర్థిక ఒత్తిడిలో కొట్టుమిట్టాడుతున్నది. వొడాఫోన్, ఐడియాలు 2010, 2012, 2014, 2015, 2016లో విలీనం కంటే ముందు నిర్వహించిన స్పెక్ట్రం వేలం పాటలో పాల్గొన్నది. ఈ ఐదు వేలంపాటలో వొడాఫోన్ రూ.79,343 కోట్ల విలువైన స్పెక్ట్రాన్ని కొనుగోలు చేయగా, ఇదే సమయంలో ఐడియా రూ.63,597 కోట్లు కొనుగోలు చేసింది. దీర్ఘకాలికంగా టెలికం రంగం నిలకడైన వృద్ధిని సాధించాలంటే కేంద్ర ప్రభుత్వం వెంటనే చర్యలు తీసుకోవాలని, ముఖ్యంగా నగదు సరఫరాను మెరుగుపరుచాలని ఇటీవల వొడాఫోన్ ప్రతినిధి సూచించారు. రూ.7.8 లక్షల అప్పులు ఉండటంతో టెలికం రంగ సంస్థలను ఆదుకోవడానికి స్పెక్ట్రం చెల్లింపులను 10 ఏండ్ల నుంచి 16 ఏండ్లకు పెంచింది.

వ్యవసాయానికి పెద్దపీట

ఈ బడ్జెట్‌లో రూ.12 లక్షల కోట్లు కేటాయించే అవకాశం


న్యూఢిల్లీ, జనవరి 20: వచ్చే ఆర్థిక సంవత్సరానికిగాను కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టనున్న బడ్జెట్‌లో వ్యవసాయ రంగానికి పెద్దపీట వేసే అవకాశాలు మెండుగాకనిపిస్తున్నాయి. వచ్చే నెల 1న పార్లమెంట్ వేదికగా ప్రవేశపెట్టనున్న సార్వత్రిక బడ్జెట్‌లో ఈ రంగానికి రూ.12 లక్షల కోట్ల నిధులను వెచ్చించనున్నట్లు విశ్వసనీయ వర్గాలు తెలిపాయి. ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికి కేటాయించిన రూ.11 లక్షల కోట్లతో పోలిస్తే 10 శాతం పెంచనున్నారు. నరేంద్ర మోదీ సర్కార్ అధికారం చేపట్టిననాటి నుంచి వ్యవసాయ రంగానికి పెద్దపీట వేస్తునే ఉన్నారు. 2017-18లో రూ.11.68 లక్షల కోట్ల మేర నిధులను వెచ్చించగా, అంతక్రితం ఏడాదితో పోలిస్తే 15 శాతానికి పైగా పెంచారు. 2016-17లో రూ.9 లక్షల కోట్ల మేర కేటాయించాలని లక్ష్యంగా పెట్టుకున్న సర్కార్ రూ.10.66 లక్షల కోట్లు ఖర్చుచేసింది. రోజు రోజుకు పెరుగుతున్న దేశ జనాభాకు తగ్గట్టుగా ఆహార పంటల విస్తీర్ణాన్ని పెంచడానికి కేంద్రం కట్టుబడి ఉన్నదన్న ఆయన..భారీగా నిధులు కేటాయించడంతో ఈ లక్ష్యానికి చేరుకోవడానికి సులభతరమవుతుందని చెప్పారు. సంస్థాగత రుణాలు అందించడం ద్వారా రైతులను ఆదుకోవాలనే ఆలోచనలో కూడా కేంద్రం ఉన్నదని, అలాగే తక్కువ వడ్డీకే సంస్థాగతేర రుణాలు ఇవ్వనున్నట్లు తెలుస్తున్నది. సాధారణంగా వ్యవసాయ రుణాలపై 9 శాతం వార్షిక వడ్డీని వసూలు చేస్తున్నారు. వ్యవసాయ ఉత్పత్తులను పెంచడానికి వడ్డీని మినహాయించే అవకాశం కూడా ఉన్నదని ఆయన పేర్కొన్నారు. ఇది స్వల్పకాలంపాటు రైతులకు ఆర్థికంగా నిలదొక్కుకోవడానికి దోహదం చేయనున్నదని, తద్వారా ఉత్పత్తి సామర్థ్యం మరింత పెరిగి అవకాశం ఉన్నది. రూ.3 లక్షల లోపు స్వల్పకాల రుణాలపై వార్షిక వడ్డీని 9 శాతానికి బదులు 7 శాతం వసూలు చేస్తున్నది కేంద్రం. అంటే రెండు శాతం మేర సబ్సిడీ ఇస్తున్నదన్న మాట. సకాలంలో రుణాలు చెల్లించిన రైతులకు మరో 3 శాతం అదనపు రాయితీని కూడా కల్పిస్తున్నది ప్రభుత్వం. ఈ వడ్డీరాయితీలు ప్రభుత్వరంగ బ్యాంకులతోపాటు ప్రైవేట్ బ్యాంకులు, కో-ఆపరేటివ్ బ్యాంకులు, ప్రాంతీయ గ్రామీణ బ్యాంకులు ఇస్తున్నాయి.



సంస్కరణలు, పన్నుల హేతుబద్ధీకరణ

వచ్చే బడ్జెట్‌లో వ్యవసాయ రంగంలో సంస్కరణలు, ప్రత్యక్ష పన్నులను మరింత హేతుబద్ధీకరించే అవకాశాలు ఉన్నాయని పారిశ్రామిక సంఘం పీహెచ్‌డీ చాంబర్ పేర్కొంది. గడిచిన ఐదుసార్లు ప్రవేశపెట్టిన బడ్జెట్లతో ప్రతి రంగంపై దృష్టి సారించిన కేంద్రం..ఈసారి సంస్కరణలకు పెద్దపీట వేసే అవకాశం ఉన్నదని ఒక ప్రకటనలో తెలిపింది. నరేంద్ర మోదీ సర్కార్ ప్రవేశపెట్టనున్న చివరి బడ్జెట్ ఇదే కావడం విశేషం. దీనిని ఫిబ్రవరి 1న ప్రవేశపెట్టే అవకాశం ఉన్నది. ప్రత్యక్ష పన్నులను హేతుబద్ధీకరించడంతోపాటు కార్పొరేట్ ట్యాక్స్‌ను 25 శాతానికి తగ్గించాలని వ్యాపార దిగ్గజాలు కోరుతున్నాయి. అలాగే ఆదాయ పన్ను పరిమితిని రూ.3.5 లక్షలకు పెంచాలని విజ్ఞప్తి చేస్తున్నారు. ప్రస్తుతం ఇది రూ.25 లక్షలుగా ఉన్నది.

23 నుంచి బిగ్‌బజార్ ‘సబ్ సేసస్తా 5 దిన్’



హైదరాబాద్, జనవరి 20: కిశోర్ బియానీకి చెందిన ప్రముఖ రిటైల్ సంస్థ బిగ్‌బజార్..‘సబ్‌సస్తా 5 దిన్’ పేరుతో అతిపెద్ద షాపింగ్ ఫెస్టివెల్‌కు సిద్ధమైంది. ఈ నెల 23న ప్రారంభమవనున్న ఈ షాపింగ్ పండుగ 27న ముగియనున్నదని తెలిపింది. ఈ ఆఫర్లలో భాగంగా రూ.3 వేల కంటే అధిక విలువైన ఆహార, గృహోపకరణాలు, ఎలక్ట్రానిక్స్, ఫ్యాషన్, దుస్తులు, పాదరక్షలు, బొమ్మలు, లగేజ్‌లతోపాటు ఇతర వస్తువుల కొనుగోలు చేసిన వారికి 20 శాతం కంటే అధికంగా క్యాష్‌బ్యాక్ లభించనున్నట్లు ప్రకటించింది. దీంతోపాటు రూపే కార్డు కలిగిన కొనుగోలుదారులకు అదనపు రాయితీ లభించనున్నది. కనీసంగా రూ.500 షాపింగ్ చేయాల్సి ఉంటుంది. అలాగే ఈ నెల 21నుంచి 22 లోపు రూ.1,000 షాపింగ్ చేసిన ప్రత్యేక సభ్యులకు రూ.100 అదనపు డిస్కౌంట్‌ను కల్పిస్తున్నట్లు కంపెనీ సీఈవో సదాశివ్ నాయక్ తెలిపారు. దుస్తులపై 50 శాతం రాయితీతోపాటు అదనంగా 20 శాతం క్యాష్‌బ్యాక్, రూ.22,990 ధర కలిగిన కోర్యో 32 అంగుళాల సూపర్ స్లిప్ ఎల్ఈడీ టీవీ, 2 హెచ్‌డీఎంఐ, 2 యూఎస్‌బీని రూ.7,992కి, టన్ను స్ప్లిట్ ఏసీ మూడు స్టార్ రేటింగ్‌ను రూ.27,990కి బదులు రూ.20,990కి, రెడ్మీ 6ఏ 2జీబీ/16జీబీని రూ.6,299కి, రెడ్మీ వై2 3జీబీ/32 జీబీని రూ.9,299కి, గృహోపకరణాలపై 60 శాతం డిస్కౌంట్‌తోపాటు 20 శాతం అదనపు క్యాష్ బ్యాక్ లభించనున్నది.

ఈ-వే బిల్లులు రావట!

■ ఆరు నెలలు జీఎస్టీ రిటర్నులు దాఖలు చేయనివారికి అంతే
■ త్వరలో ఐటీ వ్యవస్థను తీసుకురానున్న జీఎస్టీఎన్

న్యూఢిల్లీ, జనవరి 20: వస్తు, సేవల పన్ను (జీఎస్టీ) రిటర్నులను వరుసగా ఆరు నెలలపాటు దాఖలు చేయకపోతే వారికిక ఈ-వే బిల్లులు రాకుండా చేస్తున్నది కేంద్రం. ప్రస్తుతం సరకు రవాణాకు ఈ-వే బిల్లులు తప్పనిసరి అన్న విషయం తెలిసిందే. జీఎస్టీ ఎగవేతలకు అడ్డుకట్ట వేయడంలో భాగంగా నిరుడు ఏప్రిల్ 1 నుంచి రూ.50,000లకుపైగా విలువైన వస్తు రవాణా రాష్ర్టాల మధ్య జరుగాలంటే ఈ-వే బిల్లును తప్పనిసరి చేసిన ప్రభుత్వం.. ఏప్రిల్ 15 నుంచి దశలవారీగా రాష్ర్టాల్లోనూ అమల్లోకి తెచ్చింది. అప్పట్నుంచి జీఎస్టీ ఇన్స్‌పెక్టర్‌కు ఈ-వే బిల్లు చూపించనిదే సరకు ముందుకు కదలడం లేదు. ఈ క్రమంలోనే జీఎస్టీ రిటర్నులను ఫైల్ చేయనివారిపై కొరడా ఝుళిపించేందుకు ఈ-వే బిల్లుల అస్ర్తాన్ని ప్రయోగించాలని చూస్తున్నది మోదీ సర్కారు. ఇందులో భాగంగానే ఓ ఐటీ వ్యవస్థను అభివృద్ధి చేస్తున్నది జీఎస్టీ నెట్‌వర్క్. దీని సాయంతో ఆరు నెలలుగా జీఎస్టీ రిటర్నులను దాఖలు చేయనివారికి ఈ-వే బిల్లు రాకుండా చేస్తామని ఓ అధికారి పీటీఐకి చెప్పారు. దీనివల్ల జీఎస్టీ ఎగవేతదారులకు సమర్థవంతంగా చెక్ పెట్టవచ్చని అధికారులు భావిస్తున్నారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం (2018-19) ఏప్రిల్-డిసెంబర్ వ్యవధిలో జీఎస్టీ ఎగవేత, నిబంధనల ఉల్లంఘనకు సంబంధించి 3,626 కేసులను కేంద్ర పన్ను అధికారులు గుర్తించారు. కాగా, కొందరు రవాణాదారులు ఒక్క ఈ-వే బిల్లుపైనే చాలా ట్రిప్పులు వేస్తున్నట్లూ అధికారుల దృష్టికి వచ్చింది.



ఆభరణాల కొనుగోలుకు ప్రత్యేక యాప్

■ ఆవిష్కరించిన ఐటీ కార్యదర్శి జయేశ్ రంజన్

హైదరాబాద్, జనవరి 20: బంగారు, వెండి, ఇతర ఆభరణాల కొనుగోలుకు ప్రత్యేకంగా ‘జువెల్లరీకార్ట్.ఇన్’ యాప్‌ను రూపొందించారు. 135 సంవత్సరాల చరిత్ర గల శ్రీకీమ్తి జువెల్లరీస్ సంస్థ అధినేత దీపక్‌కీమ్తి ఈ యాప్‌ను తయారు చేయించగా, ఆదివారం బంజారాహిల్స్‌లోని హయత్‌ప్యాలెస్ హోటల్‌లో రాష్ట్ర ఐటీ ప్రిన్సిపల్ సెక్రెటరీ జయేశ్‌రంజన్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జువెల్లరీకి ప్రత్యేక యాప్‌ను రూపొందించడం అభినందనీయమని అన్నారు. శ్రీకీమ్తి జువెల్లరీస్ అధినేత దీపక్‌కీమ్తి మాట్లాడుతూ.. యాప్‌ను గూగుల్ ప్లేస్టోర్ ద్వారా డౌన్‌లోడ్ చేసుకున్న తర్వాత తమ ఫొటోను అప్‌లోడ్‌చేస్తే ఎంచుకున్న నగ ధరించినట్లు చూపిస్తుందని, నప్పుతుందో లేదో చూసుకోవచ్చని తెలిపారు. ఈ యాప్‌లో 700 జువెల్లరీ షాప్‌లకు చెందిన చిరునామాలు ఉన్నాయని, వీటిని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ట్విన్ సిటీస్ జువెల్లర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు కైలాశ్‌చరణ్ అగర్వాల్, హైటెక్ సిటీ జువెల్లరీ మ్యానుఫ్యాక్చర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు మహేందర్ తాయల్, సూర్యప్రకాశ్‌రావు, జినేందర్, మోహన్‌లాల్, అశోక్‌జైన్ తదితరులు పాల్గొన్నారు.



నేపాల్, భూటాన్ వెళ్లడానికి
ఆధార్ ఉంటే చాలు

■ 15 లోపు, 65 ఏండ్లు పైబడిన వాళ్లకు మాత్రమే ఈ అవకాశం

న్యూఢిల్లీ, జనవరి 20: ప్రభుత్వ పథకాలకు ప్రామాణికంగా మారిన ఆధార్ కార్డు ఇప్పుడు నేపాల్, భూటాన్ వెళ్లడానికి పాస్‌పోర్టుగా కూడా ఉపయోగపడనుంది. 15 ఏండ్ల లోపు, 65 ఏండ్లు పైబడిన వాళ్లు కేవలం ఆధార్ కార్డు చూపించి ఈ రెండు దేశాలకు వెళ్లవచ్చు. సాధారణంగా మన దేశం దాటి వేరే దేశానికి వెళ్లాలంటే వీసా లేదా పాస్‌పోర్టు అవసరం. కానీ, నేపాల్, భూటాన్‌లకు వెళ్లాలంటే పాస్‌పోర్టు ఉంటే సరిపోతుంది. అయితే గతంలో 15 ఏండ్లలోపు వయసున్న వాళ్లు, 65 ఏండ్లు పైబడిన వాళ్లు ఈ రెండు దేశాలకు వెళ్లాలంటే పాన్‌కార్డు, డ్రైవింగ్ లైసెన్స్, కేంద్ర ప్రభుత్వ ఆరోగ్య సేవల కార్డు, రేషన్‌కార్డు ఉన్నా సరిపోయేది. తాజాగా ఈ జాబితాలో ఆధార్ కార్డును కూడా కేంద్ర ప్రభుత్వం చేర్చింది. దీంతో ఇకపై పిల్లలు, వృద్ధులు ఆధార్ కార్డును చూపించి నేపాల్, భూటాన్ అందాలను వీక్షించి రావచ్చు. ఒకవేళ 15 ఏండ్లపైన వయసున్న వాళ్లు, 65 ఏండ్లలోపు వాళ్లు నేపాల్, భూటాన్ వెళ్లాలంటే పాస్‌పోర్టు, భారత ప్రభుత్వం జారీ చేసిన ఫొటో గుర్తింపు కార్డు, ఓటరు గుర్తింపు కార్డు ఇందులో ఏదో ఒకటి ఉంటే సరిపోతుంది.


పుష్పపూర్ణిమ సందర్భంగా ఆదివారం కుంభమేళాలో గంగానదికి హారతిపడుతున్న పూజారులు

ప్రపంచంలోనే అత్యంత వృద్ధుడు మసాజో కన్నుమూత

■ స్వీట్లంటే పడిచచ్చేంత ఇష్టంగా తినే జపాన్ తాత


గిన్నిస్ వరల్డ్ రికార్డును అందుకుంటున్న మసాజో నోనాకా (ఫైల్)

టోక్యో : ప్రపంచంలోనే అత్యంత వృద్ధుడిగా పేరుగాంచిన మసాజో నొనాకా(113) ఆదివారం తెల్లవారుజామున కన్నుమూశారు. జపాన్‌లోని అసోరో ప్రాంతానికి చెందిన ఆయన నిద్రలోనే ప్రాణాలు వదిలారు. మసాజో విధిధర్మంలో భాగంగానే కన్నుమూశారని ఆయన కుటుంబసభ్యులు తెలిపారు. 25 జూలై 1905లో జన్మించిన మసాజోను ప్రపంచంలోనే అత్యంత వృద్ధుడిగా 2018 ఏప్రిల్‌లో గిన్నిస్ వరల్డ్ రికార్డు గుర్తించింది. మసాజో మనుమరాలు యూకో నొనాకా స్పందిస్తూ తాత ఊపిరితీసుకోకపోతుండటంతో డాక్టరుకు చూపించామని, పరీక్షించిన డాక్టరు మరణించినట్లు ధ్రువీకరించారని తెలిపారు. మసాజోకు ఎలాంటి ఆరోగ్య సమస్యలు లేవన్నారు. తాతకు స్వీట్లు అంటే చాలా ఇష్టమని, ఎంతో ప్రీతిగా వాటిని ఆరగించేవారని పేర్కొన్నారు.

చెత్త కుప్పల నుంచి మేయర్ దాకా..!



ఛండీగఢ్, జనవరి 20: రాజేశ్ కలియా... ఛండీగఢ్ కొత్త మేయర్. శనివారం జరిగిన ఎన్నికల్లో మొత్తం 27 ఓట్లలో 16 ఓట్లు సాధించి బీజేపీ తరఫున మేయర్‌గా ఎన్నికయ్యారు. అయితే ఆయన ఈ స్థాయికి చేరడంలో ఎన్నో అవమానాలున్నాయి. ఛీత్కారింపులున్నాయి. కుటుంబం గడవడం కోసం కలియా ఒకనొక సమయంలో తన సోదరులతో కలిసి చెత్త కూడా ఏరాడు. కలియా తండ్రి కుందన్ లాల్ స్వీపర్‌గా రిటైర్ అయ్యారు. ఓ సోదరుడు ఇప్పటికీ స్వీపర్‌గా పనిచేస్తున్నారు. 'బడి ముగిసిన తర్వాత నా ఇద్దరు సోదరులు, నలుగురు సోదరిణులతో కలసి చెత్త ఏరుకునేవాళ్లం. వాటిని అమ్మి కుటుంబానికి అండగా నిలిచేవాళ్లం. ఈ పని చేసినందుకు నేనేమీ సిగ్గుపడడం లేదు' అని కలియా తెలిపారు. మేయర్‌గా తనకు ఎంత జీతం వస్తుందో కూడా తెలియదని ఆయన పేర్కొన్నారు.

కశ్మీర్‌లో ఒంటరిగా పోటీ

■ మిత్రులతో కలిసి సర్కార్ ఏర్పాటుచేస్తాం
■ బీజేపీ ప్రధాన కార్యదర్శి రాం మాధవ్ వెల్లడి

జమ్ము, జనవరి 20: త్వరలో జరిగే జమ్ముకశ్మీర్ అసెంబ్లీ ఎన్నికల్లో ఒంటరిగానే పోటీ చేస్తామని బీజేపీ ప్రధాన కార్యదర్శి రాం మాధవ్ తెలిపారు. ఎన్నికల ముందు పొత్తు పెట్టుకునే అవకాశాలు తక్కువని, ఫలితాలు వెలువడిన తర్వాత అతిపెద్ద పార్టీగా బీజేపీ అవతరిస్తుందని ఆదివారం మీడియాతో రాం మాధవ్ చెప్పారు. ఎన్నికల ఫలితాలు వెలువడిన తర్వాత కొందరు స్నేహితులతో కలిసి బీజేపీ సుస్థిర ప్రభుత్వాన్ని ఏర్పాటు చేస్తుందన్నారు. జమ్ముకశ్మీర్‌కు ఉన్న ప్రత్యేక పరిస్థితుల దృష్ట్యా.. ప్రభుత్వ ఏర్పాటు కోసం ఎవరితోనైనా చేతులు కలిపేందుకు తాము సిద్ధంగా ఉన్నామన్నారు. వచ్చేనెల మూడో తేదీన రాష్ట్రంలో ప్రధాని మోదీ పర్యటనతో ఎన్నికల ప్రచారం ప్రారంభిస్తారన్నారు.

79కు చేరుకున్న మెక్సికో మృతుల సంఖ్య

త్లాహులిన్‌పాన్ (మెక్సికో), జనవరి 20: మెక్సికోలో ఇంధన పైప్‌లైన్ పేలి మరణించిన వారి సంఖ్య ఆదివారం నాటికి 79కు చేరుకుంది. హిదాల్గో రాష్ట్రంలోని త్లాహులిన్‌పాన్ ప్రాంతంలో శుక్రవారం సాయంత్రం ఇంధన (గ్యాసోలిన్) పైప్‌లైన్‌ను చమురు దొంగలు బద్దలు కొట్టి అక్రమంగా ట్యాప్‌ను ఏర్పాటు చేయడం.. అది లీకవడంతో గ్యాసోలిన్‌ను తీసుకెళ్లేందుకు స్థానికులు బకెట్లు, డబ్బాలు, సీసాలు తీసుకుని అక్కడికి చేరుకోవడంతో ప్రమాదవశాత్తూ పైప్‌లైన్ పేలి భారీగా మంటలు ఎగిగిసిపడిన విషయం తెలిసిందే.

సింహాల దాడిలో వ్యక్తి మృతి

చండీగఢ్, జనవరి 20: చండీగఢ్‌లో సింహాలు దాడి చేయడంతో ఓ వ్యక్తి ప్రాణాలు కోల్పోయాడు. ఈ సంఘటన ఆదివారం జిరాక్‌పూర్‌లోని ఛాహత్ బిర్ జంతు ప్రదర్శన శాలలో చోటుచేసుకుంది. దాదాపు 25 అడుగుల ఎత్తున్న జూపార్క్ ప్రహరీగోడను ఓ వ్యక్తి ఎక్కి అవతలికి దూకాడు. అది సింహాల ఎన్‌క్లోజర్ అన్న విషయం అతడికి తెలియదు. దీంతో అక్కడ ఉన్న రెండు సింహాలు దాడి చేయడంతో అతడు ప్రాణాలు కోల్పోయాడు.

అక్రమ వలసదారులకు రక్షణ

ప్రభుత్వ మూసివేతకు ముగింపు పలికేందుకు ట్రంప్ ప్రతిపాదన.. ఆమోదయోగ్యంగా లేదన్న డెమోక్రాట్లు



వాషింగ్టన్, జనవరి 20: దాదాపు నెలరోజులుగా కొనసాగుతున్న ప్రభుత్వ మూసివేతకు ముగింపు పలికేందుకు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ నూతన ప్రతిపాదనలు చేశారు. మెక్సికో సరిహద్దుల్లో గోడ నిర్మించేందుకు 5.7 బిలియన్ డాలర్లు ఇచ్చేందుకు ప్రతిగా అక్రమ వలసదారులకు పలు రక్షణలు కల్పించనున్నట్లు చెప్పారు. అయితే ఈ ప్రతిపాదనకు డెమోక్రాట్లు నిరాకరించారు. ఇది విజయవంతం కాదని తేల్చిచెప్పారు. వలస విధానంపై చర్చల కంటే ముందు ప్రభుత్వాన్ని తెరవాలని డిమాండ్ చేశారు. ఆదివారం శ్వేతసౌధం నుంచి టెలివిజన్‌లో ట్రంప్ ప్రసంగిస్తూ... ప్రస్తుత ప్రతిష్ఠంభనను తొలిగించేందుకు తాను ప్రయత్నిస్తున్నట్లు చెప్పారు. చిన్నతనంలోనే తల్లిదండ్రులతో అక్రమంగా దేశంలోకి ప్రవేశించినవారికి (డ్రీమర్లు), హింస, ప్రకృతి విపత్తుల కారణంగా వలస వచ్చిన వారికి పలు రక్షణలు కల్పించనున్నట్లు చెప్పారు. 7 లక్షల మంది డ్రీమర్లు, టీపీఎస్ (టెంపరరీ ప్రొటెక్టెడ్ స్టేటస్) కింద నివసిస్తున్న మరో 3 లక్షల మందికి మూడేండ్ల పాటు వర్క్ పర్మిట్లు, సామాజిక భద్రత నంబర్ల కొనసాగింపు, దేశ బహిష్కరణ నుంచి రక్షణలు కల్పించనున్నట్లు తెలిపారు. అలాగే తక్షణ మానవతా సాయం కింద 800 మిలియన్ డాలర్లు, యూఎస్ పోర్టుల్లో భద్రత పెంపులో భాగంగా డ్రగ్ డిటెక్షన్ టెక్నాలజీ కోసం మరో 805 మిలియన్ డాలర్లు ఇవ్వాలని ట్రంప్ కోరారు. సరిహద్దు భద్రత పెంపునకు కూడా ఆయన పలు సూచనలు చేశారు. అయితే ట్రంప్ ప్రతిపాదనలను డెమోక్రాట్లు తిరస్కరించారు. ఇవి ఆమోదయోగ్యం కావని స్పీకర్ నాన్సీ పెలోస్ స్పష్టం చేశారు. డ్రీమర్లు, టీపీఎస్ కింద నివసిస్తున్న వారికి శాశ్వత పరిష్కారం ఇందులో సూచించలేదన్నారు. మొత్తంగా ఇవి విశ్వాసం కలిగించేవిగా లేవన్నారు. అక్రమ వలసలను నిరోధించేందుకు మెక్సికో సరిహద్దులో గోడ నిర్మించేందుకు 5.7 బిలియన్ డాలర్లు ఇవ్వాలని ట్రంప్ కోరుతున్న విషయం తెలిసిందే. అయితే ఇందుకు డెమోక్రాట్లు ససేమిరా అంటున్నారు. దీంతో పలు ఆర్థిక బిల్లులకు కాంగ్రెస్ ఆమోదం లభించక ప్రభుత్వం మూతపడింది. ఈ కారణంగా సుమారు 8 లక్షల మంది ఫెడరల్ ఉద్యోగులకు జీతాలు అందక వారు తీవ్ర అవస్థలు పడుతున్నారు.




జల్లికట్టులో ప్రపంచ రికార్డు

■ 1354 ఎడ్లతో పోటీల నిర్వహణ

పుదుకొట్టాయి: సంక్రాంతి సందర్భంగా తమిళనాడులో నిర్వహించే జల్లికట్టు (ఎద్దుల పోటీ) ఈ ఏడాది ప్రపంచ రికార్డు సృష్టించింది. గతేడాదితో పోలిస్తే ఈ ఏడాది రెట్టింపు సంఖ్యలో ఎడ్లు పోటీలో పాల్గొన్నాయి. 2017లో 647 ఎడ్లతో జల్లికట్టు నిర్వహించగా ఈ ఏడాది 1354 ఎడ్లు పాల్గొన్నాయని రాష్ట్ర ఆరోగ్య శాఖ మంత్రి సీ విజయభాస్కర్ తెలిపారు. ఈ సందర్భంగా ఇద్దరు మృతి చెందగా, కొంతమంది ప్రేక్షకులతోపాటు 31 మంది గాయపడ్డారని పోలీసులు తెలిపారు. వాస్తవంగా 2000 ఎడ్లతో జల్లికట్టు నిర్వహించాలని తలపెట్టినా సమయాభావం వల్ల సాధ్యం కాలేదని నిర్వాహకులు తెలిపారు. ఈ పోటీల్లో పాల్గొనేందుకు 500 మంది పేర్లు నమోదు చేసుకోగా, 424 మంది పాల్గొన్నారు.

సిక్కుపై అమెరికాలో
జాతి విద్వేష దాడి

■ సిగరెట్ పేపర్లు ఇవ్వనందుకు శ్వేత జాతీయుడి కండకావరం


నిందితుడు ఆండ్రూ రామ్‌సే

వాషింగ్టన్, జనవరి 20: అమెరికాలో జాతి విద్వేషం మళ్లీ పడగవిప్పింది. ఓ సిక్కు మతస్తుడిని ఓ శ్వేత జాతీయుడు దారుణంగా చితకబాదాడు. గడ్డం పట్టుకుని, ముఖంపై పిడిగుద్దులు గుద్దాడు. అనంతరం కింద పడేసి ఇష్టమొచ్చినట్లుగా తన్నాడు. ఓరెగాన్ రాష్ట్రంలో సోమవారం ఈ ఘటన జరిగింది. పోలీసుల వివరాల ప్రకారం... సిక్కు మతస్తుడైన హరిద్వార్ సింగ్ డోడ్ అక్కడి ఓ స్టోర్‌లో పనిచేస్తున్నాడు. ఆండ్రూ రామ్‌సే అనే 24 ఏండ్ల శ్వేత జాతీయుడు సిగరెట్ చుట్టే పేపర్ల కోసం ఆ స్టోర్‌కు వచ్చాడు. అయితే అతడి వద్ద గుర్తింపు కార్డు లేకపోవడంతో అవి అమ్మేందుకు హరిద్వార్ నిరాకరించాడు. షాపు నుంచి వెళ్లిపోవాల్సిందిగా కోరాడు. దీంతో అతడు హరిద్వార్ సింగ్‌పై విచక్షణా రహితంగా దాడికి దిగాడు. ముఖంపై పిడిగుద్దులు గుద్ది, కిందపడేసి దారుణంగా తన్నాడు. హరిద్వార్‌పై బూట్ కూడా విసిరాడు. ఈ క్రమంలో అక్కడున్న వారు రామ్‌సేను పట్టుకుని పోలీసులకు అప్పగించారు. జాతి విద్వేషం కారణంగానే అతడు ఈ దాడికి దిగినట్లు న్యాయ సలహాదారు జస్టిన్ బ్రెచెట్ తెలిపారు. రామ్‌సేపై ద్వేషపూరిత నేరం, దాడి అభియోగాలు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు. కాగా, ఎఫ్‌బీఐ గణాంకాల ప్రకారం ఓరెగాన్ రాష్ట్రంలో 2016తో పోలిస్తే 2017లో జాతి విద్వేష దాడులు 40 శాతం పెరిగాయి.

పౌరసత్వ బిల్లును వ్యతిరేకిస్తాం: జేడీయూ


కేసీ త్యాగి

పాట్నా, జనవరి 20: పౌరసత్వ (సవరణ) బిల్లు,2016ను రాజ్యసభలో వ్యతిరేకిస్తామని యునైటెడ్ జనతాదళ్ (జేడీ-యూ) తెలిపింది. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వానికి మద్దతుతో దీనికి సంబంధం లేదని, ఎప్పుడు రాజ్యసభలో ఆ బిల్లును ప్రవేశపెట్టినా వ్యతిరేకిస్తామని జేడీయూ జాతీయ ప్రధాన కార్యదర్శి కేసీ త్యాగి చెప్పారు. జేడీయూ అధ్యక్షుడు, బీహార్ సీఎం నితీశ్ కుమార్ అధ్యక్షతన ఆయన నివాసంలో ఆదివారం పార్టీ ఆఫీసు బేరర్ల సమావేశం జరిగింది. ఆ తర్వాత కేసీ త్యాగి ఆదివారం మీడియాతో మాట్లాడుతూ ఈ నెల ఎనిమిదో తేదీన లోక్‌సభలో ఈ బిల్లును ఓటింగ్‌కు పెట్టినప్పుడు కాంగ్రెస్ పార్టీ వాకౌట్ చేయడం ద్వారా ప్రభుత్వానికి మద్దతు పలికిందని ఆరోపించారు. అయోధ్యలో రామ మందిరం, 370వ అధికరణం, ఉమ్మడి పౌరస్మృతి వంటి అంశాల్లో తమ వైఖరి మారలేదన్నారు. ఈ బిల్లు విషయమై లోక్‌సభలో కాంగ్రెస్ అనుసరించిన వ్యూహం ఖండించదగిన అంశం అని పేర్కొన్నారు. బంగ్లాదేశ్, పాకిస్థాన్, ఆఫ్ఘనిస్థాన్ దేశాల నుంచి వలస వచ్చి ఆరేండ్ల పాటు దేశంలో స్థిర నివాసం ఏర్పాటు చేసుకున్న ముస్లిమేతరులకు పౌరసత్వం కల్పించాలని కేంద్రం ప్రతిపాదించిన పౌరసత్వ (సవరణ) బిల్లు, 2016ను లోక్‌సభ ఆమోదించింది. కానీ ఈ బిల్లును ఈశాన్య రాష్ట్రాల్లోని పలు సంస్థలు, వ్యక్తులు వ్యతిరేకించారు. 1985 అసోం ఒప్పందాన్ని ఈ బిల్లు రద్దు చేస్తుంది. ఈ ఒప్పందం ప్రకారం 1971 మార్చి 24 తర్వాత అసోంకు వచ్చిన శరణార్థులను వారి దేశాలకు పంపేయాల్సి ఉంటుంది.

ప్రతినిధుల ద్వారా ఎన్‌ఆర్‌ఐల ఓటింగ్?

■ రాజ్యసభలో బిల్లు పెండింగ్

న్యూఢిల్లీ, జనవరి 20: ప్రవాస భారతీయులు తమ ప్రతినిధుల ద్వారా ఓటు హక్కు వినియోగించుకునేందుకు వీలు కల్పించే కీలక బిల్లుకు పార్లమెంట్ ఆమోదం కోసం కేంద్ర న్యాయ శాఖ ప్రయత్నాలు చేస్తున్నది. అలాగే సర్వీస్ ఓటర్లకు సంబంధించిన లింగ సమానత్వ బిల్లు ఆమోదానికి కూడా కసరత్తు చేస్తున్నది. లోక్‌సభ ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో ఈ బిల్లులకు ప్రాధాన్యం ఏర్పడింది. పార్లమెంటు బడ్జెట్ సమావేశాలు జనవరి 31 నుంచి ఫిబ్రవరి 13 వరకు జరగనున్నాయి. ఈ నేపథ్యంలో ఈ సమావేశాల్లోనే ఈ బిల్లులకు పార్లమెంటు ఆమోదం లభించేలా కేంద్రం ప్రయత్నాలు చేస్తున్నది. ఎన్‌ఆర్‌ఐల ఓటింగ్‌కు సంబంధించిన బిల్లుకు 2018 ఆగస్టులోనే లోక్‌సభ ఆమోదం తెలిపింది. అయితే రాజ్యసభలో ఈ బిల్లు పెండింగ్‌లో ఉంది. ప్రస్తుతం వీరు ఓటరుగా నమోదు చేసుకుని, భారత్‌కు వచ్చి వారివారి నియోజకవర్గాల్లో ఓటు వేయాల్సి వస్తున్నది. విదేశాంగ శాఖ వివరాల ప్రకారం ప్రస్తుతం 3.10 కోట్ల మందికి పైగా భారతీయులు వివిధ దేశాల్లో నివసిస్తున్నారు.

బాలల అవార్డుల ఎంపిక బాధ్యత కేంద్రానిదే

■ ఐసీసీడబ్ల్యూపై వేటు

న్యూఢిల్లీ, జనవరి 20: జాతీయ సాహస బాలల అవార్డుల ఎంపిక ప్రక్రియను కేంద్ర ప్రభుత్వం ఈసారి సొంతంగానే చేపట్టింది. 1957 నుంచి ఈ ప్రక్రియను పర్యవేక్షిస్తున్న ఇండియన్ కౌన్సిల్ ఫర్ చైల్డ్ వెల్ఫేర్ (ఐసీసీడబ్ల్యూ) అనే స్వచ్ఛంద సంస్థ నిధుల దుర్వినియోగానికి పాల్పడినట్లు ఆరోపణలు రావడంతో కేంద్రం ఆ సంస్థతో తెగదెంపులు చేసుకుంది. అలాగే జాతీయ సాహస బాలల అవార్డులను ప్రధానమంత్రి జాతీయ బాలల అవార్డులలో మరో క్యాటగిరీగా చేర్చింది. దాదాపు ఆరు దశాబ్దాలుగా నీతి, నిజాయితీతో తమ పని నిర్వహిస్తున్నామని, మా సంస్థపై ఇలాంటి ఆరోపణలు రావడం బాధాకరమని ఐసీసీడబ్ల్యూ అధ్యక్షులు గీతా సిద్ధార్థ వ్యాఖ్యానించారు. ఐసీసీడబ్ల్యూ నిధుల దుర్వినియోగానికి పాల్పడిందని కేంద్ర మాతా శిశు అభివృద్ధి మంత్రిత్వ శాఖ ఎఫ్ఐఆర్ నమోదు చేసింది. ఖర్చు చేయని నిధులను ఆ సంస్థ తిరిగి చెల్లించలేదని విచారణలో తేలిందని వెల్లడించింది. ఈ నేపథ్యంలో కేంద్ర మంత్రి మేనకా గాంధీ నేతృత్వంలోని ఎంపిక కమిటీ గత వారం సమావేశమై బాలల అవార్డులకు 29 మందిని ఎంపిక చేసింది. గణతంత్ర దినోత్సవం రోజున వీరు రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్ చేతుల మీదుగా అవార్డులు స్వీకరించనున్నారు.

స్వైన్‌ఫ్లూ నుంచి కోలుకున్న అమిత్ షా

■ ఎయిమ్స్ నుంచి డిశ్చార్జి

న్యూఢిల్లీ, జనవరి 20: స్వైన్‌ఫ్లూతో బాధపడుతూ ఢిల్లీలోని ఎయిమ్స్ దవాఖానలో చికిత్స పొందుతున్న బీజేపీ జాతీయాధ్యక్షుడు అమిత్ షా ఆదివారం డిశ్చార్జి అయ్యారు. తాను పూర్తి ఆరోగ్యంగా ఉన్నానని, తన కోసం దేవుడిని ప్రార్థించిన అందరికీ కృతజ్ఞతలని షా ట్వీట్ చేశారు. ఎయిమ్స్ అధికార వర్గాలు మాట్లాడుతూ స్వైన్‌ఫ్లూ నుంచి షా కోలుకున్నారని, దీంతో డిశ్చార్జి చేశామని తెలిపాయి. ఊపిరితీసుకోవడంలో సమస్య ఉండటంతో బుధవారం అమిత్ షా ఎయిమ్స్‌లో చేరారు. వైద్య పరీక్షలు నిర్వహించిన డాక్టర్లు స్వైన్‌ఫ్లూ సోకినట్లు నిర్ధారించారు.

నమస్తే తెలంగాణ
జిందగీ
సోమవారం 21 జనవరి 2019 WWW. NTNEWS.COM /nt.zindagi

చక్కెర చిట్కాలు

- చర్మంపై మృతకణాలను తొలగించడంలో చక్కెర చాలాబాగా పని చేస్తుంది. ముఖ్యంగా మోకాళ్లు, మోచేతులపై ఉండే మృత కణాలను నిమ్మకాయ ముక్కకు చక్కెరను అద్ది రుద్దితే చాలు నల్లగా ఉన్న చర్మం కాంతివంతంగా మెరుస్తుంది.
- మొక్కల ఆహారంలో చక్కెర అతి ముఖ్యమైనది. మొక్కలు కూడా గ్లూకోజ్‌ను చాలా బాగా ఇష్టపడతాయి. అయితే ఇంట్లో ఉన్న మొక్కలకు చక్కెరతో పాటు కాస్త వెనిగర్ కూడా కలిపితే చీమలు, ఈగలు, కీటకాలు రాకుండా ఉంటాయి.
- కొన్ని సందర్భాల్లో పెదాలకు ఉన్న లిప్‌స్టిక్ గ్లాసులకు, ఇతర పాత్రలకు అంటినప్పుడు దానిని తొలిగించడం చాలా కష్టం. అటువంటప్పుడు కొంచెం చక్కెర తీసుకొని రుద్దితే మరకలు పోతాయి.
- బొగ్గులతో నిప్పులు రాజేసే సమయంలో మంట పుట్టించేందుకు చక్కెర ఉపకరిస్తుంది.
- స్పైసీగా ఉన్న పదార్థాలను తిన్నప్పుడు పట్టలేనంత కారం వేస్తే నాలుకపై కాస్త చక్కెర వేస్తే సరి.. వెంటనే ఉపశమనం కలుగుతుంది.
- నెయ్యి, వెన్న పాల మీద మీగడ చేతికి అంటినప్పుడు అంత తేలికగా జిడ్డు వదలదు. అటువంటి జిడ్డును చక్కెరతో ఇట్టే వదిలించవచ్చు.





మహిళాశక్తిని తక్కువ అంచనా వేయొద్దంటారు సైరీ. జిప్ కార్ వ్యవస్థాపకుడు రాబిన్ చేజ్‌ను కోట్ చేస్తూ ప్రపంచంలోని తొలి కార్ షేరింగ్ ఐడియా ఓ మహిళదే అని గుర్తు చేశారామె. వ్యాపార రంగంలో మహిళల ఆలోచనా ధోరణి పూర్తిగా మారిపోయిందని, వారి దృక్పథం బిజినెస్‌ను మించిపోయిందని చెప్తున్నారు. అయితే మధ్యవయస్సు వచ్చేసరికి ఎదుగుతున్న పిల్లలు, వారి చదువు సంధ్యలు, ఆర్థిక వ్యవహారాలతో ఉద్యోగాలు మానేస్తున్నారు. ఎవరి పనులకు వారెళ్లాక ఉండే ఖాళీ సమయాన్ని సద్వినియోగం చేసుకునేందుకు పార్ట్‌టైమ్ జాబ్ వెతికి పెడుతామంటున్న షీరోస్ డాట్ ఇన్ సీఈవో సైరీ చాహల్ సక్సెస్‌మంత్ర.



లక్షలాది మందికి ఉపాధి

దేశంలో షీరోస్‌కు 12 వందలకు పైగా విభాగాలున్నాయి. ఈ కమ్యూనిటీలో మహిళలు పార్ట్ టైంగానే ఎన్నో పెద్ద కంపెనీల ప్రాజెక్టుల్ని చేసిపెట్టారంటే ఆశ్చర్యం కలుగక మానదు. ఇప్పటి వరకూ పది వేల మందికి పైగా మహిళలు కమ్యూనిటీలో ఫుల్‌టైమ్ సభ్యులుగా చేరారు. అందులో ఇంటి నుంచే పనిచేసే ఫ్రీలాన్సార్స్, ఎంటర్‌ప్రెన్యూర్లు, ఎక్స్‌పర్ట్స్ ఉన్నారు. షీరోస్ కేవలం ఉద్యోగం వెతికిపెట్టడం మాత్రమే కాదు, సభ్యులతో సమావేశాలు, జాబ్‌మేళాలు, ప్రత్యేక శిక్షణ తరగతులు వంటి ఎన్నో కార్యక్రమాలు ఏర్పాటు చేస్తున్నారు. షీరోస్ దేశవ్యాప్తంగా ఇప్పటి వరకూ సుమారు 3 లక్షల మందికి పైగా పార్ట్‌టైం ఉద్యోగాలు వెతికి పెట్టింది.

మహిళలకు పార్ట్‌టైం ఉద్యోగాలిస్తామంటున్న సైరీ చాహల్

సక్సెస్‌మంత్ర

మహిళలు సాధికారత వైపు ఎంతవేగంగా అడుగులు వేస్తున్నా– మగవారితో పోల్చుకుంటే ఉద్యోగం చేసే మగువల సంఖ్య తక్కువే. ఒకవేళ రిటైర్ అయ్యే దాకా చేద్దామని అనుకున్నా కొన్ని కొన్ని సందర్భాలు వారితో ఉద్యోగం మానేలా చేస్తాయి. ముఖ్యంగా మిడిల్ ఏజ్ వచ్చేసరికి – ఉద్యోగం కంటే ముఖ్యమైన అంశాలు ఎన్నో ఎదురవుతాయి. ఈ పరిస్థితుల్లో ఉద్యోగం చేయడమనేది వారికి చివరి ఆప్షన్ గా మారి పోతుంది. అయినా కొంతమంది పార్ట్‌టైం జాబ్స్ వైపు, ఇంటినుంచే చేసే ఉద్యోగాలవైపు మొగ్గు చూపుతుంటారు. అలాంటి వారికోసమే తామున్నామని చెబుతున్నారు సైరీ చాహల్.

మహిళల కోసమే..

ఇంటి దగ్గరే ఉంటూ ఉద్యోగాలు చేస్తూ ఆర్థికంగా నిలదొక్కుకోవాలనుకునేవారికోసమే షీరోస్ డాట్ ఇన్ పనిచేస్తుందని సైరీ అంటున్నారు. 2014లో మొదలైంది షీరోస్ డాట్ ఇన్ వెబ్‌సైట్. ఇంటిదగ్గరే ఉండే మహిళలను ఎవరికి ఏ రంగంలో ఆసక్తి ఉందో తెలుసుకుని వారికి సంబంధించిన ఉద్యోగం వెతికిపెట్టడం. వారు పనిచేసే సమయంలో ఏమైనా సందేహాలుంటే క్లారిఫై చేస్తూ ఈ వెబ్‌సైట్ చేస్తున్నది. దీనికోసం ఒక ప్రత్యేక టీం కూడా ఉంటుంది. పర్సనల్ లైఫ్‌ను, వృత్తి పరమైన జీవితాన్ని సరైన రీతిలో తీర్చిదిద్దుకోగలను అనే నమ్మకం ఉన్న మహిళలందరికీ మా షీరోస్ డాట్ ఇన్ మంచి ప్లాట్ ఫాం అంటారు సైరీ చాహల్.

మళ్లీ నేర్పించి!..

పార్ట్ టైం జాబ్ చేయాలనుకునే మహిళలకు వచ్చే మరో సమస్య ఎంటంటే వారు ఉద్యోగం మానేసి ఇంట్లో ఉండడం మూలంగా వారు గతంలో తాము చేసిన పనిని మరిచిపోతారు. ఒకసారి ఉద్యోగాన్ని వదిలేసిన తర్వాత చాలామంది మహిళలు మళ్లీ మొదటికి వస్తున్నారు. అంతకుముందున్న స్కిల్స్ వారిలో కనిపించవు. నేర్చుకున్న విషయాలను కూడా మరిచిపోతుంటారు. ఇదే పెద్ద సమస్యగా మారిందంటారు సైరీ. అయితే, ఈ సమస్యలు, వాటి పరిష్కార మార్గాలపై చర్చించేందుకు షీరోస్ సమ్మిట్ పేరుతో దేశంలోని వివిధ నగరాల్లో సదస్సులు నిర్వహించారు. వారికి తమ స్కిల్స్‌ను తిరిగి నేర్పించి ఆ రంగంలో ఉద్యోగ అవకాశాలు కల్పించడం చేస్తున్నామని ఆమె తెలిపారు.



వ్యాపార విభాగంలోనే కాక టెక్నాలజీలోనూ పట్టు సాధించాలని మహిళలకు సూచిస్తున్నారు సైరీ. పారిశ్రామిక రంగంలో నెగ్గుకు రావడం మహిళలకు కష్టం అన్నది ఒకప్పటి మాట. ఆధునిక కాలంలో పట్టుదల ఉంటే సాధించలేనిది ఏదీ లేదంటున్నారు షిరోస్ సీఈఓ సైరీ చాహల్. అవకాశాలను అందిపుచ్చుకొని ముందడుగేస్తే జయించడానికి అతివల కోసం చాలానే ఉందని చెప్తున్నారు.

ఎంతో ప్రాచుర్యం

షీరోస్ చేస్తున్న కార్యక్రమాల పట్ల ఆసక్తి పెంచుకున్న మహిళలెందరో షీరోస్ కమ్యూనిటీలో చేరుతున్నారు. సోషల్ మీడియా, ఇతర మాధ్యమాల ద్వారా షీరోస్‌కు ఎంతో ప్రాచుర్యం లభించింది. అయితే షీరోస్ ఇటీవల విడుదల చేసిన నివేదిక ప్రకారం.. ప్రస్తుతం భారత్ లో 17 శాతం మహిళలు మాత్రమే ఉద్యోగం చేయడానికి ముందుకు వస్తున్నారు. వారిలో కేవలం 5 శాతం మాత్రమే పై స్థాయికి చేరగలుగుతున్నారు. ఈ విషయంలో మన దేశం ప్రపంచంలో 113వ స్థానంలో ఉంది. దీన్నిబట్టి అర్థం చేసుకోవచ్చు– శక్తి సామర్థ్యాలు ఉన్నప్పటికీ ఉన్నత పదవులకు వారు ఎంతదూరంగా ఉంటున్నారో. దాదాపు 48 శాతం మంది మహిళా ఉద్యోగులు ప్రమోషన్ అందుకోకుండా జాబ్ వదిలేస్తున్నారు. కనీసం మధ్యస్థాయి పదోన్నతి కూడా పొందకుండా ఉద్యోగానికి గుడ్ బై కొడుతున్నారు. మహిళలకు ఆర్థిక స్వాతంత్ర్యం లేకపోవడానికి ఇది కూడా ముఖ్యకారణం అంటున్నారామె.

కంపెనీలతో ఒప్పందాలు

షీరోస్ సుమారు 1000కి పైగా కంపెనీలతో భాగస్వామ్య ఒప్పందాలు కుదుర్చుకుంది. తమ సంస్థకు కావాల్సిన ఉద్యోగులను వెతికిపెట్టే బాధ్యతను కంపెనీల వారు షీరోస్‌కు ఇస్తున్నారు. ఉదాహరణకు క్లియర్‌టాక్స్ అనే వెబ్‌సైట్ తమ కస్టమర్లకు అవసరమైన సాయం అందించడానికి సీఏ చదివిన మహిళలతో ఒప్పందం చేసుకుంటున్నది. ఇదే దారిలో హనీవెల్ వంటి ఎన్నో కంపెనీలున్నాయి. షీరోస్ బృందంలో మెజారిటీ భాగం మహిళలే అయినప్పటికీ మగవారు కూడా ఉంటారు. వారంతా ఎక్కడెక్కడో ఉన్నా ఒక టీంగానే పనిచేస్తారు.

భామ కాదు, బామ్మ!

వయసు అయిపోయిందని కొందరు బాధపడుతూ కూర్చుంటారు. ఇంకొందరు మాత్రం వయస్సును లెక్క చేయకుండా ఇష్టమైన పనులు చేసుకుంటూ ఆనందిస్తారు. అలానే చేసింది చైనాకు చెందిన ఓ వృద్ధురాలు.. అన్నట్టు ఆమె చేస్తున్న పని చూస్తే వృద్ధురాలు అనలేం..



రిటైర్మెంట్ తర్వాత ఎవరైనా ఏం చేస్తారు? ఇంటిపట్టున ఉండి సరదాగా కాలక్షేపం చేస్తారు. వయసైపోయిందంటూ చిన్న చిన్న పనులతో కాలం వెల్లదీస్తారు. కొత్తగా ఏదైనా నేర్చుకోవడానికి అసలే ఆసక్తి చూపారు. కానీ చైనాకు చెందిన 73 యేండ్ల డయ్‌డాలి అనే ఆవిడ గురించి వింటే ఆశ్చర్యమేయక మానదు. పదిహేనేండ్ల నుంచి పోల్ డ్యాన్స్‌లో వినూత్న ప్రతిభ చూపుతూ అందరినీ ఆశ్చర్యపరుస్తున్నది. డాలీ 65వ యేట బుక్ స్టోర్ ఉద్యోగం నుంచి రిటైర్మెంట్ తీసుకుంది. తర్వాత ఖాళీగా ఉండడం ఇష్టపడలేదు. ఏదైనా కొత్తగా నేర్చుకొని సమయాన్ని వినియోగించుకోవాలనుకుంది. మొదట ఓ డ్యాన్స్ స్కూల్‌లో చేరాలని నిర్ణయించుకుంది. ఫోక్, జాజ్‌లో ఆమె ఆసక్తి చూపింది. ఈ వయస్సుల్లో డ్యాన్స్ అంటే ఆరోగ్యంగానూ, కావాల్సిన శక్తి కూడా అవసరం అని తెలుసుకుంది. తర్వాత ఫిట్‌నెస్‌పైనా దృష్టి సారించింది. దీంతో ఆమె అభిరుచి పోల్ డ్యాన్స్‌వైపు మళ్లింది. మొదట కష్టంగా ఉన్నా నిరంతర శిక్షణ అనంతరం పోల్ డ్యాన్సర్ అయింది. అప్పటి నుంచే వివిధ సందర్భాల్లో ప్రదర్శనిలిచ్చింది. 2012లో చైనా గాట్ ట్యాలెంట్‌లో ఆమె పాల్గొన్నది. అనంతరం అమెరికాలో 'ఆసియా గాట్ ట్యాలెంట్' లో నుంచి కూడా మన్ననలు పొందింది. 'నాకు గాల్లో ఎగరడం, పోల్ చుట్టూ తిరగడం ఎంతో ఆనందాన్ని ఇస్తాయి... లక్ష్యాన్ని చేరుకోవడానికి వయస్సును ఎవరూ లెక్క చేయొద్దు' అంటూ ఆమె ఎందరినో ఆశ్చర్యపరుస్తున్నది.

చుండ్రు నివారణకు..

చాలామంది చుండ్రు సమస్యతో బాధ పడుతుంటారు. ఎన్నో ఆంటీ డాండ్రఫ్ షాంపులు వాడుతుంటారు. అలా కాకుండా ఇంట్లోనే దొరికే చిన్న చిన్న పదార్థాలలో చక్కటి నివారణ మార్గాలు ఉన్నాయి. అవేంటో చూడండి..



- రెండు స్పూన్‌ల కొబ్బరినూనె తీసుకోండి. అంతే మోతాదులో నిమ్మరసం కలపండి. ఈ మిశ్రమాన్ని తలమీద రాయండి. 20 నిమిషాలు దాన్ని అలా ఉంచి కడిగేస్తే ఫలితం ఉంటుంది.
- చుండ్రు నివారణ కోసం పెరుగును వాడటం మంచి ఫలితాన్ని ఇస్తుంది. కాస్త పెరుగును వెంట్రుకలకు, తలమీద రాయండి. అది కొంచెం గట్టి పడేంతవరకు వేచి చూడండి. తర్వాత కడిగేయండి.
- తడిగా ఉన్న వెంట్రుకలను బేకింగ్ సోడాతో తుడవండి. తలమీద మర్దన చేయండి. గంట నుంచి గంటన్నర తర్వాత నీటితో కడిగేయండి. ఫలితం కనిపిస్తుంది.
- హెన్నా లేదా మెహంది వెంట్రుకలకు పెట్టడం ద్వారా వెంట్రుకలు ఆరోగ్యవంతంగా తయారవుతాయి. దీంతో పాటు చుండ్రును కూడా నివారించవచ్చు. హెన్నాను పెరుగుతో లేదా నిమ్మరసంతో బాగా కలపండి. ఈ మిశ్రమాన్ని వెంట్రుకలకు, తలమీద అప్లయ్ చేయండి. రెండు గంటలు ఉంచిన తర్వాత నీటితో కడిగేస్తే చుండ్రు తొలగిపోతుంది.
- ముల్తాని మట్టిని పేస్ట్‌లా తయారు చేయాలి. నీళ్లు, నిమ్మరసంతో బాగా కలిపాలి. ఈ మిశ్రమాన్ని వెంట్రుకలకు పెట్టి 30 నిమిషాల తర్వాత తీసేస్తే మంచి ఫలితం ఉంటుంది.

మేలు చేసే కొత్తరకం డైపర్లు!

సింథటిక్ క్లాత్‌ను ఉపయోగించిన డైపర్లను వాడడం వల్ల చిన్నారులు పలు రుగ్మతల బారిన పడుతున్నారు. అంతేకాదు సింథటిక్ డైపర్ల తయారీలో ఉపయోగించే ప్లాస్టిక్ కారకాలతో ఎటువంటి నష్టం కలుగుతున్నదో అందరికీ తెలియజేస్తూ వారిని చైతన్య పరుస్తున్నది దివ్య సిద్దార్థ. చిన్నారులకు వినియోగించిన డైపర్లను ఆరుబయట పడేయడం వల్ల అవి భూమిలో కరగకుండా ఉండి కాలుష్యానికి కారణమవుతుందనే విషయాలను జనాలకు వివరించే ప్రయత్నం చేస్తున్నది. తమిళనాడు రాష్ట్రంలోని కోయంబత్తూర్‌కు చెందిన దివ్య ఓ కళాశాలలో ప్రొఫెసర్‌గా పనిచేస్తున్నది. ఐదు నెలలున్న తన బిడ్డకు సింథటిక్ డైపర్లు వాడడం వల్ల చర్మ సమస్యలు తలెత్తాయి. అందుకోసం ఆమె ఇంటి దగ్గరే ఉండి తన బిడ్డను చూసుకోవాల్సి వచ్చింది. ఒక రోజు తన స్నేహితురాలు బట్టతో రూపొందించిన డైపర్లను తన కొడుకుకు బహుమతిగా అందజేసింది. దివ్య తన కొడుకుకు బట్టతో తయారుచేసిన డైపర్లను వినియోగించడం వల్ల కలిగిన సౌకర్యాన్ని తెలుసుకున్నది. అదే సమయంలో సహజమైన బట్టతో బేబీ డైపర్లను తయారుచేయాలని నిర్ణయించింది. విదేశాల నుంచి నాణ్యమైన బట్టను తెప్పించి తానే స్వయంగా సహజమైన డైపర్లను రూపొందించింది దివ్య. తాను తయారు చేసిన డైపర్లను తన కొడుకుపైనే ప్రయోగించి విజయవంతమైంది. అటు

ప్రస్తుతం మార్కెట్‌లో లభించే డైపర్ల వల్ల అటు చిన్నారులకు, ఇటు ప్రకృతికీ ముప్పు వాటిల్లే ప్రమాదం ఉన్నది. అటువంటి ప్రమాదం నుంచి తప్పించడానికి ఓ తల్లి తన కొడుకు వలే ఆ బాధ ఎవరూ పడకూడదని వినూత్న ప్రయోగంతో ప్రత్యామ్నాయాన్ని సూచిస్తున్నది.



చిన్నారులకు, ఇటు పర్యావరణానికీ ఎటువంటి హాని ఉండదని నిరూపించింది. ఆ తర్వాత దివ్య నెమ్మదిగా తన ఫేస్‌బుక్ ఖాతా ద్వారా జనాలకు తాను రూపొందించిన సహజసిద్ధమైన డైపర్లను వాడడం వల్ల కలిగే ప్రయోజనాలను తెలియజేసింది. అనంతరం దివ్య తయారుచేసిన డైపర్లకు ఆదరణ పెరుగడంతో 'కిడ్డీ హగ్' పేరుతో ఫేస్‌బుక్ పేజీని ప్రారంభించింది. కొద్దిరోజులకే దివ్య ఉత్పత్తులను కొనుగోలు చేసేవారి సంఖ్య పెరిగింది. ప్రస్తుతం దివ్యకు సోషల్ మీడియాలో 19వందల మందికి పైగా ఫాలోవర్స్ ఉన్నారు. పుట్టిన పిల్లల దగ్గర నుంచి ఐదేండ్ల వయసున్న పిల్లల వరకూ ఉపయోగించుకునేలా డైపర్లను తయారు చేసింది. తన ఉత్పత్తులను త్వరలోనే దేశవ్యాప్తంగా ప్రముఖ ఈ కామర్స్ వేదికలైన అమెజాన్, ఫ్లిప్‌కార్ట్‌ల ద్వారా అమ్మకాలు జరుపనున్నట్లు ఆమె తెలిపింది.

నా వయసు 35 సంవత్సరాలు. నాది కూర్చుని పనిచేసే ఉద్యోగం. ఈ మధ్య నా కడుపులో బాగా నొప్పి లేస్తున్నది. ఏదో పిసికినట్లు.. తిప్పి మెలేసినట్లు అనిపిస్తున్నది. ఒక్కోసారి ఆ బాధ భరించలేకపోతున్నాను. పొట్ట అయితే ఉబ్బినట్టు నిండుగా మారిపోతుంది. ఇలా జరిగిన ప్రతీసారి గ్యాస్‌కు సంబంధించిన టాబ్లెట్ వేసుకోవడంతో నయమయ్యేది. కానీ ఇప్పుడు టాబ్లెట్ వేసుకున్నా కూడా అలాగే ఉంటుంది. నాది గ్యాస్ సమస్యేనా? లేక ఇంకేదైనానా? అల్సర్ లక్షణాలు కూడా ఇలాగే ఉంటాయా? తిన్నది కూడా త్వరగా జీర్ణం కావడం లేదు. కాబట్టి జీర్ణాశయం పాడైందేమో అనిపిస్తున్నది. దయచేసి నా సమస్యకు పరిష్కారం తెలపండి.

- ఆర్. ఆదిత్య, మిర్యాలగూడ




డాక్టర్ రమేష్ కుమార్
గ్యాస్ట్రో ఎంటరాలజీ విభాగాధిపతి
ఉస్మానియా హాస్పిటల్, హైదరాబాద్

కడుపునొప్పికి కారణమేంటి?

అడుగండి చెబుతా



డియర్ ఆదిత్య.. మీరు తెలిపిన లక్షణాలను బట్టి చూస్తే ప్రత్యక్షంగా కలవాల్సిన అవసరం ఉందనిపిస్తున్నది. మల్టీ డిసీజ్ సింప్టమ్స్ కనిపిస్తున్నాయి. ఎక్కువగా గ్యాస్ట్రిక్ అల్సర్ సమస్య ఉన్నవారికి ఇలాంటివి ఎదురవుతుంటాయి. గ్యాస్ట్రిటైటిస్ కూడా అయుండొచ్చు. చాలామందికి హెలికో బాక్టీరియమ్ ఫైల్‌వే (హెచ్‌పీ) ఇన్ఫెక్షన్ వల్ల కడుపులో నొప్పి వస్తుంటుంది. కొందరికి బ్రాంకెటైటిస్ వల్లగానీ.. పిత్తాశయంలో రాళ్ల వల్లగానీ ఇలా జరుగుతుంది. మీరు ఆల్కహాల్ తీసుకుంటారో లేదో తెలియజేయలేదు. ఒకవేళ మీకు కచ్చితంగా ఆల్కహాల్ తీసుకునే అలవాటు ఉంటే మాత్రం ఎంత మోతాదులో తీసుకుంటున్నారో గ్రహించుకోవాల్సిన అవసరం ఉంది. ఎందుకంటే చాలామందిలో అధికమోతాదులో ఆల్కహాల్ తీసుకోవడం వల్లే క్రానిక్ బ్రాంకియాటిస్ట్ వస్తుంది. దీనివల్లనే జీర్ణ సమస్య.. గ్యాస్ సమస్యలు ఎదురవుతాయి. వీటిలో మీకున్న సమస్య ఏదీ అని నిర్ధారించుకోవడానికి మాత్రం తప్పనిసరిగా కొన్ని పరీక్షలు చేయించుకోవాలి. బ్లడ్‌షుగర్, సీబీపీ పరీక్ష, లివర్ ఫంక్షన్ టెస్ట్, సీరమ్ అమైలేజ్, సీరమ్ లైపేజ్, ఫాస్టింగ్‌లో ఉన్నప్పుడు అల్ట్రాసౌండ్ అబ్డామిన్ పరీక్ష, ఎండోస్కోపీ వంటివి చేయించుకోవాలి. ఒకవేళ కడుపులో అల్సర్ ఉంటే మాత్రం 14 రోజులు క్రమం తప్పకుండా యాంటిబయాటిక్స్ తీసుకోవాల్సి ఉంటుంది. బ్రాంకెటైటిస్ సమస్యనా అని నిర్ధారించుకోవడానికి ఎంజైమ్ రీప్లేస్‌మెంట్ థెరపీ చేయించుకోవాలి. దీనిలో భాగంగా లైపేజ్ ఎంజైమ్‌లో బయటి నుంచి ఇస్తారు. పిత్తాశయంలో రాళ్లున్నట్లు నిర్ధారణ అయితే లాప్రోస్కోపీ చేయించుకోవాల్సి ఉంటుంది. లివర్ సమస్య ఉంటే మాత్రం పూర్తిగా ఆల్కహాల్‌కు దూరంగా ఉండాలి. ఇవన్నీ చేస్తూనే మంచి జీవనశైలి ఏర్పరచుకోవాలి. ప్రతీరోజు క్రమం తప్పకుండా వ్యాయామం చేయాలి. మంచి పౌష్టికాహారం తీసుకోవాలి.



డెయిరీ ఫెయిరీ

మన దేశంలో వ్యవసాయం తరువాత ఎక్కువ మంది పాడిపరిశ్రమపై ఆధారపడి జీవిస్తున్నారు. పాలు, పాల ఉత్పత్తులకు రోజురోజుకు డిమాండ్ పెరుగుతున్నది. దీంతో ఈ పరిశ్రమ దినదినాభివృద్ధి చెందుతున్నది. దీనికి అనుగుణంగానే విద్యారంగంలో కూడా డెయిరీ టెక్నాలజీ కోర్సులు అందుబాటులోకి వస్తున్నాయి. ఈ రంగంలోని కోర్సులు ఏంటి? ఉపాధి ఎలా ఉంటుందనే విషయాలు నిపుణ పాఠకుల కోసం..

డెయిరీ టెక్నాలజీ అంటే?

- ఆహార సాంకేతిక పరిజ్ఞానం, ప్రాసెసింగ్‌లో భాగంగా పాలు, పాల ఉత్పత్తులను ప్రాసెస్ చేయడంలో వ్యవహరించే సాంకేతిక విధానాన్నే డెయిరీ టెక్నాలజీ అంటారు. నాణ్యమైన పద్ధతుల్లో పాలను ఎలా ప్రాసెస్ చేయాలి, దాని ఉప ఉత్పత్తుల తయారీ ఎలా ఉండాలి వంటి వాటి గురించి నేర్చుకుంటారు. దీనిలో ప్యాకేజింగ్, స్టోరేజీ, పంపిణీ, ట్రాన్స్‌పోర్టేషన్ ఉంటాయి. కాబట్టి బ్యాక్టీరియాలజీ, పోషణ, జీవరసాయన శాస్ర్తాలపై అవగాహన ఉండాలి.
- పోషక విలువలను ప్రభావితం చేయకుండా హానికరమైన టాక్సిన్లను తొలగించడానికి పాలు, దాని ఉత్పత్తులను ప్రాసెస్ చేసేవారిని 'డెయిరీ టెక్నాలజిస్టు'లు అంటారు. వీరు వివిధ పద్ధతులను ఉపయోగించి పాల ఉత్పత్తులను ప్రాసెసింగ్ చేస్తారు.
- పాడిపరిశ్రమలో టెక్నాలజీ అనేది అభివృద్ధి చెందుతున్న రంగాల్లో ఒకటి. డెయిరీ టెక్నాలజీ పాడిపరిశ్రమలో లోతైన జ్ఞానాన్ని అందిస్తుంది. కాబట్టి పాడి విజ్ఞానశాస్త్రంలో ఆసక్తి ఉన్నవారు, ఈ రంగంలో ఉపాధి కోరుకునేవారు డెయిరీ టెక్నాలజీని ఎంచుకోవచ్చు. దీనిలో డిప్లొమా నుంచి డిగ్రీ, పీజీ, పీహెచ్‌డీ వరకు కోర్సులు ఉన్నాయి.

ఉపాధి

- డెయిరీ కోర్సులు పూర్తిచేసినవారికి డెయిరీ టెక్నాలజిస్ట్, మైక్రో బయాలజిస్ట్, న్యూట్రిషనిస్ట్, థియాలజియన్స్, డెయిరీ సైంటిస్ట్, డెయిరీ మెడికల్ ఆఫీసర్, ప్రొడక్ట్ డెవలప్‌మెంట్ మేనేజర్, మార్కెట్ డెవలప్‌మెంట్ మేనేజర్, కమోడిటీ ట్రేడింగ్ మేనేజర్, డెయిరీ ప్లాంట్ సూపర్‌వైజర్, ప్లాంట్ అసిస్టెంట్ మేనేజర్, మేనేజర్, పర్చేజ్ మేనేజర్, క్వాలిటీ కంట్రోల్ ఆఫీసర్, డెయిరీ టెక్నాలజిస్ట్, సైంటిస్ట్, డిస్ట్రిబ్యూషన్ మేనేజర్లుగా ఉద్యోగాలు లభిస్తాయి.
- ప్రారంభంలో టెక్నికల్ అసిస్టెంట్ స్థాయిలో ఏడాదికి సుమారు రూ. లక్ష నుంచి రూ. లక్షన్నర వరకు వేతనం లభిస్తుంది. అనుభవం పెరిగేకొద్దీ ప్లాంట్ మేనేజర్, సూపర్‌వైజర్ స్థాయికి చేరుకోవచ్చు. ఈ స్థాయిలో ఏడాదికి సుమారు రూ.5 లక్షల నుంచి రూ.7 లక్షల వరకు జీతం లభిస్తుంది.
- అంతేకాకుండా సొంతంగా డెయిరీ ప్లాంట్‌ను ఏర్పాటు చేసుకోవచ్చు.



కోర్సులు

- పాడి విజ్ఞానశాస్త్రంలో ఆసక్తి కలిగి ఉండి, ఈ రంగంలో రాణించాలని కోరిక ఉన్నవారు డెయిరీ టెక్నాలజీ కోర్సులను చేయవచ్చు. విద్యార్థులు వారి వీలును బట్టి రెగ్యులర్‌గా లేదా దూర విద్య ద్వారా ఈ కోర్సులను చేయవచ్చు. డెయిరీ టెక్నాలజీ అనేది మంచి భవిష్యత్తు ఉన్న కోర్సు. ఆ కోర్సులేంటో చూద్దాం.

డిప్లొమా ప్రోగ్రామ్‌లు

- డిప్లొమా ఇన్ డెయిరీ టెక్నాలజీ
- డిప్లొమా ఇన్ ఫుడ్ అండ్ డెయిరీ టెక్నాలజీ
- అడ్వాన్స్‌డ్ డిప్లొమా ఇన్ డెయిరీ సైన్స్ అండ్ టెక్నాలజీ

డిగ్రీ ప్రోగ్రామ్‌లు

- బీటెక్ ఇన్ డెయిరీ టెక్నాలజీ
- బీఈ ఇన్ డెయిరీ టెక్నాలజీ
- బీఎస్సీ ఇన్ డెయిరీ టెక్నాలజీ

పీజీ ప్రోగ్రామ్‌లు

- ఎంటెక్ ఇన్ డెయిరీ మైక్రోబయాలజీ
- ఎంటెక్ ఇన్ డెయిరీ ఇంజినీరింగ్
- ఎంటెక్ ఇన్ యానిమల్ బయోకెమిస్ట్రీ
- ఎంటెక్ ఇన్ బయోటెక్నాలజీ
- ఎంటెక్ ఇన్ యానిమల్ జెనెటిక్స్ అండ్ బ్రీడింగ్
- ఎంటెక్ ఇన్ డెయిరీ కెమిస్ట్రీ
- ఎంటెక్ ఇన్ డెయిరీ టెక్నాలజీ
- తెలుగు రాష్ర్టాల్లోని ప్రభుత్వ కాలేజీల్లో ఇంటర్‌లో డెయిరీపై వొకేషనల్ కోర్సులు అందుబాటులో ఉన్నాయి. ఆ తర్వాత వీరు బీ వొకేషనల్ కోర్సులు కూడా చేయవచ్చు.

అర్హతలు

యూజీ కోర్సులు

- మ్యాథ్స్, ఫిజిక్స్, కెమిస్ట్రీ సబ్జెక్టులతో, 50 శాతం మార్కులతో ఇంటర్ ఉత్తీర్ణులు అర్హులు. ఇంటర్‌లో సాధించిన మెరిట్ ఆధారంగా ప్రవేశాలు కల్పిస్తారు.

పీజీ కోర్సులు

- బీఈ, బీటెక్‌లో తీసుకున్న స్పెషలైజేషన్ల ఆధారంగా పీజీలో డెయిరీ టెక్నాలజీ చేయవచ్చు. ఇవి రెండేండ్ల కాలవ్యవధిగల కోర్సులు.

ప్రవేశాలు

- దేశస్థాయిలో ICAR, న్యూఢిల్లీ నిర్వహించే ఆలిండియా ఎంట్రెన్స్ ఎగ్జామినేషన్ ఫర్ అడ్మిషన్స్ (AIEEA) ఎంట్రెన్స్‌లో చూపిన ప్రతిభ ఆధారంగా ప్రవేశాలు కల్పిస్తారు.
- రాష్ట్రస్థాయిలో నిర్వహించే ఎంసెట్ వంటి ఎంట్రెన్స్‌ల ద్వారా రాష్ర్టాల్లోని ఆయా కాలేజీల్లో ప్రవేశాలు కల్పిస్తారు.

సంస్థలు

- రాష్ట్రంలో పీవీ నర్సింహారావు తెలంగాణ వెటర్నరీ యూనివర్సిటీ ఆధ్వర్యంలో రాజేంద్రనగర్, కామారెడ్డి కాలేజీల్లో డెయిరీ కోర్సులు అందుబాటులో ఉన్నాయి.
- నేషనల్ డెయిరీ రిసెర్చ్ ఇన్‌స్టిట్యూట్, బెంగళూరు
- కాలేజ్ ఆఫ్ డెయిరీ అండ్ సైన్స్ టెక్నాలజీ, ఉదయ్‌పూర్
- గురు ఆనంద్‌దేవ్ కాలేజ్ ఆఫ్ డెయిరీ అండ్ సైన్స్ టెక్నాలజీ, లూధియానా
- ఇగ్నో, న్యూఢిల్లీ
- కాలేజ్ ఆఫ్ ఫుడ్ అండ్ డెయిరీ టెక్నాలజీ, అలహాబాద్
- దేశ్ భగత్ యూనివర్సిటీ, పంజాబ్
- నేషనల్ డెయిరీ రిసెర్చ్ ఇన్‌స్టిట్యూట్, కర్నాల్
- కేరళ అగ్రికల్చరల్ యూనివర్సిటీ, త్రిస్సూర్
- ఇందిరాగాంధీ అగ్రికల్చరల్ యూనివర్సిటీ, రాయ్‌పూర్
- ఆనంద్ అగ్రికల్చరల్ యూనివర్సిటీ, ఆనంద్
- ఆంధ్రా యూనివర్సిటీ, విశాఖపట్నం
- శ్రీవెంకటేశ్వర వెటర్నరీ యూనివర్సిటీ, తిరుపతి.

రిక్రూటర్లు

- మదర్ డెయిరీ, అమూల్, గ్లాక్సోస్మిత్‌క్లైమ్, హిందుస్థాన్ యునీ లీవర్, నెస్లే, రిలయన్స్, వొకార్డ్, వడిలాల్, మెట్రో టెయిరీ, ITC, Heinz, COMPFED (Sudha), GCMMF వంటి ప్రముఖ సంస్థలు డెయిరీ కోర్సులు చేసినవారిని రిక్రూట్ చేసుకుంటున్నాయి.
- ప్రభుత్వ రంగంలో నేషనల్ డెయిరీ డెవలప్‌మెంట్ బోర్డ్ ఆఫ్ ఇండియాలో డెయిరీ టెక్నాలజిస్టులుగా, ప్రభుత్వ ఆధ్వర్యంలో నడిచే డెయిరీ ఫామ్స్‌లో క్వాలిటీ కంట్రోల్ విభాగాల్లో, పాల ఉత్పత్తుల తయారీ కంపెనీల్లో ఉపాధి లభిస్తుంది.
- పీహెచ్‌డీ చేసినవారికి యూనివర్సిటీలు, రిసెర్చ్ ఇన్‌స్టిట్యూట్లలో అవకాశాలు లభిస్తాయి. అంతేకాకుండా విదేశాల్లో కూడా వీరికి మంచి అవకాశాలు ఉన్నాయి.

... ✍ సత్యం చాపల

ప్రజల జీవనశైలి వేగంగా మారుతున్నది. అందుకు అనుగుణంగానే ఆహారపు అలవాట్లలో కూడా మార్పులు వస్తున్నాయి. ప్రస్తుతం చాలామంది నోటికి రుచిగా ఉండటంతోపాటు తక్కువ సమయంలో తినడానికి సిద్ధమయ్యే ఫాస్ట్‌ఫుడ్స్ వైపు మొగ్గు చూపుతున్నారు. దీంతో స్థూలకాయం, హై కొలెస్ట్రాల్, బీపీ, షుగర్ తదితర రోగాలను కొని తెచ్చుకుంటున్నారు. ఇలా అనారోగ్యాల బారిన పడకుండా ఉండాలన్నా, ఇప్పటికే ఉన్న అనారోగ్య సమస్యలను అదుపులో పెట్టుకోవాలన్నా సరైన పరిష్కారం ఆరోగ్యకరమైన డైట్. ఈ డైట్‌ను సూచించే వ్యక్తే డైటీషియన్. ఈ రోజుల్లో డైటీషియన్లకు డిమాండ్ బాగా పెరుగుతున్నది. ఈ నేపథ్యంలో డైటీషియన్ కావడానికి ఉండాల్సిన అర్హతలు, ఉద్యోగ అవకాశాలకు సంబంధించిన వివరాలు తెలుసుకుందాం...

డైనమిక్ కోర్సు డైటీషియన్



డైటీషియన్లు ఏం చేస్తారు?

- వైద్యుల లాగానే డైటీషియన్లది కూడా ఎంతో గౌరవప్రదమైన వృత్తి. పని ఒత్తిడి తక్కువగా ఉండటం, సౌకర్యవంతమైన పని వేళలు, అధిక రాబడి అదనపు అకర్షణలు. వ్యక్తుల పూర్తి వివరాలను మెడికల్ రికార్డ్స్ ద్వారా తెలుసుకుని, వారి స్వభావసిద్ధ అలవాట్లను గమనించి, శాస్త్రీయ పద్ధతిలో ఎలాంటి ఆహారం, ఎంత మొత్తంలో, ఏయే సమయాల్లో తీసుకోవాలో సూచించడం డైటీషియన్ల పని. సమస్యను ఆధారంగా చేసుకుని ఒక్కొక్కరికి ఒక్కో రకమైన డైట్‌ను వీరు సూచిస్తుంటారు.



చదవాల్సిన కోర్సులు

- డైటీషియన్ కావడానికి వివిధ బ్యాచిలర్ డిగ్రీ, మాస్టర్ డిగ్రీ కోర్సులతోపాటు కొన్ని పీజీ డిప్లొమా కోర్సులు కూడా అందుబాటులో ఉన్నాయి. వాటిలో కొన్ని కోర్సుల వివరాలు పరిశీలిద్దాం..

బీఎస్సీ/బీఏ న్యూట్రిషన్

- ఇవి మూడేండ్ల కాలవ్యవధిగల కోర్సులు.
- ఇంటర్మీడియట్ ఉత్తీర్ణులైనవారు ఈ కోర్సులలో చేరడానికి అర్హులు. సైన్స్ సబ్జెక్టులతో (బయాలజీ, ఫిజిక్స్, కెమిస్ట్రీ) ఇంటర్ పూర్తిచేసిన వారికి ప్రాధాన్యం ఉంటుంది.
- ఇందులో భాగంగా హ్యూమన్ సైకాలజీ, బేసిక్స్ ఆఫ్ న్యూట్రిషన్, ఫుడ్ బయోటెక్నాలజీ మొదలైన అంశాలు బోధిస్తారు. కోర్సు చివరలో డైట్ చార్ట్స్ తయారు చేయడం, బరువు తగ్గడానికి అనుసరించాల్సిన వ్యూహాలపై శిక్షణ ఇస్తారు.

బీఎస్సీ ఫుడ్ టెక్నాలజీ

- ఇది కూడా మూడేండ్ల కాలవ్యవధిగల కోర్సు.
- ఇంటర్ ఉత్తీర్ణతతో ఈ కోర్సులో చేరవచ్చు.
- ఇందులో బేసిక్స్ ఆఫ్ ఫుడ్ టెక్నాలజీ, ప్రిన్సిపుల్స్ ఆఫ్ ఫుడ్ సైన్స్, న్యూట్రిషన్, ఫుడ్ ప్రాసెసింగ్ అండ్ ఇంజినీరింగ్, ఫుడ్ ప్రిపరేషన్ మొదలైన అంశాలు ఉంటాయి.

ఎమ్మెస్సీ ఫుడ్ అండ్ న్యూట్రిషన్

- ఇది రెండేండ్ల కాలవ్యవధిగల కోర్సు.
- బ్యాచిలర్ డిగ్రీ ఉత్తీర్ణులైన వారు ఈ కోర్సులో చేరడానికి అర్హులు.
- ఫుడ్ అండ్ న్యూట్రిషన్‌లో ఉండే క్లినికల్ హెల్త్ (డీలింగ్ విత్ క్లినికల్ పేషెంట్స్), చైల్డ్/అడోలోసెంట్స్, పబ్లిక్ హెల్త్, ఫుడ్ ప్రాసెసింగ్ మొదలైన విభాగాల నుంచి ఒకదాన్ని స్పెషలైజేషన్‌గా ఎంచుకోవచ్చు.
- ఈ కోర్సులో భాగంగా తప్పనిసరిగా 6-8 నెలల ఇంటర్న్‌షిప్ చేయాలి.

పీజీ డిప్లొమా కోర్సులు

- ఇవి ఏడాది కాలవ్యవధిగల కోర్సులు. బ్యాచిలర్ డిగ్రీ పూర్తయిన తర్వాత ఈ కోర్సులలో చేరవచ్చు.
- ఫుడ్ అండ్ న్యూట్రిషన్‌కు సంబంధించిన వివిధ స్పెషలైజేషన్లతో పీజీ డిప్లొమా కోర్సులు చేయవచ్చు.
- కోర్సులో భాగంగా ఏదైనా హెల్త్‌కేర్ సెంటర్‌లో తప్పనిసరిగా ఏడు లేదా ఎనిమిది వారాల ఇంటర్న్‌షిప్ పూర్తిచేయాలి.
- డైటీషియన్‌గా రిజిస్ట్రేషన్ చేయించుకోవడానికి పీజీ డిప్లొమా సరిపోతుంది. కానీ ఫుడ్ అండ్ న్యూట్రిషన్‌కు సంబంధించిన అంశాలను లోతుగా అవగాహన చేసుకోవాలంటే మాత్రం మాస్టర్ డిగ్రీ చేయాల్సిందే.

డైటీషియన్‌గా రిజిస్ట్రేషన్ ఎలా?

- ఫుడ్ అండ్ న్యూట్రిషన్‌కు సంబంధించిన సబ్జెక్టులతో గ్రాడ్యుయేషన్‌గానీ, పోస్ట్‌గ్రాడ్యుయేషన్‌గానీ, పీజీ డిప్లొమాగానీ పూర్తిచేసిన వారిని న్యూట్రిషనిస్టు అంటారు. కానీ డైటీషియన్ అనరు. డైటీషియన్ కావాలంటే ముందుగా 'ఇండియన్ డైటిటిక్ అసోషియేషన్ (ఐడీఏ)'లో పేరు నమోదు చేసుకోవాలి. ఆ తర్వాత ఐడీఏ నిర్వహించే ప్రవేశపరీక్షలో ఉత్తీర్ణత సాధించాలి. అప్పుడే రిజిస్టర్డ్ డైటీషియన్‌గా గుర్తింపు లభిస్తుంది.
- 'ఐడీఏ'లో పేరు నమోదు చేసుకుని, ప్రవేశపరీక్ష రాయాలంటే గ్రాడ్యుయేషన్ తర్వాత ఆరు నెలల ఇంటర్న్‌షిప్‌తో పీజీ డిప్లొమా లేదా మాస్టర్ డిగ్రీ పూర్తిచేసిన వారు మాత్రమే అర్హులు. పరీక్ష రెండు పేపర్లుగా ఉంటుంది. పేపర్-1లో హ్యూమన్ ఫిజియాలజీ, బయోకెమిస్ట్రీ, ఫిజియాలజిక్ అండ్ మెటబాలిక్ చేంజెస్ ఇన్ డిసీజ్, ఫుడ్ మైక్రో బయాలజీ, శానిటేషన్, హైజీన్ మొదలైన అంశాలు ఉంటాయి. పేపర్-2లో హ్యూమన్ న్యూట్రిషన్ అండ్ & మీల్ మేనేజ్‌మెంట్, కమ్యూనిటీ న్యూట్రిషన్, డైట్ థెరపీ, న్యూట్రిషన్ ఎడ్యుకేషన్ & డైటిటిక్ కౌన్సెలింగ్, ఫుడ్ సర్వీస్ మేనేజ్‌మెంట్ అంశాలు ఉంటాయి.

విద్యాసంస్థలు

- దేశంలోని పలు విద్యాసంస్థలు డైటీషియన్ కోర్సులను ఆఫర్ చేస్తున్నాయి. అవి..
- యూనివర్సిటీ ఆఫ్ ఢిల్లీ - ఢిల్లీ
- నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ న్యూట్రిషన్ - హైదరాబాద్
- పంజాబ్ అగ్రికల్చరల్ యూనివర్సిటీ - లూధియానా
- యూనివర్సిటీ ఆఫ్ పుణె - పుణె
- యూనివర్సిటీ ఆఫ్ అలహాబాద్ - అలహాబాద్
- జాదవ్‌పూర్ యూనివర్సిటీ - కోల్‌కతా
- యూనివర్సిటీ ఆఫ్ మద్రాస్ - చెన్నై
- యూనివర్సిటీ ఆఫ్ ముంబై - ముంబై

అవకాశాలు

- మనదేశంలో గత కొంతకాలంగా డైటీషియన్లకు డిమాండ్ పెరుగుతున్నది. వీరికి కార్పొరేట్ ఆస్పత్రులు, స్టార్ హోటళ్లు, నర్సింగ్‌హోమ్‌లు, ప్రభుత్వ ఆరోగ్యశాఖ, కార్పొరేట్ స్కూళ్లు, కాలేజీలు, హెల్త్ క్లబ్‌లు, స్పోర్ట్స్ ఆర్గనైజేషన్లు, ఆహార సంబంధిత పరిశ్రమలు, రిసెర్చ్ ల్యాబ్‌లు, వివిధ ఎంఎన్‌సీ కంపెనీలు మొదలైన వాటిలో ఉద్యోగ అవకాశాలు ఉంటాయి.

వేతనాలు

- అప్పుడే డిగ్రీ పూర్తిచేసిన వారికి నెలకు రూ.15 వేల నుంచి రూ.20 వేలు, మాస్టర్ డిగ్రీ చదివిన వారికి రూ.20 వేల నుంచి రూ.25 వేలు ప్రారంభ వేతనం లభిస్తుంది. ఆ తర్వాత అనుభవం ఆధారంగా రెట్టింపు ఆదాయం పొందవచ్చు.

... ✍ తోట నాగరాజు

సుడోకు

డైలీ సుడోకు 42 సమాధానం

9	6	3	1	2	5	7	4	8
7	4	2	3	6	8	9	1	5
5	8	1	4	7	9	2	3	6
8	3	6	5	4	2	1	7	9
1	9	5	7	3	6	8	2	4
2	7	4	8	9	1	5	6	3
3	1	9	6	5	7	4	8	2
6	2	7	9	8	4	3	5	1
4	5	8	2	1	3	6	9	7

1. నిలువుగా, అడ్డంగా ప్రతివరుసలోనూ 1 నుంచి 9 వరకు అంకెలను నింపాలి.
2. ఒకసారి రాసిన అంకెను మరోసారి నింపకూడదు.
3. ప్రతి గడిలోనూ నింపిన అంకెను మళ్లీ నింపకూడదు.

సమాధానం రేపటి సంచికలో

డైలీ సుడోకు -43

1	3	7		5				
5		8		3		2		
			6					8
		5	7			8		
	7					6		2
6				4			9	3
				8				6
8			9					
			5	7	2			4

నమస్తే తెలంగాణ
నిపుణ
[హైదరాబాద్]
సోమవారం 21 జనవరి 2019



క్లాట్-2019

భారతదేశంలోనే కాకుండా ప్రపంచంలో ఎక్కడైనా న్యాయవాద వృత్తి ఎవర్‌గ్రీన్. న్యాయశాస్త్రంపై మంచి పట్టు సాధిస్తే జీవితంలో డబ్బుతోపాటు గొప్ప స్థాయికి ఎదిగే అవకాశం ఉంది. అయితే, సబ్జెక్టుపై మంచి పట్టు రావాలంటే మంచి విద్యాసంస్థలో చదవాలి. అందుకే న్యాయశాస్త్రం అభ్యసించాలనే ఆసక్తి ఉన్న ప్రతి విద్యార్థి క్లాట్‌వైపే చూస్తాడు. ఈ ఏడాది క్లాట్ మే 12న జరుగనుంది. ఈ పరీక్షకు సంబంధించిన పూర్తి సమాచారం నిపుణ పాఠకుల కోసం..

- దేశంలోని జాతీయ న్యాయ విశ్వవిద్యాలయాల్లో ఎల్ఎల్‌బీ కోర్సుల్లో ప్రవేశాల కోసం నిర్వహించే పరీక్షే కామన్ లా అడ్మిషన్ టెస్ట్. దీనిని సంక్షిప్తంగా క్లాట్ అని పిలుస్తున్నారు. క్లాట్ ద్వారా దేశంలోని 21 జాతీయ న్యాయ విశ్వవిద్యాలయాల్లో గ్రాడ్యుయేట్ కోర్సుల్లో ప్రవేశాలు జరుగుతాయి. ఈ పరీక్షను జాతీయ న్యాయ విశ్వవిద్యాలయాల కన్సార్టియం నిర్వహిస్తుంది. దేశంలో మొదటిసారి క్లాట్ పరీక్ష 2008లో జరిగింది. ఈ ఏడాది క్లాట్ పరీక్ష మే 12వ తేదీ సాయంత్రం 3 నుంచి 5 గంటల వరకు జరుగనుంది. క్లాట్‌లో ఈ ఏడాది ప్రధానమైన మార్పు ఈ పరీక్షను ఆఫ్‌లైన్‌లో నిర్వహించనుండటం. గతంలో ఈ పరీక్ష కేవలం ఆన్‌లైన్ విధానంలోనే ఉండేది.

క్లాట్ పరీక్ష విధానం

ఈ పరీక్ష 200 ప్రశ్నలతో 200 మార్కులకు ఉంటుంది.
పరీక్షా సమయం 2 గంటలు
ప్రశ్నలు మొత్తం ఆబ్జెక్టివ్ విధానంలోనే ఉంటాయి.

సబ్జెక్టుల వారీగా వెయిటేజీ

సబ్జెక్టు	ప్రశ్నలు
1. ఇంగ్లిష్, కాంప్రహెన్షన్	40
2. జనరల్ నాలెడ్జ్, కరెంట్ అఫైర్స్	50
3. గణితం	20
4. లీగల్ ఆప్టిట్యూడ్	50
5. లాజికల్ రీజనింగ్	40

నోట్: నెగెటివ్ మార్కుల విధానం ఉంది. ప్రతి తప్పు జవాబుకు 1/4 వంతున మార్కులు తగ్గిస్తారు.

ఇంగ్లిష్

- ఇంగ్లిష్ విభాగంలో ప్రశ్నలు ఫిల్ ఇన్ ద బ్లాంక్స్, ఒకాబులరీ, ఇడియమ్స్, ఫ్రేజెస్, ఫారిన్ టర్మ్స్, అనాలజీ, కాంప్రహెన్షన్, గ్రామర్ నుంచి అడుగుతారు. ముఖ్యంగా ఇంగ్లిష్ గ్రామర్‌లో ఖాళీలను పూరించడం, తప్పులను గుర్తించడం, వాక్యాలను సరిచేయడం తదితర పద్ధతుల్లో అభ్యర్థిని పరీక్షిస్తారు. ఈ విభాగంలో మంచి మార్కులు సాధించాలంటే అభ్యర్థి ఉన్నత పాఠశాల స్థాయిలో ఇంగ్లిష్ గ్రామర్ సూత్రాలను మరోసారి పునశ్చరణ చేసుకోవాలి. ముఖ్యంగా ఆర్టికల్స్, ప్రిపోజిషన్స్, టెన్సెస్, సబ్జెక్ట్- వెర్బ్- అగ్రిమెంట్, కామన్ ఎర్రర్స్‌ను బాగా చదవాలి. ప్రస్తుతం పరీక్షకు తక్కువ సమయమే ఉన్నందువల్ల అభ్యర్థులు ఒకాబులరీపై ఎక్కువ సమయం వెచ్చించడం మంచిదికాదు. అయితే తరుచుగా ఉపయోగించే ఇడియమ్స్, ఫ్రేజెస్‌లను ఒక లిస్టు తయారుచేసుకొని రివిజన్ చేసుకోవాలి. సాధారణంగా స్పెల్లింగ్ తప్పులు దొర్లే పదాలను కూడా ఒక లిస్టు తయారుచేసుకుని చదవడం మంచిది. ఈ విభాగంలో కాస్త దృష్టిపెడితే మంచి మార్కులు సాధించగలిగేది కాంప్రహెన్షన్ ప్యాసేజీలో. పరీక్షలో ఇచ్చిన పేరాను సావధానంగా చదివి అర్థం చేసుకుంటే పూర్తి మార్కులు సాధించవచ్చు.

జనరల్ నాలెడ్జ్, కరెంట్ అఫైర్స్

- ఈ విభాగం చాలా విస్తృతమైనది. పరీక్షలో జనరల్ నాలెడ్జ్, కరెంట్ అఫైర్స్‌ను కలిపి ప్రశ్నలు అడుగుతారు. జనరల్ నాలెడ్జ్ ప్రశ్నలు ఎక్కువగా మన చుట్టూ జరిగే సంఘటనలపైనే ఉంటాయి. కరెంట్ అఫైర్స్‌లో మంచి మార్కులు సాధించాలంటే 2018 మార్చి నుంచి 2019 మార్చి మధ్యలో జరిగిన ప్రాంతీయ, జాతీయ, అంతర్జాతీయ సంఘటనలు, మార్పుల గురించి తెలుసుకుని ఉండాలి. మార్కెట్లో దొరికే ప్రామాణికమైన జీకే పుస్తకాన్ని ఎంచుకుని క్షుణ్ణంగా చదవాలి. మనోరమ ఇయర్ బుక్ కూడా బాగా ఉపయోగపడుతుంది. భారత రాజ్యాంగం, చరిత్ర, భూగోళశాస్త్రం, నిత్యజీవితంలో సైన్స్ పాత్ర, పుస్తకాలు- రచయితలు, పరిశోధనలు, ఆవిష్కరణలకు సంబంధించిన ప్రాథమిక అంశాలపై పట్టు సాధిస్తే జీకేలో మంచి మార్కులు సాధించవచ్చు.

గణితం

- ఈ విభాగంలో ప్రశ్నలు ఉన్నత పాఠశాల స్థాయిలో ఉంటాయి. ముఖ్యంగా కసాగు, గసాభా, నిష్పత్తి, శాతాలు, లాభనష్టాలు, వడ్డీ, సగటు, కాలం-పని, కాలం-దూరం, క్షేత్రమితి, ప్రస్తారాలు, సంయోగాలు, సంభావ్యత తదితర భాగాల నుంచి ప్రశ్నలు అడుగుతారు. పరీక్షలో గణితానికి 20 మార్కులే కేటాయించినప్పటికీ లెక్కలు రోజూ సాధనచేస్తే పూర్తి మార్కులు సాధించవచ్చు.

లీగల్ ఆప్టిట్యూడ్

- అభ్యర్థికి న్యాయశాస్త్ర అధ్యయనం పట్ల ఉన్న అభిరుచిని, సమస్యా పరిష్కార సామర్థ్యాన్ని అంచనావేసేందుకు పరీక్షలో ఈ విభాగాన్ని చేర్చారు. లీగల్ రీజనింగ్, లీగల్ ఆప్టిట్యూడ్ నుంచి ఎక్కువగా ప్రశ్నలు అగుడుతారు. పరీక్షలో ఒక న్యాయ సూత్రాన్ని, ఒక సన్నివేశాన్ని ఇచ్చి వాటిపై ప్రశ్న అగుడుతారు. అభ్యర్థి ఆ రెండింటిని అర్థం చేసుకుని సన్నివేశానికి సూత్రాన్ని అప్లయ్ చేయాల్సి ఉంటుంది. న్యాయ సూత్రాలు ఎక్కువగా నేరాలు, ఒప్పందాలు, క్రిమినల్ లాకు సంబంధించినవై ఉంటాయి. ఇలాంటి ప్రశ్నలకు సరైన సమాధానాలు గుర్తించాలంటే న్యాయ సూత్రాల ప్రాథమికాంశాలపై పట్టు సాధించడంతోపాటు గత ప్రశ్నపత్రాలను ఎక్కువగా అధ్యయనం చేయాలి. లీగల్ ఆప్టిట్యూడ్ విభాగంలో ఎక్కువగా భారత రాజ్యాంగంతోపాటు న్యాయ పదకోశంపై ప్రశ్నలు ఉంటాయి. అందువల్ల భారత రాజ్యాంగం మౌలిక సూత్రాలు, ప్రాథమికాంశాలతోపాటు సాధారణంగా వాడుకలో ఉన్న న్యాయశాస్త్ర పదకోశంపై పట్టు సాధించాలి.

లాజికల్ రీజనింగ్

- క్లాట్‌లో ఈ విభాగాన్ని చేర్చటానికి ప్రధాన కారణం అభ్యర్థి తార్కిక ఆలోచనా శక్తిని అంచనా వేయటమే. ఇందులో ప్రశ్నలు రక్తసంబంధాలు, కోడింగ్-డికోడింగ్, డైరెక్షన్ టెస్ట్, పజిల్స్, అనాలజీ, గడియారాలు, క్యాలెండర్లు, సిలాజిసమ్స్, సిరీస్, స్టేట్‌మెంట్స్-అజెంప్షన్స్ తదితర అంశాల నుంచి అడుగుతారు. ఈ విభాగంలో మంచి మార్కులు సాధించాలంటే సిలబస్ చదివిన తర్వాత గత ప్రశ్నపత్రాలను బాగా అధ్యయనం చేయాలి. ఎలాంటి మోడల్ ప్రశ్నలు అగుడుతున్నారో గమనించాలి. ఏదిపడితే అది చదవకుండా మార్కెట్లో ఉన్న ఏదైనా ఒక ప్రామాణిక పుస్తకం ఎంపిక చేసుకుని చదవాలి.

మంచి స్కోర్ కోసం ఇలా చేయండి..!

- గత క్లాట్ ఫలితాలను పరిశీలిస్తే కనీసం 140 మార్కులు సాధించినవారికి మంచి న్యాయ విశ్వవిద్యాలయంలో సీటు లభిస్తున్నది. అందువల్ల ఏ విభాగాన్నీ చాయిస్ కింద వదిలేయకుండా క్షుణ్ణంగా చదవాలి. కింది టిప్స్ పాటిస్తే మంచి స్కోర్ చేసే అవకాశం ఉంది.

గత ప్రశ్నపత్రాల సాధన

- గతంలో నిర్వహించిన క్లాట్‌తోపాటు నల్సార్, ఎన్ఎల్ఎస్ఐయూ, ఎన్‌యూజేఎస్ తదితర ప్రశ్నపత్రాలను సాధన చేయటం ద్వారా క్లాట్‌లో మంచి స్కోర్ సాధించవచ్చు. ఈ రకమైన సాధనవల్ల అన్ని కోణాల్లో ప్రశ్నలను అర్థం చేసుకోవటానికి అవకాశం ఉంది. ఆత్మవిశ్వాసంతో పరీక్ష రాయవచ్చు.

సమయం ముఖ్యం

- క్లాట్‌లో సమయం చాలా కీలకమైనది. 120 నిమిషాల్లోనే 200 ప్రశ్నలకు సమాధానాలు గుర్తించవలసి ఉంటుంది. అయితే అభ్యర్థి ముందుగా చక్కటి ప్రణాళిక వేసుకుంటే ఇచ్చిన సమయంలో అన్ని ప్రశ్నలకు సమాధానాలు గుర్తించడం కష్టమేమీ కాదు. అందుకోసం ఏ విభాగంలోని ప్రశ్నలకు ఎంత సమయంలో సమాధానాలు గుర్తించాలనే అంశాన్ని ముందుగానే ప్లాన్ చేసుకోవాలి. జీకే, ఇడియమ్స్-ఫ్రేజెస్, న్యాయశాస్త్ర పదకోశంపై అడిగే ఒక్కో ప్రశ్నకు 15 సెకండ్లలోపు సమాధానం గుర్తించాలి. తద్వారా లీగల్, లాజికల్ రీజనింగ్ ప్రశ్నలకు ఎలాంటి ఒత్తిడి లేకుండా సమాధానాలు గుర్తించవచ్చు.

పక్కా వ్యూహంతో

- అభ్యర్థి పరీక్షకు పక్కా వ్యూహాన్ని రూపొందించుకోవాలి. అందుకోసం స్వీయ బలాబలాలను తెలుసుకుని పరీక్ష పేపర్‌లో ఏ విభాగానికి ముందుగా సమాధానాలు గుర్తించాలో నిర్ణయించుకోవాలి. రెండుగంటల సమయాన్ని విభజించి ప్రతి విభాగానికి కచ్చితంగా నిర్ణయించాలి.

మాక్ టెస్టులు


- ఫైనల్ పరీక్షను ఎలాంటి ఒత్తిడి లేకుండా సునాయాసంగా రాయాలంటే అభ్యర్థి ప్రిపరేషన్ చివరలో 5 నుంచి 8 వరకు మాక్ టెస్టులు రాయడం తప్పనిసరి. మాక్ టెస్టులు రాయడంవల్ల అభ్యర్థి ఫైనల్ పరీక్షలో ఎలాంటి ప్రశ్నలు అడిగినా రాసేందుకు మానసికంగా సిద్ధం కావచ్చు.

నెగెటివ్ మార్కింగ్

- క్లాట్‌లో 1/4 నెగెటివ్ మార్కులు ఉన్నందువల్ల పూర్తిగా తెలిసిన ప్రశ్నలకే సమాధానాలు గుర్తించాలి. గెస్సింగ్ అస్సలు పనికిరాదు. లేదంటే స్కోర్ తగ్గే ప్రమాదం ఉంది.

ఆఫ్‌లైన్‌లో పరీక్ష

- గతానికి భిన్నంగా క్లాట్ పరీక్ష ఈసారి ఆఫ్‌లైన్‌లో జరుగనుంది. అందువల్ల కంప్యూటర్ ఆధారిత పరీక్ష సాధన ప్రత్యేకంగా అవసరం లేదు. అయితే ఓఎంఆర్ ఆన్సర్ షీట్‌లో సమాధానాలు దిద్దేటప్పుడు అభ్యర్థి చాలా జాగ్రత్తగా ఉండాలి. ప్రశ్న నంబర్‌ను ఓఎంఆర్ షీట్‌లో నంబర్‌ను సరిచూసుకొని సమాధానాలు దిద్దాలి.



వై. శ్రీనివాస్, డైరెక్టర్,
ప్రైమ్ ట్రెయినింగ్ సర్వీసెస్ ప్రైవేట్ లిమిటెడ్
హిమాయత్‌నగర్
9542377000

విద్య, ఉద్యోగ సమాచారం

ఎన్ఎస్ఐసీలో ప్రవేశాలు

హైదరాబాద్‌లోని నేషనల్ స్మాల్ ఇండస్ట్రీస్ కార్పొరేషన్ లిమిటెడ్ (ఎన్ఎస్ఐసీ) టెక్నికల్ సర్వీస్ సెంటర్ కింది సర్టిఫికెట్ కోర్సుల్లో (మూడు నెలలు/ఏడాది) ప్రవేశానికి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నది.

एन एस आई सी
NSIC
National Small Scale Industries Corporation

- కెమికల్ సేఫ్టీ, ఇండస్ట్రియల్ సేఫ్టీ, ఫైర్ సేఫ్టీ/ ఎలక్ట్రీషియన్, సోలార్ పవర్ టెక్నీషియన్
- **అర్హత:** ఎస్ఎస్‌సీ/ఇంటర్, బీఎస్సీ లేదా బీఈ/ బీటెక్, ఇంటర్/డిప్లొమా ఉత్తీర్ణత.
- ఇతర వివరాలకు మొబైల్ నంబర్ 9908032577లో సంప్రదించవచ్చు.
- కన్‌స్ట్రక్షన్ సేఫ్టీ, ఆటోక్యాడ్, ఫిట్టర్, వెల్డర్ (గ్యాస్), వెల్డర్ (గ్యాస్ అండ్ ఏఆర్‌సీ), రిఫ్రిజిరేషన్ అండ్ ఎయిర్ కండిషనింగ్.
- **అర్హత:** ఎస్ఎస్‌సీ/ఐటీఐ, ఎస్ఎస్‌సీ/ఇంటర్/ డిప్లొమా
- పూర్తి వివరాలకు మొబైల్ నంబర్ 8447768944లో సంప్రదించవచ్చు.
- కంప్యూటర్/ మొబైల్ మెయింటెనెన్స్ రిపేర్, ఆడియో సిస్టమ్ రిపేర్ అండ్ మెయింటెనెన్స్, పవర్ సప్లై, ఇన్వర్టర్ అండ్ యూపీఎస్ రిపేర్ అండ్ మెయింటెనెన్స్, రిపేర్ అండ్ మెయింటెనెన్స్ ఆఫ్ డొమెస్టిక్ అప్లయన్సెస్, టీవీ అండ్ ఎల్ఈడీ సిస్టమ్ మెయింటెనెన్స్ అండ్ రిపేర్.
- **అర్హత:** ఎస్ఎస్‌సీలో ఉత్తీర్ణత.
- ఇతర వివరాలకు మొబైల్ నంబర్ 8789406069లో సంప్రదించవచ్చు.
- సీ++ ఆబ్జెక్టివ్ ఓరియంటెడ్ ప్రోగ్రామింగ్ సిస్టమ్, వెబ్ డిజైనింగ్, డాటా బేస్ అడ్మినిస్ట్రేషన్
- **అర్హత:** ఇంటర్ /డిగ్రీ, బీఈ/బీటెక్, ఎంటెక్, ఎంసీఏ, ఎమ్మెస్సీ ఉత్తీర్ణత.
- ఇతర వివరాలకు మొబైల్ నంబర్ 7075104688లో సంప్రదించవచ్చు.
- మల్టీమీడియా (బేసిక్ యానిమేషన్), డెస్క్‌టాప్ పబ్లిషింగ్ (డీటీపీ), ఎంబ్రాయిడరీ, బ్యూటీషియన్, ఫ్రంట్ ఆఫీస్ ఆపరేషన్.
- **అర్హత:** ఎనిమిదో తరగతి, ఎస్ఎస్‌సీ, ఇంటర్ లేదా తత్సమాన పరీక్షలో ఉత్తీర్ణత.
- పూర్తి వివరాలకు మొబైల్ నంబర్ 9963005214లో సంప్రదించవచ్చు.
- కోర్సు పూర్తి చేసిన వారికి తెలంగాణ స్టేట్ బోర్డు ఆఫ్ టెక్నికల్ ఎడ్యుకేషన్ అండ్ ట్రెయినింగ్ సంస్థ ద్వారా సర్టిఫికెట్ ఇస్తారు.

సీపెట్‌లో ఉచిత శిక్షణ

హైదరాబాద్‌లోని సెంట్రల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ప్లాస్టిక్స్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీ (సీపెట్)- సీఎస్‌టీఎస్ ఆధ్వర్యంలో ఉద్యోగ ఆధారిత ఉచిత నైపుణ్యాభివృద్ధి శిక్షణ కోసం అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నది.

CIPET सिपेट
Central Institute of Plastics Engineering & Technology
Department of Chemicals & Petrochemicals, Ministry of Chemicals & Fertilizers, Government of India
probe . perform . practice . Plastics

- **కోర్సు పేరు:** మెషిన్ ఆపరేటర్- ఇంజెక్షన్ మౌల్డింగ్
- **కాలవ్యవధి:** ఆరు నెలలు
- **అర్హతలు:** కనీసం 8వ తరగతి ఉత్తీర్ణత లేదా ఆపై విద్యార్హతలు కలిగి ఉన్నవారు.
- **వయస్సు:** 18-28 ఏండ్ల మధ్య ఉండాలి.
- ఎస్సీ, ఎస్టీలకు ఐదేండ్లు, ఓబీసీలకు మూడేండ్లు వయోపరిమితిలో సడలింపు ఇస్తారు.
- శిక్షణ, వసతి, భోజన సౌకర్యాలను సంస్థ ఉచితంగా అందిస్తుంది.
- **ప్లేస్‌మెంట్స్:** విజయవంతంగా శిక్షణ పూర్తిచేసుకున్న వారికి ప్రముఖ ప్లాస్టిక్స్, దాని అనుబంధ పరిశ్రమల్లో ఉద్యోగావకాశం కల్పిస్తారు.
- ఈ కోర్సును రూరల్ ఎలక్ట్రిఫికేషన్ కార్పొరేషన్ లిమిటెడ్ (ఆర్ఈసీ) ఫౌండేషన్ సీఎస్ఆర్ స్కీం కింద అందిస్తుంది.
- **దరఖాస్తు:** అర్హతకు సంబంధించిన సర్టిఫికెట్స్ జిరాక్స్‌తో బయోడేటా, కలర్ ఫొటోను జతచేసి మెయిల్ (cipethydstc2@gmail.com)/ పోస్టు ద్వారా పంపాలి.
- **చివరితేదీ:** జనవరి 28
- **ఎంపిక:** ఇంటర్వ్యూ ద్వారా
- **ఇంటర్వ్యూ తేదీ:** జనవరి 30
- పూర్తి వివరాల కోసం 7893586494, 9849599133 నంబర్లలో సంప్రదించవచ్చు.
- **వెబ్‌సైట్:** www.cipet.gov.in

ఐఐటీ హైదరాబాద్‌లో బీటెక్ ఏఐ

- హైదరాబాద్‌లోని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (ఐఐటీ) బీటెక్‌లో ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్ బ్రాంచీని 2019-20 నుంచి ప్రారంభించనుంది. కృత్రిమ మేధస్సు (ఏఐ)కు దేశంలో అందించనున్న మొదటి సంస్థగా, అంతర్జాతీయంగా మూడో సంస్థగా ఐఐటీహెచ్ నిలిచింది. ప్రస్తుతం బీటెక్ ఏఐ కోర్సును ఎంఐటీ (యూఎస్), కార్నెగీ మిలన్ వర్సిటీ (యూఎస్) అందిస్తున్నాయి. తొలి బ్యాచ్‌లో 20 మందితో దీన్ని ప్రారంభించనున్నట్లు ఐఐటీహెచ్ అధికారులు వెల్లడించారు. జేఈఈ అడ్వాన్స్‌డ్ ర్యాంకు ఆధారంగా ప్రవేశాలు కల్పిస్తారు.



- ఐఐటీ హైదరాబాద్ ఇప్పటికే ఎంటెక్‌లో ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్సీ-మెషిన్ లెర్నింగ్, ఎంటెక్ డాటా సైన్స్ కోర్సులను అందిస్తుంది. సంస్థలో బీటెక్ ఇతర బ్రాంచీలు చదువుతున్నవారు ఏఐని మైనర్ సబ్జెక్టుగా కూడా ఎంపిక చేసుకోవచ్చని సంస్థ అధికారులు తెలిపారు.

మన దిక్సూచి నావిక్



గ్లోబల్ నావిగేషన్ శాటిలైట్ సిస్టం (జీపీఎస్)ను ప్రపంచవ్యాప్తంగా అత్యధిక దేశాలు వినియోగిస్తున్నాయి. ఇందులో భారత్ కూడా ఒకటి. జీపీఎస్ నియంత్రణ అమెరికా చేతిలో ఉన్నది. ఏదైనా ఇబ్బందికర పరిస్థితి వస్తే ఆ దేశం సాయం అందిస్తుందన్న నమ్మకం లేని పరిస్థితి. కార్గిల్ యుద్ధ సమయంలో అదే జరిగింది. పాకిస్థాన్ సైనిక దళాలు కచ్చితంగా ఎక్కడ ఉన్నాయో తెలుసుకోవడానికి భారత సైన్యానికి నావిగేషన్ వ్యవస్థ అవసరమైంది. ఇందుకోసం అమెరికా సాయాన్ని కోరింది. కానీ, సాయం అందించడానికి ఆ దేశం నిరాకరించింది. ఈ చేదు అనుభవాన్ని దృష్టిలో పెట్టుకుని సొంత నావిగేషన్ వ్యవస్థను రూపొందించడానికి 2006, మేలో కేంద్రప్రభుత్వం ఆమోదం తెలిపింది.

- 2011 చివరి నుంచి ప్రతి ఆరు నెలలకు ఒక ఉపగ్రహం చొప్పున నాలుగు ఉపగ్రహాలను ప్రయోగిస్తామని, 2015లో సొంత నావిగేషన్ వ్యవస్థ అందుబాటులోకి వస్తుందని 2010, ఏప్రిల్‌లో ఇస్రో ప్రకటించింది. కానీ, అదనంగా మరో మూడు ఉపగ్రహాలను ప్రయోగించాలని నిర్ణయించడంతో కార్యక్రమం ఆలస్యమైంది. మొత్తం ఏడు ఉపగ్రహాల్లో భాగంగా తొలి ఉపగ్రహం ఐఆర్ఎన్ఎస్ఎస్- ఏను 2013, జూలై 1న విజయవంతంగా ప్రయోగించగా, చివరి ఉపగ్రహం ఐఆర్ఎన్ఎస్ఎస్- 1జీని 2016, ఏప్రిల్ 28న ప్రయోగించారు. కానీ, ఐఆర్ఎన్ఎస్ఎస్-1ఏలోని అణు గడియారాలు విఫలమయ్యాయి. దాని స్థానంలో ఐఆర్ఎన్ఎస్ఎస్-1 హెచ్‌ను ప్రయోగించారు. కానీ, అది ప్రయోగ దశలోనే విఫలమైంది. 2018, ఏప్రిల్ 12న ఐఆర్ఎన్ఎస్ఎస్-1ఐను విజయవంతంగా ప్రయోగించారు. దీంతో ముందుగా అనుకున్న లక్ష్యం నెరవేరింది. ఇందులో మూడు ఉపగ్రహాలను సుమారుగా 36,000 కి.మీ. ఎత్తులోని భూస్థిర కక్ష్యలో ప్రవేశపెట్టగా, మిగిలిన నాలుగు ఉపగ్రహాలను భూ అనువర్తిత కక్ష్యలో ప్రవేశపెట్టారు. దశాబ్దంన్నర కృషి ఫలితంగా ఇండియన్ రీజినల్ నావిగేషన్ శాటిలైట్ సిస్టమ్ సాధ్యమైంది. దీనికి ప్రధాని నరేంద్ర మోదీ 'నావిక్' అని పేరు పెట్టారు. తొలుత 2018 ఏప్రిల్ నుంచి నావిక్ సేవలు ప్రారంభమవుతాయని ప్రకటించారు. కానీ, తొలి ఉపగ్రహంలోని అణు గడియారాలు విఫలం కావడం, దాన్ని మార్చాల్సి రావడంతో నావిక్ సేవలు ఎప్పటి నుంచి ప్రారంభం కానున్నాయో ఇస్రో ప్రకటించలేదు.

వ్యయం

- మొదట మొత్తం ప్రాజెక్టు వ్యయం రూ. 1420 కోట్లుగా అంచనా వేశారు (గ్రౌండ్ సెగ్మెంట్ కోసం రూ. 300 కోట్లు, ఒక్కో ఉపగ్రహానికి రూ. 150 కోట్లు, పీఎస్ఎల్వీ-ఎక్స్ఎల్ రాకెట్ నిర్మాణం కోసం రూ. 130 కోట్లు). అయితే, ఒక ఉపగ్రహం విఫలం కావడంతోపాటు దానిస్థానంలో చేసిన ప్రయోగం కూడా నిష్ప్రయోజనమవడంతో మరో ఉపగ్రహాన్ని ప్రయోగించాల్సి వచ్చింది. దీంతో ప్రాజెక్టు వ్యయం రూ. 2246 కోట్లకు చేరింది.
- ఐఆర్ఎన్ఎస్ఎస్ ఉపగ్రహాల నిర్వహణ, కార్యకలాపాల కోసం పలు కేంద్రాలను ఏర్పాటు చేశారు.
- ఐఆర్ఎన్ఎస్ఎస్ స్పేస్‌క్రాఫ్ట్ కంట్రోల్ ఫెసిలిటీ (ఐఆర్ఎస్‌సీఎఫ్)

పేలోడ్‌లు

- ప్రతి ఉపగ్రహంలోనూ రెండు రకాల పేలోడ్‌లు ఉంటాయి.
- **నావిగేషన్ పేలోడ్ :** ప్రామాణిక నావిగేషన్ సేవలు అందించడానికి ఎల్5 బ్యాండ్ (1176.5 ఎంహెచ్‌జీ), ఎస్ బ్యాండ్ (2492.028 ఎంహెచ్‌జీ)లలో పనిచేసే నావిగేషన్ సాధనాలను అమర్చారు.
- **రేంజింగ్ పేలోడ్:** సీ బ్యాండ్ ట్రాన్స్‌పాండర్‌ను అమర్చారు. లేజర్ రేంజింగ్ కోసం కార్నర్ క్యూబ్‌రెట్రో రిఫ్లెక్టర్‌ను అమర్చారు. వీటి వల్ల దేశం లోపలే కాకుండా సరిహద్దుల నుంచి 1500 కి.మీ. విస్తీర్ణం మేరకు విస్తరించిన ప్రాంతంలో 10-20 మీటర్ల కచితత్వంతో స్టాండర్డ్ పొజిషనింగ్ సేవలు అందించవచ్చు. ప్రస్తుతం ఉన్న ఏడు ఉపగ్రహాల కూటమిని 11కు పెంచాలని ఇస్రో నిర్ణయించింది.

ఇస్రో నావిగేషన్ సెంటర్ (ఐఎన్‌సీ)

- ఐఆర్ఎన్ఎస్ఎస్ రేంజ్ అండ్ ఇంటిగ్రిటీ మానిటరింగ్ స్టేషన్స్ (ఐఆర్ఐఎంఎస్)
- ఐఆర్ఎన్ఎస్ఎస్ నెట్‌వర్క్ టైమింగ్ స్టేషన్స్ (ఐఆర్‌సీడీఆర్)

లేజర్ రేంజింగ్ స్టేషన్స్

- ఐఆర్ఎన్ఎస్ఎస్ ఐఆర్ఎన్ఎస్ఎస్ డేటా కమ్యూనికేషన్ నెట్‌వర్క్ (ఐఆర్‌డీసీఎన్)
- 2013, మే 28న కర్ణాటక రాష్ట్రం బ్యాలలులోని ఇస్రో క్యాంపస్ పరిధిలో కొత్త శాటిలైట్ నావిగేషన్ సెంటర్ 'డీప్ స్పేస్ నెట్‌వర్క్ (డీఎస్ఎన్)'ను ఏర్పాటు చేశారు.

ప్రపంచంలో సొంత నావిగేషన్ వ్యవస్థలు ఉన్న ఐదు దేశాల సరసన భారత్ నిలిచింది.

నావిగేషన్ వ్యవస్థ గల దేశాలు

1. అమెరికా- జీపీఎస్ (గ్లోబల్ పొజిషనింగ్ సిస్టమ్) 24 ఉపగ్రహాలు. ఈ వ్యవస్థ 20 ఏండ్ల క్రితమే అమలులోకి వచ్చింది. ప్రపంచంలో అత్యధిక మంది దీన్ని వినియోగిస్తున్నారు.
2. రష్యా- గ్లోనాస్ (గ్లోబల్ నావిగేషన్ శాటిలైట్ సిస్టమ్) 24 ఉపగ్రహాలు
3. యూరప్- గెలీలియో (నావిగేషన్ వ్యవస్థ నిర్మాణ దశలో ఉన్నది)
4. చైనా- బీడీఎస్ (బీడోయ్ నావిగేషన్ శాటిలైట్ సిస్టం) 10 ఉపగ్రహాలు. 2011 నుంచి సేవలను అందిస్తున్నది.
5. జపాన్- క్యూజెడ్ఎస్ఎస్ (క్వాసీ జెనిథ్ శాటిలైట్ సిస్టం) అభివృద్ధి దశలో ఉన్నది. ఇప్పటివరకు మూడు ఉపగ్రహాలను ప్రయోగించారు.

ఉపయోగాలు

- ఐఆర్ఎన్ఎస్ఎస్ రెండు రకాల సేవలను అందించనున్నది. అందులో ఒకటి స్టాండర్డ్ పొజిషనింగ్ సర్వీస్ (ఎస్‌పీఎస్). ఇది అందిరికీ అందుబాటులో ఉంటుంది. రెండోది రిస్ట్రిక్టెడ్ సర్వీస్ (ఆర్ఎస్). దీన్ని అధీకృత వ్యక్తులు మాత్రమే వినియోగించుకోవడానికి వీలున్నది. నావిక్ ద్వారా ప్రజలకు అందించే సేవల్లో 20 మీటర్లకు అటుఇటుగా కచ్చితత్వం ఉంటే.. నియంత్రిత సేవల పేరిట సైనికులకు కేవలం 10 మీటర్ల కచ్చితత్వంతో సేవలు అందించేలా ఇస్రో శాస్త్రవేత్తలు కృషి చేశారు.
- రవాణారంగంలో సాధారణ వ్యక్తులు కూడా తమ గమనాన్ని, చేరాల్సిన చోటు తెలుసుకోవడం, లక్ష్యం ఎంత దూరంలో ఉందో నిర్ధారించుకోవడంలో ఉపయోగపడుతుంది.
- సెల్‌ఫోన్లు ఇతర పరికరాల ద్వారా నావిక్ నావిగేషన్ సౌకర్యాలు అందుబాటులోకి రావడంతోపాటు వైమానిక, నౌకాయాన రంగాలకు, రక్షణ, పౌర సేవలకూ ఉపయోగపడుతుంది.
- సెల్‌ఫోన్లు, ప్రత్యేక పరికరాల సాయంతో మిలిటరీ, సాధారణ పౌర అవసరార్థం నావిగేషన్ సమాచారాన్ని ప్రతికూల పరిస్థితుల్లోనైనా నిరంతరాయంగా కచ్చితత్వంతో పొందవచ్చు.

ఉపగ్రహం	ప్రయోగ తేదీ	రాకెట్	ప్రస్తుత పరిస్థితి
ఐఆర్ఎన్ఎస్ఎస్ -1ఎ	2013, జూలై 1	పీఎస్ఎల్వీ -ఎక్స్ఎల్-సి22	కక్ష్యలో విఫలం (అటామిక్ గడియారాలు విఫలం)
ఐఆర్ఎన్ఎస్ఎస్ -1బి	2014, ఏప్రిల్ 4	పీఎస్ఎల్వీ - ఎక్స్ఎల్-సి24	పనిచేస్తున్నది
ఐఆర్ఎన్ఎస్ఎస్-1సి	2014, అక్టోబర్ 16	పీఎస్ఎల్వీ - ఎక్స్ఎల్-సి24	పనిచేస్తున్నది
ఐఆర్ఎన్ఎస్ఎస్-1డి	2015, మార్చి 28	పీఎస్ఎల్వీ - ఎక్స్ఎల్-సి27	పనిచేస్తున్నది
ఐఆర్ఎన్ఎస్ఎస్-1ఇ	2016, జనవరి 20	పీఎస్ఎల్వీ - ఎక్స్ఎల్-సి31	పనిచేస్తున్నది
ఐఆర్ఎన్ఎస్ఎస్-1ఎఫ్	2016, మార్చి 10	పీఎస్ఎల్వీ - ఎక్స్ఎల్-సి32	పనిచేస్తున్నది
ఐఆర్ఎన్ఎస్ఎస్-1జి	2016, ఏప్రిల్ 28	పీఎస్ఎల్వీ - ఎక్స్ఎల్-సి33	పనిచేస్తున్నది
ఐఆర్ఎన్ఎస్ఎస్-1హెచ్	2017, ఆగస్టు 31	పీఎస్ఎల్వీ - ఎక్స్ఎల్-సి39	ప్రయోగ దశలో విఫలం
ఐఆర్ఎన్ఎస్ఎస్-1ఐ	2018, ఏప్రిల్ 12	పీఎస్ఎల్వీ - ఎక్స్ఎల్-సి41	పనిచేస్తున్నది

- ఇప్పటివరకు కచ్చితమైన నావిగేషన్ వ్యవస్థ లేకపోవడంతో రాడార్ల పరిధుల్లో దూరం, సమయం ఎక్కువైనా ప్రయాణించక తప్పని పరిస్థితి. నావిక్ వ్యవస్థ ద్వారా విమానాలు, నౌకల రాకపోకల్లో దూరం, సమయం, ఖర్చు గణనీయంగా ఆదా అవుతుంది.
- నౌకల గుంపును గమనాన్ని పర్యవేక్షించడానికి నేవీకి ఎంతో ఉపయుక్తకరం
- అత్యవసర పరిస్థితులు, ప్రకృతి విపత్తుల సమయంలో అవసరమైన ప్రాంతాలకు, వ్యక్తులకు వివిధ వ్యవస్థలు త్వరగా చేరుకునేలా దారిచూపి బాధితులకు సత్వర సహాయం అందేలా చేస్తుంది.
- క్షిపణుల ప్రయోగ సమయంలో కచ్చితమైన నావిగేషన్‌ను అందిస్తుంది.
- దేశ, విదేశీ పర్యాటకులకు గమన నిర్దేశ సౌకర్యాలను అందిస్తూ వారి సమయాన్ని ఆదా చేయడమేగాక మరిన్ని ప్రదేశాలను తక్కువ సమయంలో పర్యటించేలా చేయవచ్చు.
- సహజ వనరులను వెలికితీసేందుకు ఉద్దేశించిన రిమోట్ సెన్సింగ్ ఉపగ్రహాల సమాచారాన్ని నావిక్ వ్యవస్థతో విశ్లేషించి, ఆ వనరులున్న ప్రాంతాలకు సులభంగా చేరుకునేందుకు సహాయపడుతుంది.
- అత్యధికంగా చేపలు ఉండే ప్రాంతాలను సూచించడంతో మత్స్యకారులకు సమయం, ఖర్చు తగ్గుతుంది.

... సాయికిరణ్ వేముల

నమస్తే తెలంగాణ
చిత్రం
[హైదరాబాద్]
సోమవారం 21 జనవరి 2019


నాగశౌర్య

సీరియస్ లవ్‌స్టోరీ

ఊహలు గుసగుసలాడే, జ్యో అచ్యుతానంద తర్వాత శ్రీనివాస్ అవసరాల దర్శకత్వంలో నాగశౌర్య కథానాయకుడిగా ఓ సినిమా తెరకెక్కనున్నట్లు సమాచారం. వీరి కలయికలో వచ్చిన గత సినిమాలకు పూర్తి భిన్నంగా సీరియస్ ప్రేమకథతో శ్రీనివాస్ అవసరాల సిద్ధం చేసిన కథ నచ్చడంతో నాగశౌర్య ఈ చిత్రానికి గ్రీన్‌సిగ్నల్ ఇచ్చినట్లు తెలిసింది. ఇండియా, అమెరికా నేపథ్యంలో నాలుగు పాత్రలు ప్రధానంగా ఈ సినిమా సాగనున్నట్లు వార్తలు వినిపిస్తున్నాయి. తన స్నేహితుల జీవితాల్లో జరిగిన సంఘటనల నుంచి స్ఫూర్తి పొంది దర్శకుడు ఈ కథను సిద్ధం చేసినట్లు సమాచారం. ఈ సినిమాలో నాగశౌర్య పాత్ర చిత్రణ నవ్యపంథాలో సాగుతుందని చెబుతున్నారు. పీపుల్ మీడియా ఫ్యాక్టరీ సంస్థ ఈ చిత్రాన్ని నిర్మించనున్నట్లు తెలిసింది. ప్రస్తుతం ఈ చిత్రానికి సంబంధించిన పూర్వ నిర్మాణ కార్యక్రమాలు జరుగుతున్నాయి.


మహేష్‌బాబు

పొల్లాచ్చిలో వ్యవసాయం

ఇప్పుడు ఎక్కడ చూసినా రైతు గురించిన మాటలే వినిపిస్తున్నాయి. రాజకీయం కూడా రైతు చుట్టే తిరుగుతున్నది. దీంతో కథానాయకులు కూడా రైతు పాత్రలకు సై అంటున్నారు. అగ్ర హీరో మహేష్‌బాబు తన తాజా చిత్రం 'మహర్షి'లో రైతు పాత్రలో కనిపించబోతున్నారు. నాగలి చేతబట్టి పొలం మడుల్లో దుక్కి దున్నుతూ వ్యవసాయానికి సిద్ధమయ్యారు. వంశీ పైడిపల్లి దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రం ప్రస్తుతం కేరళలోని పొల్లాచ్చిలో చిత్రీకరణ జరుపుకుంటున్నది. పూజా హేగ్డే కథానాయిక. ప్రధాన తారాగణంపై కీలక సన్నివేశాల్ని చిత్రీకరిస్తున్నారు. ఇందులో మహేష్‌బాబు కాలేజీ స్టూడెంట్‌గా, రైతుగా రెండు భిన్న పార్శ్వాల్లో సాగే పాత్రను పోషిస్తున్నారని సమాచారం. పొల్లాచ్చిలో మహేష్‌బాబు వ్యవసాయం చేస్తున్న సన్నివేశాల్ని తెరకెక్కిస్తున్నారు. కథానుగుణంగా ద్వితీయార్థంలో మహేష్‌బాబు రైతు పాత్రలో కనిపిస్తారని చెబుతున్నారు. స్నేహం గొప్పతనాన్ని , మానవీయ అనుబంధాల ఔన్నత్యాన్ని తెలియజెప్పే ఇతివృత్తంతో రూపొందుతున్న ఈ సినిమాలో మహేష్‌బాబు స్నేహితుడిగా అల్లరి నరేష్ నటిస్తున్నారు. ఈ చిత్రంలో రైతు సమస్యలపై కూడా చర్చించబోతున్నారని తెలిసింది. దిల్‌రాజు, అశ్వనీదత్, పీవీపీ ప్రసాద్ నిర్మాతలుగా వ్యవహరిస్తున్న ఈ చిత్రం ఏప్రిల్‌లో ప్రేక్షకులముందుకురానుంది. దేవిశ్రీప్రసాద్ సంగీతాన్నందిస్తున్నారు.


సందీప్‌కిషన్, అన్యసింగ్

నీడ శత్రువైతే..

సందీప్‌కిషన్ కథానాయకుడిగా నటిస్తున్న చిత్రం 'నిను వీడని నీడను నేనే'. వెంకటాద్రి టాకీస్, విస్తా డ్రీమ్ మర్చంట్ పతాకాలపై దయా పన్నెం, వి.జి. సుబ్రహ్మణ్యన్ నిర్మిస్తున్నారు. అనిల్ సుంకర విడుదలచేయనున్నారు. కార్తిక్‌రాజు దర్శకుడు. అన్యసింగ్ కథానాయిక. చిత్రీకరణ తుదిదశకు చేరుకున్నది. దర్శకుడు మాట్లాడుతూ 'తన నీడతో యుద్ధం చేసే ఓ యువకుడి కథ ఇది. నీడ అతడికి శత్రువుగా మారడానికి దారితీసిన పరిస్థితులేమిటి? ఈ యుద్ధంలో అతడు ఎలా విజయాన్ని సాధించాడన్నది ఆసక్తికరంగా ఉంటుంది. ఇప్పటివరకు ఎవరూ స్పృశించని వినూత్న పాయింట్‌తో రూపొందిస్తున్నాం. ప్రస్తుతం హైదరాబాద్‌లో జరుగుతున్న చివరి షెడ్యూల్‌లో నాయకానాయికలపై కీలక సన్నివేశాలతో పాటు ఓ పోరాట ఘట్టాన్ని చిత్రీకరిస్తున్నాం. ఈ షెడ్యూల్‌తో సినిమా పూర్తవుతుంది' అని తెలిపారు. తాను నటిస్తున్న తొలి హారర్ చిత్రమిదని సందీప్‌కిషన్ తెలిపారు. వినూత్న కథతో రూపొందుతున్న ఈ చిత్రాన్ని ఫిబ్రవరిలో విడుదల చేయడానికి సన్నాహాలు చేస్తున్నామని నిర్మాతలు చెప్పారు. పోసాని కృష్ణమురళి, మురళీశర్మ, వెన్నెలకిషోర్ కీలక పాత్రలను పోషిస్తున్న ఈ చిత్రానికి సంగీతం: ఎస్.ఎస్. తమన్, సినిమాటోగ్రఫీ: ప్రమోద్‌వర్మ, ఎడిటర్: కె. ఎల్ ప్రవీణ్.


నందితాశ్వేత, సుమంత్ అశ్విన్

రెండింతల వినోదం

సుమంత్ అశ్విన్, నందితాశ్వేత, సిద్ధి ఇద్నాని ప్రధాన పాత్రల్లో నటిస్తున్న చిత్రం 'ప్రేమకథా చిత్రమ్-2'. హరికిషన్ దర్శకుడు. ఆర్.పి.ఏ క్రియేషన్స్ పతాకంపై ఆర్. సుదర్శన్‌రెడ్డి నిర్మిస్తున్నారు. ఈ సినిమాకు నటుడు రావురమేష్ వాయిస్ ఓవర్ అందిస్తున్నారు. నిర్మాత మాట్లాడుతూ ''ప్రేమకథా చిత్రమ్'కు సీక్వెల్‌గా రూపొందిస్తున్న చిత్రమిది. హారర్ ఎంటర్‌టైనర్ కథాంశంతో ఆద్యంతం నవ్విస్తూనే భయపెడుతుంది. ప్రతీకారేచ్ఛతో ఉన్న ఆత్మ కారణంగా ప్రేమ జంట ఎదుర్కొనే ఇబ్బందులు వినోదాల్ని పంచుతాయి. రావురమేష్ వాయిస్ ఓవర్ చిత్రానికి ప్రధాన ఆకర్షణగా నిలుస్తుంది. చిత్రీకరణ పూర్తయింది. ప్రస్తుతం నిర్మాణానంతర కార్యక్రమాల్ని జరుపుతున్నాం. ఫిబ్రవరి 22న సినిమాను ప్రేక్షకుల ముందుకు తీసుకొస్తాం' అని తెలిపారు. విద్యుల్లేఖ రామన్, ప్రభాస్‌శ్రీను ప్రధాన పాత్రల్లో నటిస్తున్న ఈ చిత్రానికి కెమెరామెన్: సి.రాంప్రసాద్, సంగీతం: జేబీ, సహనిర్మాతలు: ఆయుష్‌రెడ్డి, ఆర్.పి. అక్షిత్‌రెడ్డి.

కోల్‌కతా చిత్రోత్సవంలో 'అప్పూ'


'అప్పూ' చిత్రంలో సాయిశ్రీవంత్

ఆదివారం ప్రారంభమైన 8వ కోల్‌కతా అంతర్జాతీయ బాలల చలన చిత్రోత్సవాల్లో 'అప్పూ' చిత్రం ప్రదర్శనకు ఎంపికైంది. ఈ నెల 22న ఈ చిత్రాన్ని ప్రదర్శించబోతున్నారు. ఈ సందర్భంగా చిత్ర దర్శకుడు మాట్లాడుతూ '2017లో హైదరాబాద్‌లో జరిగిన అంతర్జాతీయ బాలల చలన చిత్రోత్సవాల్లో ప్రదర్శితమైన మా చిత్రం మరో ప్రతిష్టాత్మక ఫిల్మ్ ఫెస్టివల్‌లో ఎంపికకావడం ఆనందంగా ఉంది' అన్నారు. మాస్టర్ సాయిశ్రీవంత్ (యశస్వి) టైటిల్ రోల్‌లో మోహన్ మూవీ మేకర్స్ పతాకంపై ఈ చిత్రాన్ని రూపొందించారు. ఎనిమిదేళ్ల బాలుడు అప్పూ ఏనుగుని చూడాలనే తన కోరికను ఎలా నెరవేర్చుకున్నాడనేదే ఈ చిత్ర కథాంశం. జాకీ, లోహిత్‌కుమార్, ప్రజ్ఞ, బిందు తదితరులు ముఖ్య పాత్రల్ని పోషించారు.


ధృవ, అశ్విని

సస్పెన్స్ థ్రిల్లర్ 'యమ్6'

ధృవ, అశ్విని, శ్రావణి, తిలక్, సాధన ప్రధాన పాత్రల్లో నటిస్తున్న చిత్రం 'యమ్6'. విశ్వనాథ్ ఫిల్మ్ ఫ్యాక్టరీ, శ్రీలక్ష్మి వెంకటాద్రి క్రియేషన్స్ పతాకాలపై విశ్వనాథ్ తన్నీరు నిర్మించారు. జైరామ్ వర్మ దర్శకుడు. సెన్సార్ కార్యక్రమాలు పూర్తయ్యాయి. యు.ఏ.సర్టిఫికెట్ లభించింది. నిర్మాత మాట్లాడుతూ 'సస్పెన్స్ థ్రిల్లర్ చిత్రమిది. ఆద్యంతం ఉత్కంఠభరితంగా సాగుతుంది. థ్రిల్లర్ అంశాలతో పాటు కామెడీకి కూడా పెద్దపీట వేశాం. ఫిబ్రవరి మొదటివారంలో విడుదల చేసేందుకు సన్నాహాలు చేస్తున్నాం' అన్నారు. 'సరికొత్త ప్రయోగాత్మక ఇతివృత్తంతో ఈ సినిమాను తెరకెక్కించాం. కథ, కథనాలు ఆసక్తికరంగా సాగుతాయి. తెలుగు ప్రేక్షకులకు కొత్త అనుభూతిని అందిస్తుంది' అని దర్శకుడు తెలిపారు. ఈ చిత్రానికి సినిమాటోగ్రఫీ: మహ్మద్ రియాజ్, సంగీతం: విజయ్ బాలాజీ.

అన్నపూర్ణమ్మగారి మనవడు


శ్రీహర్ష, సుమన్‌శెట్టి, అన్నపూర్ణమ్మ

సీనియర్ నటి అన్నపూర్ణమ్మ ప్రధాన పాత్రలో నటిస్తున్న చిత్రం 'అన్నపూర్ణమ్మ గారి మనవడు'. మాస్టర్ రవితేజ టైటిల్ పాత్రలో నటిస్తున్నాడు. నర్రా శివనాగేశ్వరరావు దర్శకుడు. ఎవరెస్టు ఎంటర్‌టైన్‌మెంట్ పతాకంపై ఎం.ఎన్.చౌదరి ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. నిర్మాత మాట్లాడుతూ 'అమరావతిలోని ఓ అందమైన గ్రామం నేపథ్యంలో ఈ చిత్రాన్ని తెరకెక్కిస్తున్నాం. గ్రామ పెద్దగా అన్నపూర్ణమ్మ పాత్ర ఆకట్టుకుంటుంది. తొలి షెడ్యూల్ పూర్తయింది. జూనియర్ ఆర్టిస్టులు పాల్గొనగా అన్నపూర్ణమ్మపై పలు కీలక సన్నివేశాల్ని చిత్రీకరించాం. అన్ని వర్గాల ప్రేక్షకుల్ని అలరిస్తుందన్న నమ్మకముంది' అన్నారు. అర్చన, బెనర్జీ, రఘుబాబు, రఘు కారుమంచి, తాగుబోతు రమేష్, సుమన్ షెట్టి, శ్రీహర్ష, రమాప్రభ, శ్రీలక్ష్మి తదితరులు నటిస్తున్నారు.


శివ కంఠంనేని

సందేశంతో 'అక్కడొకడుంటాడు'

శివ కంఠంనేని ప్రధాన పాత్రలో నటిస్తున్న చిత్రం 'అక్కడొకడుంటాడు'. శ్రీపాదవిశ్వక్ దర్శకుడు. కె.శివశంకరరావు, రావుల వెంకటేశ్వరరావు నిర్మిస్తున్నారు. రామ్‌కార్తిక్, శివహరీష్, అలేఖ్య, రసజ్ఞదీపిక నాయకానాయికలుగా నటిస్తున్నారు. ఈ చిత్ర ట్రైలర్‌ను హీరో నాగశౌర్య విడుదలచేశారు. 'ఆడిపాడి గడిపేద్దాం' అనే గీతాన్ని నిర్మాత కె.ఎస్.రామారావు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా నాగశౌర్య మాట్లాడుతూ 'సస్పెన్స్ థ్రిల్లర్ కథాంశంతో ఆసక్తికరంగా సినిమాను తెరకెక్కించారు దర్శకుడు. ట్రైలర్, పోస్టర్స్ బాగున్నాయి' అని తెలిపారు. 'డ్రంకన్ డ్రైవ్ వల్ల జరిగే అనర్థాలను చాటిచెబుతూ రూపొందిస్తున్న సందేశాత్మక చిత్రమిది. ఉత్కంఠభరితమైన మలుపులతో సాగుతుంది. త్వరలో ఆడియోను, ఈ నెలలోనే సినిమాను విడుదల చేస్తాం' అని నిర్మాతలు పేర్కొన్నారు. వినోద్‌కుమార్, రవిబాబు, ఇంద్రజ ముఖ్య పాత్రల్లో నటిస్తున్న ఈ చిత్రానికి ఛాయాగ్రహణం: ఎన్. రాజశేఖరన్, సంగీతం: సార్స్క్.